ట్వీన్నవలలు

# ఓ మొగ్గ పువ్వవుతోంది
# ఎరుపు తెల్లపోతోంది

అనామకుడు

అపరాజిత పబ్లికేషన్స్

ట్వీన్నవలలు

ఓ మొగ్గ పువ్వవుతోంది

ఎరుపు తెల్లపోతోంది

డిజిటల్ పుస్తకం

నవంబర్ 11, 2013

కాపీరైట్ రచయితదే

ముఖచిత్రం : గిరిధర్

వెల : 50 రూ॥

అపరాజితా పబ్లికేషన్స్
ramasastri@hotmail.com

drgayatri@hotmail.com

ప్రతులకు : కినిగె.కాం

## ట్విన్నవలలు

ముందుమాట 4

ఓ మొగ్గ పువ్వవుతోంది 5–82

ఎరుపు తెల్లపోతోంది 83– 174

ముందుమాట

ఈ నవలలు రాసిన అనామకుడు పేరున్న రచయితే. అదేం పేరో, ఎంత పేరో నాకు తెలియదు. నాకు మాత్రం బావ.

మాకు పెళ్ళైంది 1984 నవంబర్ 11న. అప్పటి నుండి బావ రచనలకి మొదటి శ్రోతను నేనే.

అనామకుడి కొన్ని కథలకి నామం పెటట్డమో, పెట్టించడమో చేసిందీ నేనే.

ఈ రెండు రచనలూ స్వాతి మాసపత్రికలో అనుబంధ నవలలుగా వచ్చాయి.

ఇవి నవలలవడం వల్లనేమో బావ ప్రచురించిన "రమణీయం" "శీలమా? అది ఏమి?" కథా సంపుటాల్లో రాలేదు.

ఇందులో "ఎరుపు తెల్లపోతోంది" చదివి ఓ ప్రముఖ నిర్మాత సినిమా తియ్యడానికి పిలిస్తే తను చేస్తున్న ఉద్యోగంలో సినిమా స్క్రిప్ట్ రాసే తీరిక లేక బావ వెళ్ళలేదు. ఇప్పటికీ ఆ నవల చదువుతోంటే చాలా సినిమాటిక్‌గా ఉంటుంది.

మేం మా ఇరవై తొమ్మిదో పెళ్ళి రోజున ఒకరికొకరం ఇచ్చి పుచ్చుకునే బహుమతులే – ఈ డిజిటల్ పుస్తకాలూ, వాటి ముందు మాటలూ.

బావ పుస్తకానికి ముందుమాట రాయడం అంటే ఆగనంత నవ్వొస్తోంది.

– డా॥ గాయత్రీదేవి

# ఓ మొగ్గ పువ్వవుతోంది

## 1

ఆ రోజుకి సూర్యుడి తొలికిరణం కనిపించింది.

నిన్న మొగ్గగా ఉన్న మందారం పువ్వవుతోంది.

పువ్వు మీద వాలి, ఎగిరి, మళ్ళీ వాలుతోంది సీతాకోకచిలుక.

పక్క మీద నుండి లేచి కూర్చుని కిటికీలోంచి పువ్వునీ, సీతాకోకచిలుకనీ చూస్తున్న కళ్యాణి ఏదో అవసరమయినట్లు హఠాత్తుగా బాత్రూంలోకి వెళ్ళింది.

బాత్రూంలోంచి "వదినా!" అన్న కేక వినిపించి, హడావుడిగా వచ్చి చూసింది సుజాత.

సంపూర్ణ స్త్రీత్వపు తొలి లక్షణం కళ్యాణిలో అంకురించిందన్న భావన కలగ్గానే అదోలాగనిపించింది సుజాతకి. అది బాధ కాదు. ఆనందం కాదు. అదేదో అర్థంకాని అనుభూతి. మొగ్గ పువ్వవడం చూసి, మొగ్గ ఇక లేదన్న బాధతోపాటు పువ్వుని చూస్తున్నామని పొందే ఆనందం.

"ఇంక నెలనెలా ఇంతేనా?" అన్న కళ్యాణి ప్రశ్నకి అవునన్నట్లు తలూపింది సుజాత. కళ్యాణి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. మానవ జీవన ప్రారంభం నుండి ప్రకృతి స్త్రీలో కలిగించే సామాన్య ఋతుక్రమం ఇది. ప్రతిసారీ ప్రతి స్త్రీకీ కొత్తగా అనిపిస్తుంది. అలాగే ఈసారి కళ్యాణికి కొత్త. అంతే.

పద్నాలుగు సంవత్సరాల క్రితం కూచిపూడిలో సుందరికీ, వెంకట్రావుకీ పుట్టింది కళ్యాణి. పెద్ద కొడుకు మురళీకృష్ణ పుట్టిన పదిహేనేళ్ళ తర్వాత పుట్టడం గారానికి మొదటి కారణమైనా, పెరగడం మొదలెట్టాక కళ్యాణి రూపం, మాటలూ గారానికి అసలు కారణాలయ్యాయి.

మూడేళ్ళ కళ్యాణికి పరికిణీ కట్టి, జడేసి, గజ్జెలు పెడితే– కూచిపూడి వాసనలంటినట్లు– నడకే నాట్యంలాగుండేది.

కళ్యాణికి అయిదేళ్ళు వచ్చేసరికి ఒక పక్క స్కూలుకి మరోపక్క సంగీతం మాస్టర్ దగ్గరికి పంపించడం మొదలెట్టారు. స్కూల్లో తక్కిన పిల్లలందరి కన్నా బాగా చదువుతుందనీ,

అంత చిన్న వయస్సులోనే స్వరాలు స్పష్టంగా పలుకుతోందనీ, 'సరస్వతీ' అనేవారు కళ్యాణిని ఇరుగూ పొరుగూ.

కళ్యాణికి పదేళ్ళప్పుడు మురళీకృష్ణకి సుజాతతో పెళ్ళయింది.

సుజాత దగ్గర కళ్యాణికి బాగా అలవాటవడంవల్లా, కూచిపూడిలో కన్నా విజయవాడలో చదువు బావుంటుందని మురళీకృష్ణ అనడంవల్లా అన్నయ్య ఉద్యోగం చేస్తున్న విజయవాడలో ఉండడం మొదలెట్టింది కళ్యాణి.

మొగల్రాజపురంలో చుట్టూ పెద్ద తోట ఉన్న చిన్న ఇంట్లో ఉంటూ, సూర్యారావుపేటలో స్కూలుకి వెళ్ళి వస్తూ, నాలుగేళ్ళ విజయవాడ చదువు తర్వాత పదో క్లాసులోకి వచ్చింది కళ్యాణి.

వేసవి సెలవులయ్యాక స్కూలు తెరిచిన రోజులవి.

బాగా చదువుకుంటూ, సంగీత సాధన చేసుకుంటూ, నలుగురితో సరదాగా రోజులు గడిపేస్తున్న చిరుప్రాయపు చిన్నపిల్ల కళ్యాణి ఎలప్రాయపు కన్నెపిల్లయింది ఆ రోజు.

## 2

క్లాసులో టీచర్ పాఠం చెప్తున్నారు. అదేమీ సరిగ్గా వినబడ్డంలేదు కళ్యాణికి. ఏదో తెలియని ఆందోళన.

ఇంటినుండి బయటకి అడుగుపెట్టిన దగ్గర్నుండి ఏ మగపిల్లాడు కనిపించినా సిగ్గుగా అనిపించసాగింది. అది సిగ్గుకాదు. చాలా చిన్నతనంగా అనిపించడం. అవమానంగా ఫీలవడం. మగవాళ్ళంతా ఏదో సుపీరియర్‌గా, వాళ్ళకేమీ కష్టాలు లేనట్లుగా, బాధలన్నీ తనలాంటి ఆడవాళ్ళకేనన్న భావం. అంతేకాదు. అందరూ తననే చూస్తున్నారనీ, తనలో వచ్చిన మార్పునే గమనిస్తున్నారనీ అనిపిస్తోంది.

ఎవ్వరితోనూ మాట్లాడాలనిపించడంలేదు. అయితే ఎవరి దగ్గరైనా కూర్చుని తనలో జరిగిన మార్పుని గురించి చెప్పుకోవాలనిపిస్తోంది. తను రోజూ మాట్లాడేవాళ్ళతో కాకుండా ఇంకెవరికన్నా చెప్పుకోవాలనిపించసాగింది.

అలా ఆలోచిస్తూ– అనాలోచితంగా తను రోజూ కలిసి తినేవాళ్ళతో కాకుండా శకుంతలతో బయల్దేరింది లంచ్ టైంలో.

శకుంతల కళ్యాణి వయస్సుదే. కాని శారీరకమైన ఎదుగుదల ఎక్కువవడంతో పద్దెనిమిదేళ్ళకి పైనే వయస్సున్నదాన్లా కనిపిస్తుంది. మొహంలోనూ, తక్కిన శరీర భాగాలలోనూ వయస్సుకి మించిన మార్పులు రావడంవల్ల, పెద్దతనంగా ఉండాల్సిన అవసరం కలిగినట్లు

వేషం వేసుకుంటుంది. తక్కిన అమ్మాయిలు దూరంగా ఉంచుతారో, తనే దూరంగా ఉంటుందో కానీ, శకుంతల ఎవ్వరితోనూ ఎక్కువగా కలవదు. తనతో వస్తున్న కళ్యాణిని, "ఈ రోజు నాతో వస్తున్నావేం" అని అడిగింది శకుంతల. కల్యాణిసమాధానం చెప్పలేదు.

ఇద్దరూ శకుంతల కార్ దగ్గరకు నడిచారు. కార్ వెనకసీట్లో కూర్చున్నారు. డ్రైవర్ ఇచ్చిన నాలుగు గిన్నెల క్యారియర్‌లోంచి కంచంలోకి వడ్డించుకుని తినడం మొదలెట్టింది శకుంతల. తన టిఫిన్ బాక్స్ తెరుచుకుంది కళ్యాణి. తన క్యారియర్‌లోంచి ఏదీ ఇస్తానని అనలేదు శకుంతల. అలాగని కళ్యాణి టిఫిన్ బాక్స్‌లో ఏముందో చూడలేదు. తన గ్రూప్‌లో ఒకళ్ళదొకరు లాక్కుని తినడం గుర్తొచ్చింది కళ్యాణికి.

"పొద్దున్న నేను బయల్దేరేసరికి ఇంట్లో వంట పూర్తవదు. అందుకని ఏదో ఒకటి తిని వచ్చేస్తాను. మధ్యాహ్నానికి భోజనం పంపిస్తారు" అంది శకుంతల తింటూ. ఆ గొంతులో దగ్గరతనం వినిపించింది కళ్యాణికి.

అంతవరకూ చెప్పెయ్యాలనుకుంటున్న మాటలు అసంకల్పంగా కళ్యాణి నోట్లోంచి బయటకి వచ్చేశాయి– "నేను పెద్దమనిషినయ్యాను"

రోజూ గంటలతరబడి ఎన్నో విషయాలు మాట్లాడేవాళ్ళెవరితోనూ అనని విషయం, ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడకుండా ముభావంగా ఉండే శకుంతలతో అంది కళ్యాణి. అన్నాక ఎంతో రిలీఫ్‌గా అనిపించసాగింది.

"అందరూ నన్నే చూస్తున్నారనిపిస్తోంది. మగాళ్ళంతా నన్ను చూసి నవ్వుతున్నారనిపిస్తోంది. ఇక్కడ నుండి ఎక్కడికో పారిపోవాలనిపిస్తోంది" అలా చెప్తూ కళ్యాణి ఏడవడంలేదు. బాధపడ్డంలేదు. తనలో ఉన్న ఫీలింగ్‌ని సిన్సియర్‌గా చెప్తోంది. శకుంతల భోంచేస్తూనే ఉంది.

"ఈ ఫీలింగ్ అందరికీ కలుగుతుందా?" అని అడిగింది కళ్యాణి.

శకుంతల గిరుక్కున తలతిప్పి కళ్యాణివైపు కోపంగా చూస్తూ ఏదో అనబోయి తమాయించుకుని శాంతంగా అంది.

"నాకింకా ఈ అనుభవం లేదు. అయితే నాకన్నా పెద్దవాళ్ళు నాతో ఇలాంటి విషయాలు మాట్లాడుతుంటారు. అలా నాకు తెలిసిందేమిటంటే ఈ ఫీలింగ్స్ ఇలా కలగడం సహజం అని. దాని గురించి నువ్వు బాధపడద్దు. కొంత కాలానికి అంతా సద్దుకుంటుంది. శకుంతల భోంచెయ్యడం పూర్తయింది. క్యారియర్ సర్ది కంచం కడిగి నీళ్ళు తాగుతోంది. ఇలా కూర్చుని ఎవరు తెచ్చుకున్నవి వాళ్ళు తినడం చాలా సివిలైజ్‌డ్‌గానూ, గొడవపడుతూ ఒకళ్ళనొకరు లాక్కుని తినడం ఎంతో బార్బేరియస్‌గానూ అనిపించింది కళ్యాణికి.

ఇద్దరూ తిరిగి క్లాస్‌కి నడవడం మొదలెట్టారు. శకుంతల పక్కన నడుచుకుంటూ

వెళ్తుంటే, ఇంతకు ముందున్న ఆందోళన బాగా తగ్గినట్లనిపించింది కళ్యాణికి. ఎంతో భయంకరమైన ఆలోచనలూ, ఆందోళనలూ, శకుంతలలో అనుక్షణం ఉంటాయన్న సంగతి కళ్యాణికి తెలియదు. శకుంతల చెప్పదు.

# 3

కొండ ఎక్కి, దుర్గగుడికెళ్ళి, కిందకి దిగివచ్చి కృష్ణా బేరేజ్ పక్కనున్న ఇసుకలో కూర్చున్నారు కళ్యాణి, అనిత, శ్రీవిద్య, మహాలక్ష్మి.

రంగులోనూ, పొడవులోనూ, లావులోనూ చాలా బేలన్స్‌డ్‌గా ఉంటుంది కళ్యాణి. ఆ వయస్సుకెంత ఎదగాలో అంతే ఎదిగిన శరీరం. ఒత్తుగా పొడుగ్గా ఉన్న జుట్టు. నారింజరంగు పరికిణీ జాకెట్టు. అదే రంగు గాజులు.

అనిత సన్నంగా పొడుగ్గా కనిపిస్తుంది– సన్నంవల్ల పొడుగ్గానో లేక పొడుగు వల్ల సన్నంగానో కనిపిస్తుందేమో మరి. అంతగా సూటవని సల్వార్ కమీజ్. ఓ చేతికి గాజులా ఉండే గడియారం.

శ్రీవిద్య కొంచెం పొట్టిగా కాస్త లావుగా ఉంటుంది. పరికిణీ జాకెట్ల మీద కొన్నాళ్ళక్రితమే చేరిన ఓణీ ఎప్పుడు జారిపోదామా అన్నట్లు ఇబ్బందిగా ఉంది. మెళ్ళో చిన్న నెక్‌లెస్. రెండు చేతులకీ రెండేసి గాజులు, చెవులకి చిన్న దుద్దులు.

నలుగురిలోకి చాలా అందంగా ఉంటుంది మహాలక్ష్మి. బాగా నునుపు దేరిన చక్కని తెలుపురంగు శరీరం. లిప్‌స్టిక్ లేకపోయినా ఎర్రగా ఉండే పెదవులు. ట్రిమ్ చెయ్యకుండానే వంపు తిరిగిన సన్నని కనుబొమలు. కాటుక అవసరం లేకుండానే నల్లగా ఉండే విశాలమైన కళ్ళు. ఎంత ఎత్తుకు ఎంత స్లోప్‌లో తేవాలో తెలిసినట్లు పెరిగిన ముక్కు. మరీ పొడుగు కాకపోయినా ఒత్తుగా నల్లగా ఉన్న జుట్టు. రోజారంగు మిడీ వేసుకుని తల్లో రోజా పువ్వు పెట్టుకుంది. మెళ్ళోని సన్న గొలుసుకున్న సీతాకోకచిలుక లాకెట్, మిడీ మీద కుట్టిన చిన్న పువ్వు మీద వేళ్ళాడుతోంది.

“తొందరగా సినిమా చాన్సిప్పించమని కోరుకున్నావా కనకదుర్గని?” అని అడిగింది అనిత మహాలక్ష్మిని.

‘‘కాకపోతే–అందమైన మగాడు అమాంతంగా లేవదీసుకుపోవాలని కోరుకుంటానా– నీలా?” అంది మహాలక్ష్మి.

“నేనేం అలా కోరుకోలేదు” అంది అనిత.

“అలా లేవదీసుకుపోవాలని కోరుకోదులే. ఇద్దరూ కలిసి వెల్‌కమ్ రెస్టారెంట్‌లో లంచ్ చెయ్యాలనో, ఎవరెస్ట్ శిఖరంపై విహరించాలనో అనుకుంటుంది” అంది శ్రీవిద్య

కలగచేసుకుంటూ.

వాళ్ళలా మగాళ్ళ గురించి, పెళ్ళిళ్ల గురించి మాట్లాడుకోడం నచ్చనట్లు మాట మారుస్తూ అంది కళ్యాణి.

"ఈ కృష్ణానదీ, ఈ దుర్గగుడి కొండా– ఇవి మన ఊరికి ప్రకృతి ప్రసాదించిన వరాలు కదూ?"

అనిత నవ్వి అంది– "నువ్వు ఏడుస్తావని ఇక్కడకి వస్తాను కానీ, నాకైతే ఇలా రావడమే పెద్ద బోర్"

"ఇంకాసేపు ఆగితే బేరేజ్ మీద దీపాలు వెలిగిస్తారు. అలల మీద పడే దీపాలకాంతి నచ్చుదా నీకు?" అని అడిగింది కళ్యాణి శ్రీవిద్య ఒళ్ళో వాలుతూ.

"ఏడ్చినట్లుంటుంది" అంది అనిత వెంటనే.

"పోన్లే, నీ ఇష్టం నీది" అంది కళ్యాణి రిజైన్డ్‌గా.

"ఏదన్నా సినిమాకి పోదామా?" అడిగింది అనిత.

"మీరెళ్ళండి. నేను రాను" అంది శ్రీవిద్య.

"ఏం, ఎందుకనేం" అడిగింది అనిత.

"నేను ఏడూ–ఏడున్నరకల్లా ఇంటికి చేరకపోతే, మా ఇంట్లోవాళ్ళు నా కోసం వెతుక్కుంటూ వస్తారు" అంది శ్రీవిద్య.

"పాపం, చిన్న పాపాయి తప్పిపోయిందని" మహాలక్ష్మి వ్యంగ్యంగా అంది.

"ఏయ్ లక్ష్మీ, నువ్వొస్తావా?" అడిగింది అనిత.

"సినిమా అంటే నేను రెడీయే" అంది మహాలక్ష్మి.

"ఏ సినిమాకెళ్దాం" అడిగింది అనిత.

"ఏదో ఒకటి చూద్దాంలే– కళ్యాణీ, నిన్నడగడం అనవసరంకానీ నువ్వొస్తావా?" అంది మహాలక్ష్మి.

"నేను రాను" కళ్యాణి స్థిరంగా అంది.

"అదేంటి నువ్వు కూడా ఆ అమ్మకూచిలో చేరిపోయావ్" అంది మహాలక్ష్మి లేస్తూ.

"మీరెళ్ళండి" అంది కళ్యాణి లేవకుండానే.

"అదోసారి రానంటే అంతేలే. దాన్ని బతిమాలి లాభంలేదు. మనకు టైం అయిపోతుంది. పోదాం పద" అంటూ లేచి మహాలక్ష్మి చెయ్యి పట్టుకుని లాక్కుపోతూ నడవసాగింది అనిత.

కొంచెం దూరం వెళ్ళాక వెనక్కి తిరిగి 'సీయూ" అంది మహాలక్ష్మి.

"దాన్ని వాళ్ళ పేరెంట్స్‌కి జాగ్రత్తగా అప్పచెప్పు" అంది అనిత నవ్వుతూ కళ్యాణితో.

దూరంగా ఇద్దరూ గట్టెక్కడం, రిక్షా ఎక్కడం చూశారు. కళ్యాణీ, శ్రీవిద్యా.

"నా కోసం నువ్వెందుకు మానెయ్యడం? నువ్వు వెళ్ళాల్సింది. మా ఇంటి గురించి నీకు తెలుసుగా" అంది శ్రీవిద్య.

"నేను వెళ్ళకపోవడానికి కారణం నువ్వు కాదు. నాకీ కొత్త సినిమాలంతగా నచ్చవు"

"చూడాలని ఉన్నా నాకు కుదరదులే"

"నువ్వు మీ అమ్మా నాన్నల గురించి అలా అనుకోకూడదు. శ్రీ–వాళ్ళు నీ మంచి కోసమేకదా ఏం చేసినా"

"ఆ అన్నీ నా మంచి కోసమే. నన్నో మంచి డ్రెస్ వేసుకోనియ్యరు. ఓ సినిమా చూడనివ్వరు. ఇవన్నీ నా మంచి కోసమేగా?"

"నీకేం–మంచి డ్రెస్‌లే వేసుకుంటున్నావుగా?"

"ఇవా? వాళ్ళు చూడు. మహాలక్ష్మి మిడీ. అనిత సల్వార్ కమీజ్. నన్ను చూడు. పాత చింతకాయ పచ్చడిలాంటి వేషం. దానికి తోడు పాతకాలం నగలు. అసలు నన్ను చూస్తే ఓ పల్లెటూరిదాన్లా ఉండనూ?"

"ఛ–అలాగంటావేంటి?"

"ఆ–అంతే, ఫ్యాషనంటే పాపంలా చూస్తారు మా ఇంట్లో"

"అసలు, ఫ్యాషనేంటి? మనం ఏం వేసుకుంటే అదే ఫ్యాషన్"

"నువ్వు వేదాంతం మాట్లాడకు. నువ్వు నా పొజిషన్‌లో ఉంటే నీకర్థం అవుతుంది."

"నా సంగతీ అంతే. నేనూ ఏడున్నరకి ఇంటికి చేరకపోతే–అన్నయ్యా వదినా ఇద్దరూ వీధి గుమ్మంలోనే ఉంటారు"

"అది నీ మీద ఉన్న అభిమానంవల్ల. కానీ నా విషయం అలా కాదు. నేను టైంకి ఇంటికి చేరకపోతే, నేనేదో చేసేస్తుంటానని వాళ్ళ అనుమానం"

"సర్లే, ఏ కారణంగా అయితేనేం–ఇద్దరిళ్ళలోనూ ఎదురుచూస్తుంటారు. పోదాం పద" ఇద్దరూ లేచి బస్‌స్టాండ్ వైపుకి నడుచుకుంటూ వెళ్ళారు. వాళ్ళు స్టాండ్‌కి చేరడం ఐదవ నంబర్ బస్ రావడం ఒకేసారి జరిగాయి. మధు గార్డెన్స్ బస్ స్టాప్‌లో కళ్యాణి దిగాక, శ్రీవిద్య ఇంకా బస్‌లోనే ఉంది. వాళ్ళుంటున్నది స్టెల్లా కాలేజీ దగ్గర.

కళ్యాణి ఇంట్లోకి అడుగుపెట్టేసరికి పక్కింటి మోహన్ మురళీకృష్ణతో మాట్లాడుతూ కూర్చుని ఉన్నాడు.

మోహన్‌వాళ్ళ నాన్న, మురళీకృష్ణ ఒకే కంపెనీలో పని చేస్తున్నారు. ఇళ్ళు కూడా పక్కపక్కనే. మోహన్ వాళ్ళక్కా, సుజాతా బాగా స్నేహంగా ఉంటారు. మోహన్ వాళ్ళక్క నాగార్జున యూనివర్సిటీలో మేథమేటిక్స్ ఎమ్.ఎస్.సి చేస్తోంది. ఒకే స్కూల్లో ఒకే క్లాస్‌లో

చదువుతున్నా ఒకరితో ఒకరు మాట్లాడుకోరు కళ్యాణీ, మోహన్‌లు. ఆడపిల్లలతో మాట్లాడాలంటే వల్లమాలిన సిగ్గు మోహన్‌కి. కళ్యాణి కూడా చొరవ తీసుకోదు.

అందుకే మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది కళ్యాణి.

కొంచెంసేపు మాట్లాడి మోహన్ వెళ్ళిపోయాక కళ్యాణితో అన్నాడు మురళీకృష్ణ.

"మీ లెక్కల టీచర్ పాఠం సరిగ్గా చెప్పరుటకదా?"

"ఆ ఏదో చెప్తారు. అంత బాగా చెప్పరు."

"మోహన్‌కి లెక్కలు బాగా వచ్చుటగా"

"ఎప్పుడూ సెంట్ పర్‌సెంట్ వస్తుంది"

"నీకేమైనా డౌట్స్ ఉంటే అతన్ని అడుగు. నేను అదే మాట చెప్పాను. నీకేదైనా కావాల్సివస్తే తన దగ్గరకు వస్తావని చెప్పాను"

"ఏదన్నా అవసరమైతే అడుగుతాను" అంది కళ్యాణి.

## 4

అది జరిగిన వారం రోజులకే ఆ అవసరం వచ్చింది.

క్వార్టర్లీ పరీక్షలకి వారం రోజులుండనగా కళ్యాణికి జ్వరం వచ్చి స్కూల్‌కి వెళ్ళడం కుదరలేదు. పరీక్షల టైంకి జ్వరం తగ్గింది.

మురళీకృష్ణ మోహన్‌ని పిలిచి కళ్యాణి స్కూల్‌కి రాని రోజుల్లో చెప్పిన లెక్కలు చెప్పమని అడిగాడు. సరేనంటూ వచ్చాడు మోహన్.

తన గదిలో కుర్చీలో నీరసంగా కూర్చునుంది కళ్యాణి.

మురళీకృష్ణ అడిగితే లెక్కలు చెప్తానంటూ వచ్చాడేకానీ గదిలోకి వెళ్ళాలంటే భయం మొదలయింది మోహన్‌కి. అసలు ఆడపిల్లలతో మాట్లాడాలంటేనే మొహమాటం. అలాంటిది ఒంటరిగా కూర్చున్న కళ్యాణి దగ్గర కూర్చుని లెక్కలు చెప్పాలనేసరికి మోహన్ గుండె నిమిషానికి వందసార్లకి పైగా కొట్టుకోసాగింది.

ఆ గుండె చప్పుడు మోహన్‌కే వినిపించసాగింది. అడుగులు తడబడ్డాయి. తల వాలిపోయింది. కళ్ళు నేలనే చూస్తున్నాయి. ఒళ్ళంతా వణుకు పుట్టింది.

కళ్యాణి కూర్చున్న కుర్చీ పక్కనున్న కుర్చీలో కూర్చుని గొణుక్కుంటున్నట్లు చెప్పడం మొదలెట్టాడు. కంఠం వణకసాగింది.

అలానే కష్టపడుతూ రెండు మూడు నిమిషాలు చెప్పేసరికి కంగారు తగ్గింది. ఇక లెక్కల్లో మునిగిపోయాడు. అతనికింక మరో దృష్టిలేదు. తనకు తెలిసినది అవతలి మనిషికి అర్థమయ్యేలా చెప్పడమొక్కటే ధ్యేయం.

కళ్యాణికి అతను చెప్పే పద్ధతి బాగా నచ్చింది. ప్రతి లెక్కకు అతను ఏం చెయ్యాలో, ఎందుకు చెయ్యాలో, ఎలా చెయ్యాలో చెప్పడం చూస్తే, వాళ్ళ టీచర్ కన్నా మోహన్ బాగా చెప్తున్నట్టనిపించింది. తనకు అర్థంకాని విషయాలు అడిగింది. మోహన్ కూడా భయం తగ్గి మామూలుగా మాట్లాడసాగాడు.

ఆ రోజు నుండి కళ్యాణి తనకు తెలియనివి మోహన్ దగ్గర అడిగి నేర్చుకోవడం మొదలెట్టింది. మోహన్‌కి కళ్యాణి దగ్గర మొహమాటం తగ్గింది. అలాంటి సమయాల్లోనే వాళ్ళు, వాళ్ళ టీచర్ల గురించి తక్కిన పిల్లల గురించి మాట్లాడుకోడం మొదలెట్టారు– తమకు తెలియకుండానే. అలాగే వాళ్ళ బంధువుల గురించి, గత జీవితాల గురించి కూడా మాట్లాడుకునేవారు.

అలా–పరీక్షలయ్యేసరికి వాళ్ళిద్దరి మధ్యా– దారిలో ఒకరినొకరు చూస్తే చిరునవ్వుతో పలకరించుకునేంత చనువూ– పరీక్షలకి వెళ్ళడానికి ముందు ఒకరినొకరు కలుసుకుని 'బెస్టాఫ్‌లక్' చెప్పుకునేంత సాన్నిహిత్యం వచ్చేశాయి.

## 5

క్వార్టర్లీ పరీక్షలయ్యాక దసరా సెలవులకి కళ్యాణి అమ్మా నాన్నల దగ్గరకు కూచిపూడి వెళ్ళింది.

కళ్యాణితో మాట్లాడ్డం మొదలెట్టి పదిహేను రోజులు కూడా కాకపోయినా, మోహన్‌కేదో వెలితిగా అనిపించసాగింది.

ఫ్రెండ్స్‌తో తిరగడం ఎక్కువ అలవాటులేదు మోహన్‌కి. పుస్తకాలు చదువుకోడం, లెక్కలు చేసుకోవడం, అక్కతో కబుర్లాడ్డంతోటే కాలక్షేపం అయిపోతుందతనికి.

ఓ రోజు సాయంత్రం ఇంట్లో కూర్చుని మోహన్ ఏదో చదువుకుంటుండగా క్లాస్‌మేట్స్ సుధాకర్, రవీంద్ర వచ్చారు.

"సెలవు రోజుల్లో కూడా పొద్దున్నుండి సాయంత్రందాకా ఇంట్లోనే కూర్చుంటే బోరుగా ఉండదూ?" అని అడిగాడు రవీంద్ర.

"నాకు బానే ఉంటుంది. అయినా బయటకి పోయి మాత్రం ఏం చేస్తాం?" అన్నాడు మోహన్.

"వీడికసలు చదువు మీద తప్ప మరింక దేనిమీదా ఇంట్రెస్ట్ లేదురా. బయటకి పోయి ఏం చేస్తాం అంటాడు చూడు" అన్నాడు రవీంద్ర సుధాకర్‌తో.

"ఏం చేస్తాం కాదు– ఏం చూస్తాం అనాలి" అన్నాడు సుధాకర్.

"ఏం చూస్తాం ఊరేకదా. అయినా ఈ ఊళ్ళో చూసేందుకేం లేవు కూడా"

అన్నాడు మోహన్.

"ఈ ఊళ్ళో చూసేందుకు లేకపోవడమేం్రటా బాబూ– రోజుకో కొత్త అందాన్ని చూడచ్చు" అన్నాడు సుధాకర్.

"కనకదుర్గ గుడికెళ్తే చాలు–ఎంతమంది వచ్చి పోతుంటారో– అలా చూస్తూ కూర్చోవచ్చు" అన్నాడు రవీంద్ర.

"అంతెందుకోయ్. బస్సెక్కితే చాలు– ఏ చెయ్యో భుజమో తగలకపోతుందా?" అన్నాడు సుధాకర్.

మోహన్ మాట్లాడకుండా వింటున్నాడు. ఏం మాట్లాడకపోయినా, తనకి అడుగు దూరంలో కూర్చుని రాసుకుంటున్న కళ్యాణి చేతివేళ్లు గుర్తుకొచ్చాయి.

వాళ్ళిద్దరూ అలా మాట్లాడుతుండగా మోహన్ అక్క ముగ్గురికీ కాఫీ తీసుకొచ్చింది. తను కూడా కాఫీ తాగుతూ అక్కడే కూర్చుంది.

సడెన్‌గా రవీంద్ర, సుధాకర్‌లు సైలెంట్ అయిపోయారు.

"సెలవుల్లో ఎంజాయ్ చేస్తున్నారా?" అడిగింది తనే.

"అవునక్కా" అని సమాధానం ఇచ్చాడు రవీంద్ర.

అంతవరకూ, 'అక్కా!' అంటూ పిలుస్తూ మాట్లాడే సుధాకర్ కొన్ని రోజులుగా ఏమీ మాట్లాడకుండా కూర్చోడం గమనిస్తోంది మోహన్ వాళ్ళక్క. మొహంలో కూడా మరికొన్ని మార్పులు గుర్తిస్తోంది.

అంతకుముందు నున్నగా ఉండే పెదాల పైన ఇప్పుడు సన్నని చిన్న వెం్రటుకలు కనిపిస్తున్నాయి– మరికొన్నాళ్ళలో మీసాలుగా మారడానికి. గొంతుకలో అంతకుముందున్న మృదుత్వం పోయి ఓ విధమైన కరుకుదనం వినిపిస్తోంది. అంతకుముందు మాట్లాడుతుంటే కళ్ళు తనకేసి అమాయకంగా, నిర్భయంగా చూసేవి. ఇప్పుడు చూపులు తనలో ఏదో వెదుకుతున్నట్లు చూస్తున్నాయి. అంతేకాదు– తనని చూస్తున్న కళ్ళు తను అటు చూడగానే ఎటో తిరిగిపోతున్నాయి. సుధాకర్‌తో జా్రగత్తగా ఉండాలనుకుంది.

మోహన్‌లోనూ కొన్ని మార్పులు తెలుస్తున్నాయి. మీసాలు రావడానికి ముందుగా వచ్చే నలుపు పెదాల పైభాగంలో కనిపిస్తోంది. గొంతులో జీర వస్తోంది. అంతకుముందు సన్నంగా ఉండే కనుబొమలు కాస్త గుబురుగా అవుతున్నట్లున్నాయి.

రవీంద్ర మా్రతం ఇంకా అలానే వున్నాడు. ఇప్పుడు పర్వాలేదు కానీ, ఇదే మూతిలో ఇదే గొంతుతో ఇంకొన్నాళ్ళుంటే అమ్మాయిలా ఉంటాడని లోపలే నవ్వుకుంది.

"మీ కాలేజీకి సెలవులు లేవా?" అని అడిగాడు రవీంద్ర.

"స్కూలుకీ, యూనివర్సిటీకి చాలా తేడా ఉందిలే. యూనివర్సిటీలో ్రపొఫెసర్ల

ఇష్టాయిష్టాలనుబట్టి సెలవులుంటాయి. టెన్తయ్యాక ఏం చేస్తావ్?"

"ఇంటర్మీడియేట్– బై.పి.సి.తో చేద్దామని"

"అంటే డాక్టర్ రవీంద్ర అవ్వాలని అన్నమాట"

"మా నాన్నకి ఉందా కోరిక. నా చిన్నప్పట్నుంచీ అదే అంటున్నాడు"

నాన్న అంటున్నాడు అన్న మాటలు నచ్చలేదు మోహన్ వాళ్ళక్కకి. "నీ ఇష్టం ఏంటి?" అని అడిగింది.

"నాకదేం లేదు. ఏదో ఒకటి చదవడమే"

"నువ్వోయ్ సుధాకర్" అంది సుధాకర్‌తో.

"చూడాలి" అన్నాడు సుధాకర్ అదే సమాధానమైనట్లు.

"మీ మోహన్ ఇంజనీరేగా?" అడిగాడు రవీంద్ర.

"వాడికి లెక్కలంటే బాగా ఇష్టం. ఇంటర్‌లో ఎమ్.పి.సి. తీసుకుంటాడు. ఇంజనీరింగ్‌లో సీటొస్తే చేస్తాడు. లేకపోతే నాలా ఎమ్మెస్సీ చేస్తాడేమో" అంది.

"నేను ఇంజనీరింగ్ చదువుతాను" అనుకున్నాడు మోహన్.

"ఛ–బీఎస్సీ, ఎమ్మెస్సీ ఏంటక్కా. ఇంజనీరో, డాక్టరో అవాలికానీ" అన్నాడు రవీంద్ర. లోపలే నవ్వుకుని లేచింది మోహన్ వాళ్ళక్క.

"నాకన్నా ఆరేళ్ళు చిన్నాడు. నాకు టెన్త్‌లో వచ్చిన చదువులో సగం కూడా రానివాడు. నేను చదువుతున్న కోర్సుని ఛ అంటున్నాడు. వాళ్ళ నాన్న గారేదో ఆశ పెట్టుకున్నారు. కానీ మెడికల్ కాలేజీలో సీట్ వస్తుందా. అసలు ఇంటర్ సరిగ్గా పాసవగలడా' అనుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

"అలా వెళ్ళొద్దాం, రా" అన్నాడు రవీంద్ర లేస్తూ.

మోహన్ డ్రస్ మార్చుకుని వాళ్ళతో బయటకి కదిలాడు.

ముగ్గురూ బస్సెక్కి దిగి నడుచుకుంటూ వెళ్ళి అన్నపూర్ణ సినిమా హాల్ దగ్గర నిలబడ్డారు. మ్యాట్నీ వదిలే టైమయింది. కొత్త సినిమా– మొదటి ఆటకు జనం క్యూలో ఉన్నారు.

ఆట వదిలారు. వస్తున్న జనాన్ని చూస్తున్నాడు రవీంద్ర. వాల్ పోస్టర్ మీద ఉన్న తడిసిన తెల్లచీరలోని హీరోయిన్ అందాల్ని చూస్తున్నాడు సుధాకర్. మోహన్‌కి అక్కడ నిలబడ్డం చాలా చిరాగ్గా ఉంది. ఏదో ఇంటికి వచ్చి పిలిస్తే బావుండదని బయల్దేరాడు కానీ, అలా నిలబడ్డం ఇష్టం లేకపోవడమే కాకుండా చిన్నతనంగా ఉంటుందతనికి.

అంతలో– వాళ్ళకి కొంత దూరంలో రిక్షా దిగారు అనిత, మహాలక్ష్మి.

"వీళ్ళిద్దరూ చూడని సినిమా ఉండదులాగుంది" అన్నాడు రవీంద్ర వాళ్ళని చూస్తూ.

"నీకెలా తెలుసు?" అడిగాడు మోహన్.

"మనకి తెలియకపోడమేంటి?" అన్నాడు రవీంద్ర.

"ఇలా సినిమా హాళ్ళ దగ్గర, గుళ్ళ దగ్గర, ఆడపిల్లల బళ్ళ దగ్గర నిలబడితే తెలియకేం చేస్తుంది?" అన్నాడు మోహన్.

"అదో థ్రిల్లోయ్–నీకు తెలియదు. నువ్వు పిల్లాడివి" అన్నాడు రవీంద్ర.

తను పిల్లాడో, వాళ్ళు పిల్లలో అనుకున్నాడు మోహన్.

టిక్కెట్లు లేవన్న బోర్డు తగిలించారు హాలువాళ్ళు.

బ్లాక్‌లో టిక్కెట్లు దొరుకుతాయేమో చూసి, దొరక్క, మళ్ళీ ఇంకో సినిమాకన్నట్లు హడావుడిగా రిక్షా బేరం చేసుకుని అందులో ఎక్కారు అనిత, మహాలక్ష్మి. రిక్షా వెళ్ళిపోయింది. హాల్ దగ్గర జనం పల్చబడ్డారు. "ఇంక పోదాం పద" అన్నాడు రవీంద్ర. సెంటర్‌దాకా నడిచి వచ్చారు.

అక్కడ కుడిపక్కకి తిరిగి నవరంగ్ హాల్ వెనక్కి నడుచుకుంటూ వెళ్ళాడు రవీంద్ర. అక్కడే వాళ్ళిల్లు.

బస్టాండ్‌లో ఉన్న బస్సెక్కాడు మోహన్.

పక్కనున్న ఓ బుక్‌స్టాల్‌లో పుస్తకాల మీద బొమ్మల్ని కాస్సేపు చూసి, ఓ పుస్తకాన్ని కొనుక్కుని ఏలూరు రోడ్‌వైపు నడిచాడు సుధాకర్. కొంచెం దూరం వెళ్ళి ఎవ్వరూ చూడకుండా షర్ట్ కొంచెం ఎత్తి ప్యాంట్‌లో దోపుకున్నాడు ఆ పుస్తకాన్ని. ఏలూరురోడ్లోకి వచ్చి మాచవరం వెళ్ళే బస్కెక్కాడు. మాచవరం ఆంజనేయస్వామి గుడిపక్క సందులో ఉంది వాళ్ళిల్లు.

ఇంటికెళ్ళేసరికి వాళ్ళ నాన్న ఇంట్లో లేడు. వాళ్ళమ్మ వంట చేసుకుంటోంది. చెల్లెళ్ళిద్దరూ చింతగింజలాడుకుంటున్నారు. సుధాకర్ నాన్న సుబ్రహ్మణ్యం ఓ దినపత్రిక ఆఫీసులో ప్రింటింగ్ సెక్షన్‌లో పని చేస్తున్నాడు. ఎక్కువ నైట్ షిఫ్టులుంటాయి. పగలంతా నిద్రపోయి రాత్రికి ఆఫీసుకి వెళ్తాడు.

ఇంట్లో ఉన్న కాస్సేపు కూడా భార్యతోనే గడుపుతాడు. పిల్లలకి మామూలు బట్టలూ, భార్యకి ఖరీదైన బట్టలూ కొనడం చిన్నప్పుడు తెలియకపోయినా, ఇప్పుడు బాగా తెలుస్తోంది ముగ్గురికీ. చెల్లెళ్ళ జడలు ఖాళీగానూ, అమ్మ జడ నిండా మల్లెపూలు కనిపించడం చిరాగ్గా ఉంటోంది సుధాకర్‌కి.

తొందరగా భోజనం పెట్టమని తిని ఓ గదిలోకి పోయి చదువుకుంటున్నానని చెప్పి తలుపులు వేసుకున్నాడు సుధాకర్. ప్యాంట్‌లో దాచిన పుస్తకాన్ని బయటకి తీసి చదవసాగాడు. ఆడవాళ్ళ అంగాంగ వర్ణనలతో పాటు అతనికింకా అర్థంకాని విషయాలెన్నో ఉన్న పుస్తకం అది. ప్రతి వాక్యం అతనికెంతో ఇష్టంగా అనిపించింది. అంతకుముందు

వాల్‌పోస్టర్ మీదున్న అందాలతార అతని పక్కనే పక్కమీద పడుకున్నట్లయింది. ఏదో చేసెయ్యాలన్న కసి, కోరిక అతన్ని చుట్టేశాయి. ఆ పుస్తకం చదివేకొద్దీ ఇంకా ఎక్కువయ్యాయి.

## 6

సెలవులయ్యాయి. మళ్ళీ స్కూలు తెరిచారు.

శకుంతల స్కూలుకి కార్లో వస్తూనే ఉంది. ఎవరితోనూ ఎక్కువ కలవడంలేదు. తన ధోరణిలోనే తనుంటుంది. మనిషి ఇంకాస్త లావెక్కినట్లయింది.

అనిత సినిమాలు చూస్తూనే ఉంది. సినిమా పుస్తకాలూ, నవలలూ చదువుతూనే ఉంది. ఏదో ఊహాలోకంలో ఉండడం ఇంకా ఎక్కువవుతోంది.

మహాలక్ష్మి ఇంకా అందంగా తయారవుతోంది. రంగు, రూపం మెరుగులు దిద్దుకుంటున్నాయి. మూడేళ్ళుగా నేర్చుకుంటున్న నాట్యం ప్రాక్టీస్ చేస్తూండడం వల్ల బాగా వస్తోంది.

సుధాకర్ శృంగార సాహిత్యం చదవడం పెరిగింది. దాంతోపాటు విదేశీ పుస్తకాల్లోని ఫొటోలు చూడ్డం ప్రారంభించాడు. ఇంకా ఏదో కావాలన్న కోరిక పెరగసాగింది.

శ్రీవిద్యకి ఇంట్లోవాళ్ళ మీద కోపం పెరిగి విసుక్కోడం ఎక్కువయింది. ఆ విసుగుకి వాళ్ళకి కూడా కోపం వచ్చి ఏదో అనడం పెరిగింది. తనకిక్కడ లేని సుఖం ఎక్కడో దొరుకుతుందన్న ఆలోచన ఎక్కువవుతోంది శ్రీవిద్యకి.

రవీంద్రకి అమ్మాయిల వెనకే తిరుగుతూ అల్లరి చెయ్యడం బాగా అలవాటయింది. పొద్దున్న, సాయంత్రం వేళల్లోనే కాక స్కూలు వేళల్లో కూడా తిరగడం మొదలయింది.

మోహన్, కళ్యాణిల మధ్య చనువు పెరుగుతోంది.

అలా రోజులు గడుస్తున్నాయి.

పబ్లిక్ పరీక్షల రోజులు దగ్గరయ్యేకొద్దీ అందరికీ చదువు మీద గడిపే సమయం ఎక్కువయింది. పరీక్షలు జరిగాయి. రెండు నెలలు గడిచాయి. రిజల్ట్సు వచ్చాయి. మోహన్ స్కూలు ఫస్టొచ్చాడు. శకుంతల సెకండొచ్చింది. కళ్యాణి, మహాలక్ష్మి, అనిత ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యారు. రవీంద్రకి సెకండ్ క్లాసొచ్చింది. సుధాకర్ పాసయ్యాడు. శ్రీవిద్య పరీక్ష పోయింది. పరీక్ష పోయినందుకు శ్రీవిద్య ఏడ్చింది. మళ్ళీ రాసేందుకు ఫీజ్ కట్టింది.

కొత్తగా తెరిచిన ఓ కాలేజీలో కామర్స్ గ్రూప్‌లో చేరాడు సుధాకర్.

మూడు వేలు డొనేషనిచ్చి బై.పి.సి. గ్రూప్‌లో చేర్పించారు రవీంద్రని వాళ్ళ నాన్న.

అనిత, మహాలక్ష్మి, శకుంతల బై.పిసి.లో చేరారు. కళ్యాణి మాత్రం మేథమేటిక్స్ మెయిన్‌తో చేరింది. మోహన్ ఎమ్.పి.సి. గ్రూప్‌లో చేరాడు.

మోహన్ వాళ్ళక్క పెళ్ళయింది.

## 7

ఒకే స్కూల్‌వాళ్ళు నలుగురుండడంతో కాలేజీలో కొత్తగా అనిపించలేదు కళ్యాణికి. కానీ స్కూలుకి, కాలేజికి తేడా బాగా కనిపించింది. స్కూల్లో టీచర్లకి పిల్లలతో ఉన్నంత సంబంధం కాలేజీలో లెక్చరర్లకి స్టూడెంట్లతో ఉండడం లేదనిపించింది. అరవై మందికి పైగా ఉన్న క్లాస్‌రూమ్స్‌లో ఓ గంటపాఠం చెప్పి వెళ్ళిపోవడమే కానీ, ప్రతి స్టూడెంట్ గురించి తెలుసుకునే తీరికా, తెలుసుకోవాలనే కోరికా లేనట్లున్నారు లెక్చరర్లు.

పిల్లల మధ్య సంబంధం కూడా స్కూల్లో ఉన్నంత దగ్గరగా అనిపించలేదు కళ్యాణికి. స్కూల్నించి కలిసివచ్చినవాళ్ళు గుంపులుగా ఉండడంతో, కొత్తగా స్నేహం పెరిగే అవకాశం తక్కువగా వున్నట్లనిపించింది.

అంతేకాక, ఇంటర్మీడియేట్‌లో ఒక్కసారిగా సిలబస్ ఎక్కువవడంతో, బాగా కష్టపడితేకానీ మంచి మార్కులు రావడం కష్టమవుతుందనిపించింది. అలాంటి భావాలతో ఒక నెల గడిచేసరికి కాలేజీ వాతావరణం బాగా అలవాటయింది.

ఆ నెల రోజుల్లో మోహన్ తన కాలేజీ అనుభవాలు చెప్పేవాడు. ఇద్దరి అనుభవాలు, ఆలోచనలూ సుమారు ఒకేలాగుండేవి.

ఇద్దరు గ్రూపులా ఒకటే అవడంతో ఇద్దరూ సబ్జెక్ట్స్ గురించి మాట్లాకునేవారు. అలానే సంభాషణ కాలేజీల గురించి, లెక్చరర్ల గురించి, తక్కిన పిల్లల గురించి, ఎక్కువగా సాగేది. అయినా కలిసి మాట్లాడుకోకపోతే మాత్రం ఎంతో వెలితిగా అనిపించేది ఇద్దరికీ. ఇద్దరూ కలిసి గడిపే సమయం ఎక్కువయింది.

## 8

కాలేజీలు తెరిచిన నెల రోజులకి...ఓ రోజు

రవీంద్ర ఇంటికి చేరేసరికి రాత్రి తొమ్మిదయింది.

“ఈ రోజు లేటయిందేం?” అని అడిగింది రవీంద్ర చెల్లెలు.

“నీకెందుకు” రవీంద్ర జవాబు కొట్టినట్లుగా వచ్చింది.

చెల్లెలు మరేం మాట్లాడలేదు.

“నీ కన్న పెద్దాడు–మగాడు–వాడిని నువ్వడగడమేంటి?” అని వాళ్ళమ్మ కూడా చెల్లెల్నే కోప్పడింది.

రవీంద్ర పుస్తకాలు ఓ మూల పడేసి “భోజనం పెట్టెయ్” అన్నాడు.

రవీంద్ర నాన్నగారు, చెల్లెలు, రవీంద్ర భోజనానికి కూర్చున్నారు.

రవీంద్ర నాన్నగారి పేరు దక్షిణామూర్తి. ఏదో గవర్నమెంట్ ఆఫీసులో చిన్న ఉద్యోగి. చాలా ఏళ్ళ క్రితం నూజివీడు దగ్గర స్వగ్రామం వదిలిపెట్టి విజయవాడ వచ్చేశాడు. ఆయనకు ఇద్దరు కూతుళ్ళ మధ్యన ఒక కొడుకు. పెద్ద పిల్లకి పెళ్ళయింది. అమ్మాయిల పెళ్ళిళ్ల విషయంలో కూడా లేని ఆశ ఆయనకు కొడుకు చదువు మీద ఉంది. ఆ ఆశతోపాటు కొడుకు మీద ఆయనకు నమ్మకం కూడా ఎక్కువ.

ఇంట్లో రవీంద్ర అమ్మా, చెల్లెలూ రవీంద్ర చెయ్యాల్సిన పనులు కూడా చేస్తూంటారు. రవీంద్రకస్సలు పనిలేదు. తనకు వీలయినంతలో రవీంద్రకి కావాల్సినవన్నీ చేస్తుంటాడాయన. రవీంద్ర అన్నం సరిగ్గా తినకుండా కెలుకుతుండడం చూసి

"ఏరా, సరిగ్గా తినడం లేదు?" అని అడిగారాయన.

"ఏం లేదు"

"బయట ఏమన్నా తిళ్ళు తింటున్నావా?"

"అబ్బే–అదేం లేదు"

"ఎలాగుంది కాలేజీ?"

"బానే ఉంది"

"బాగా చెప్తున్నారా?"

"ఆ–"

"ఏ సబ్జెక్ట్ అన్నిటికన్నా బావుంటోంది?"

"అలా అడిగితే ఎలా? అన్నీ బావుంటాయి"

"ఫిజిక్స్‌లో ఏం చెప్తారు?"

"ఏం చెప్తారంటే–నీకెలా చెప్పడం–నీకేం రాదుగా"

"నాకు రాదులే. అయినా ఏం చెప్తారో తెలుసుకోవాలని"

రవీంద్ర జవాబియ్యలేదు.

"బాగా చదువుతున్నావా?"

"ఏవీ–ఇంకా పరీక్షల్లేవుగా"

"ముందు నుండి ఏ రోజు పాఠం ఆ రోజు చదివేసుకుంటే చివరికి కష్టం ఉండదు".

"పర్లేదు–అంత కష్టం ఏమీ కాదు"

"టెన్త్‌లోనూ అదే మాటన్నావ్–ఏమయింది?" రవీంద్ర మళ్ళీ మాట్లాడలేదు. తల్లి ఈ సంభాషణతో సంబంధం లేనట్లు వడ్డిస్తోంది.

చెల్లెలు వింటోంది– అంతే.

"ఇంటర్‌లో మార్కులు బాగా రావాలి–మెడిసిన్‌లో సీటు తెచ్చుకోవాలి"

"మెడిసిన్‌కి విడిగా ఎంట్రన్స్. ఇంటర్‌లో ఎన్ని మార్కులొచ్చినా ఒకటే"

"ఈ కబుర్లకేంలే. ఇంటర్‌లో బాగా చదివితేకదా ఎంట్రన్స్ బాగా రాయగలిగేది?"

"అదేం అక్కర్లేదు–మంచి ట్యుటోరియల్ కాలేజీలో ఓ నెల రోజుల కోచింగ్ చాలు"

"మనం చదువుకుంటే చాలు– మళ్ళీ కోచింగ్ ఎందుకు?"

"ఏం, డబ్బు కోసం చూస్తున్నావా?"

"ఛ, అదేం కాదు. నీకిప్పుడే చెప్తున్నా. నా హోప్సన్నీ నీమీదే. నేనేం పెద్దగా చదువుకోలేదు. నాకీ చిన్న ఉద్యోగం తప్ప మరో గతిలేదు. పెద్దదానికి పెద్ద చదువు చెప్పించలేదు. దీని గురించి కూడా నాకా బాధలేదు. నీకు మాత్రం ఎంత ఖర్చయినా చెప్పిస్తాను. నువ్వు బాగా చదవాలంతే".

చెల్లెలి మొహంలో మార్పు లేదు. అదేదో మామూలు మాట నోట్లోంచి వచ్చినట్లు వింది. తను అన్నయ్యకన్నా శ్రద్ధగా చదువుతుంది. అయినా తనకి చెప్పించకుండా నాన్న అన్నయ్యకి చదువు చెప్పిస్తానంటున్నాడు. అదేమీ అన్యాయంగా అనిపించినట్లు లేదు ఆ పిల్లకి.

రవీంద్ర భోజనం అయింది. చెయ్యి కడుక్కుని లేచి వెళ్ళిపోయాడు.

తన గదిలోకి వెళ్లి ఆ రోజే కొన్న సినిమా పత్రిక చూడ్డం మొదలెట్టాడు.

వాళ్ళ నాన్నగారూ, చెల్లెలూ ఇంకా భోంచేస్తున్నారు.

ఆ సమయానికి సుధాకర్ కూడా సినిమా పత్రికే చూస్తున్నాడు. అయితే అది చదవడం కాదు. పత్రిక మధ్య పేజీలో ఉన్న అందాలతార సగం దుస్తుల బొమ్మని అన్ని వైపుల నుండి చూడ్డం, ఎంతసేపు చూసినా ఇంకా చూస్తూనే ఉండాలనిపిస్తోంది. ఇంతకన్నా ఇంకా ఏదో చూడచ్చునన్న భావం. చూడ్డమే కాదు– ఏదో చేసెయ్యాలన్న కసి.

తనున్న గదిలో పక్కన పడుకుని నిద్రపోతున్నారు చెల్లెళ్ళు. పక్క గదిలో ఆఫీసుకి వెళ్ళేందుకు తయారవుతున్నాడు నాన్న.

అతనిక్కావల్సినవి అందిస్తూ ఆ గదిలోనే ఉంది అమ్మ.

సుధాకర్‌కి దాహమై లేచి వంటింట్లోకి వెళ్ళబోతూ పక్క గదివైపు చూశాడు. తలుపులు వేసి ఉన్నాయి. సుధాకర్‌కి చిరాగ్గా అనిపించింది. మంచినీళ్ళు తాగకుండా బాత్రూంవైపు నడిచాడు.

అతని ఆలోచనలు తనిందాక చూసిన బొమ్మలోని అమ్మాయి మీదకు మళ్ళాయి.

## 9

ఓ ఆదివారం సాయంత్రం

కళ్యాణి ఇంటిముందు తోటలో వేసి ఉన్న రెండు కుర్చీల్లో ఓ కుర్చీలో కూర్చునున్నాడు మోహన్.

డాబా మీదకెక్కడానికున్న మెట్ల రెయిలింగ్‌ని ఆధారంగా చేసుకుని పెరిగిన జాజి తీగ పువ్వుల్ని కోస్తోంది కళ్యాణి. ఒక్కో మెట్టు ఎక్కుతోంది. రెయిలింగ్ మీద వంగుతూ పువ్వులు కోస్తోంది. అలా కోస్తూనే మోహన్‌తో మాట్లాడుతోంది.

మోహన్ తలెత్తి కళ్యాణివైపు చూస్తున్నాడు. జాజి మొగ్గ మొదట్లో పట్టుకుని తుంపుతున్నాయి సన్నగా ఉన్న వేళ్ళు – సన్నగా పొడుగ్గా ఉన్న వేళ్ళు– సన్నగా పొడుగ్గా నాజుగ్గా ఉన్న వేళ్ళు. ఆ వేళ్ళనే చూస్తున్నాడు మోహన్. ఆ వేళ్ళు తన చెంపల మీద సుతారంగా కదులుతున్నట్లు లీలగా అనిపిస్తోంది మోహన్‌కి.

పువ్వులు కొయ్యడం అయింది.

కళ్యాణి పువ్వుల్ని తెచ్చుకుని మోహన్ పక్క కుర్చీలో కూర్చుంది.

సూర్యుడు అస్తమించాడు. పశ్చిమాకాశంలో ఎఱ్ఱ రంగు మిగిలింది.

కళ్యాణి పూలమాల కట్టడం మొదలెట్టింది.

దారాన్ని పువ్వుల చుట్టూ చుడ్తున్న వేళ్ళని చూస్తున్నాడు మోహన్. వేళ్ళ చివర గోళ్ళనే చూస్తున్నాడు.

సన్నగా ఉన్న గోళ్ళు– సన్నగా పొడుగ్గా ఉన్న గోళ్ళు– గోరింటాకు రంగుతో ఉన్న గోళ్ళు. ఆ గోళ్ళు తన పెదాలకి తగిలినట్లనిపిస్తోంది మోహన్‌కి.

"ఏంటలా చూస్తున్నావ్?" తన వేళ్ళవంకే చూస్తున్న మోహన్‌ని అడిగింది కళ్యాణి.

"గోరింటాకు గోళ్ళని" అన్నాడు మోహన్.

"అంత ఇష్టమైతే నువ్వూ పెట్టుకోకూడదా?" నవ్వుతూ అడిగింది కళ్యాణి.

"ఉందా?" అడిగాడు మోహన్.

"నిజంగా పెట్టుకుంటావా?" అదోలా చూస్తూ అడిగింది కళ్యాణి.

"ఏం?"

"ఏం లేదు, గోరింటాకు లేదు. నెయిల్ పాలిష్ ఉంది. వేసుకుంటావా?" అంది కళ్యాణి లేస్తూ.

"వద్దు– ఆడవాళ్ళకే కానీ, మగవాళ్ళకి కాదుగా అది" అన్నాడు మోహన్.

"అందుకే నీకు" అని నవ్వుతూ లోపలికి వెళ్ళింది.

తను నెయిల్ పాలిష్ వేసుకుంటే అందరూ నవ్వుతారని తెలుస్తోంది మోహన్‌కి. అయినా కళ్యాణి వేళ్ళలో తన వేళ్లు ఉంచుకుని పాలిష్ వేయించుకోవచ్చునన్న ఊహ ఎంతో మధురంగా అనిపించింది.

నెయిల్ పాలిష్ తెచ్చి ఇచ్చి "వేసుకో" అంది కళ్యాణి.

"నాకు రాదు" అన్నాడు మోహన్.

తన కుర్చీని మోహన్ కుర్చీకి ఎదురుగా లాక్కుని కూర్చుంది కళ్యాణి. మోహన్ ఎడం చేతిని తన ఎడం చేతిలోకి తీసుకుని కుడిచేత్తో గోళ్ళకి రంగు వెయ్యసాగింది.

అలా చెయ్యి తగలగానే మోహన్ నరాల్లో ఏదో జివ్వున లాగింది. శరీరంలోని రక్తమంతా విపరీతమైన వేగంతో ప్రవహిస్తున్నట్లయింది. ఒళ్ళంతా ఏదో తెలియని మత్తు ఆవరిస్తున్నట్లయింది. తల తేలిగ్గా అయిపోయింది.

అంతవరకూ ఏదో నవ్వుతూ మాట్లాడేస్తున్న కళ్యాణి మాట్లాడ్డం, నవ్వడం ఆపేసింది. మోహన్‌ని చూడ్డం మానేసింది.

ఎడంచేతి గోళ్ళయ్యాయి. కుడి చెయ్యి అందించాడు మోహన్.

మోహన్ చేతిని తన చేతిలోకి తీసుకుని బలంగా పట్టుకుంది కళ్యాణి.

రంగు వెయ్యడం పావు గంటలో పూర్తయింది.

చుట్టూ చీకటి అలముకుంది. మోహన్ కళ్యాణి మొహంలోకి చూడ్డానికి భయపడ్డాడు. కళ్యాణి మోహన్‌ని చూడ్డానికి సిగ్గుపడింది.

మోహన్ గేట్‌వైపూ, కళ్యాణి ఇంట్లోకీ నడిచారు.

తోటలో ఓ గులాబీమొక్క రెండు కొమ్మలకున్న రెండు గులాబీమొగ్గలు...

గాలికి కొమ్మలు కదలడంతో ఒకదానికొకటి దగ్గరయ్యాయి.

## 10

"ఈసారన్నా పాసవుతావా?" అడిగాడు శ్రీవిద్యా వాళ్ళ నాన్న, శ్రీవిద్య చదువుతోంటే.

"అది నేనెలా చెప్తాను. నా ప్రయత్నం నేను చేస్తున్నా" అంది శ్రీవిద్య.

"అమ్మాయ్, విద్యా- చంటిపిల్ల ఏడుస్తోంది. ఎత్తుకుందువ్‌గానిరా" అని పిలిచింది శ్రీవిద్య తల్లి.

"ఇదిగో, ఇదీ నా చదువు" అంది శ్రీవిద్య తండ్రితో.

"బావుంది-చదువనీ ఇంట్లో పనులు మానుకొంటామా, వెళ్ళి ఎత్తుకో" అన్నాడు తండ్రి. శ్రీవిద్య లోపలకెళ్ళి అక్కపిల్లని ఒళ్ళో వేసుక్కూర్చుంది.

శ్రీవిద్య అక్క నాలుగు నెల్ల క్రితం పురిటికి వచ్చి రెండు నెల్లకి ముందు ఆడపిల్లను కంది. అప్పట్నుంచి నీరసం అంటూ మంచం మీదే పడుకునుంటోంది. పిల్ల పెంపకం భారం అంతా శ్రీవిద్య తల్లిదే. దాంతో శ్రీవిద్యకి పని పెరిగింది.

శ్రీవిద్య తండ్రి శ్రీరామమూర్తికి గవర్నమెంటాఫీసులో ఉద్యోగం. సంపాదన బాగా ఉంటుంది. ఇద్దరాడపిల్లల్లో రెండవది శ్రీవిద్య. పెద్దల్లుడికి విశాఖపట్నంలో ఉద్యోగం.

శ్రీరామమూర్తికి కొడుకులు లేరన్న అసంతృప్తి ఉంది. ఆ అసంతృప్తి కొంత కూతుళ్ళ మీద కోపంగా మారుతుంది. కూతుళ్ళ చదువుల మీద అతనేనాడూ శ్రద్ధ చూపించలేదు. ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు చెయ్యడానికి ముందు కొంత చదువు అవసరమన్న ఉద్దేశంతోనే పెద్దపిల్లకి ఇంటర్మీడియేట్ దాకా చెప్పించి పెళ్ళి చేశాడు. శ్రీవిద్యకి కూడా ఇంకో రెండు మూడేళ్ళలో పెళ్ళి చేసెయ్యాలని శ్రీరామమూర్తి అభిప్రాయం.

శ్రీవిద్య తల్లికి ఏమీ అభిప్రాయాలు లేవు. పిల్లల్ని కనడం, పెంచడం, పెళ్ళిళ్ళు చెయ్యడం, మనవల్ని, మనవరాళ్ళని పెంచడం ఇవే ఆవిడ జీవితలక్ష్యాలు.

శ్రీవిద్య అక్క పెళ్ళయ్యేంతవరకూ శ్రీరామమూర్తి అభిప్రాయాలకి ఆ ఇంట్లో అడ్డు లేకపోయింది.

పెళ్ళయి విశాఖపట్నంలో ఉండడం మొదలెట్టాక అక్కడ అలవాట్లకు మారింది శ్రీవిద్య అక్క. అంతకుముందు శ్రీరామమూర్తి ఇంట్లో వారపత్రికలూ నవలలూ చదవనిచ్చేవాడు కాడు. సినిమాలు చూడనిచ్చేవాడుకాడు. పౌడర్ కూడా వాడనిచ్చేవాడుకాడు. శ్రీవిద్య అక్కకి అత్తవారింట్లో ఇలాంటివి చాలా అలవాటయ్యాయి.

ఇవన్నీ శ్రీవిద్య చూసింది. దాంతో తండ్రినెదిరించడం మొదలెట్టింది. తండ్రి తిట్టేవాడు. తల్లితో వాదించేది. నాన్నేంచేసినా నీ మంచికేనమ్మా అనేది తల్లి.

అక్కలాగే తను కూడా పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే తప్ప తనకు సుఖ సంతోషాలుండవన్న ఆలోచన శ్రీవిద్యలో బలంగా నాటుకుపోసాగింది.

అక్కపిల్లని ఒళ్ళో కూర్చోపెట్టుకుని ఉన్న సమయానికి శ్రీవిద్య వాళ్ళింటికి వచ్చింది కళ్యాణి.

“లోపలుంది శ్రీవిద్య– వెళ్ళు” అన్నాడు శ్రీరామమూర్తి.

వస్తూనే శ్రీవిద్య పక్కనే కూర్చుని పిల్లని తన ఒళ్ళోకి తీసుకుంది కళ్యాణి.

శ్రీవిద్య అక్కకి పిల్ల పుట్టినప్పట్నుంచి వీలయినప్పుడల్లా వాళ్ళింటికి వెళ్ళి పిల్లని కాస్సేపు కూర్చోబెట్టుకోడం అలవాటయింది కళ్యాణికి.

తనకి ఏ పనైతే రోతగా, చిరాగ్గా, అసహ్యంగా ఉంటుందో – ఆ పని కళ్యాణికంత సరదాగా ఎలాగుంటుందో అర్థంకాలేదు శ్రీవిద్యకి.

"ఈ పిల్లతో నీకు బోల్డు కాలక్షేపం" అంది కళ్యాణి.

"ఆ– ఇంకేం పనీ చేసుకోనక్కర్లేదు".

"నీకింకేం పనులున్నాయ్?– పరీక్షలకి చదువుకోడం తప్ప. ఎలా చదువుతున్నావ్? ఏవయినా డౌట్స్ ఉంటే నన్నడుగు" అంది కళ్యాణి పిల్ల మొహం దగ్గర చిటికేస్తూ.

"నా చదువే చదువులే– మహాలక్ష్మిని కలిసి చాలా రోజులైంది. ఎలాగుంది?"

"బావుంది. దానికి కాలేజీ అయ్యాక డాన్స్ క్లాసులున్నాయి. దాంతో ఎక్కడికీ వెళ్ళేందుకు టైముండడం లేదు"

"దాని ప్రోగ్రాం ఏదో ఉంటుందిటగా. అనిత అంది"

"అనిత కలుస్తుంటుందా?"

"అప్పుడప్పుడు వస్తుంటుంది. నేనూ వెళ్తుంటాను వాళ్ళింటికి"

"మా ఇంటికి రావేం?"

"ఎందుకూ– నువ్వే వస్తావుగా. అయినా నువ్వు కాలేజీకి వస్తే మా ఇల్లు దగ్గరేగా. మోహన్ బావున్నాడా? ఇంకా పుస్తకాల పురుగేనా?"

"ఆ–" అంది కళ్యాణి. మోహన్ గురించి అడిగిన రెండు ప్రశ్నల్లో దేనికి సమాధానమో చెప్పకుండా. మోహన్ ప్రస్తావన వచ్చిన దగ్గర్నుండి సరిగ్గా ఉండలేకపోయింది కళ్యాణి. శ్రీవిద్య అదేమీ గమనించకుండా కబుర్లు చెప్తూనే ఉంది.

పావుగంట తర్వాత ఇక వెళ్తానంటూ లేచింది కళ్యాణి.

# 11

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మహాలక్ష్మి అరంగేట్రం పెట్టించింది మహాలక్ష్మి గురువుగారు శ్రీమతి పద్మగారు.

మహాలక్ష్మి నాన్నగారు శంకర్ చార్టర్డ్ అకౌంటెంట్. కొన్నాళ్ళు కొన్ని కంపెనీల్లో పనిచేసి, అప్పుడు సంపాదించుకున్న స్నేహాలను ఆధారంగా చేసుకుని, స్వంతంగా ప్రాక్టీసు మొదలెట్టి బాగా డబ్బు సంపాదించుకున్నారు.

విజయాటాకీసు దగ్గర సందులో రెండంతస్తుల మేడ.

మహాలక్ష్మికిద్దరన్నయ్యలు, ఇద్దరక్కయ్యలు, ఇద్దరు తమ్ముళ్ళు, ఇద్దరు చెల్లెళ్ళు. ఇంట్లో ఎవరి ఇష్టాలూ, అలవాట్లూ, గదులూ వాళ్ళవి. ఓ నాలుగు రోజులు అందులో ఎవరన్నా ఇంట్లోలేకపోయినా తక్కినవాళ్ళకి ఆ విషయం తెలుస్తుందన్న నమ్మకం లేదు. కలిసి ఉన్నప్పుడు మాత్రం హాయిగా మాట్లాడుకుంటారు. మహాలక్ష్మి నాన్నగారి మీద ఉన్న గౌరవం ఒక కారణమైనా, మహాలక్ష్మి అందం, నాట్యం ముఖ్యకారణాలుగా డాన్స్ నేర్చుకోడం

మొదలెట్టిన నాలుగేళ్ళలోనే అరంగేట్రం ఏర్పాటు చేసింది పద్మ.

ఇంట్లో ఉన్నవాళ్ళంతా వాళ్ళకు తెలిసిన వాళ్ళను పిలిచారు. ఒక్కొక్కరికీ తెలిసినవాళ్ళు చాలామంది ఉన్నారు. పిలిచిన వాళ్ళలో చాలామంది వచ్చారు. దాంతో పెద్దదైనా కళాక్షేత్రం సగం పైగా నిండింది.

ఓ ఎమ్.ఎల్.ఏ.గారు, ఓ చిత్ర దర్శకులు ముఖ్య అతిధులుగా వచ్చారు.

అరగంట ఆలస్యంగా అరంభమైంది అరంగేట్రం.

చక్కటి కంఠంతో పాట పాడ్డం ప్రారంభించింది పద్మ.

వయ్యారంగా నడుచుకుంటూ స్టేజీ మీదకి వచ్చి గురువుకి నమస్కరించి నాట్యం ప్రారంభించింది మహాలక్ష్మి.

లైట్ల కాంతుల్లో, డాన్స్ దుస్తుల్లో చాలా అందంగా మెరిసిపోతోంది మహాలక్ష్మి. తన జీవితపు అనుభవాన్నంతా వినియోగించి ఎవరో మహాశిల్పి మలచిన పాలరాతి విగ్రహంలోకి హఠాత్తుగా ప్రాణం వచ్చి నాట్యం చేస్తున్నట్లుంది.

కొండ శిఖరాల మీద నుండి కిందకు దూకుతున్న వాగుల వేగం కనిపించింది ఆ శరీరపు కదలికలలో. చిరుగాలులకు కదిలీ కదలనట్లు కదిలే చిగురుటాకుల చిరుకంపం తెలిసింది ఆ దేహపు ప్రకంపనలలో.

నవరసాల్లో అన్ని రసాలు ఎంతసేపు కావాలో అంతసేపు నిల్చాయి ఆ విశాల నేత్రాలలో. ఆ కళ్ళు నవ్వాయి. ఏడ్చాయి. చెదిరాయి. అగ్నికీలల్ని కురిపించాయి. పాటకనుగుణంగా కంపించాయి ఎర్రని పెదవులు.

దంతంతో చెయ్యబడి పాలమీగడల పూతలతో మెత్తబడినట్లున్న చేతులు గాలిలో తేలుతున్నట్లు కదిలాయి. గోరింటాకు ముద్రించుకున్న అరచేతులు, పొడుగైన నాజూకు వేళ్ళతో కలిసి అందించాయి అన్ని ముద్రలనీ. అందమైన పూలజడ– సుమారు అంతే లావున్న సన్నని నడుంతో కలిసి లయబద్ధంగా ఊగింది. పాటకనుగుణంగా నర్తించాయి గజ్జెల పాదాలు.

గగన వేదికపై మెరపు తీగల నృత్యాన్ని మైమరపిస్తూ వర్షాగమన సమయంలో నెమలి హొయల్ని మరపింపచేస్తూ నాదస్వరానికి అనుగుణంగా అన్నట్లు కదిలే నాగుపాము కదలికలను చిన్నపుచ్చుతూ సాగింది మహాలక్ష్మి నాట్యం.

ప్రకృతిలోని ప్రతి అందం ప్రతి కదలిక ఇన్నాళ్ళూ తనలో ఇమిడిపోయి ఉండి, ఈరోజు అందరి ముందు బయటకొస్తున్నట్లు నర్తించింది మహాలక్ష్మి.

నాట్యం గురించి తెలియని వాళ్ళకది మానవ నృత్యంలా అనిపించలేదు. దేవతా నృత్యంలా అనిపించింది.

తెలిసినవాళ్ళకి, తెలియనివాళ్ళకీ కూడా నాట్యం బావుంది.

అంతకన్న మహాలక్ష్మి బావుంది. చాలా అందంగా వుంది.

ఆ మాటే అన్నాడు చిత్ర దర్శకుడు. పద్మ దగ్గర శిక్షణ అయ్యాక మహాలక్ష్మి సినిమాలవైపు వస్తుందని ఆశిస్తున్నానన్నాడు. మహాలక్ష్మికామాట ఎంతో ఆనందాన్నిచ్చింది. ఇంకా ప్రదర్శనలిచ్చి, ఇంకా పాపులర్ అయి, సినిమాల్లో చేరిపోవాలన్న ఆలోచనలు చుట్టుముట్టేశాయి మహాలక్ష్మిని.

# 12

మేడ మీద తన గదిలో పెద్ద మంచం మీద ఓ మూలగా నాలుగు తలగడలకానుకుని కూర్చుకున్నట్లు పడుకుని ఓ కామిక్‌ని చదువుతోంది శకుంతల. జుట్టు విరబోసుకుంది. చాలా లూజ్‌గా ఉన్న నైటీ వేసుకుంది.

సుమారు రెండు వేల చదరపు గజాల స్థలం చుట్టూ ప్రహరీ గోడ. మెయిన్ గేట్‌లోంచి లోపలకి వెళ్తే ఎదురుగా తామరపువ్వు ఆకారంలో ఉన్న సిమెంట్ తొట్టిలోంచి పైకి లేస్తున్న ఫౌంటెన్లు. దానిపక్కనే రెండస్తుల మేడ. మేడ లోపలకి అడుగు పెట్టగానే రెండు పక్కలా రెండు సోఫాసెట్లూ, మధ్యలో సోఫాసెట్టూ వేసినా విశాలంగా కనిపించే పెద్ద హాలు. గోడలకి పెయింటింగ్స్, ఆ హాలుకి రెండు పక్కల నుండి పైకి మెట్లు. కింద పది గదులు, రెండు డ్రాయింగ్ రూమ్స్, రెండు డైనింగ్ రూమ్స్, రెండు గెస్ట్ రూమ్స్, వంటిల్లు, స్టోర్ రూమ్, రెండు సర్వెంట్స్ రూమ్స్. పైన ఉన్న పది గదులూ– శకుంతలకి, తండ్రి వెంకయ్యనాయుడికి, తల్లి ఇందిరాదేవికీ, అన్న సుభాష్‌కీ, చెల్లెలు మేనకకీ.

ఆ రోజు మేనక పదవ పుట్టినరోజు చాలా గొప్పగా చెయ్యడానికి కింద గార్డెన్‌లో సన్నాహాలు జరుగుతున్నాయి. గార్డెన్‌కి మధ్యగా చిన్న వేదిక మీద పెద్ద టేబుల్– కేక్ కోసేందుకు అనువుగా. దాని చుట్టూ కుర్చీలు. తోటలో ఉన్న చెట్లకి లైట్లు పెట్టారు. అందరికీ కనిపించేలా ఓ చెట్టునుండి మరో చెట్టుకి ఉన్న దీపాల మాల వెలుగుతూ ఆరుతూ ఉంది.

అతిథులకి కూల్‌డ్రింక్స్, స్వీట్స్, ఐస్‌క్రీమ్స్, తక్కిన తినుబండారాలు అన్నీ సరిగ్గా ఉన్నాయని చూసుకున్నాక పైకి వచ్చింది ఇందిరాదేవి.

శకుంతల గది దగ్గరకెళ్ళి తలుపు కొట్టింది. కామిక్‌లో మునిగి ఉన్న శకుంతలకది వినిపించలేదు. తనే తలుపు తోసుకుని లోపలకొచ్చి శకుంతల దగ్గర కూర్చుంటూ– "బేబీ, రెడీకామ్మా. ఐదు దాటింది. గెస్ట్స్ ఆరింటికి రావడం మొదలెడ్తారు" అంది ఇందిరాదేవి.

"బర్త్‌డే మేనకది కదా, నేనెందుకు?" అంటూ లేచింది శకుంతల.

"అలా సిల్లీగా మాట్లాడకు– అందరూ నువ్వెక్కడున్నావని అడిగితే నేనేం చెప్పాలి?

నీ ఫ్రెండ్స్‌ని పిలవమని చెప్పాను. ఎవరినన్నా పిలిచావా?" అడిగింది ఇందిరాదేవి.

అప్పుడు గుర్తొచ్చింది శకుంతలకి, కళ్యాణిని పిలిచినట్లు.

లేచి, ఆ గోడనుంచి ఈ గోడ వరకూ ఉన్న వార్డ్రోబ్ తలుపులు తీసింది. ఓ పక్క మిడీలు, ఓ పక్క డ్రెస్‌లూ. ఓ పక్క పరికిణీ జాకెట్లూ. ఓ పక్క చీరలూ, బ్లౌస్‌లూ. మూడు నెలల క్రితం కుట్టించుకున్న బట్టలు ఇప్పుడు చాలుతాయన్న నమ్మకం లేదు. ఈ శరీరం ఏంటో విపరీతంగా పెరిగిపోతోంది. రెండు మూడు నెలలకే బట్టలు సరిపోవడంలేదు. ఎందుకిలా పెరిగి పోతోందో తెలియదు. మమ్మీకానీ, డాడీకాని ఈ విషయం పట్టించుకోరెందుకో. తనకి వాళ్ళనెలా అడగాలో తెలియదు. అసలు వినేందుకు వాళ్ళకు తీరికేది?

గ్రీన్ కలర్ మిడీ తీసుకుంది.

అది చూసి ఇందిరాదేవి "మిడీ ఎందుకు? చీర కట్టుకో. నీకిష్టమైతే గ్రీన్ కలర్‌దే వేసుకో" అని వెళ్ళిపోయింది.

మమ్మీ తన గదిలోకి ఎందుకు వచ్చిందో అర్థమైంది శకుంతలకి. ఎందుకు చీర కట్టుకొమ్మందో తెలుసు– తన ఎత్తూ, లావూ, మొహం, తక్కిన శరీరావయవాలు– అన్నీ చీర కట్టుకునేవాళ్ళలానే ఉంటాయి. ఆ విషయం శకుంతలకీ తెలుసు. అయినా ఇంకొకళ్ళు గుర్తుచేస్తే బాధ కలుగుతుంది.

అదే జరిగిందిప్పుడు. అయితే ఇలాంటి విషయాలకు అలవాటుబడ్డ మనస్సు తల్లి మాటను పాటించింది.

పావుగంటలో–

శకుంతల ఆకుపచ్చ చీరలో గార్డెన్‌లోకి వచ్చింది. అప్పటికే కొందరు వచ్చారు. తెల్లని ఫ్రాక్‌లో ముద్దొస్తూ నిలబడింది మేనక. పిల్లలు మేనక చుట్టూ నిలబడి మాట్లాడుతున్నారు. సుభాష్ తన ఫ్రెండ్స్‌తో ఇంకో పక్క ఉన్నాడు. ఆ వయస్సు ఆడా, మగా అంతా అక్కడే నిలబడి కబుర్లు చెప్పుకుంటున్నారు.

కళ్యాణిని తప్ప తక్కిన ఫ్రెండ్సెవరినీ పిలవలేదు శకుంతల. కళ్యాణి ఇంకా రాలేదు. 15, 16 సంవత్సరాల పిల్లలు కొందరు ఓ పక్క ఉన్నారు. గుంపుగా.

అక్కడకు నడిచింది శకుంతల. వాళ్ళు శకుంతలను గుర్తించినట్లుగా నవ్వి, ఓసారి పలకరించి, మళ్ళీ వాళ్ళ సంభాషణలో మునిగిపోయారు.

శకుంతల కూర్చునుంది, ఓ పక్కగా.

తనెళ్ళి ఏ గుంపుతో కలవాలో, ఎవరితో మాట్లాడాలో.

కళ్యాణి వచ్చేదాకా ఒంటరిగానే ఉంది శకుంతల.

అరగంట ఉండి వెళ్ళిపోయింది కళ్యాణి.

వెంటనే తన గదిలోకి వెళ్ళి పడుకుంది శకుంతల.

కళ్యాణితోపాటు తిన్న ఐస్‌క్రీం తప్ప ఇంకేం తినలేదు శకుంతల ఆ రాత్రి. అలా తినకుండా ఉండడం మొదటిసారి కాదు.

అలానే– అంతకుముందు ఎన్నో రాత్రులలానే– ఆ రోజు రాత్రి కూడా నిద్ర లేదు శకుంతలకి, అర్థంకాని అయోమయమైన ఆలోచనలవల్ల.

## 13

కూల్‌డ్రింక్ షాప్‌లోకి నడిచాడు రవీంద్ర.

లోపల డ్రింక్స్ తాగుతూ కనిపించారు అనితా, మహాలక్ష్మి.

“హల్లో” అంటూ వాళ్ళదగ్గరకెళ్ళాడు రవీంద్ర.

ఇంకా మీసం రాని మొహం, నున్నగా ఉండే బుగ్గలు, కాటుక పెట్టినట్లుండే కళ్ళూ– ప్యాంటూ, షర్టూ బదులు పరికిణి, ఓణీ వేస్తే తమ కాలేజీకి రావచ్చుననుకుంది మహాలక్ష్మి.

“ఎలాగున్నావ్” అడిగింది అనిత.

“బావున్నా. మీరెలాగున్నారు? చాలా రోజులైంది చూసి”

“నిన్న సాయంత్రం మా కాలేజీ గేట్ దగ్గరున్నట్లున్నావ్” అడిగింది అనిత.

“ఆ – ఎవరినో కలవాలని”

“రోజూ ఎవరినో కలవడానికే వస్తున్నట్లున్నావ్” అంది మహాలక్ష్మి.

“రోజూ కాదే”

“రోజూ పొట్టి జుట్టు జీన్స్ ప్యాంట్‌కి ఎస్కార్ట్‌గా వస్తున్నావనుకున్నాను” అంది మహాలక్ష్మి నవ్వుతూ.

“మీరెక్కడ నుండి వచ్చారు?” అన్నాడు రవీంద్ర ఆ టాపిక్‌ని మార్చడానికన్నట్లు.

“అసలా ప్రశ్నెందుకు? సినిమా హాల్నుండే. నువ్వెవరినయినా ఫాలో అవుతూ ఇటు వచ్చావా?” అడిగింది అనిత.

“ఎవర్ని ఫాలో అవుతాను?” అన్నాడు రవీంద్ర.

“ఏమో– ఎర్ర ఓణీనో, పచ్చ డ్రెస్‌నో, నీలం షర్ట్‌నో” నవ్వేస్తూ అంది మహాలక్ష్మి.

“మీరు నా మూవ్‌మెంట్స్‌ని బాగా అబ్జర్వ్ చేస్తున్నారులాగుందే” అన్నాడు, రవీంద్ర తను కూడా నవ్వుతూ.

“ఎలాగుంది బయాలజీ?” అడిగింది మహాలక్ష్మి.

"ఎలాగుండడానికి ఏముంది?" అన్నాడు రవీంద్ర.

"మెడిసిన్ ఎయిమ్‌తో చదువుతున్నావా?" అని అడిగింది మహాలక్ష్మి మళ్లీ.

"ఇంకా మొదటి సంవత్సరం సగం కూడా కాలేదు. అప్పుడే మెడిసిన్ గురించి ఆలోచనలేంటి? ఎంజాయ్ చేస్తున్నానంతే. ఏం, మీరప్పుడే ప్రిపరేషన్ మొదలెట్టేశారా? ఆడవాళ్ళకి ఇంకేం పనుంది?" అన్నాడు రవీంద్ర తేలిగ్గా.

"ఆడవాళ్ళంటే అంత చులకనేం నీకు?" అంది విసురుగా అనిత.

"అంత కోపమెందుకు నీకు?" అన్నాడు ఆశ్చర్యం నటిస్తూ.

"ఈ డిస్కషనెందుక్కానీ – ఎలాగుంది కాలేజీ లైఫ్?" అడిగింది మహాలక్ష్మి.

"హాయిగా ఉంది. క్లాసెస్‌కి వెళ్ళాలనుంటే వెళ్ళడం, లేకపోతే మానెయ్యడం. ఏ లెక్చరర్ ఎవ్వరినీ ఏమీ అనడు. ఆఫ్‌కోర్స్ మీ లేడీస్ కాలేజీలో అలాగుండదేమో గేట్లకి తాళాలేస్తారేమో" అన్నాడు హేళనగా.

"చదువుకునేవాళ్ళకి అదే మంచిదిగా" అంది అనిత.

"అందరం చదువుకునేవాళ్ళమేగా" అన్నాడు రవీంద్ర, అనిత మాటల్లోని అంతరార్థం అర్థం కానట్లు నటిస్తూ.

అతని ధోరణి ఇష్టం లేనట్లు మౌనంగా కూర్చున్నారిద్దరూ.

కొంచెంసేపు సంభాషణ లేకుండా గడిచింది.

"నీ డ్రెస్ చాలా బావుంది" అన్నాడు రవీంద్ర మహాలక్ష్మితో.

తన డ్రెస్ బావుందని మరెవరన్నా అంటే మహాలక్ష్మికి అభ్యంతరం ఉండేది కాదు. ప్రస్తుతం రవీంద్ర అన్న తీరు నచ్చలేదు.

"థాంక్స్–నాకు కొంచెం పనుంది. మేం వెళ్ళొస్తాం – రావే అనితా" అంటూ లేచి, కౌంటర్ దగ్గర డబ్బిచ్చేసి బయటకు నడిచేసింది.

"బై" అని రవీంద్రతో అని, తొందరగా నడిచి మహాలక్ష్మిని చేరుకుంది అనిత.

"ఏం పనుంది నీకు?" అడిగింది అనిత.

"పనా? పాడా? వాడి చూపులూ, మాటలూ నచ్చలేదు నాకు"

"ఇంటికి పోదామా?"

"రా, మా ఇంట్లో కూర్చుందాం"

"లేదు, ఇంటికెళ్ళిపోతాను"

"సరే, అయితే" అంటూ విజయాటాకీస్‌వైపుకి నడిచింది మహాలక్ష్మి.

సత్యనారాయణపురంలో ఇంటికి వెళ్ళేందుకు రిక్షా ఎక్కింది అనిత.

అనిత నాన్న పేరు నారాయణరావు. ఆయనకు వన్‌టౌన్‌లో ఓ స్టీలు సామాన్ల

కొట్టుంది. స్వంత ఊళ్ళో పదెకరాల పొలం ఉంది. రెండింటిమీదా ఆదాయం బావుంది. నారాయణరావు భార్య అనితను కనగానే కన్నుమూసింది. రెండో పెళ్ళి తలపెట్టలేదు నారాయణరావు.

కొట్టు పనులూ, ఊళ్ళో పొలం పనులూ– వీటితో అసలు తీరిక ఉండదు నారాయణరావుకి. అనితకి కావాల్సినవన్నీ చూసేందుకు నారాయణరావు దూరబ్బంధు వొకావిడ ఇంట్లో ఉంటుంది. ఆవిడకి ఇంటిపనీ, వంటపనీ తప్ప ఇంకేం పట్టదు. దానితో అనితనేం చేస్తున్నావని అడిగేవాళ్ళే లేరు.

అనిత ఇంటిముందు రిక్షా ఆగేసరికి ఇంటిముందు గేటు తీసుకుని బయటకి వచ్చాడు, సుమారు ఇరవై రెండేళ్ళ కుర్రాడు. ఒత్తుగా ఉన్న జుట్టు. సన్నంగా ఉన్న మీసం. చామనచాయ రంగుకి నప్పిన బ్రౌన్ కలర్ ప్యాంట్. ఇన్ చెయ్యబడ్డ చాకొలేట్ కలర్ షర్ట్. చేతిలో తాళం చెవులు తిప్పుకుంటూ వెళ్ళి, ఇంటి గోడపక్కగా ఉంచిన మోటార్‌సైకిలెక్కి, స్టార్ట్ చేసుకుని, స్పీడ్‌గా వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళేదాకా చూసి ఇంట్లోకి నడిచింది అనిత. తన గదిలో కూర్చుని ఏవో కాయితాలు చూసుకుంటున్నాడు నారాయణరావు.

“ఇప్పుడు బయటకెళ్ళిందెవరు?” అడిగింది అనిత.

“పై పోర్షన్ ఖాళీగా ఉందిగా– అందులోకి చేరడానికి వచ్చాడు” అన్నాడు నారాయణరావు కుర్చీలో రిలాక్సవుతూ.

‘‘ఒక్కడికీ అంత పోర్షనెందుకో?’’ అంది ఒక్కడే ఉంటున్నాడా అని తెలుసుకోడానికన్నట్లు.

“త్వరలో పెళ్ళి చేసుకుంటాడేమో” అన్నాడు నారాయణరావు కళ్ళజోడు తీసేస్తూ.

“ఏం చేస్తున్నాడేంటి?” అంది అనిత అక్కడే ఉన్న ఇంకో కుర్చీలో కూర్చుంటూ.

“ఏదో మెడికల్ కంపెనీలో రిప్రెజెంటేటివ్‌ట. వెనకా, ముందూ ఎవ్వరూ లేరట. కుర్రాడు చురుగ్గా ఉన్నాడు. అసలా ఉద్యోగానికి ఆ మాత్రం చురుకుదనం ఉండాలిలే. పేరు సుబ్బరాజు. అయితే అందరికీ రాజ్ అనే తెలుసుట. అలానే పిలవమన్నాడు” అన్నాడు నవ్వుతూ.

“ఎప్పుడొచ్చి చేరతాడు?” అంది అనిత లేస్తూ.

“ఎల్లుండి ఆదివారం పొద్దున్నే వస్తాట్ట” అన్నాడు నారాయణరావు. మళ్ళీ కళ్ళజోడు పెట్టుకుంటూ.

“నువ్వు లేనప్పుడింట్లో తోడుంటాడులే” అంది అనిత గది దాటి వెళ్తూ.

“నేనీ రాత్రికి భోజనానికి బయటకెళ్తున్నా. నువ్వు ఎప్పుడు ఆకలైతే అప్పుడు

తినెయ్యి" అని తన కాగితాల్లో మునిగిపోయాడు నారాయణరావు.

అనిత తన గదిలోకి వెళ్ళి తలుపులేసుకుంది. గోడల నిండా సినిమా యాక్టర్ల, క్రికెటర్ల పోస్టర్లు.

ఒకసారి గోడలన్నీ చూసి, డ్రెస్ మార్చుకుని, టేబుల్ ముందు కూర్చుంది.

టేబుల్ మీద ఓ పక్కగా తన కాలేజీ పుస్తకాలున్నాయి. అన్ని టెక్స్ట్ బుక్స్‌కీ, నోట్‌బుక్స్‌కీ, రకరకాల మేగజైన్స్‌లోంచి చింపిన సినిమా యాక్టర్లబొమ్మలే అట్టలుగా ఉన్నాయి. ఒక్కో పుస్తకం తీసి అట్టలు చూసింది. ఆ పుస్తకాలన్నీ పక్కన పెట్టేసి, అక్కడే ఉన్న సినిమా మేగజైన్ ఒకటి తీసుకుని, మంచం మీద వాలి పేజీలు తిప్పసాగింది. ఏ హీరో ఏ హీరోయిన్‌తో కలుస్తున్నాడో, ఏ హీరోయిన్ ఏ హీరో నుండి విడిపోతుందో అన్న వివరాలు ఆసక్తిగా చదువుతూ బొమ్మలు చూస్తోంది.

చూడ్డమయ్యాక పుస్తకం మూసి, కళ్ళు మూసుకుంది.

అలా కళ్ళు మూసుకుని పడుకోడం కొత్తకాదు అనితకి.

అలా పడుకుని చిరంజీవినో, కమల్‌హాసన్నో, రవిశాస్త్రినో, కపిల్‌దేవ్‌నో కలుసుకున్నట్లు ఊహించుకోడం కూడా కొత్త కాదు.

అయితే, ఆ రోజు ఊహల్లోకి వచ్చిన వ్యక్తి మాత్రం కొత్త. ఆ రోజు రాజ్ మోటార్‌సైకిల్ వెనకెక్కి కూర్చుని అలా వెళ్ళిపోతున్నట్లు ఊహించుకుంటోంది. ఆ ఊహ నిజమవుతుందేమో!

## 14

ఓ ఆదివారం సాయంత్రం– మహాలక్ష్మి ఇంటికెళ్ళి, మహాలక్ష్మి ఇంట్లో లేక, అనిత ఇంటికెళ్దామని ఏలూరు రోడ్లోకి వచ్చి నడుస్తోంటే ఎదురుగా వస్తున్న మోహన్‌ని చూసి నవ్వింది కళ్యాణి.

"ఎక్కడికి?" అన్నాడు దగ్గరకొచ్చి మోహన్.

"ఇంట్లో ఏమీ తోచక బయల్దేరా. మహాలక్ష్మి ఇంట్లో లేదు. అనిత దగ్గరకి వెళ్దామనుకుంటుంటే నువ్వు కనిపించావ్. నువ్వెక్కడ నుండి?" అడిగింది కళ్యాణి.

"విశాలాంధ్ర బుక్ హవుస్ కెళ్ళాను– పిస్కునోవ్ మేథమెటిక్స్ పుస్తకం దొరుకుతుందేమోనని. కాపీలు లేవుట వాళ్ళదగ్గర.

ఈ ఊళ్ళో మంచి లైబ్రరీలూ లేవు, మంచి పుస్తకాల షాపులూ లేవు".

"అదేంటి, ఈ రోడ్డంతా పుస్తకాల షాపులే కదా?"

"షాపులెక్కువే. మనక్కావాల్సిన మంచి పుస్తకాలు దొరికే షాపులు తక్కువ.

ఉన్నవాటిలో ఎక్కువగా దొరికేవి నవలలే కదా. మద్రాసులో హిగ్గిన్ బాదమ్స్ లాంటి షాపేది ఇక్కడ?"

"మన దగ్గర ఉన్న పుస్తకాలు చాలవా మన ఇంటర్మీడియేట్‌కి?"

"పరీక్షలు పాసయ్యేందుకో, మంచి మార్కులు తెచ్చుకుందుకో అయితే సరిపోతాయి. కాని సబ్జెక్ట్ బాగా అర్థం కావాలన్నా, ఎక్కువ విషయాలు తెలియాలన్నా ఇంకా మంచి పుస్తకాలు కావాలిగా".

"ఇదంతా వచ్చే సంవత్సరం ఇంజనీరింగ్‌కి ప్రిపరేషనా?"

"ఆ– ఐ.ఐ.టి. ఎంట్రన్స్ రాస్తానుగా– నువ్వు కూడా ట్రై చెయ్యి".

"నేను ఇంజనీరింగ్ చెయ్యలేను కానీ– ఇంటికెళ్ళి ఏం చేస్తావ్. బ్యారేజీకి వెళ్దామా?"

"అనిత ఇంటికి వెళ్ళవా?"

"అది మాత్రం ఉంటుందని నమ్మకమేంటి?"

"అయితే బ్యారేజీకెందుకు– ప్లానెటోరియంకి వెళ్దాం".

"ఏముంటుందక్కడ? నేనింతవరకు చూళ్ళేదు".

"ఈ ఊళ్ళో ఉంటూ చూడకపోవడమేంటి? ఈ రోజు ఆదివారం కదా. షో ఉంటుంది. వెళ్దాం రా".

ఇద్దరూ గాంధీ కొండమీద ప్లానిటోరియం దగ్గరకెళ్ళేసరికి, షో మొదలవడానికి సిద్ధంగా ఉంది. టిక్కెట్లు మోహన్ కొన్నాడు. కళ్యాణికి అంతా వింతగా అనిపించసాగింది. ఇద్దరూ లోపలకి వెళ్ళి పక్కపక్కగా కూర్చున్నారు.

అలా రాకుండా ఉండాల్సిందేమోనని ఓసారి అనిపించినా, అలా ఇద్దరే రావడం హాయిగా అనిపించింది కళ్యాణికి.

షో మొదలయింది. అంతా చీకటై పోయింది. పైనున్న 'డోం' ఆకాశంలా అయిపోయింది. వలయాకారపు హాలు మధ్యనున్న యంత్రం కన్నాల్లోంచి వస్తున్న వెలుగు రేఖలు "డోం–ఆకాశం'లో చుక్కల్లా మెరవసాగాయి. ఇద్దరూ తలెత్తి చూస్తున్నారు. ఎవరో ఒకాయన నక్షత్రాల గురించి వివరిస్తున్నాడు. అనుకోకుండా కళ్యాణి ఓణీ అంచు మోహన్ చేతికి, మోహన్‌చెయ్యి కళ్యాణి చేతికి తగిలింది. ఇద్దరూ చేతులు దూరంగా తీసుకోలేదు. ఒకరి చేతులు మరొకరికి తగుల్తూ అలానే కూర్చున్నారు. ఇద్దరిలోనూ ఏదో మత్తు ఆవరించింది. బయట ఏం జరుగుతోందో తెలియడంలేదిద్దరికీ.

నక్షత్రాలూ, గ్రహాలూ, వాటి స్వరూపాలూ, ఆకాశంలో దూరాలూ, గమనాలూ చక్కగా వివరణ సాగుతోంది. అంతకుముందు ఆరుసార్లు చూసినా, చూసిన ప్రతిసారి ఆ 'విశ్వదర్శనం'లో మునిగిపోయేవాడు మోహన్. ఈసారి అవేం తెలియడంలేదు, కళ్యాణి

చేతిస్పర్శ తప్ప. అంతకుముందెప్పుడూ కళ్యాణికి అటువంటి అనుభూతి లేదు. పక్కనేవున్న మోహన్ ఉచ్ఛ్వాస విశ్వాసాల సవ్వడిలో షో పూర్తి అయింది.

ఇద్దరూ పక్కపక్కనే నడుస్తూ కొండదిగసాగారు. చీకటిపడ్డంతో లైట్ల కాంతిలో అందంగా ఉంది విజయవాడ.

కొండకిందకొచ్చేసరికి– ఒకరికి తగులుకుంటూ ఒకరు – నవ్వుకుంటూ, మాట్లాడుకుంటూ– దిగుతున్నారు.

దారిపక్కనున్న ఓ చెట్టుకొమ్మ మీది గూటికి అప్పుడే వచ్చిన గువ్వలు రెండు– కబుర్లాడుకుంటున్నట్లు కూస్తున్నాయి.

## 15

రాత్రి పదకొండున్నర సమయం.

ఇంట్లో చెల్లెళ్ళిద్దరూ నిద్రపోతున్నారు. సుధాకర్ కంటికింకా కునుకులేదు.

పక్కగదిలోంచి శబ్దాలు వినిపిస్తున్నాయి. అమ్మా నాన్నా నిద్రపోనట్లుగా మంచం కదులుతున్నట్లు, గాజులు గలగలమన్నట్లు.

చాలా చిరాగ్గా అనిపించింది సుధాకర్‌కి. కోపం మనసునిండా ముసురుకుంది.

చెల్లెళ్ళిద్దరూ ప్రశాంతంగా పడుకునున్నారు.

ఓ ఏడాది క్రితం సుధాకర్ కూడా అలానే పడుకోగలిగేవాడు, ఏ ఆలోచనా లేకుండా. కాని, ఇప్పుడు ఏదో చేసేయాలన్న కసి పెరుగుతోంది.

అసహనంగా లేచాడు. ఇంటి బయటకి నడిచాడు. నడుస్తున్నాడు. రోడ్లవెంట, సందులవెంట. ఇది గమ్యం అన్న స్థిరత్వం లేకుండా, అయినా ఎక్కడికో చేరుకోవాలన్న తపనతో.

రాత్రి దీపాలకాంతిలో ఊరు పగటికి భిన్నంగా ఉంది. కొట్లన్నీ మూసేసి వున్నాయి. అక్కడక్కడా ఎవరో మనుషుల అలికిడి తప్ప జనం సంచారం లేదెక్కడా. కుక్కలు తిరుగుతున్నాయి. అరుచుకుంటూ, ఒకదానిని ఒకటి తరుముకుంటూ.

రోడ్డపక్క ప్లాట్‌ఫారాల మీద పడుకునున్నారు– కొందరు ఒంటరిగా, కొందరు జంటలుగా, కొందరు కుటుంబాలుగా.

సినిమాహాళ్ళ ముందుర రిక్షాలవాళ్ళు కూర్చునున్నారు.

నడుస్తున్నాడు సుధాకర్. రోడ్డుపక్క ఫ్లాట్‌ఫారంమీద– మరీ వెలుతురులేనిచోట– చీరపైదాకా వెళ్ళిన ఓ ఆడకాలు, మరో మగకాలితో పెనవేసుకోవడం కనిపించింది సుధాకర్‌కి. ఓ క్షణం ఆగి, చూసి, బయల్దేరాడు.

కొంచెం దూరం నడిచేసరికి, పల్చని, పసుప్పచ్చని నైలెక్స్ చీరలో, తల్లో వాడిపోతున్న పూలతో, మొహంనిండా మెత్తుకున్న పౌడర్‌తో, ఓ గంట క్రితం వేసుకున్న తాంబూలం తాలూకు ఎర్రని పెదాలతో, అలాంటి ఎన్నో తాంబూలాల సేవనంలో గారపట్టిన పళ్ళతో, లైట్ స్తంభం పక్కగా నిలబడిందో పాతికేళ్ళపైబడిన మనిషి.

ఎప్పుడూ పిలుస్తున్నట్లుగా వున్న నవ్వుతో, అందర్నీ ఆహ్వానిస్తున్నట్లుగా ఉన్న కళ్ళతో, సుధాకర్ని చూసీ, చూడనట్లు రెండు చేతులూ దీప స్తంభాన్ని పట్టుకోడానికన్నట్లు పైకెత్తింది. చెమటకి తడిసిన జాకెట్టు నుండి ఏదో సెంటువాసన ఘాటుగా తగిలింది సుధాకర్ ముక్కుకు.

ఆ నిలబడ్డంలో చీరకొంగు జార్చింది, కావాలనే. ఇంతకాలం తను చూడదల్చుకున్నదేదో కనిపిస్తున్నట్లయింది సుధాకర్‌కి. ఇంకా ఏదో చూడాలన్నట్లు ఆగాడు సుధాకర్.

"ఏం చూస్తున్నావ్?" అంది. సుధాకర్ అర్థం కానట్లు నవ్వాడు.

"వస్తావా?" అంది.

"ఎక్కడికి?"

"ఇంతవరకూ ఎవ్వరూ ఇలా పిలవలేదా? నువ్వెళ్ళలేదా?"

"లేదు"

"అయితే రా"

సుధాకర్ నవ్వబోయాడు. మళ్ళీ అంది.

"పాతిక రూపాయలవుతాయి"

"నా దగ్గరిప్పుడు డబ్బులేదు. డబ్బు రేపిస్తా"

"అరువు బేరాల్లేవుగానీ– వెళ్ళు" అంది నాలికతో పెదాల్ని రాసుకుంటూ.

సుధాకర్‌కి ఆ పెదాల్ని కొరికెయ్యాలనిపించింది.

"ఇప్పుడే వస్తా. ఉండిక్కడే" అంటూ కదిలాడు.

"నాకింకో బేరం వస్తే, ఉండను పిల్లాడా" అని లైట్‌స్తంభం దగ్గరే నిలబడింది.

సుధాకర్ నడుస్తున్నాడు.

పాతిక రూపాయలు లేవు. ఇంటికెళ్ళినా ఉండవ్. ఇంట్లో డబ్బంతా నాన్న గదిలో ఉంటుంది. ఆ గది తలుపులు వేసున్నాయిప్పుడు. వంటింట్లోంచి ఏదన్నా వస్తువు తీసుకొచ్చి అమ్మచ్చుకానీ, రాత్రి ఎవరు కొంటారు? నడుస్తున్నాడు.

పక్క హాల్లో సినిమా వదిలినట్లున్నారు. జనం బయటకి వస్తున్నారు.

రిక్షాలు కదిలాయి. రద్దీ తగ్గింది కాస్సేపట్లో.

రోడ్డుకో పక్కగా నడుస్తున్నాడో కుర్రాడు. అతని జేబులోంచి పర్స్ కనిపిస్తోంది. సుధాకర్‌కి లైట్ స్తంభం కింద నిలబడ్డ పసుప్పచ్చ చీర మనిషి, పాతిక రూపాయలూ తప్ప మరో ఆలోచనలేదు.

నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళి కుర్రాడి జేబులోంచి పర్స్ లాక్కుని పరిగెత్తేశాడు. ఆ కుర్రాడికి ఏమయిందో అర్థమయ్యేలోగానే మాయమైపోయాడు సుధాకర్.

పక్కసందులో కాస్సేపాగి పర్స్ తెరిచాడు. ఆరు పది రూపాయల నోట్లూ, కొంత చిల్లరా.

లైట్ స్తంభం వైపు నడిచాడు.

అక్కడే ఇంకా నిలబడి ఉందా మనిషి, సుధాకర్ వస్తాడని తెలిసినట్లు.

సుధాకర్ దగ్గరకెళ్ళి "వెళ్దాం" అన్నాడు.

ఇద్దరూ దగ్గర్లోఉన్న ఓ గుడిసెలోకి నడిచారు. చిన్నదీపం కాంతి. నులక మంచంమీద మాసిన దుప్పటి. తలుపు వేసింది. చీర ఇప్పేసింది. మంచం మీదకు వాలింది. సృష్టి కార్యక్రమానికి అవసరంగా ప్రకృతి అందరికీ సహజసిద్దంగా నేర్పించే శృంగారానికి బదులు...

డబ్బు సంపాదించడానికి మరో మార్గంలేక పడుపువృత్తినాశ్రయించిన ఓ వెలయాలి దగ్గర పశుప్రవృత్తి నేర్చుకుంటున్నాడు సుధాకర్– పరస్పరావగాహన, సహకారం, ప్రేమ, లాలిత్యం వంటి భావనలకి దూరంగా కామపూరితమైన వాంఛ ఒక్కటే ఆలంబనగా. దాంపత్య జీవనాన్ని ఒక కళగా తీర్చిదిద్దిన వాత్సాయనుని దేశంలో పదహారేళ్ళ సుధాకర్– పాతికేళ్ళ వయస్సులోనే ఎందరో మగాళ్ళ దగ్గర చేదు అనుభవాల్ని చవిచూసి, శృంగారమన్నది కేవలం తనను ఆ రాత్రికి డబ్బిచ్చి కొనుక్కునే మగాడికి అందించే విలాసవస్తువుగానే చూస్తున్న ఆ మనిషి దగ్గర కొత్త అనుభవాన్ని చవిచూశాడు.

నరాలకి మత్తును కలిగించే ఆ అనుభవం, అనుభవించేకొద్దీ ఇంకా కావాలనే కోరిక పెరుగుతుందన్న విషయం తెలియని మనస్సు, తెలియనివ్వని వయస్సు సుధాకర్‌వి.

## 16

ఎవరిదో పెళ్ళని విజయవాడ వచ్చిన చుట్టాలు కొందరు ఇంట్లో వున్నారు. అందరూ సరదాగా కబుర్లతో, ఆటలతో గడుపుతున్నారు– ఒక్క శకుంతల తప్ప. సాయంత్రం ఆరు దాటింది.

శకుంతల ఒక్కతే గదిలో కూర్చుని చూస్తోంది, రంగురంగుల లైట్ల కాంతుల్లో మెరుస్తున్న ఫౌంటెన్ నీళ్ళని. వచ్చిన చుట్టాలలో ఓ పాతికేళ్ళావిడ తన మూడేళ్ళ పిల్లతో

శకుంతల గదిలోకి వచ్చి అడిగింది.

"ఇంట్లో డెకొరేటివ్‌గా పెట్టుకుందుకు ఏవన్నా కొనాలి. ఇక్కడ లేపాక్షి ఎంపోరియంలో రకరకాల వస్తువులు దొరుకుతాయటకదా. నాకు ఈ ఊరంత బాగా తెలియదు. నువ్వొస్తావా?"

శకుంతల డ్రెస్ మార్చుకుని కారెక్కింది. కారు బయల్దేరింది. శకుంతలతో ఆవిడ మాట్లాడ్డం మొదలెట్టింది.

తన పిల్ల గురించి, పిల్ల చేసే అల్లరి గురించి, పిల్లని తను పెంచుతున్న తీరును గురించి కాస్సేపు. తన శ్రీవారి గురించి, ఆయన టూర్ల గురించి, ఆయన లేనప్పుడు తను అనుభవించే కష్టాల గురించి కొంతసేపు.

శకుంతలకి చిరాగ్గా వుంది. తనతో తన చదువు గురించో, తన కాలేజీ గురించో మాట్లాడకపోతేపోయె తన వయస్సుకేమాత్రం సంబంధించని దంపతుల సంగతులు, పిల్లల పెంపకాలు మాట్లాడుతోందావిడ.

మూడేళ్ళ పిల్లకి శకుంతలని ఆంటీగా పరిచయం చేసి, పిల్లని శకుంతలకి ఇచ్చేసింది.

లేపాక్షి దగ్గర ఆగింది కారు. ముందు ఆవిడ దిగింది. పిల్లతో వెనకే దిగింది శకుంతల. ఎంపోరియంలోకి వెళ్ళారు ముగ్గురూ.

ఎంపోరియం తనకు బాగా పరిచయమున్న స్థలంలా, అక్కడ కౌంటర్లలోని మనుషులు తనకు ఎంతో తెలిసినవాళ్ళలా, అన్ని కౌంటర్లలోకి వెళ్తూ, వస్తువుల్ని చూస్తూ, అన్ని వస్తువుల నాణ్యం, ధర గురించి అడిగి తెలుసుకుంటూ, తనకి తెలిసినవి చెప్తూ తిరుగుతోందావిడ.

శకుంతల కొంతవరకూ ఆవిడతో వెళ్ళి, అలా తిరడమెందుకో అర్థంకాక, పిల్లని తీసుకుని ఎంపోరియం మొదట్లో నిలబడి దిక్కులు చూడసాగింది.

ఎర్రని ఫ్రాక్‌లో తెల్లని పిల్ల ముద్దొస్తూ, ముద్దు ముద్దుగా ఏదో కబుర్లు చెప్తోంది. ఆంటీ అంటూ.

వరసకి పిన్ని కానీ, అత్త కానీ... కాని తనను ఆంటీ అని పరిచయం చేసినప్పుడే బాధపడింది. శకుంతల తన వయస్సున్న మరో పిల్లనైతే అక్కా అని పిలిపించి ఉండేదనుకుంది. ఎంపోరియంలోకి కొందరు వెళ్తున్నారు. లోపల్నుంచి కొందరు వస్తున్నారు. వెళ్తున్నవాళ్ళలో ఎవరో పక్కవాళ్ళతో– "పిల్ల చాలా బావుంది. తల్లి పోలిక కాదు. తండ్రి పోలికేమో. అదృష్టవంతురాలు"– అని తనను చూపిస్తూ అనడం వినిపించింది.

శకుంతలకి ఒళ్ళు తూలినట్లయింది. కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది. ఎవరో

నెత్తిమీద సుత్తితో బాదినట్లయింది.

తన్ని మూడేళ్ళ పిల్ల తల్లి అనుకునేటట్లుందాతను? ఆ బాధలో ఎంతసేపు గడిచిందో తెలియలేదు. లోపల్నుంచి ఆవిడ రావడం, కారెక్కడం ఇంటికి చేరడం తెలియకుండానే జరిగిపోయాయి. ఆవిడ ఏం కొందో కూడా చూడలేదు.

ఇంటికెళ్ళగానే భోంచెయ్యకుండా పడుకుంది. నిద్ర రాలేదు. కానీ, ఆ నిద్రలేమితో అంతకుముందెప్పుడూ రాని ఓ భయంకరమైన ఆలోచన వచ్చింది శకుంతలకి.

అంతకుముందు అలాంటి సంఘటనలెన్నో జరిగాయి– ఎంతో బాధ పడింది శకుంతల. ఎన్నో రాత్రులు మథనపడింది– తన్ని భగవంతుడు ఇలా ఎందుకు సృష్టించాడని.

తన వయస్సువాళ్ళెవ్వరికీ లేని సమస్య తన్ని మాత్రం ఎందుకిలా పీడిస్తోందని వెక్కి వెక్కి ఏడ్చింది.

కానీ ఎప్పుడూ– తనెందుకిలా బతుకుతోంది అని అనుకోలేదు.

చచ్చిపోవాలని అనుకోలేదు.

పదహారేళ్లు నిండా రాని శకుంతల తనకింక ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదేమోనని ఆలోచించసాగింది. ఆ ఆలోచనల అలజడిలో అలసిపోయిన శకుంతలకి ఆలస్యంగా ఆశ్రయమిచ్చింది నిద్రాదేవి.

## 17

అనుకున్న రోజునే అనితా వాళ్ళింట్లో అద్దెకు చేరాడు సుబ్బరాజు.

అయితే మర్నాడే టూర్‌కని వెళ్ళిపోయాడు అలా వెళ్తూ, వస్తూ, వెళ్తూండేవాడు.

ఓ పది రోజుల టూర్ తర్వాత ఓ మధ్యాహ్నం తిరిగి వచ్చాడు. ఆ రోజే దీపావళి. ఇంటిముందు తోరణాలుగా దీపాలహారాలు వేలాడదీసింది అనిత.

గేటుకున్న ఆర్చ్‌కి, ఉలిపిరి కాగితాల నక్షత్రం కట్టింది. అందులో దీపం వెలిగితే, కాగితాల మీద హ్యాపీ దీపావళి అని రాసి కనిపిస్తుంది.

సాయంత్రానికి చుట్టుపక్కల ఇళ్ళలో నూనె దీపాలు వెలిగించే సమయానికి, అనిత ఎలక్ట్రిక్ దీపాలు వెలిగించింది.

దానితో ఏ సంబంధం లేనట్లు తన గదిలో, ఏదో రాసుకుంటున్నాడు నారాయణరావు, చుట్టపావిడ వంటింటిలోనే వుంది.

గేటు దగ్గర నించుని చూస్తోంది అనిత, చుట్టూ వెలుగుతున్న దీపాల్ని. చిచ్చుబుడ్లు, మతాబులు, విష్ణుచక్రాలూ, వెన్నముద్దలూ, భూచక్రాలూ, కాకరపువ్వొత్తులూ, అగ్గిపుల్లలూ వీటి కాంతితో వీధంతా మెరుస్తోంది.

తారాజువ్వలు ఆకాశంలోకి దూసుకుపోతున్నాయి. పేలుడు టపాకాయలు చెవులు బద్దలుకొడుతున్నాయి. పైనుండి పెద్ద బుట్టతో దిగాడు సుబ్బరాజు. పలకరింపుగా నవ్వింది అనిత, అతన్ని చూసి.

"ఏంటండీ. ఏమీ కాల్చడం లేదా? భయమా?" అన్నాడు సుబ్బరాజు బుట్ట ఓ పక్కగా పెడ్తూ.

"అబ్బే–ఒక్కదాన్నే కాల్చడంలో ఏం సరదా?".

"రండి, కాలుద్దాం" అంటూ బుట్టలోంచి సామాను తీసి, ఇంటిముందు స్థలంలో కాల్చడం మొదలెట్టి, అనితని

బలవంతంచేసి కాల్పించసాగాడు.

ముందు మొహమాటపడ్డా అనిత కూడా సరదాగానే కాల్చసాగింది.

అంతకుముందు ఎన్నో దీపావళులు కలిసి చేసుకున్నవారిలాగే కలిసిపోయి కాల్చారిద్దరూ– సుబ్బరాజు అనితను భయపెడుతూ– అనిత భయం నటిస్తూ, నవ్వుకుంటూ, కాల్చుకుంటూ గడిపారు.

ఆ రాత్రికి భోజనం మా ఇంట్లోనే అంది అనిత. సరేనన్నాడు సుబ్బరాజు.

అనితకి జీవితంలో అదే మొదటి దీపావళిలా అనిపించింది.

అదే దీపావళి రోజు.

ఇంటి చుట్టూ చెట్లకున్న రంగురంగుల దీపాల కాంతులకూ, తనకూ ఏమీ సంబంధంలేనట్లూ, చుట్టూ ఎన్నో శబ్దాలున్నా ఒంటరితనాన్ని అనుభవిస్తూ గదిలో పడుకుండిపోయింది శకుంతల.

ఇంటికి అక్కా, బావా వచ్చారన్న ధ్యాసకూడా లేకుండా, అమ్మాయిల్ని చూడ్డానికి మధ్యాహ్నమే బయల్దేరాడు రవీంద్ర. ఇంట్లో చేసిన పిండివంటలు తినకుండా హొటల్‌కెళ్ళి ఏవో తిని, ఊరంతా తిరిగి, ఇంట్లో సందడంతా సద్దుమణిగాక, ఇల్లు చేరాడు.

ఇంటిముందు చెల్లెళ్ళు మతాబాలాతో ఆనందిస్తోంటే, ఇంకోపక్క సుబ్రహ్మణ్యం భార్యతో విష్ణుచక్రాలు కాల్పిస్తోంటే, అన్యమనస్కంగానే ఉండిపోయాడు సుధాకర్. ఇంటిముందు వెలిగించిన దీపాలు తప్ప మరో సందడిలేదు మోహన్ ఇంట్లో. డాబా ఎక్కి, చుట్టూ ఉన్న కాంతుల్ని చూస్తూ గడిపాడు మోహన్, పండగకి ఇంటికి వచ్చిన అక్కాబావలతో కలిసి.

ఇంట్లో ఎవ్వరూ కాల్చకపోతే బావుండదని కొన్ని కొని తీసుకొచ్చి కళ్యాణి చేత కాల్పించింది సుజాత.

ఇంటికొచ్చిన అల్లుడికి కావల్సిన పిండివంటలు తయారు చెయ్యడంలో తల్లికి

సాయంచేసి, వంటగదిలో ఓమూల పడేసిన పోయిన సంవత్సరపు దీపపు కుందుల్ని బయటకి తీసి, నూనె పోసి, ఒత్తులు వేసి వెలిగించి, ఇంటిముందూ వెనకా ఎవరెక్కడ పెట్టమంటే అక్కడ పెట్టి, అక్కాబావలు సరదాగా కాలుస్తుంటే అక్క కూతురు నెత్తుకు కూర్చుని, తల్లినీ తండ్రినీ అందర్నీ మనసులో తిట్టుకుంటూ గడిపింది శ్రీవిద్య.

ముదురు నీలం పట్టుపరికిణీ, జాకెట్టు మీద పల్చని, తెల్లని నైలెక్స్ ఓణీ వేసుకుని, చెవులకు బుట్టలూ, చేతులకు నీలంరంగు గాజులూ, కాళ్ళకు గజ్జెలూ పెట్టుకొని, వేసుకునీ, కట్టుకొనీ తలంటుకున్న జుట్టుని వదులుగా జడ అల్లుకునీ, నుదుటిని దోసగింజంత నీలంరంగు బొట్టూ, కళ్ళకు కాటుక పెట్టుకునీ, కవుల కావ్యాలలో, చిత్రకారుల చిత్రాలలో ఉండే అందమంతా పోగయి తానయినట్లు నవ్వుతూ, నవ్విస్తూ, బెదిరిస్తూ, నడుస్తూ, పరుగెడుతూ– వయ్యారంగా, గర్వంగా, మనోహరంగా అలనాటి సత్యభామే పండగ చేసుకుందుకు భూలోకానికి వచ్చిందా అన్నట్లు పండగ జరుపుకుంది మహాలక్ష్మి.

## 18

కాలేజీ మానేసి, పొద్దున్నంతా ఊళ్ళో తిరిగి, మార్నింగ్ షో వదిలే సమయానికి ఓ సినిమా హాల్ దగ్గర నిలబడ్డాడు రవీంద్ర, మరో ఇద్దరు స్నేహితులతో. జనం బయటకి వస్తున్నారు, సినిమా అవగానే. వచ్చే అమ్మాయిల గురించి రకరకాల వ్యాఖ్యానాలతో, నవ్వుల్లో ఉన్నారు ముగ్గురూ.

ఇద్దరు స్నేహితురాళ్ళెవరో వీళ్ళ ముందునుండి వెళ్ళారు. అందులో ఒకళ్ళు ఒకవైపు, ఇంకోళ్ళు ఇంకోవైపు బయల్దేరారు.

"ఎవరిల్లు చూద్దాం?" అన్నాడు రవీంద్ర స్నేహితులలో ఒకడు.

"నల్ల ఓణీ తెల్లపిల్లది" అంటూ అటు దారితీశాడు రవీంద్ర. వెనకే ఇద్దరూ.

అమ్మాయి బస్టాండులో నిలబడింది. ముగ్గురూ పక్కనే చేరారు.

"నల్లచీర పిల్ల నా పెళ్ళాం" అన్నాడు వెకిలిగా ఒకడు.

ఆ అమ్మాయి తలవంచుకుని నిలబడి వుంది. మధ్యమధ్యలో బస్సొచ్చేవైపు చూస్తూ, బస్సు తొందరగా వస్తే బాగుండుననుకుంటూ.

"ఎదురుచూపులు బస్సుకోసమేనా?" వాళ్ళలో వాళ్ళనుకుంటున్నట్లు ప్రశ్న.

"పక్కనే నేనున్నాగా, బస్సుకోసం చూడ్డమెందుకు?"

"నువ్వేమన్నా మోసుకుతీసుకెళ్తావా ఇంటికి?" ముగ్గురూ నవ్వారు.

బస్సొచ్చింది. ఎవరో ఇద్దరు ముగ్గురున్నారు బస్సులో. అమ్మాయి ఎక్కింది. రవీంద్ర గుంపు కూడా ఎక్కింది. అమ్మాయి ఓ సీట్లో కూర్చుంది. ముగ్గురూ సీట్లున్నా కూర్చోకుండా,

అమ్మాయి సీటు పక్కనే నిలబడ్డారు.

కండక్టరొచ్చాడు. వాళ్ళనక్కడ నుండి వెళ్ళి వెనక కూర్చోమంటాడేమోనని ఆశపడింది అమ్మాయి. కండక్టర్ అదేం పట్టనట్లు టికెట్టడిగాడు వాళ్ళను.

"ఎక్కడికి కొనాలి" అన్నాడు ఒకడు.

"అందరూ ఎక్కడ దిగితే మనమూ అక్కడే" అన్నాడు మరోడు, ఆ అమ్మాయినే చూస్తూ.

"లేడీస్ ఫస్ట్–ముందావిడకియ్యండి టికెట్టు. తర్వాత మాకు" అన్నాడు ఎంతో మర్యాదగా రవీంద్ర.

"ఎక్కడికి?" అన్నాడు కండక్టర్ అమ్మాయితో.

దిగాల్సినచోటు చెప్పి, చిల్లరిచ్చి, టికెట్టు తీసుకుంది ఆ అమ్మాయి.

అదే స్టాప్ చెప్పాడు రవీంద్ర ముగ్గురికి.

కేకలూ, కూతలూ, నవ్వులూ, అసభ్యపు మాటలూ.

బస్సులో ఉన్నవాళ్ళు వాళ్ళనాపని చెయ్యొద్దనలేదు.

వాళ్ళు దిగాల్సినచోటు ఆగింది బస్సు. నలుగురూ దిగారు.

ఎక్కువ జనసంచారం లేని సందులోకి నడిచింది ఆ అమ్మాయి. వెనకే ముగ్గురూ. పరుగులాంటి నడకతో ఓ ఇంట్లోకి వెళ్ళిపోయింది ఆ అమ్మాయి. వెనక్కి తిరిగారు ముగ్గురూ.

మళ్ళీ బస్సెక్కి ఇంటికి చేరాడు రవీంద్ర.

ఆరోజు క్లాసులో తనకేమాత్రమూ తెలియని పాఠాలున్నాయనీ, అవి తనకు చదివితే అర్థంకావనీ, క్లాసు మిస్సవడంవల్ల పరీక్షల్లో చాలా కష్టం అవుతుందనీ రవీంద్రకి తెలుసు.

అయితే,

ఎవరన్నా అమ్మాయి కనిపిస్తే చాలు, వెనకే వెళ్ళాలనీ, ఏవో మాటలని వాళ్ళని ఏడిపించాలనీ అతని నరనరాల్లో పీకేస్తుంది. అలాగని ఏ అమ్మాయన్నా అతనికి ప్రత్యేకమైన అభిమానం ఏమీలేదు. అలా తిరగడం, అంతే.

ఇంటికి చేరేసరికి తండ్రి ఇంట్లోనే వున్నాడు.

"ఈరోజు తొందరగా వచ్చేశావా?"

"ఆ–"

"ఎందుకు?"

"తొందరగా వదిలేశారు"

"ఏం?"

"ఏమో"

ఇలాంటి అంటీముట్టనట్లుండే సమాధానాలు బాగా అలవాటయ్యాయి దక్షిణామూర్తికి.

"ఇంక నాలుగైదు నెలల్లో పరీక్షలేమోగా. జాగ్రత్తగా చదువు"

"ఇంకా నాలుగైదు నెలలున్నాయిగా"

సంవత్సరం పోర్షను సంవత్సరమంతా చదివినా పరీక్షల సమయంలో కష్టమవుతుందని రవీంద్రకి తెలుసు. కాని తండ్రి ప్రశ్నలకి తిన్నగా సమాధానం చెప్పడం చిన్నతనంగా అనిపిస్తుంది రవీంద్రకి!

# 19

టెన్త్ మళ్ళీ ఫెయిలయింది శ్రీవిద్య. మళ్ళీ రాస్తావా అని అడగలేదు శ్రీరామమూర్తి. శ్రీవిద్య రాస్తాననికానీ, రాయననికానీ ఏమీ అనలేదు. మొదటిసారి పరీక్ష పోయినప్పుడు కొంచెం బాధపడింది. ఏడ్చింది. ఈసారి అలాంటిదేమీ లేదు.

అప్పటికి ఓ నెలముందే, పిల్లను ఇక్కడ ఉంచేసి విశాఖపట్నం వెళ్ళిపోయింది శ్రీవిద్య అక్క.

శ్రీరామమూర్తి అల్లుడికి ఉత్తరం రాశాడు. శ్రీవిద్యకి పెళ్ళి చేసెయ్యాలనుకుంటున్నాననీ, అతని ఎరికలో ఏవన్నా సంబంధాలుంటే చూడమనీ.

ఆ మాటే శ్రీరామమూర్తి భార్యతో అంటూంటే వింది శ్రీవిద్య.

తన వయస్సువాళ్ళంతా కాలేజీలకి వెళ్ళి చదువుకుంటుంటే తనకు పెళ్ళి చేసేస్తున్నారని బాధపడలేదు. ఆ పిల్లకదేదో వింత వార్తలా తోచింది.

ఎవరికన్నా ఆ విషయం చెప్పెయ్యాలన్న ఆతృతతో కళ్యాణి దగ్గరకి బయల్దేరింది. ఇంట్లోనే వుంది, కళ్యాణి, ఆ సాయంత్రం.

"నాకు పెళ్ళి చేసేస్తారుట" అంది శ్రీవిద్య కళ్యాణి పక్కనే పడుకుంటూ.

కళ్యాణి వాళ్ళింటికి శ్రీవిద్య వచ్చినప్పుడల్లా కళ్యాణి పడుకునే గదిలో మంచం మీద పడుకునే కబుర్లు చెప్పుకుంటారిద్దరూ.

"అప్పుడేనా?" కళ్యాణి ఆశ్చర్యంగా అడిగింది.

"టెన్త్ మళ్ళీ పోయిందిగా. నాకింక చదువు ఎలాగూ రాదని, పెళ్ళి చేసేద్దామనుకుంటున్నారు నాన్న"

"మళ్ళీ రాయచ్చుగా పరీక్ష"

"ఆ– నాక్కూడా ఇంట్రస్ట్ లేదులే"

"అదేంటి? ఇప్పుడు చదువుకోకపోతే తర్వాత చదవడం కష్టం. నామాట విని

మళ్ళీ రాయి. ఈసారి కష్టపడి చదివితే తప్పకుండా పాసవుతావు. తర్వాత ఇంటర్‌చేసి డిగ్రీ చెయ్యచ్చు. అప్పుడే పెళ్ళికి తొందరెందుకు?"

"అంత డిగ్రీ దాకా ఎలాగూ చెప్పించరు నాకు. మహా అయితే ఇంటర్. ఆ మాత్రానికి ఇంత కష్టం ఎందుకు?"

"పోనీ, ఇంటర్ ఇప్పుడైతే, డిగ్రీ తర్వాత చేసుకోవచ్చు. అసలు టెన్త్ కాకపోతే ఇంక తర్వాత ఏం చేస్తావ్?"

"ఈ చదువులు నాకింక వద్దులేవే. అందరూ నీలాగా ఇంటలిజెంట్సే ఉంటారా? అందరికీ చదువులు కావాలా?"

"చదవకపోతే పోనీ, అప్పుడే పెళ్ళెందుకు?"

"చదవకుండా ఊరికే ఇంట్లో కూర్చుని ఏం చెయ్యాలి కనక?"

"రెండు మూడేళ్ళు ఆగచ్చుగా"

"ఏం చెయ్యనింట్లో?"

"అక్కడ ఏం చేస్తావో అదే ఇక్కడ"

"ఇక్కడ మా అమ్మానాన్నలకు నన్నింట్లో ఉంచుకోడం ఇష్టం లేదు. తొందరగా పెళ్ళిచేసి పంపించెయ్యాలనుకుంటున్నారు".

"అమ్మా నాన్నలకు పిల్లలంటే ఇష్టం వుండకపోవడం ఉండదు. ఊరికే కూర్చుంటే నీకు బావుండదని పెళ్ళి చేసేద్దామనుకుంటున్నారేమో"

"అందరూ ఒకలాగుండరే. మా నాన్నకి మేం పెద్ద బరువుగా కనిపిస్తాం. ఎలాగో పెళ్ళి చేసి పంపేస్తే చాలనుకుంటాడు. అంతే. పెళ్ళయి వెళ్ళాక మా బావ దగ్గరే సుఖపడుతోంది మా అక్క, ఇక్కడకన్నా"

"ఛ- అదేంటే, అలాగంటావు?"

"కాక- ఇక్కడో సినిమా చూడనిస్తారా, పుస్తకం చదవనిస్తారా, మంచి బట్టలు వేసుకోనిస్తారా- అవన్నీ అక్కడకి వెళ్ళాకే వచ్చాయి మా అక్కకు"

"అవేనేంటి సుఖాలంటే?"

"ఇంకేం వుంటాయి? అయినా నేవద్దన్నా మానరులే నా పెళ్ళి"

"నువ్వు నిజంగా వద్దనుకుంటే, నేను, అనిత, మహాలక్ష్మి వచ్చి మీ నాన్నగారితో మాట్లాడతాం"

"నాక్కూడా చేసుకోవాలనే వుంది"

"నీకే ఇష్టం అయితే ఇంకేం చేస్తాంలే"

"అక్కడకి వెళ్తే చాలా హాయిగా ఉంటుందనిపిస్తోంది"

"ఎవరిని చేసుకుంటావో, వాళ్లెలాంటివాళ్ళో తెలియదు నీకు– అక్కడ బావుంటుందని ఎందుకనుకుంటున్నావ్?"

"ఎక్కడయినా మా ఇంట్లోకన్నా బానేవుంటుంది" అంది లేస్తూ శ్రీవిద్య.

"లేచావేం?"

"ఇంక వెళ్ళిపోతాను"

"కాసేపు కూర్చో"

"అనిత దగ్గరకెళ్ళాలి"

"అందరికీ చెప్పేస్తావా"

"ఏం?"

"పెళ్ళి నిశ్చయమయ్యాక చెప్పచ్చు. అప్పుడే అందరికీ చెప్పడమెందుకు?"

"అందరికీ కాదులే– అనితకీ, మహాలక్ష్మికీ మాత్రం చెప్తా, లేకపోతే, తర్వాత చెప్పలేదంటారు"

"నీ ఇష్టం"

వెళ్ళిపోతూంటే అడిగింది సుజాత

"తొందరగా వెళ్ళిపోతున్నావేం?"

"ఏంలేదు" అంటూనే కదిలింది శ్రీవిద్య.

శ్రీవిద్య వెళ్ళాక కళ్యాణి వదినతో అంది– "శ్రీవిద్యకి పెళ్ళి చేసేస్తారుట"

"నీ వయస్సుదే కదూ?"

"నాకన్నా కొంచెం పెద్ద, అంతే"

"పద్దెనిమిదేళ్ళు దాటకపోతే పెళ్ళి చట్టబద్ధం కాదు" అని, నవ్వి మళ్ళీ తనే– "మనుషుల్లో మార్పు రానంతకాలం చట్టాలేం చేస్తాయిలే" అంది సుజాత.

"పెళ్ళయితే అక్కడ హాయిగా ఉంటుందనుకుంటోంది"

"ఇక్కడ బాలేదు– అక్కడ బావుంటుందన్న ఊహతో వెళ్తే మాత్రం డిజప్పాయింట్ కావచ్చు"

"చెప్తే వినడంలేదు"

"అలాంటి మనస్థితి వస్తే, మనం చెప్పేది వినిపించదు. ఇంట్లో అమ్మా నాన్నల దగ్గర బావుండని పరిస్థితి ఎలాగొచ్చిందో. కొంత పెద్దవాళ్ళలోనూ, కొంత పిల్లల్లోనూ ఉంటుంది లోపం. అయినా సంబంధం కుదిరేసరికి కొంత సమయం పడ్తుందిలే" నిట్టూర్చి లోపలకెళ్ళింది కళ్యాణి. అదే అదనుగా చెబుదామనుకుంది సుజాత– మోహన్‌తో మరీ చనువుగా ఉండద్దనీ. కానీ చెప్తే కళ్యాణిలో లేని అభిప్రాయాలు కలిగించినదాన్నవుతానేమోనని

మానేసింది.

అయితే స్పష్టంగా ఇష్టం అని తెలియకపోయినా, మోహన్‌తో బాగా చనువు పెరిగింది కళ్యాణికి. వాళ్ళు కలిసి ఉండే సమయంలోనూ, కలిసి ఉండే పద్ధతిలోనూ మార్పువచ్చింది. ఒకరినొకరు తగులుతూ కూర్చోడం ఎక్కువయింది. మాటలు కూడా చదువు గురించికాక, ఒకరి గురించి మరొకరు మాట్లాడ్డం పెరిగింది. ఒకరు లేని సమయంలో ఇంకొకరికి కష్టంగా ఉంటోందని ఇద్దరూ చెప్తున్నారు.

అంతకుముందులా చదవలేకపోతున్నాడు మోహన్. మధ్యమధ్యలో కళ్యాణి గురించిన ఆలోచనలతో కొంతకాలం గడుస్తోంది. అలాంటి సమయాల్లో అవసరం లేకపోయినా కళ్యాణిని కలిసి, మాట్లాడుతున్నాడు.

కళ్యాణి పరిస్థితి కూడా అంతే.

# 20

డిశంబర్ 31 సాయంత్రం ఏడింటికి పైకి సుబ్బరాజు పోర్షన్‌లోకి వెళ్ళింది అనిత. అనితకలా వెళ్ళడం బాగా అలవాటయింది.

అప్పుడే డ్రెస్ మార్చుకుంటున్నాడు సుబ్బరాజు. తెల్లచొక్కా మీద నల్లచారలో లేక నల్ల చొక్కా మీద తెల్లచారలో చెప్పలేనట్లుండే పొడుగు చేతుల లూజ్ షర్ట్‌ని ఫేడెడ్ జీన్స్‌లోకి టక్ చేశాడు. ఒంటి మీద నుండి ఏదో ఫారెన్‌సెంట్ వాసన.

“ఎక్కడికి బయల్దేరుతున్నావ్” అడిగింది అనిత. వాళ్ళిద్దరిమధ్య మర్యాదపూర్వక బహువచనాలు పోయాయి. దీపావళి మర్నాడే.

‘ ‘ఈ రోజుతో ఈ సంవత్సరానికి గుడ్ బై. ఎక్కడకి అని లేకుండా తిరుగుతుండడమే రాత్రంతా. వస్తావా?”

“ఎన్నింటికి తిరిగిరావడం”

“పన్నెండు దాటాక ఎప్పుడో. నువ్వొస్తానంటే రాత్రి ఎక్కువసేపు ఉండద్దు. పన్నెండు దాటగానే వచ్చేద్దాం”

“ఇంట్లో నాన్నలేరు చెప్పి రావడానికి”

“లేకపోతే చెప్పడమెందుకు?”

“రాత్రికి వస్తారేమో తెలియదుగా. ఉండు, ఆవిడకి చెప్పేసొస్తా” కిందకి పరిగెత్తింది అనిత. నాన్న రెండు రోజులు రానన్నారంది బంధువులావిడ. రాత్రికి ఫ్రెండింట్లో ఉంటానని చెప్పింది అనిత.

నీలం రంగు మిడీ వేసుకుని గోల్డెన్ కలర్ బెల్ట్ పెట్టుకుంది. జుట్టుని పైపైన

దువ్వి లూజ్‌గా వదిలేసింది. కాళ్ళకి హై హీల్స్ వేసుకుని పైకెక్కింది.

"రోజ్ వాటర్ టు రోజీ గర్ల్" అని, స్ప్రే నొక్కాడు అనితకి దగ్గరగా. అనిత బట్టలనిండా వాసన గుప్పుమంది.

"పద" అంటూ తలుపుకి తాళంవేసి బయల్దేరాడు.

మోటార్ సైకిల్ మీద రాజు వెనక కూర్చుంది అనిత. అదే మొదటిసారి అలా ఎక్కి కూర్చోడం. మోటార్‌సైకిల్ వేగంగా వెళ్తోంది. గ్రీన్‌ల్యాండ్స్ హోటల్ దగ్గర ఆపాడు రాజు. ఇద్దరూ లోపలకి నడిచారు. గార్డెన్ రెస్టారెంట్ నిండా జనమే. ఉన్న టేబుల్స్ అన్నీ ఫిల్లయ్యాయి. ఇంకా కొందరు వెయిట్ చేస్తున్నారు.

"ఈరోజు హోటల్సన్నీ ఇలానే ఉంటాయేమో" అనుకుంటూ బయటకి నడిచారు. అలా రెండు హోటల్స్ అయ్యాక, మూడో హోటల్లో సీట్లు దొరికాయి.

హోటల్ నిండా రంగురంగుల కాగితాలు, బెలూన్లు కట్టున్నాయి. టేబుల్స్ మీద చిన్న ఫ్లవర్‌వేజ్‌ల్లో రోజా పువ్వులున్నాయి. రెండు రకాల స్వీట్స్‌తో డిన్నరయింది. గంట దాటింది, ఇద్దరూ బయటకి వచ్చేసరికి.

"పన్నెండుకింకా మూడుగంటలుంది. సినిమా చూద్దామా?" అన్నాడు రాజు.

"పద" అంది అనిత.

లీలామహల్లో ఏదో ఇంగ్లీషు సినిమా. కార్నర్ సీట్లలో కూర్చున్నారిద్దరూ.

రాజు అనిత సీటువైపుకి వంగి కూర్చున్నాడు- అతని కాళ్ళు, భుజం అనిత కాళ్ళకి భుజానికి తగులుతున్నాయి.

సినిమా నడుస్తోంది. హీరో, హీరోయిన్ల ప్రణయ దృశ్యాలే సినిమా నిండా. జనం అరుపులూ, ఈలలూ, గోలా హాలునిండా. ఏదో మత్తూ, మాయా అనిత మనస్సునిండా. అనితే వుంది రాజు కళ్ళనిండా.

సినిమా అయింది. పదకొండున్నరయింది.

మోటార్ సైకిల్ బయల్దేరింది. స్పీడ్‌గా వెళ్తోంది బండి. రోడ్లనిండా కార్లు, స్కూటర్లు తిరుగుతున్నాయి, జనాలతో. అందరూ కొత్త సంవత్సరం మూడ్‌లో ఉన్నారు.

బండి కృష్ణా బేరేజీ రోడ్డుమీద పోతోంది. చల్లగాలి రివ్వున వీస్తోంది. చలికన్నట్లు రాజునల్లుకుపోయి కూర్చుంది అనిత. అలా కొంత దూరం పోయి, మళ్ళీ వెనక్కి తిరిగింది బండి.

పన్నెండయింది. గట్టిగా జనం అరుపులు. టపాకాయలు, తారాజువ్వలు.

ఇంటికి చేరారిద్దరూ. ఒకరిమీదకొకరు వాలిపోతూ, పైకెక్కారు. సినిమా మత్తింకా వదల్లేదు. హీరోహీరోయిన్లు ఇంకా కళ్ళముందే ఉన్నారిద్దరికీ, రాజు అనితను దగ్గరికి

తీసుకున్నాడు. చేతుల్లో ఎత్తుకుని తీసుకెళ్ళి, మంచంమీద పడుకోబెట్టి, తనూ పక్కనే పడుకున్నాడు. అనిత అడ్డు చెప్పలేదు. తనకేదో అయిపోతున్నట్లు అయినా ఇంకా ఏదో కావాలన్నట్లు ఉంది. తనకే తెలియని తన్మయస్థితిలో ఉంది.

ఆ స్థితిలోనే, ఏదో కలలో ఉన్నట్లుగా అంది– "నాకేదో భయం వేస్తోంది"

"ఏం భయం లేదు"

"మనం చేస్తున్నది తప్పేమో"

"ఏం తప్పులేదు. నేన్నీతో ఇన్నాళ్ళూ అనలేదు– మనం పెళ్ళి చేసుకుందాం"

"ఎప్పుడు?"

"వీలైనంత తొందరలో"

"అదొక్కటే కాదు నా భయం"

"పిల్లలు పుడతారనా? ఆ భయం వద్దులే" అంటూ ఓ ప్యాకట్టందుకున్నాడు రాజు. అది అతని దగ్గరెందుకుందో అని ఆలోచించలేదు అనిత.

ఆ తర్వాత గదిలో

వేడి నిట్టూర్పులు– చక్కిలిగింతలు– నవ్వులు– నలిగిన బట్టలు– సన్నటి అరుపులు– తడిసిన పెదవులు– స్వేదబిందువులు– తడారిన పెదవులు– బాధ– ఆనందం– స్వర్గలోకపు టంచులకి చేరడం – జారడం–

కొత్త సంవత్సరం మొదటిరాత్రి నిద్రరాలేదు అనితకి, కొత్త అనుభవంతో.

# 21

సంక్రాంతి పండక్కి ఇంటికొచ్చారు మోహన్ వాళ్ళక్కా, బావా.

అంతకుముందు దీపావళికి వచ్చినప్పుడే మోహన్ కళ్యాణితో ఎక్కువసేపు గడపడం, కళ్యాణి లేని సమయాల్లో కూడా కళ్యాణి గురించే మాట్లాడ్డం గమనించింది మోహన్ వాళ్ళక్క. ఈసారికి అది తగ్గకపోగా, ఇంకా ఎక్కువయినట్టు గుర్తించింది.

ఆ మాటే సుజాతతో అంది, ఏదో మాటల సందర్భంలో.

అక్క : ఓ సంవత్సరం క్రితం ఒకరినొకరు చూసుకుందుకు కూడా సిగ్గుపడే వాళ్ళు – ఇప్పుడు వాళ్ళిద్దరే లోకమన్నట్లు ఉంటున్నారే.

సుజాత : నేనే నీతో ఈమాట అందామనుకుంటున్నా.నువ్వే ఈ ప్రస్తావన తెచ్చావ్. చాలా చనువుగా ఉంటున్నారిద్దరూ.

అక్క : ఇద్దరిమధ్య ఉత్త స్నేహమే ఉంటే ఫరవాలేదు. కానీ ఈ వయస్సులో ఉన్న పిల్లలకి ఆకర్షణలేని స్నేహం అర్థమవుతుందా? అలా ఉండగలరా? అని నా అనుమానం.

సుజాత : నా భయం కూడా అదే. పదహారు, పదిహేడు సంవత్సరాల అమ్మాయి, అబ్బాయి మధ్య పరస్పరాకర్షణకలగడం సహజం. దాన్ని వాళ్ళు తప్పుగా అర్థం చేసుకోవచ్చు.

అక్క : ఇద్దరూ తెలివైనవాళ్ళే. కానీ, చదువులో తెలివితేటలకీ, ఈ ఇమోషనల్ ఇన్వాల్వ్ మెంట్‌కీ సంబంధం ఏమీలేదు.

సుజాత : కళ్యాణితో ఈ విషయం మాట్లాడుదామనుకున్నానుకానీ, నిజంగా తనకీ ఆలోచనా లేకపోతే, నేనే కల్పించినదాన్నవుతానేమోనని ఊరుకున్నాను.

అక్క : మోహన్‌ని నేనడగడం ఎలాగో నాకూ తెలియదు. పోనీ, ఆయన్ని అడగమన్నా?

సుజాత : ఏం అడగమంటావ్?

అక్క : అదీ తెలియదు. కళ్యాణిని ప్రేమిస్తున్నావా అని అడగమంటాను.

సుజాత : నీ వెర్రికానీ, ఆ వయస్సులో ప్రేమేంటి? ఒకరితో ఒకరు చాలా ఏళ్ళు కలిసివుండి, ఒకళ్ళ అవసరం ఒకళ్ళకి కలిగి, ఒకరి కష్టాలు ఒకరికి తెలిసి, ఒకరికొకరు సాయం చేసుకుని, అలా పరస్పరావగాహనతో, అవసరంతో ప్రేమ పుడుతుంది. ఇరవై ఏళ్ళ వయస్సు కూడా రాని వాళ్ళమధ్య ఉండేది ఇన్‌ఫేచుయేషన్ అంతే.

అక్క : నా ఉద్దేశం వాళ్ళు ప్రేమించుకుంటున్నారని కాదు– వాళ్ళు ప్రేమించుకుంటున్నాం అని అనుకుంటున్నారేమోననే.

సుజాత : అంటే వాళ్ళు మేము ప్రేమించుకుంటున్నాం అనిచెప్తే వాళ్ళు ప్రేమించుకుంటున్నాం అని అనుకుంటున్నారని మనం అనుకోవచ్చు. అప్పుడు ఏం చెయ్యాలో అది వేరే ఆలోచన. ఒకవేళ వాళ్ళు అలా చెప్పలేదనుకో. అసలింతవరకూ వాళ్ళకా ఆలోచనే లేదనుకో. ఒకళ్ళతో ఒకళ్ళు బాగా స్నేహంగానే ఉంటున్నారనుకో. అప్పుడు మనం వాళ్ళకి కొత్త ఆలోచన ఇచ్చినవాళ్ళం అవమా?

అక్క : వాళ్ళుండే తీరు చూస్తే వాళ్ళలా ఉత్త స్నేహంతోనే ఉంటున్నట్లులేదు.

సుజాత : అది నీ ఊహ. నీ ఇరవైరెండేళ్ళ వయస్సుతో నువ్వాలోచిస్తున్నది ఏడెనిమిదేళ్ళ క్రితం నువ్వు మగవాళ్ళతో మాట్లాడేప్పుడు ప్రేమ గురించి ఆలోచించేదానివా?

అక్క : మన సంగతి వేరు.

సుజాత : మనం అందరం మన సంగతి వేరనే అనుకుంటాం. మనకిలా మరో అబ్బాయితో చనువుగా వుండే అవకాశం రానందువల్లనో, మనమే అలాంటి పరిస్థితులు రానివ్వకపోవడం వల్లనో– మన సంగతి వేరే అనుకుందాం. కళ్యాణి కూడా అలాంటి పిల్లే కావచ్చుగా. అలాగే మీ మోహన్ కూడా.

అక్క : అంటే?

సుజాత : అంటే వాళ్ళిద్దరిమధ్య ఉత్త స్నేహమే ఉండుండచ్చుగా.

అక్క : నాకలా అనిపించడంలేదు.

సుజాత : నాకూ అనిపించడంలేదు.

అక్క : మరేం ఇంతసేపూ అలా వాదించావ్?

సుజాత : మనం డీల్ చేస్తున్నది ఎదిగీ ఎదగని మనసులతో. దేనిమీదా స్పష్టమైన ఆలోచన, అవగాహనలేని పిల్లలతో. మనమేదో చేసి వాళ్ళ మనసులమీద అనవసరమైన ముద్రలు వెయ్యకూడదు. మనం చెయ్యబోయేదేంటో మనకు స్పష్టంగా తెలియాలి. అంతవరకూ ఏం చెయ్యకూడదు.

అక్క : అది కరక్టే. కానీ ఆలస్యమయ్యేకొద్దీ వాళ్ళేదన్నా చేస్తే–

సుజాత : ఇప్పుడు ఆకర్షణగా మొదలైంది. నిజంగా వాళ్ళ మధ్య చాలా కాలం నిలిచే ప్రేమగా మారి, పెళ్ళి చేసుకుని వాళ్ళు సుఖంగా ఉంటే– అంతకన్నా మనకు కావాల్సిందేముంది?

అక్క : నేను మాట్లాడేది పెళ్ళి గురించి కాదు.

సుజాత : నువ్వు మాట్లాడే విషయం నాకర్థమైంది. పెళ్ళికాకుండా, వాళ్ళు శారీరక ఆకర్షణకు గురవ్వచ్చుననే కదా నీ బెంగ?

అక్కడ : అవును.

సుజాత : అలాంటప్పుడు మనం జాగ్రత్త తీసుకోవాలి.

అక్క : అదే నేనంటున్నది.

సుజాత : కానీ, ప్రస్తుత పరిస్థితి అది అవునో కాదో తెలియదుగా.

అక్క : అది మనకు తెలిసేలోగా అంతా అయిపోవచ్చు.

సుజాత : నేనిక్కడే ఉంటూగా, పరిస్థితి చెయ్యి జారిపోతోందంటే ఊరుకుంటానా?

అక్క : నీ యిష్టం.

సుజాత : ఈ వయస్సు పిల్లల్లో రెబెల్ మనస్తత్వం ఉంటుంది. మనం చెయ్యొద్దన్నపనిని, పనికట్టుకుని మరీ చేస్తారు.

అక్క : నువ్వు వద్దంటే కళ్యాణి, నేవద్దంటే మోహన్– అదే పనిని చెయ్యొచ్చుగా.

సుజాత : చెప్పిన మాటకి వ్యతిరేకంగా ఉండడం మగపిల్లలకి ఆడపిల్లలకన్న ఎక్కువ మన సమాజంలో.

అక్క : అది నిజమే. చిన్నప్పటినుండి ఇంకొకళ్ళ మాట వినమని ఆడపిల్లలకి నూరిపొయ్యడం వల్లనేమో.

సుజాత : అయితే– అబ్బాయిలు, ప్రేమలు, పెళ్ళిళ్ళు– ఈ వ్యవహారాల దగ్గరకొచ్చేసరికి ఆడపిల్లలు కూడా తల్లిదండ్రుల్ని ఎదిరించచ్చు. అప్పుడుకానీ తెలియదు కళ్యాణి

సంగతి.

అక్క : అయితే, మోహన్‌కేమీ చెప్పద్దంటావ్.

సుజాత : అది నీ ఇష్టం. నా అభిప్రాయం ప్రకారం ప్రస్తుతం మనం ఏం చెయ్యక్కర్లేదు. పరిస్థితులను బట్టి ఏం చెయ్యాలో చూడచ్చు. నువ్విక్కడుండడం లేదని కంగారు పడకు. అవసరాన్ని బట్టి చెయ్యాల్సింది నేను చేస్తాను.

మోహన్ వాళ్ళక్కకి పూర్తిగా మనస్సు కుదుటపడలేదు. తమ్ముడు బాగా చదువు కుంటూ మధ్యలో ఈ ఆకర్షణలో పడ్డాడే అన్న బాధ తగ్గలేదు. అయినా సుజాత మీద నమ్మకంతో భారమంతా సుజాత మీదే వదిలేసింది. పండగ అయ్యాక హైదరాబాద్ వెళ్ళిపోయింది.

## 22

మార్చి నెలాఖరులో శ్రీవిద్య పెళ్ళయింది.

ఫిబ్రవరిలో పెళ్ళివారొచ్చి చూసుకోడం, వెంటనే సంబంధం కుదరడం, మార్చి నెల చివర్లో ముహూర్తం నిశ్చయించుకోడం– అన్నీ తొందరగా జరిగిపోయాయి. పెళ్ళికొడుక్కి రాజమండ్రి పేపర్ మిల్లులో ఉద్యోగం. సొంత పొలం ఉంది దగ్గరే ఒక పల్లెటూళ్ళో. బావుంటుంది సంపాదన. అతనికి పెళ్ళయిన అక్కలిద్దరూ, పెళ్ళికావల్సిన తమ్ముళ్ళిద్దరూ వున్నారు. తండ్రి లేదు. ఈ విషయాలు శ్రీవిద్యకంతగా నచ్చలేదు. అయితే రాజమండ్రి పల్లెటూరు కాదనీ, అక్కడ హొటళ్ళు సినిమా హాళ్ళు ఎక్కువ వున్నాయని తెలిశాక ఫరవాలేదనిపించింది.

పెళ్ళి పనులు చకచకా సాగాయి. గంగరాజు కళ్యాణమండపంలో రాత్రి పదకొండింటికి పెళ్ళి.

శ్రీవిద్య తన ఫ్రెండ్సందర్నీ పిలిచింది. కళ్యాణి, అనిత, మహాలక్ష్మి పొద్దున్నే వచ్చారు. పూలజడేసి, బుగ్గన చుక్క పెట్టేసరికి పెళ్ళి కళ వచ్చింది శ్రీవిద్యకి.

ముహూర్తానికింకా గంటన్నర ఉందనగా వచ్చాడు రవీంద్ర. పెళ్ళికొచ్చిన ఆడపిల్లల వైపు చూస్తూ గడపసాగాడు. ఇంకో అరగంటపోయాక, మోహన్ వచ్చి, కళ్యాణిని చూసి, పలకరింపుగా నవ్వి, రవీంద్ర దగ్గరకెళ్ళి నిలబడ్డాడు. సుధాకర్ వచ్చి వాళ్ళదగ్గరే నిలబడ్డాడు, ఎవరితోనూ మాట్లాడకుండా. పదకొండుకింక పదినిమిషాలుందనగా కార్లోంచి దిగింది శకుంతల. వచ్చి కళ్యాణి పక్కనే కూర్చుంది.

ఆ రోజు పెళ్ళికొచ్చినవాళ్ళకి కొత్త దంపతులకన్నా కొట్టొచ్చినట్లు కనపడింది మహాలక్ష్మి. ఓసారి చూసినవాళ్ళు ఇంకోసారి చూడకుండా ఉండలేకపోయారు. చాలా

బావుందనుకున్నారు. కొందరైతే దగ్గరకొచ్చి మరీ చూశారు. అందులో కొందరు ఆ మాట మహాలక్ష్మితోనే అన్నారు. సినిమా స్టారులాగా ఉన్నావన్నారు కొంతమంది.

సినిమా స్టారన్న మాట మహాలక్ష్మి చెవులకు వేణునాదంలా వినిపించింది. అదేమాట కళ్యాణికి వెగటుగా తోచింది. మేకప్పుల చాటున దాగివున్న ఏ సినిమా స్టార్ అందమూ మహాలక్ష్మి అందం ముందు పనికిరాదనుకుంది కళ్యాణి.

పెళ్ళిచూపులకి ముందు ఒకరికొకరు తెలియని వాళ్ళిద్దరూ ఒకరినెత్తి మీద ఒకరు జీలకర్రా-బెల్లం పెట్టుకున్న ముహూర్తం నుండి ఒకరికొకరైపోయారు. మంగళసూత్రం కట్టడం అయిన అరగంటకు చాలామంది వెళ్ళడం మొదలెట్టారు. శకుంతల, రవీంద్ర, మోహన్, సుధాకర్- ఎవరు తెచ్చిన గిఫ్టలు వాళ్ళు అందించి వెళ్ళిపోయారు.

ఇంకా మిగిలిన పెళ్ళితంతు జరుగుతోంది. శ్రీవిద్య పక్కనే కూర్చుని ఏదో మాట్లాడుతూ, హడావుడి చేస్తున్నారు, అనితా, మహాలక్ష్మి. కళ్యాణి కూర్చుని చూస్తూ ఆలోచిస్తోంది. తను స్కూల్లో చేరినప్పటినుండి గత అయిదేళ్ళుగా కలిసే ఉంటున్నారు నలుగురూ. బాధ్యతలులేని స్కూలు జీవితాన్ని ఒక గ్రూప్‌గా కలిసిపోయి హాయిగా గడిపేశారు.

ఈరోజు శేఖర్‌ని పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతుంది శ్రీవిద్య. శేఖర్‌కి భార్యగా, మరో కుటుంబంలోకి వెళ్ళిపోతుంది. పదిహేను ఏళ్ళు నిండని శ్రీవిద్య. మళ్ళీ కలవడం ఎప్పుడో? కలిసినా, ఇన్నాళ్ళూ ఉన్నట్లు ఉంటుందా?

తనలోని భాగం ఏదో తన్ని విడుస్తున్నట్లుగా అనిపించింది కళ్యాణికి.

పెళ్ళి తంతు సాగుతూ అంపకాల దగ్గరకొచ్చింది. శ్రీవిద్య తల్లిదండ్రులు శేఖర్‌కి, అతని కుటుంబసభ్యులకీ అప్పచెప్తున్నారు శ్రీవిద్యని.

నేనంటే ఇష్టంలేదని ఎవరి గురించి శ్రీవిద్య అనేదో, ఆ తల్లిదండ్రుల కళ్ళలో నీళ్ళు. అంతవరకూ నవ్వుతూ అల్లరిచేస్తున్న అనితా, మహాలక్ష్మి అదోలాగైపోయారు. అక్కడ కూర్చోలేనట్లు ముగ్గురూ అక్కడనుండి లేచి, దూరంగా వెళ్ళి నిలబడి, ఒకరి చేతులనొకరు గట్టిగా పట్టుకుని, చూస్తున్నారు.

గొంతులో ఏదో అడ్డుపడ్డట్లు ముగ్గురి నోట్లోంచి మాట రావడంలేదు. అంతేకాదు. లోపల్నుండి బయటకి వచ్చెయ్యబోతున్నదేదో గొంతు దగ్గర ఆగిపోతున్నట్లు అనిపించింది. స్కూల్లో కలిసి కూర్చోడాలూ, తిరగడాలూ, చిన్న చిన్న దెబ్బలాటలు, కలిసిపోడాలు గుర్తొస్తున్నాయి ముగ్గురికీ.

అంతకుముందు ఏమీ తెలియకుండా- అంపకాల దగ్గరే తను ఆ ఇంటి నుండి వెళ్ళిపోతున్నట్లు హటాత్తుగా అర్థమైనట్లు, ఒక్కసారిగా బావురుమంది శ్రీవిద్య- తల్లిదండ్రుల్ని పట్టుకుని.

అంతవరకూ ఆగిన కన్నీళ్ళు అనితా, మహాలక్ష్మిల కళ్ళలోంచి బయటకి వచ్చేశాయి.

ఆ ఇంట్లోంచి వెళ్ళిపోతే చాలనుకునే శ్రీవిద్య ఏడవడం ఆశ్చర్యంగా అనిపించింది కళ్యాణికి. అయితే ఆ భావం ఒక్కక్షణం కన్నా నిలవలేదు.

ఒక్క పరుగుతో శ్రీవిద్య దగ్గరికి చేరింది. వెనకాలే పరిగెత్తారు అనితా, మహాలక్ష్మి. చుట్టూ వున్న చుట్టాలు అందరూ చూస్తుండగా శ్రీవిద్యని పట్టుకుని ముగ్గురూ– ముగ్గుర్నీ పట్టుకుని శ్రీవిద్యా తనివితీరా ఏడ్చారు.

మర్నాడు మధ్యాహ్నం– శేఖర్‌తో కలిసి రాజమండ్రి వెళ్ళిపోయింది శ్రీవిద్య.

# 23

సాయంత్రం అయిదున్నరకి– మ్యూజియం పక్కనున్న ఖాళీస్థలంలో ఓ చెట్టు కింద గడ్డి మీద పడుకున్నారు అనితా రాజులు. రాజు ఎడం భుజంమీద తలపెట్టి పడుకునుంది అనిత. రాజు ఎడం చేతివేళ్ళు అనిత పరికిణీ జాకెట్ల మధ్యనా కుడి చేతివేళ్ళు అనిత బుగ్గల మీదా ఉన్నాయి.

ఆరోజు అనిత తెల్లజాకెట్టు, రాజు తెల్ల చొక్కా వేసుకున్నారు.

అది వాళ్ళిద్దరికీ అలవాటయింది. ఒకళ్ళ డ్రెస్‌కి మేచ్ అయేట్లు ఇంకోళ్ళు వేసుకోడం.

కొత్త సంవత్సరం మొదటిరాత్రి తర్వాత, అప్పుడప్పుడు ఆ అనుభవాన్ని చవిచూస్తున్నారు అనితా రాజులు.

రాజు ఇంట్లో ఎవ్వరూ లేరు. నారాయణరావుకి ఇంటి గొడవ పట్టదు. బంధువులావిడకి వంటగది తప్ప మరో చోటు తెలియదు. అయితే, కావల్సిన జాగ్రత్త తీసుకుంటున్నాడు సుబ్బరాజు.

"ఈ మ్యూజియం మన కోసమే కట్టినట్లున్నారు– ఎవ్వరూ రారేం ఇక్కడికి?" అంది అనిత.

"ఏం– ఎవరన్నా వస్తే మనకేంటి?"

"వచ్చి, మనల్ని చూసి నవ్వుకుంటారు"

"నవ్వుకోరు– ఏడ్చుకుంటారు"

"అవును– ఏడ్చుకుంటారు. ఇలా మనం సరదాగా ఉండడం తక్కిన వాళ్ళకి కన్నుకుడుతుంటుంది.

"ఎంతయినా ఇంట్లో ఉన్నట్లుగా ఉండదిక్కడ. ఇంట్లో అయితే నిన్ను పూర్తిగా–" అన్నాడు రాజు నవ్వుతూ.

“ఛీ–” అంది అనిత. గుప్పిళ్ళతో రాజు ఛాతీమీద కొడ్తూ.

అనిత రెండు చేతులూ పట్టుకున్నాడు రాజు

“పెళ్ళయిపోతే ఈ అవసరం ఉండదు”

“ఎప్పుడో చెప్పు మరి”

“నువ్వెప్పుడంటే అప్పుడే”

“నీ గొడవలో పడి నా చదువు సంగతి కూడా మర్చిపోయాను. ఇంటర్మీడియెట్ అయినా అవుతుందో అవదో”

“ఇప్పుడా చదువు సంగతి ఎందుకుకానీ, ఏవన్నా తియ్యటికబుర్లు చెప్పు”

“కబుర్లు చెప్పడం నాకేం చేతనవుతుంది. అది నీ పనికదా? డాక్టర్లతో బాగా కబుర్లు చెప్తావా?”

“ఆ– లేడీ డాక్టర్లయితే మరీను”

“వాళ్ళకేం పనుండదేంటి, నీతో కబుర్లు చెప్పేందుకు? నేను కూడా మెడిసిన్ చదువుదామనే బై.పి.సి.లో చేరాను”

“అది అమ్మాయిలంతా చేసే పనేగా. మెడిసిన్‌కని బై.పి.సి.లో చేర్తారు. సీట్‌రాక ఏ హోమ్ సైన్స్‌లోనో దూర్తారు”

రాజు వేళాకోళంగా అన్నా ఆ మాటలు నచ్చలేదు అనితకి. అది గ్రహించినట్లు సుబ్బరాజు

“ఏదన్నా సినిమా కెళ్దామా?” అన్నాడు.

“పద” అంది లేస్తూ అనిత.

ఇద్దరూ మోటార్ సైకిల్ దగ్గరకి నడిచారు.

అక్కడున్న కాపలామనిషి చేతిలో రెండు రూపాయల నోటుంచాడు రాజు.

మోటార్‌సైకిల్ సినిమాహాల్ దగ్గర రెండున్నరగంటలాగి ఇంటికి చేరింది.

ఇంటిముందు గదిలో కూర్చునున్నాడు నారాయణరావు.

వాళ్ళిద్దరూ అలా తిరగడం చాలాసార్లు చూశాడాయన. కానీ, అనితను ఏమీ అడగలేదు, అనలేదు.

ఏదన్నా అంటే తల్లిలేని పిల్ల బాధపడుతుందన్న ఊహకన్న, అసలు ఆ విషయం గురించి ఆలోచించే తీరికలేకపోవడమే అడగకపోవడానికి కారణం.

అనితా రాజులు శారీరకమైన సంబంధం పెట్టుకున్నారని తెలిస్తే నారాయణరావు ఏంచేసేవాడో తెలియదు. అయితే ఆ ఆలోచనే అతని మనస్సులోకి రాదు. ఆ మనస్సునిండా ఎప్పుడూ పొలంగొడవలూ, వ్యాపారం వ్యవహారాలూ కూతురికి పదహారేళ్ళ వయస్సు

వచ్చిందనీ, ఆ వయస్సులో పిల్లలు రకరకాల ఆకర్షణలకి లోనవుతారనీ, తను కొంచెం జాగ్రత్తపడాలనీ, పిల్లకి కొన్ని విషయాలు చెప్పాలనీ నారాయణరావుకెప్పుడూ అనిపించదు. అదే అనితకీరోజు రాజుతో తిరిగే స్వేచ్ఛనిచ్చింది. ఆ స్వేచ్ఛ ప్రస్తుతం అనితకెంతో ఆనందాన్నిస్తోంది. అంతకన్నా ఆలోచించగల శక్తి, జీవితంలో ఏమీ అనుభవంలేని అనితకు లేదు. ఉంటే ఆశ్చర్యపోతుంది!

# 24

ఏప్రిల్ రెండవవారంలో ఫస్టియర్ పరీక్షలు మొదలయ్యాయి.

మర్నాడు కెమిస్ట్రీ పరీక్ష. రవీంద్ర రాత్రి కెమిస్ట్రీ పుస్తకం తెరిచాడు.

ఆ సంవత్సరంలో ఎప్పుడూ పుస్తకాన్నే చూడలేదు రవీంద్ర. క్లాసులకు ఎక్కువ వెళ్ళలేదు. వెళ్ళినా కూడా ఏమీ వినలేదు. పుస్తకం తిరగెయ్యసాగాడు.

ఒక్కముక్క కూడా తెలియడంలేదు. అంతేకాదు, చదవాలన్న కోరికకూడా లేదు. పరీక్ష సరిగ్గా రాయకపోయినా ఫరవాలేదుకానీ, ఫెయిలైతే నాన్న తిడతాడు. తిడితే బాధనికాదు కానీ తిట్టించుకోవడమెందుకని అనుకున్నాడు రవీంద్ర.

అయితే ఆ పుస్తకం అంతా కానీ, కొంత కానీ పూర్తిగా చదివేందుకు టైం లేదు. ముఖ్యమైన టాపిక్స్ చూశాడు. తను పరీక్షలో రావచ్చుననుకున్న ప్రశ్నలకి సమాధానాలుండే కాగితాలు చింపేశాడు పుస్తకంలోంచి. అవసరమనుకున్న "ఈక్వేషన్ బేలన్సింగ్"లు "కాంపౌండ్ స్ట్రక్చర్"లు ఓ కాగితంమీద చిన్న చిన్న అక్షరాల్లో రాసుకున్నాడు. ఇక పరీక్ష హాల్లో చూసుకోవచ్చునని నిశ్చింతగా నిద్రపోయాడు.

మర్నాడు పరీక్ష హాల్లో ప్రశ్నపత్రం తీసుకున్నాడు. నిన్న తను చింపిన కాగితాలు, రాసుకున్న కాగితం ప్యాంట్‌లో జాగ్రత్తగా ఉన్నాయి.

రవీంద్ర కాపీ చెయ్యడానికి ప్రయత్నించడం అదే మొదటిసారి. అంతకు ముందెప్పుడూ ఆ అవసరం రాలేదు. జాగ్రత్తగా చదివితే పరీక్షలు బాగా రాసే తెలివి తేటలున్నాయి రవీంద్రకి.

ఎప్పుడూ అమ్మాయిల వెనక తిరుగుతుండడంతో చదివేందుకు టైంలేక పోయింది రవీంద్రకి. దానికి తోడు ఓ విధమైన అహంకారం అబ్బింది, తండ్రి ఇంట్లో ఇచ్చే అలుసు కారణంగా. ఈ జీవితానికన్నా తాను అతీతుడునన్న ఫీలింగ్, ఈ పరీక్షల గురించి పట్టించుకోనక్కర్లేదన్న భావం పెరిగాయి.

ఇన్విజిలేటర్ అటూ ఇటూ తిరుగుతున్నాడు.

తను తెచ్చుకున్న మెటీరియల్‌తో పరీక్షలో చాలా ప్రశ్నలకి సమాధానాలు రాయచ్చు.

నెమ్మదిగా కాగితాలూ తీస్తూ సమాధానాలు రాస్తున్నాడు రవీంద్ర. రాస్తూ అటూ ఇటూ చూస్తున్నాడు. కొంతమంది తలలువంచుకొని శ్రద్ధగా రాస్తున్నారు. కొందరు తనలాగే కాపీలు కొడుతున్నారు. ఇంకొందరు ఏంచెయ్యాలో తెలియక దిక్కులు చూస్తున్నారు. తనిన్నాళ్ళూ మొదటిరకంగా ఉండేవాడు. అందుకే పరీక్ష హాల్ వాతావరణం తెలియలేదు రవీంద్రకి. కాపీలు కొట్టేవాళ్ళు ఇంకా ఉన్నారన్న ధైర్యంతో చకచకాలాగించేశాడు కాపీ.

సంవత్సరమంతా కష్టపడి చదివిన చాలామందికన్నా తనకు ఎక్కువ మార్కులు రావచ్చునన్న ఊహ వింతగా అనిపించింది రవీంద్రకి. అయినా ఆ ఊహ ఎంతో బాగుంది. అసలు కష్టపడకుండా పరీక్షలు పాసయ్యేందుకు ఇంత సులువు మార్గం ఉంటే, ఎందుకు చదవాలో అర్థకాలేదు రవీంద్రకి. ఓ రాత్రి కష్టపడితే చాలు. అతని మనస్సు తేలికపడింది. రెండు గంటల్లో పేపరిచ్చేశాడు.

మర్నాటి ఫిజిక్స్ పరీక్షకి ప్రిపేర్ అవడానికి బదులు ఓ లేడీస్ కాలేజీ వైపు నడిచాడు. అక్కడ అప్పటికే రవీంద్రలాంటివాళ్ళు చాలా మంది ఉన్నారు.

## 25

మొదటి సంవత్సరం పరీక్షలయ్యాక సెలవుల్లో కూచిపూడి వెళ్ళనంది కళ్యాణి. తనకి విజయవాడలో చదువుకోడానికి బావుంటుందంది. కళ్యాణి ఎందుకిక్కడ ఉంటానంటోందో ఊహించుకుంది సుజాత. బలవంతంగా పంపడం ఇష్టంలేక ఊరుకుంది. మురళీకృష్ణ ఏమీ అనలేదు.

మే 5న కళ్యాణి పుట్టినరోజు.

తలంటుకుని, సన్నటి జడపాయనల్లి, దానితో తక్కిన జుట్టుని ముడి వేసింది. ముందురోజు తనూ, వదినా వెళ్ళి కొని తీసుకొచ్చిన చీర వదిన చేత కట్టించుకుంది కళ్యాణి. అదే కళ్యాణి జీవితంలో మొదటిసారి చీర కట్టుకోవడం.

తెల్లని పాలియస్టరు చీర. కింద అంచుల నుండి బయల్దేరిన సన్నని కొమ్మలకు ఆకుపచ్చని ఆకులు, నీలం రంగు పువ్వులు వున్న డిజైన్ చీరంతా.

కుచ్చిళ్ళు అందంగా పెట్టి చీర కట్టింది సుజాత. అందమైన పూల లతలు కాళ్ళ నుండి నడుందాకా చుట్టేసినట్లుంది, కళ్యాణి ఆ చీరలో.

కళ్యాణిని దగ్గరగా తీసుకుని, "నా దిష్టే తగులుతుంది నీకు" అంది సుజాత.

అన్నా వదినలకు నమస్కారం చేసింది కళ్యాణి.

చీరలో చెల్లెల్ని చూసి, "పెద్దదయిపోతోంది కళ్యాణి" అన్నాడు మురళీకృష్ణ సుజాతతో.

"ఇంకో సంవత్సరం పోతే మేజరయిపోతుంది" అంది సుజాత.

సుజాత చేసిన స్వీట్స్‌ని కళ్యాణి ఇద్దరి నోటికీ అందించింది ఇద్దరూ కళ్యాణి చేత తినిపించారు.

పదింటికి ఆఫీసుకెళ్ళిపోయాడు మురళీకృష్ణ.

ఆ రోజు అనితా మహాలక్ష్మిల భోజనం కళ్యాణి వాళ్లింట్లోనే. అలానే మోహన్‌ది కూడా.

భోజనాలయ్యాక సినిమాకి బయల్దేరారు. పాత హిందీ సినిమా.

సినిమాహాల్లో మోహన్, కళ్యాణి పక్కపక్కనే కూర్చున్నారు. కళ్యాణి పక్కనే అనితా, మహాలక్ష్మి.

ఇంటర్వెల్ సమయంలో కళ్యాణి, మోహన్‌ల మధ్య ప్రేమ సంబంధమున్నట్లూ ఇద్దరికీ పెళ్ళి కాబోతున్నట్లూ అర్థం వచ్చేలా మాట్లాడారు అనితా మహాలక్ష్మి. కళ్యాణి వాళ్ళని వారించలేదు.

సినిమా అయింది. దుర్గగుడికెళ్దామంది కళ్యాణి. ఇంక ఇంటికెళ్ళిపోవాలంటూ వెళ్ళిపోయారు అనితా మహాలక్ష్మిలు, కళ్యాణి, మోహన్‌లు బస్సెక్కడానికి నడుస్తుంటే, మోహన్ పక్కనున్న నవోదయా బుక్ హౌస్‌లోకి వెళ్ళాలన్నాడు.

పుస్తకాల అలమరాలోంచి పుస్తకాలు తీస్తూ, చూస్తూ, పెడుతూ– నండూరి రామ్మోహన్రావు రాసిన విశ్వదర్శనం పుస్తకం తీసి, 'బావుంటుంది' అంటూ కౌంటర్‌లోకెళ్ళి డబ్బిచ్చి, పుస్తకం తీసుకుని నడవసాగాడు, కళ్యాణితో.

బస్సెక్కి మార్కెట్ దగ్గర దిగారు.

మెట్లెక్కి గుళ్ళోకి వెళ్ళారు. జనం ఎక్కువగా లేరు. ఇద్దరూ మౌనంగా ఉన్నారు. ఇద్దరి మనస్సుల్లోనూ ఏదో అర్థంకాని అనుభూతి. అలా కలిసి ఉండడమనే ఆనందస్వప్నం చెదిరిపోకూడదన్న ఆశ. చెదిరిపోతుందేమోనన్న భయం. ఆ భయంతో ఒకరి చేతుల్లోకి మరొకరి చేతులు తీసుకుని చేతివేళ్ళను బిగించి పట్టుకున్నారు.

కనకదుర్గ ముందు నిలబడ్డారిద్దరూ. ఆ కనకదుర్గే తన పక్కన వచ్చి కళ్యాణి రూపంలో నిలబడిందనుకున్నాడు మోహన్.

వేసవికాలం, ఆలస్యంగా అవుతోంది సూర్యాస్తమయం. పారుతున్న కృష్ణానదికి అడ్డుగా నిలిచిన బ్యారేజీ. బ్యారేజీకి ఒకపక్క బంగారు రంగు కాంతుల్లో నీళ్ళు. రెండోపక్క ఎండిపోయిన ఇసుక నది.

రైలింగ్ మీద చేతులాన్చి, ఒకరి మొహం దగ్గరగా మరొకరి మొహం ఉంచుకుని, భుజాలు తగులుతూ నిల్చున్నారు.

కళ్యాణి ఒంటిమీద పాలియస్టర్ చీర జారుతోంది.

శివుడి గుడి చూసి, రోడ్డుమీద నుండి దిగడం మొదలుపెట్టారు.

జనసంచారం లేదు.

వాహనాల రొదకి దూరంగా నిశ్శబ్ద వాతావరణం.

సూర్యుడు అస్తమిస్తోంటే, అలుముకుంటున్న చీకటి.

రోడ్డు పక్కనున్న గట్టుమీద కూర్చున్నారిద్దరూ– ఏమీ మాట్లాడకుండా, ఏదో మాట్లాడాలన్న కోరికతో.

అప్పుడే అస్తమించిన సూర్యుడి తాలూకు ఎర్రజీర కళ్యాణి నుదుటమీద బొట్టులా– ఆవరిస్తున్న చీకటి కళ్యాణి కళ్ళలో కాటుకగా అనిపించాయి.

తనెదురుగుండా ఉన్న కళ్యాణి తప్ప మరోలోకం లేనట్లు కళ్యాణినే చూస్తున్నాడు మోహన్.

ఒకరి చేతుల్లో మరొకరి చేతులు. మోహన్ తన చేతిని కళ్యాణి భుజం చుట్టూ వేశాడు. వద్దనలేదు కళ్యాణి.

ఓ పాట పాడమని అడిగాడు "మరుగేలరా" పాడడం మొదలెట్టింది.

సన్నగా తీగలా సాగుతున్న కళ్యాణి కంఠంలోంచి– చీకటిని చీల్చుకుంటూ వస్తున్న వెలుగు పుంజంలా– నీరవంలోకి విస్తరిస్తున్న మధురగానంలా ఆవరిస్తోంది పాట.

"అన్ని నీవనుచు అంతరంగమున" అని పాడుతూ మోహన్‌కేసి చూసి చిన్నగా నవ్వింది కళ్యాణి.

పాటలోని ఆ భావానికీ, కళ్యాణి ఆ భావం తన గురించేనని సూచిస్తూ తన్ని చూసి నవ్విన చిర్నవ్వుకీ– మోహన్ మనస్సులోపల ఎక్కడో బయల్దేరిన కోరిక– పుట్టి పెరిగిన వాతావరణపు దట్టపు పొరల్ని చీల్చుకుని బయటకి వచ్చింది.

ఇన్నాళ్ళూ అతని చుట్టూ వున్న సమాజపు నీతినియమాల సరిహద్దుల గోడల్ని బద్దలుకొట్టింది.

అతనితోపాటే చిన్నప్పటినుండి అతనిలో పెరిగిన తప్పొప్పుల భావాల్ని సమూలంగా నాశనం చేసింది.

అతని మెదడు నిండా, శరీరం నిండా ఆవరించింది.

ఆ కోరిక మత్తులో ఏం చేస్తున్నాడో తెలియని స్థితిలోకి జారుకున్నాడు.

కళ్యాణి భుజం చుట్టూ ఉన్న చేతివేళ్ళు, జుట్టులోకి దూరి, తల వెనగ్గా వెళ్ళి, బలంగా కళ్యాణి మొహాన్ని తన మొహం దగ్గరకు తీసుకొచ్చాయి.

మోహన్ పెదవులు కళ్యాణి పెదవుల్ని తాకాయి. పెదవుల తొలి తాకిడి

అనుభవంలో ఇద్దరికీ– కాల, స్థల పరిమితులు తెలియలేదు. తెలిసే స్థితికొచ్చేసరికి చుట్టూ చీకటి ఆక్రమించుకుంది.

ఆపినచోట నుండి మళ్ళీ పొద్దం మొదలెట్టింది కళ్యాణి.

దూరంగా ఉన్న ఓ దీపంకాంతిలో విశ్వదర్శనం మొదటి పేజీలో రాశాడు మోహన్.

"పుస్తకాల్లో లేని

అందం, ఆనందం

జీవితంలో

నేర్పిన

గురువుకి"– సంబోధనలేదు. సంతకం లేదు.

పుస్తకం కళ్యాణికిచ్చాడు. హేపీ బర్త్‌డే అంటూ.

మోహన్ రాసింది చదివి, అతని వంక ఆనందంగా చూసి, ఆ అక్షరాల్ని ముద్దుపెట్టుకుంది కళ్యాణి.

ఇద్దరూ లేచి నడుస్తున్నారు. మోహన్ గుండెలో కళ్యాణి రాగం. కళ్యాణి మనసులో మోహనరాగం. ఇద్దరికీ లోకమంతా– కళ్యాణంగా, మోహనంగా...

కళ్యాణి ఇంటికి చేరేసరికి అమ్మానాన్నలు ఇంట్లో వున్నారు.

సెలవులకి ఇంటికి రానన్న కూతుర్ని తీసుకెళ్ళడానికి వచ్చారు.

ఆ వచ్చేది, పుట్టినరోజునాడు వస్తే, ఆ ముచ్చటకూడా చూడవచ్చుననుకుని ఆ రోజున వచ్చారు. మర్నాడు పొద్దున్నే తీసికెళ్ళిపోయారు. వాళ్ళ అభిమానపు మాటలకి, కన్నీళ్ళకి అడ్డు చెప్పలేకపోయింది.

సమయం కుదరక, తను వెళ్తున్నట్లు మోహన్‌తో చెప్పలేకపోయింది.

కూచిపూడి చేరాక ఎన్నోసార్లు మోహన్‌కి ఉత్తరం రాద్దామనుకుని ఎలా రాయాలో తెలియక మానేసింది కళ్యాణి.

మోహన్ దగ్గర్నుండి ఉత్తరం వస్తే బావుండునని ఎదురుచూడసాగింది.

అలా ఎదురుచూస్తున్న రోజుల్లో– ఓ పెద్ద ఉత్తరం వచ్చింది. చింపి చూసింది. వదిన దగ్గర్నుండి.

కళ్యాణీ!

నువ్వు వెళ్ళినప్పట్నుంచీ మాకు ఏమీ తోచడంలేదు, ప్రత్యేకించి నాకు. ఆరేళ్ళక్రితం నాకు పెళ్ళయి వచ్చినప్పట్నుంచి నువ్వు నాతోటే వుంటున్నావు నా అదృష్టంగా. నువ్వుండడం వల్లనేనేమో, ఇన్నేళ్ళుగా మాకు పిల్లలు లేకపోయినా, ఆ విషయం గురించి బెంగ లేకపోయింది. అసలు నువ్వే మా పిల్లవని అనుకుంటున్నప్పుడు పిల్లలు లేరన్న భావమే

లేదనుకో.

నాలుగు రోజులక్రితం డాక్టర్ తేల్చిన విషయం ఏంటంటే నీకు చెల్లెలో, తమ్ముడో పుడతారని (లోకం భాషలో నీకు మేనకోడలో, మేనల్లుడో).

ఓ వారం రోజుల్లో బయల్దేరి నేను మా అమ్మ దగ్గరకెళ్తున్నా. నువ్వొచ్చే సరికి వుండను. ఇంకో రెండు నెలల్దాకారాను. ఆ తర్వాత వచ్చాక కూడా మూడు నెలలుండి మళ్ళీ వెళ్తాను. అప్పుడు మళ్ళీ వచ్చేసరికి 'నా సంతానం'తో నాలో కూడా స్వార్థం పెరిగి, నిన్ను సరిగ్గా చూడనేమోనని భయంగా వుంది.

అయినా నిన్ను నేను చూడ్డం ఏంటి? పదిహేడేళ్ళొచ్చినదానిని. స్వంతంగా స్నేహాలూ, బంధాలూ పెంచుకోగలదానవు అయ్యావు. నేనెవరి గురించి రాస్తున్నానో నీకర్థం అయ్యుంటుంది. అర్థంకాకపోడానికి నువ్వేం తెలివితక్కువదానివి కావు. ఎంతో తెలివయిన దానివి, కాబట్టి నేను రాస్తున్న ఈ ఉత్తరాన్ని సరిగ్గా అర్థంచేసుకోగలవన్న ధైర్యంతో రాస్తున్నాను. ఎదురుగా వుంటే అన్నీ చెప్పగలుగుతానో లేదో అనుమానమే. అంతేకాదు. అలాంటి అవకాశం అంత తొందరగా రాకపోవచ్చు.

చదువు సాకుచెప్పి నువ్విక్కడ వుండిపోతానన్నావు కానీ, అసలు కారణం మోహన్‌ని విడిచి వెళ్ళడం నీకిష్టంలేదన్న సంగతి నాకు తెలుసు. అలాంటి సంగతులు మీ అన్నయ్యకు తెలియవు– అదృష్టమో, దురదృష్టమోకానీ.

కళ్యాణీ! మా పెళ్ళిచూపులప్పుడు మీ అన్నయ్యతోపాటు వచ్చిన నీ అమాయకపు మొహం నాకింకాగుర్తుంది. ఆ అమాయకత్వం నీలో ఇంకా పోలేదు. దాన్నంత తొందరగా పోనియ్యకు.

'ఆనందకరమైన పదహారేళ్ళ పరువం' అంటారు కానీ ఆ వయస్సే జీవితానికి నిజమైన పరీక్షాసమయం. ప్రకృతి నియమాలననుసరించి అమ్మాయిల్లో, అబ్బాయిల్లో శారీరకమైన మార్పులొచ్చేది ఈ వయసులోనే. అదే వయస్సులో ఒకరంటే ఒకరికి తెలియని ఆకర్షణ మొదలవుతుంది. ఇది చాలా సహజం.

చదువూ, ఉద్యోగం వంటి అవసరాలు లేని రోజుల్లో ఆ వయస్సుకే పెళ్ళిళ్ళయి సంసారం మొదలయ్యేది కూడా. ఇప్పుడు సమాజంమారి, చదువుకి, సంపాదనకీ అవసరం పెరిగింది.

అసలు సమస్య అక్కడే మొదలయింది. మనిషికి కావాలనుకున్నా, అక్కర్లేదనుకున్నా వయస్సుతోపాటు శరీరంలో మార్పులు వస్తాయి. కానీ, ఆ వయస్సులోనే ఆ మార్పులవల్ల కలిగే ఆకర్షణకి లోనవకుండా రాబోయే జీవితానికి పునాదిగా చదువు చదవాల్సివస్తోంది. ఓ పక్క ఆకర్షణ, మరో పక్క అవసరం.

కొన్నాళ్ళు మాత్రం నిలిచే ఆకర్షణలో పడి జీవితాన్ని నాశనం చేసుకోకుండా వుండగలగాలి. దానికి మన మనస్సులమీద మనకు 'కంట్రోల్' వుండాలి. అది తల్లిదండ్రుల పెంపకంలో కొంతా, తక్కిన పరిసరాల ప్రభావంలో కొంతా వస్తుంది. ప్రస్తుతం పరిసరాలు ఆకర్షణకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నాయి. నవలలూ, సినిమాలూ పదహారేళ్ళ పిల్లల ప్రేమలకే ప్రాముఖ్యాన్నిస్తున్నాయి.

వీటి ప్రభావం నీమీద ఎక్కువగా లేదు. అయినా నువ్వు మోహన్‌వైపు ఆకర్షితురాలివయ్యావు. ప్రేమ వేరు. ఆకర్షణ వేరు.

నీ వయసులో వుండేదాన్ని infatuation అంటారు. love అనరు.

ప్రేమ ఎన్నో అనుభవాల తర్వాత, కష్టాల తర్వాత పుడుతుంది. నీ వయస్సుకి నీకా అనుభవంలేదు. నీకేకాదు, నీ వయస్సువాళ్ళెవ్వరికీ అది రాదు.

అయితే ప్రేమిస్తున్నామన్న భావంలో పడతారు. ఆ భావాన్ని ప్రేమిస్తారు. అది కాదన్నవాళ్ళని శత్రువులుగా చూస్తారు. ఈ ఉత్తరం చదివాక నేను కూడా నీకు శత్రువుగా అనిపిస్తానేమోనన్న భయం నాకుంది. అయితే ఎవ్వరూ చెప్పక నువ్వు అనవసరంగా నీ జీవితాన్ని పాడుచేసుకుంటావేమోనన్న భయం ముందు నువ్వు నన్నపార్థం చేసుకుంటావేమో నన్న భయం నిలవలేదు.

నీ భవిష్యత్తు పాడవకూడదన్నదే నా లక్ష్యం.

నీకంతకు ముందు మగపిల్లలతో ఎక్కువ పరిచయంలేదు. నువ్వు దగ్గరగా చూసిన మొదటి మగపిల్లాడు మోహన్. అందులోనూ చదువంటే గొప్పదనుకుంటున్న నీకు చదువులో గొప్పవాడయిన మోహన్ హీరోగా కనిపించడం సహజం.

మోహన్ పరిస్థితి కూడా అంతే. అంతేకాదు మోహన్‌కి అదే సమయంలో వాళ్ళక్క పెళ్ళి చేసుకుని ఇంటినుండి వెళ్ళిపోవడంతో మానసికంగా ఇంకో ఆలంబన అవసరం అయింది. అది నువ్వయ్యావు.

అలా మొదలైన మీ చనువు శారీరకాకర్షణదాకా చేరింది. కాదని బుకాయించకు. నాతో అబద్ధం ఆడగలవు. నీతో నువ్వు అబద్ధం చెప్పుకోకు. మనిషికి అన్నిటికన్న బలహీనమైన స్థితి– తనతో తను అబద్ధం చెప్పుకున్నప్పుడే వస్తుంది. ఇలాంటి మాటలు, నీ వయస్సుకి నీకర్థం కాకపోవచ్చు. కొన్నేళ్ళ తర్వాత అర్థమవుతాయి, అనుభవాలతో బుర్ర బరువెక్కాక. మీ మధ్య ఆకర్షణేకానీ, శారీరక సంబంధం ఇంకా లేదని నా నమ్మకం. ఇది నా నమ్మకం మాత్రమే. నిజం మీ ఇద్దరికీ తెలుసు. దేవుడికి తెలుసు (దేవుడు వుంటే).

ఈ ఆకర్షణ నుండి బయటపడండి. పెళ్ళి గురించి ఆలోచించాల్సిన వయస్సు మీ ఇద్దరికీ లేదు.

ఇంజనీరింగ్ చదివి, బంగారు భవిష్యత్తు నిర్మించుకోవలసినవాడు మోహన్. అలాగే నువ్వు కూడా.

ఒకవేళ మీమధ్య ఉన్నది తాత్కాలికాకర్షణకాక, నిజమైన బంధమే అయితే, అదెలాగైనా కలకాలం నిలుస్తుంది– మీ ప్రమేయం, ప్రయత్నం లేకుండా.

అదెలాంటిదయినా, మీరు దాన్నొదిలేసి మీ చదువుమీద పూర్తిగా దృష్టి కేంద్రీకరించండి. ఇప్పుడు చదవడం లేదా లాంటి ప్రశ్నలు వెయ్యద్దు. ఇలాంటి ప్రశ్నలు కూడా ఈ వయస్సుకి సహజమైనవే. ఇంకొకళ్ళు చెప్పిందెందుకు వినాలన్న ఆలోచన ఈ వయస్సు ఇస్తుంది. నువ్వలా చెయ్యకు.

చదువంటే ఒక్క క్లాసు పుస్తకాలే కాదు. మంచి పుస్తకాలెన్నో వున్నాయి. ఆలోచించుకునే తర్కాన్ని నేర్పగల పుస్తకాలు చదవచ్చు. నేర్చుకోవచ్చు. ఆటల్లో ప్రావీణ్యత సంపాదించవచ్చు. నువ్వు నీ సంగీతంలో ఇంకా సాధనచేసి, ఎంతో సాధించవచ్చు.

నిన్ను మగవాళ్ళతో స్నేహం చెయ్యద్దని అనడంలేదు. అలా విడిగా వుండడం కూడా మంచిదికాదు. అయితే, మోహన్‌తో ప్రత్యేకమైన చనువు తగ్గించుకో. మోహన్ కూడా ఈ విషయం అర్థం చేసుకోగలడు.

టీన్స్ నాలుగైదేళ్ళు జీవితాన్ని మంచివైపో చెడువైపో మలుపుతిప్పుతాయి. మీరు మంచివైపు మళ్ళాలని నా కోరిక. తీరుస్తావు కదూ?

ఉత్తరం చదవగానే చింపెయ్యకు. మళ్ళీ చదువు. నాలుగైదుసార్లు చదివినా, నీకిందులో ఆలోచించాల్సింది, ఆచరించతగ్గది ఏదీ లేదనిపిస్తే, దీన్ని కాల్చెయ్యి. నేనేం అనుకోను. నా అనుమానాలూ, భయాలూ నిజం కాకూడదనుకుని నీకు మంచే జరగాలని ప్రార్థిస్తూ ఉంటాను.

సదా నీ సుఖాన్ని, సంతోషాన్ని కోరే–

నీ వదిన

తన గదిలో మంచంమీద పడుకుని అరగంటలో మూడుసార్లు ఉత్తరాన్ని చదివింది కళ్యాణి. తర్వాత చాలాసేపు ఆలోచిస్తూ పడుకుంది.

'ఉత్త అమాయకురాలు వదిన' అని నవ్వేసుకోలేదు.

'నాకీ మాత్రం తెలియదా' అని అహంకరించుకోలేదు.

'ప్రేమ గురించి వదినకేం తెల్సు' అని అపహాస్యించలేదు.

తనకీ మోహన్‌కీ మధ్య వున్న సంబంధం ఎలాంటిదని మళ్ళీ మళ్ళీ ప్రశ్నించుకుంది. ఇద్దరిమధ్యా శారీరకాకర్షణ మొదలవుతోందని గుర్తించింది.

తనమీద వదినకున్న నమ్మకానికి, అభిమానానికి ఆనందించింది.

అయితే, ఆ  ఉత్తరాన్ని ఆ రోజేకాదు– ఎప్పటికీ కాల్చెయ్యలేదు కళ్యాణి.

సెలవుల తర్వాత కళ్యాణి విజయవాడ వచ్చిందని విని చూడ్డానికి వచ్చాడు మోహన్. మామూలుగా మాట్లాడింది కళ్యాణి. ఊళ్ళో విశేషాల గురించి, సెలవుల్లో చదువు గురించి. సాయంత్రం రాఘవయ్య పార్కుకెళ్దామని పంపించేసింది.

ఆ సాయంత్రం– పార్కులో ఓ పక్కగా కూర్చున్నారిద్దరూ.

మోహన్‌కి తగలకుండా జాగ్రత్తపడుతూ కూర్చుంది కళ్యాణి.

మోహన్ కళ్యాణి చేతిని తన చేతిలోకి తీసుకోబోతోంటే "ప్లీజ్" అంటూ తన చేతుల్ని దూరంగా తీసుకుంది. ఏమిటన్నట్లు చూశాడు మోహన్.

"మోహన్, ఇన్నాళ్ళూ మనం చేస్తున్న పని మంచిదికాదేమోననిపిస్తోంది నాకు. నేను నిన్ను తప్పు పట్టడంలేదు. మనం అడాలసెంట్ అటాక్షన్‌కి లోనయ్యాం. నా అదృష్టం నాకది ఇన్‌ఫాట్యురేషన్ అని అర్థం అవుతోంది. నీక్కూడా అర్థం అవుతుంది ఆలోచిస్తే.

నీకు అనిపించడంలేదా, మనం శారీరక స్పర్శకోసం తహతహలాడిపోతున్నాం అని. మన మధ్య వున్నది ఉత్త స్నేహమే అయితే ఆ తహతహ వుండదు. మన మధ్య ప్రేమ వుందని మనం అనుకోవచ్చు. అసలు ప్రేమంటే ఏమిటో తెలియకుండానే.

మన మధ్య వున్నది కేవలం శారీరకాకర్షణేకానీ, ప్రేమ కాదని నాకు తెలుస్తోంది. నీకూ తెలుస్తుంది. మోహన్, మనం ఒకరి ఆలోచనల్లో ఒకరం పడి, మన చదువుల్ని కూడా చాలావరకు విస్మరిస్తున్నాం.

నువ్వు చాలా తెలివైనవాడివి. లెక్కల్లో బాగా ఇష్టం వున్నవాడివి. నువ్వు ఇంజనీరయ్యి మోక్షగుండం విశ్వేశ్వరయ్యలా దేశానికి ఎంతో ఉపయోగించే పనులు చెయ్యాలి.

నువ్వు నన్ను ఇష్టపడుతున్నావన్న భావం నన్నిన్నాళ్ళు ఆనందంలో ముంచెత్తేది. కానీ ఈ రోజు నాకలా అనిపించడంలేదు. నువ్వు నీ చదువు పూర్తిచెయ్యి. ఈ సంవత్సరం ఐ.ఐ.టి.కి. ప్రిపేరవు. ఆ తర్వాత బి.టెక్. చదువు.

చదువూ, ఆకర్షణా కలిసి సాధించలేనా అని అడుగుతావేమో. ఈ ఆకర్షణ ఉన్నంతకాలం చదువులో పూర్తి ఏకాగ్రతను పొందలేవు.

అంతేకాదు. ఇది తాత్కాలికమైన ఆకర్షణ అని తెలిసిన తర్వాత మనం ఇంకా ఆ బురదలోకే దిగకూడదని  నిశ్చయించుకున్నాను. మనం మన స్నేహాన్ని వదులుకోవద్దు. అయితే ఈ ఆకర్షణలో పడి కొట్టుకుపోవద్దు.

ఇది సాధ్యమేనా అన్న ప్రశ్న వస్తోంది కదూ? మనం కావాలనుకుంటే సాధ్యం కానిది వుండదు. మనం ఇద్దరం మాత్రమే విడిగా, ఒంటరిగా కూర్చోవద్దు. ఇదే ఆఖరిసారను కుందాం. ఒకరినొకరం తాకద్దు. చదువు గురించో, తక్కిన మరేదో విషయం గురించో

తప్పు– మన గురించి మనమే మాట్లాడుకోవద్దు. అప్పుడు స్నేహం మాత్రం నిలుస్తుంది. ఈ విషయంలో నాకు అనుమానం లేదు.

ఈ విషయం గురించి నేను చాలా రోజులుగా ఆలోచిస్తున్నాను. నువ్వు కూడా ఆలోచించు. నీకు నేను చెప్పేదంతా అర్థరహితంగా అనిపిస్తే– నాకు చెప్పడం చేతకానట్లే తప్ప, నేను చెప్పేదాంట్లో అర్థం లేకకాదు"

పావుగంటసేపు ఎంతో మృదువుగా– అయినా గంభీరంగా కళ్యాణి చెప్తూంటే అలా వింటూండిపోయాడు మోహన్.

అందులో ప్రతీ మాటా అతనిలో ఎన్నో ఆలోచనల్ని రేకెత్తించాయి. కొన్ని మాటలు కొరడాల్లా అతని మనస్సును తాకాయి.

చెప్పడం అయినట్లు కళ్యాణి మౌనంగా కూర్చుంది. మోకాళ్ళమీదకు తల ఆన్చి, ఒక చెయ్యిని కాళ్ళ చుట్టూ వేసుకుని, మరో చేత్తో పక్కనున్న గడ్డిని తుంపుతూ కళ్ళెత్తి చూస్తోంది మోహన్‌ని అప్పుడప్పుడు.

మోహన్ చిన్న గులకరాళ్ళను తీసుకుని ఓ చేతిలోంచి మరో చేతిలోకి వేసుకుంటూ ఆలోచిస్తున్నాడు. ఓ పావుగంట గడిచింది. ఒక్కోరాయిని తీసుకుని దూరంగా విసరసాగాడు. ఆఖరి రాయి విసిరేసరికి, అతని ముఖంలో ఆలోచనల అయోమయం పోయి, ఓ స్థిరత్వం వచ్చింది. లేస్తూ అన్నాడు, "పోదాం పద" అని. కళ్యాణి కూడా లేచింది. ఇద్దరూ నెమ్మదిగా నడుస్తున్నారు.

గేట్ దగ్గర ఆగి అన్నాడు మోహన్– "కొన్నాళ్ళుగా నేను ప్రవర్తించిన తీరుకి సిగ్గుపడుతున్నానని అనడంలేదుకానీ, నా కళ్ళు మూసుకుపోయినందుకు బాధపడుతున్నాను. ఇప్పుడు నువ్వు నా కళ్ళు తెరిపించావు. నా కర్తవ్యం గుర్తు చేశావు. అందుకు నీకెలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియడంలేదు"

"ఏంటా సినిమా డైలాగులు?" అంది కళ్యాణి నవ్వుతూ.

"నువ్వెలాగనుకున్నా నేనన్న మాటలు నిజం" అంటూ కదిలాడు మోహన్. పక్కనే నడిచింది కళ్యాణి. ఇద్దరూ నడుస్తున్నారు– ఒకరికి తగలకుండా ఒకరు.

## 26

పెళ్ళైన తర్వాత మొదటి ఆషాఢమాసానికి పుట్టింటికి వచ్చింది శ్రీవిద్య. పెళ్ళయిన కొత్తలో ఓ ఉత్తరం రాసింది కళ్యాణికి. వెంటనే కళ్యాణి సమాధానం రాసింది కూడా. తర్వాత మళ్ళీ ఇద్దరిమధ్యా ఉత్తర ప్రత్యుత్తరాలు జరగలేదు.

శ్రీవిద్య వచ్చిందని తెలిసి వాళ్ళింటికి వెళ్ళింది కళ్యాణి. "ఎలాగుంది రాజమండ్రి"

అని అడిగింది కళ్యాణి. ఇంకేం అడగాలో తెలియక.

"రాజమండ్రికేం బావుంది" అంది శ్రీవిద్య.

"నేనడిగింది రాజమండ్రి నీకెలాగుందని"

"నేను ఊరేం చూస్తున్నానులే– నా బతుకంతా ఇంట్లోనే గడుస్తోంది"

"చాలా సినిమా హాళ్ళున్నాయిగా– సినిమాలు చూడడం లేదా?"

"సినిమాయా, షికారా? ఇంటినిండా ఎప్పుడూ జనమే. మా అత్తగారూ, ఇద్దరు మరుదులతోపాటు, వదినగార్లిద్దరిలో ఎవరో ఒకరు వస్తూంటారు. వాళ్ళు కాకుండా బీరకాయ పీచు చుట్టాలెవరో ఒకరు వుంటూనే వుంటారు. అందరికీ వండడంతోనే సరిపోతుంది జీవితమంతా"

"అప్పుడప్పుడయినా వెళ్తూంటారుగా. పెద్ద బ్రిడ్జి వుందిగా అక్కడ"

"అక్కడకెళ్ళిన మొదటివారంలో కాస్త బయటకెళ్ళాం అంతే. ఎక్కడకన్నా వెళ్ళాలంటే ఎంతమంది తల్లీ ప్రయాణమయ్యేది? వాళ్ళందర్నీ వేసుకుని వెళ్ళడంకన్నా మానెయ్యడం మంచిది"

"ఇంట్లో అంతమంది వుంటే, అసలు బయటకెళ్ళడం ఎందుకు హాయిగా కూర్చుని కబుర్లు చెప్పుకోకుండా"

"సరదా కబుర్లా, పాడా? ఎంతసేపూ నేనది చెయ్యలేదు. ఇది చెయ్యలేదని దెప్పుళ్ళేకదా?"

"ఎవరూ?"

"అందరూనూ– మా అత్తగారూ, మరుదులూ"

"మరి బావగారు"

"ఆయనోసారి అటూ, ఓసారి ఇటూ"

"అంటే నువ్వు కూడా వాళ్ళను అంటూంటావా?"

"అనక, పడి ఊరుకోమంటావా?"

"దెబ్బలాడతావా నువ్వు?"

"వాళ్ళేదన్నా అంటే నేనూ అంటాను"

"మీరు తిట్టుకుంటే బావగారికి ఇబ్బందికాదూ?"

"లేకపోతే, వాళ్ళేదన్నా అంటే నన్నూరుకోమంటావా? బావుంది నువ్వు చెప్పేది"

"అసలెందుకంటారు?"

"కారణం ఏమీ వుండదు. నేనేదో నవల చదువుతున్నాననుకో. వాళ్ళలో ఎవరో వంట మొదలెడితే, తక్కిన వాళ్ళంతా నన్ను తిట్టడం మొదలెడ్తారు. ఇంట్లో పనేం చెయ్యనని

వాళ్ళకి కోపం”

“నిజంగా చెయ్యవా?”

“ఎందుకు చెయ్యను. వాళ్ళకు కావల్సినట్లు చెయ్యను. అయినా నేనే ఎందుకు చెయ్యాలి? ఇంట్లో మేమిద్దరమే వుంటే, నేనే చేసుకుందును. తక్కినవాళ్ళకు ఇంకేం బాధ్యతలేదా?”

“ఏమైనా ఇంట్లో మీరంతా తిట్టుకుంటుంటే బావగారికి బాధగా వుండదూ?”

“ఆయనేం తక్కువకాదు– ఆయనా తిడ్తారు”

“ఎవర్ని?”

“నన్ను”

“నిన్నా, ఎందుకు?”

“నేను సరిగ్గా వుండడంలేదనీ. నేను సినిమాలకీ, హెూటళ్ళకీ తీసుకెళ్ళమంటాను. ఆయనకు చిరాకొచ్చి తిడ్తారు. నేను అరుస్తాను. ఇంకా తిడతారు”

“ఇలాంటి గొడవలు వదిలేస్తే, నిన్ను బాగా చూసుకుంటారా?”

“ఏదో బానే ఉంటారులే. పెళ్ళయిన ఇన్నాళ్ళకి నేను పోరుపెడితే మొన్నోసారి ఓ చీరకొన్నారు”

“నీకు బోల్డు బట్టలున్నాయిగా?”

“వుంటే– కొనకూడదా? అడిగితే కొంటే ఇంట్లో అందరికీ కొనాలి, తర్వాత చూద్దాం అంటారు”

“అది నిజమేగా”

“ఆ–అలాగైతే కొన్నట్లే.

“ఇంట్లో ఇద్దరు ముగ్గురున్నప్పుడు ఒకళ్ళకే కొనడం ఏం బావుంటుంది?”

“అలాగనుకుంటే, నేనేం కొనుక్కోడం అవదు. అందుకే దెబ్బలాడి మరీ కొనిపించుకున్నా చీరను”

“నీలా దెబ్బలాడేదాన్ని కట్టుకున్నానని బాధపడాల్సి వస్తుంది బావగారు”

“ఆ మాట ఆయన నా దగ్గరే అన్నారు ఓ రోజు– నీదింత చిన్న మనసని తెలియక చేసుకున్నా అని. అలా అన్నంతమాత్రాన మనకి కావల్సినవి మనం అడగకపోతే ఎలా? ఇక్కడున్నన్నాళ్ళు నాన్న దగ్గర సుఖం లేక, పెళ్ళయి మొగుడు దగ్గరా సుఖం లేక–”

కళ్యాణి ఇంకేం మాట్లాడలేదు. ఆ విషయం గురించి.

“అనిత ఎలాగుంది?” అడిగింది శ్రీవిద్య.

“బావుంది”

"రాజుతో తిరుగుతోందా?"

"ఇద్దరూ పెళ్ళి చేసుకుంటారనుకుంటాను"

"ఇంకా పెళ్ళి చేసుకోవల్సిన అవసరం ఏముందిలే- అవాల్సినవన్నీ అవుతున్నాయిగా"

కళ్యాణికి ఆ మాటలు అసహ్యంగా అనిపించాయి.

"మహాలక్ష్మి ఏం చేస్తోంది?"

"చదువూ- డాన్సే"

"ఇంకా సినిమా పిచ్చి వదల్లేదా?"

"ఏదీ-చూడ్డమా, నటించాలనా?"

"నటన పిచ్చే"

"అందం, నాట్యం రెండూ వున్నాయి. సినిమావాళ్ళు కళ్ళకద్దుకొని తీసుకుంటారు. కానీ, అసలా దరిద్రపు లోకంలోకి వెళ్ళడమెందుకిది?"

"దరిద్రపు లోకం నీ కళ్ళకి మాత్రమే. అందులోకి వెళ్తే ఎంత డబ్బు, ఎంత పేరు?"

"అది పేరా? ప్రతి గోడమీదా, పత్రికమీదా అశ్లీలంగా బొమ్మలుంటే, అది పేరవుతుందా?"

"అలాంటి బొమ్మల్నే ముద్దు పెట్టుకుంటుంటారు మగాళ్ళు, తెలుసా? పెద్ద స్టారయితే మహాలక్ష్మి కాలిగోరుని కూడా వదల్రు జనం. అందరికీ ఆ అదృష్టం ఎక్కడ దొరుకుతుందిలే. నాలాంటివాళ్ళ బ్రతుకుల్లో సినిమా చూసే యోగం కూడా లేదు"

శ్రీవిద్య ఇంకా మాట్లాడుతోంది. కళ్యాణి చెవులకే కానీ బుర్రకెక్కడం లేదది. తన ఆలోచనల్లో తనుంది.

శ్రీవిద్య పెళ్ళిచేసుకుని సుఖపడ్డం లేదు. అలాగని భర్తని సుఖపెడ్తున్నట్లూ లేదు. ఇంట్లో బాలేదని పెళ్ళి చేసుకుంటే మాత్రం అక్కడ డిసప్పాయింట్ అవుతుందన్న వదిన మాటలు గుర్తొచ్చాయి కళ్యాణికి.

## 27

డబ్బిచ్చి సుఖాన్ని కొనుక్కోడానికి బాగా అలవాటుపడ్డాడు సుధాకర్. డబ్బుకు సుఖాన్ని అమ్మేవాళ్ళకు కొరత లేకపోయేది కానీ డబ్బుకే బాగా కొరత వచ్చేది. డబ్బు సంపాదనకు సుధాకర్‌కి ఎక్కువ మార్గాలు కూడా లేకపోయాయి.

కాని నరాల ఒత్తిడి తీర్చుకోడం ఆకలి తీర్చుకోడమంత ప్రాథమిక అవసరంగా

అనిపించేది. అసలలా తీర్చుకోకుండా వుండచ్చునన్న ఆలోచన కలిగేది కాదు సుధాకర్‌కి. ఆ అవసరం ఎలా గడుస్తుందన్న ఆలోచనే మనస్సునిండా.

కాలేజీకి అప్పుడప్పుడు వెళ్ళి వస్తున్నాడు. చాలా రోజులు వెళ్ళడమే లేదు. కాలేజీకి సంబంధించిన ఫీజులనీ, పుస్తకాలనీ ఇంట్లో తీసుకున్న డబ్బంతా తన ఖర్చుకే సరిపోతోంది. రకరకాల అబద్ధాల కథలు చెప్పి ఇంట్లోంచి డబ్బు సాధించేవాడు.

తల్లికి కానీ, తండ్రికి కానీ చదువు అవసరాలు తెలియవు. తెలుసుకోవాలని తండ్రి ఎప్పుడూ ప్రయత్నించలేదు. రాత్రి ఎక్కువసేపు ఇంట్లో వుండడం లేదని తెలిసి కూడా ఏమీ అనలేదు సుధాకర్ని.

ఇంట్లో చిన్న దొంగతనాలు చేశాడు సుధాకర్. అది చాలనప్పుడు బయట కూడా దొంగతనాలు చేసేవాడు. అసలు మొదటి అనుభవం దొంగతనంతోనే మొదలయింది.

అలాంటి చిల్లర దొంగతనాలు చేస్తూ, అలా దొంగతనాలు చేస్తున్న తక్కినవారికి దగ్గరయ్యాడు. ఆ గుంపులో వుంటూ సిగరెట్టు కాల్చడం, తాగడం మొదలైనవాటికి అలవాటుపడ్డాడు.

అలవాట్లు పెరిగేకొద్దీ డబ్బు అవసరం పెరిగింది. అతనికీ అలవాట్లు నేర్పిన గుంపులో, డబ్బు సంపాదించేందుకు ఎన్నో మార్గాలనవలంబించే వాళ్ళున్నారు. అందులో కొన్ని నేర్చుకున్నాడు సుధాకర్.

రాజకీయ పార్టీలకు కొన్ని సందర్భాలలో గొడవలు చేసేందుకు మనుషులు అవసరమైతే వెళ్ళేవాడు, సుధాకర్ డబ్బుకోసం.

కాలేజీలలో స్టూడెంట్లు గొడవలు చేసి బీభత్సం సృష్టించాలంటే బయట నుండి కొందర్ని తీసుకెళ్ళేవారు. తన కాలేజీకి కాకుండా తక్కిన కాలేజీలకు వెళ్ళేవాడు సుధాకర్. ఇవన్నీకాక, ఇంకో వృత్తి మొదలెట్టాడు. కొందరు పడుపుకత్తెలకు బ్రోకర్‌గా వుండడం. సినిమాహాళ్ళ దగ్గర, రైల్వేస్టేషన్ దగ్గర, బస్‌స్టాండ్ దగ్గర నిలబడి, ఆ రాత్రి స్త్రీ అవసరం వుంటుందనిపించేవాళ్ళ దగ్గరకెళ్ళి, వాళ్ళకి అమ్మాయిల రేట్లు చెప్పి, లాడ్జీలకు తీసుకెళ్ళడం ప్రారంభించాడు.

దాంతో కొంత స్థిర ఆదాయం మొదలయింది. అంతేకాదు. అప్పుడప్పుడు ఆ పడుపుకత్తెల పొందు దొరికేది.

ఓ సంవత్సరం గడిచేసరికి– చిల్లర దొంగతనాల సుధాకర్‌గా, బ్రోకర్ సుధాకర్‌గా నిలదొక్కుకున్నాడు సుధాకర్. ఆ జీవితం తప్పుగా అనిపించలేదతనికి. అది తప్పని ఎవ్వరూ అనలేదు అతనితో.

# 28

కొత్త సంవత్సరంనాటి కొత్త అనుభవం, వారానికో పదిరోజులకో ఓసారి చొప్పున అనిత రాజుతో అనుభవిస్తూనే వుంది. అనితకది అనివార్యమైన అవసరంగా, ఆనందదాయకమైన అనుభవంలా అనిపిస్తూనే వుంది.

సుబ్బరాజు అనితావాళ్ళింట్లో చేరి సంవత్సరం అయినరోజున అదేదో పండగలా కొత్తబట్టలు వేసుకున్నారు ఇద్దరూ. సుబ్బరాజు కొని తెచ్చిన స్వీట్స్ తిన్నారు. రాత్రి ఎనిమిది ప్రాంతంలో, సుబ్బరాజు పోర్షన్‌లో ఇద్దరూ ఒకే మంచం మీద పడుకునుండగా సుబ్బరాజు–

"రేపు నేను ఊరువెళ్తున్నా – వారందాకా రాను" అన్నాడు.

"వారం రోజులే" అంది అనిత.

"చాలా ఊళ్ళ టూర్ తప్పదు"

"పెళ్ళెప్పుడో చెప్పవేం?"

"ఈసారి టూర్ నుండి రాగానే మీ నాన్నగారితో మాట్లాడ్డం. పెళ్ళి చేసుకోవడం నాకెవరినీ అడగాల్సిన అవసరంలేదు– ఎవరూ లేరుగా"

"పోనీ, నువ్వెళ్ళడానికి ముందే చేసుకుందాం"

"ఏం– నేను రానేమోనని అనుమానమా?"

"అనుమానమేం లేదు– పెళ్ళి పేరుతో నువ్వు వెళ్ళడం మానేస్తావేమోనని"

"రేపెన్నింటికి ప్రయాణం?"

"మధ్యాహ్నం– పన్నెండింటికి"

"నేను కాలేజీలో వుంటాను"

"మానెయ్యలేవా?"

"పోనీ మానేస్తాలే"

"మానద్దు. క్లాసులు పోగొట్టుకోడం ఎందుకు? నేను వారంలో వచ్చేస్తాగా, నువ్వెళ్ళు"

"నువ్వు లేకుండా వారం రోజులుండలేనేమో"

"ఎంత, వారమేగా?"

అలా అనిత వారం రోజులుండలేనని, రాజు వుండగలవని నాలుగైదుసార్లు అన్నాక, కిందకి దిగింది అనిత.

ఆ రాత్రి కలత నిద్రపోయింది.

మర్నాడు కాలేజీకి వెళ్ళడానికి ముందు పైకెళ్ళి, రాజుతో కాసేపు కూర్చుని కబుర్లాడి,

వెళ్ళలేక వెళ్ళలేక కాలేజీకి వెళ్ళింది అనిత.

సాయంత్రం ఇంటికొచ్చి అలవాటుగా పై పోర్షన్‌వైపు చూసి, తాళం చూసి, నిట్టూరుస్తూ లోపలకెళ్ళింది.

వారం రోజులు. అంటే 148 గంటలు. అంటే 8880 నిమిషాలు. అంటే... అని లెక్కేసుకుంటూ కాలం గడపసాగింది.

రాజు వున్నప్పుడు కుందేలు పరుగులా సాగే కాలం, రాజు లేనప్పుడు నత్త నడకలా నడుస్తోంది.

వారం రోజులయ్యాయి. రాజు రాలేదు. ఆలస్యం చేసినందుకు తిట్టుకుంటూ ఓ రోజు గడిపింది.

ఎందుకాలస్యమైందో, ఏమిటో అంటూ ఆదుర్దాపడుతూ ఇంకోరోజు గడిపింది. ఏవో పనులుండి వుంటాయి అని సమాధానపరుచుకుంటూ మరోరోజు గడపసాగింది.

వారం, రెండు వారాలయింది. అనితకేదో అనుమానం మొదలయింది. పైకెళ్ళి కిటికీ సందులోంచి లోపలకి చూసింది. ఖాళీ మంచం, టేబుల్ తప్ప ఇంకేం కనిపించలేదు. ఇల్లు పూర్తిగా ఖాళీ చేసినట్లే కనపడుతోంది.

ఆ రోజు కాలేజీకి వెళ్ళకుండా రాజు పనిచేసే కంపెనీకి వెళ్ళింది. అంతకుముందు రాజుద్వారా పరిచయమున్న ఓ వ్యక్తిని కలుసుకుంది.

"సుబ్బరాజు టూర్ ఎన్నాళ్ళు?" అని అడిగింది.

"టూరేమిటి? మీకు తెలియదా? సుబ్బరాజు రిజైన్ చేసేశాడు"

"ఎక్కడికెళ్ళాడో తెలుసా మీకు?"

"బొంబాయిలో ఏదో కంపెనీలో ఉద్యోగం వచ్చిందన్నాడు. కంపెనీ పేరు చెప్పలేదు. నేనడగలేదు"

"ఆఫీసులో ఎవరికన్నా తెలుస్తుందా?"

"వుండండి. కనుక్కుందుకు ప్రయత్నిస్తాను" అంటూ లోపలకెళ్ళాడతను. ఓ పావుగంట తర్వాత వచ్చి–

"ఎవరికీ చెప్పలేదుట. అడిగినవాళ్ళకు కూడా అదేదో సస్పెన్స్ అని దాటించేశాడుట తప్ప చెప్పలేదుట. రాజీనామా పత్రంలో కూడా రాయలేదుట"

"మీకు తర్వాత ఎప్పుడైనా తెలిస్తే నాకు తెలియచెయ్యండి" అంటూ లేచింది వచ్చెయ్యడానికి.

"ఎందుకు?" అన్నాడతను అదోలా చూస్తూ.

"అద్దె మూడు నెలలు బాకీ వున్నాడు" అని ఇంటికి వచ్చేసింది.

తన గదిలో పడుకుని ఆలోచిస్తోంది. ఎంత స్కౌండ్రల్, ఎంత దగుల్బాజీ, ఎంతటి నయవంచకుడీ రాజు. తిరిగి వస్తాను, పెళ్ళి చేసుకుంటాను అని ప్రామిస్ చేస్తాడా రాస్కెల్. తను కొంచెం చనువిచ్చినమాట నిజమే. తన్నో ఆటవస్తువుగా చేసుకుని, కావల్సినన్నాళ్ళు వాడుకుని, అవసరం తీరిందనిపించి, వదిలి వెళ్ళిపోతాడా ఆ ఇడియట్. వాణ్ణేం చేసినా పాపంలేదు.

అసలు వాణ్ణి నమ్మినందుకు తన్నసుకోవాలి. ఇంత మూర్ఖంగా వాడి వెనకాల తిరిగింది. చుట్టూ వున్నవాళ్ళు నవ్వుతున్నా, వెక్కిరిస్తున్నా కూడా పట్టించుకోకుండా వాడి వెనకాలే తిరిగింది. పచ్చి మోసగాడు– వాడేంటి, అసలీమగజాతే అంత. తనకు తెలిసినంత వరకూ మగవాళ్ళ కథలన్నీ ఇంతే. మాటల్తో, చేష్టల్తో మంచి చేసుకుని, కావల్సిందంతా దోచేసుకుని, వదిలేస్తారు.

తన్ని తల్లిని చేసే ధైర్యం లేకపోయింది పిరికి వెధవకి. ఎంత జాగ్రత్త తీసుకునేవాడో. ఎంత ప్రేమ నటించాడో, ఎన్ని కబుర్లు చెప్పాడో, తన కళ్ళకు మైకం కమ్మించేశాడు. దాంతో తను వాడి అసలు రూపాన్ని చూడలేకపోయింది. ఇంక ఛస్తే రాడు. వచ్చి నంగి నంగి మాటలు చెప్పినా తను నమ్మదు. వీణ్ణేకాదు, అసలే మగాణ్ణి నమ్మకూడదు.

అసలా జాతిలోనే మోసం చేసే గుణం జీర్ణించుకుపోయింది. ఇక జన్మలో ఏ మగాడితోనూ స్నేహంగా వుండకూడదు. కొంచెం స్నేహంగా వుంటే చాలు, కొంగట్టుకుని లాగేసి మంచంమీద పడిపోతారు దొంగవెధవలు.

వీడు– బి.ఎస్సీ కూడా సరిగ్గా పాసవని వెర్రి వెంగళాయి– తన చదువు గురించి ఎంత వేళాకోళంగా మాట్లాడేవాడు.

ఆడపిల్లలంతా మెడిసన్ చేద్దామని బై.పి.సి.లో చేరి, అక్కడ సీటు దొరక్క ఏ హోంసైన్స్‌లోనే దూర్తారుట. పొట్ట కోస్తే ఉత్త కబుర్లు తప్ప అక్షరమ్ముక్క లేని మొద్దు. వీడితో లేడీ డాక్టర్లు సరదాగా కబుర్లు చెప్తారుట. బడాయి కబుర్లూ, వీడూను. ఇలాంటివాళ్ళ పొగరు అణచడానికైనా తను ఎమ్.బి.బి.ఎస్. చదవాలి. కష్టపడి చదివి డాక్టరవ్వాలి. ఆ విషయం తెలిసి కుళ్ళికుళ్ళి ఏడవాలా బాస్టర్డ్ సుబ్బరాజు. వాడితోపాటు, వాడిలాంటి మగపురుగులందరూ.

అనిత ఆలోచనలు ఓ స్థిరరూపానికి వచ్చాయి. ఆ రోజు నుండి అనిత పుస్తకాల పురుగు అయింది. అలానే పూర్తిగా పురుషద్వేషి కూడా అయింది.

## 29

ఇంటర్మీడియెట్ సెకండియర్ పరీక్షలకింకా పదిహేనురోజులున్నాయి. మోహన్

స్టేట్ ఫస్ట్ రావాలన్న ఉద్దేశంతో బాగా ప్రిపేరవుతున్నాడు. కళ్యాణిని కలుస్తూ మాట్లాడుతున్నాడు కానీ అది చదువుకు ఆటంకంగా వుండటంలేదు. అంతేకాదు, కళ్యాణితో కొంచెంసేపు మాట్లాడేసరికి, అతనికి చదివే మూడ్ ఎక్కువవుతోంది. "నువ్వు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అంతటి ఇంజనీర్ కావాలని నా కోరిక" అన్న కళ్యాణిమాటలు అతనికి అనుక్షణం గుర్తొస్తున్నాయి.

కళ్యాణి కూడా శ్రద్ధగా చదువుతోంది.

మహాలక్ష్మికి సినిమాల్లో చేరాలన్న మోజుతో చదువుమీద ధ్యాస తగ్గినా, పరీక్షలకి కావల్సినంత చదువుతోంది.

అనితకి చదువు తప్ప మరో ధ్యాసలేదు. ఇంట్లో గోడలకు, పుస్తకాలకు వున్న సినిమా యాక్టర్ల, క్రికెటర్ల బొమ్మలు చింపేసింది. నిరంతరం చదువులోనే మునిగిపోయింది. ఇంటర్ అవగానే మెడికల్ ఎంట్రన్స్ కోచింగ్‌కి గుంటూరులో చేరేందుకు ఏర్పాట్లు చేసుకోసాగింది.

శకుంతల చదువుతోంది, ఇష్టాయిష్టాల ప్రసక్తి లేకుండా.

అసలా సంవత్సరం ఫీజులే కట్టలేదని, కాలేజీకి రాలేదనీ హాల్ టికెట్టివ్వలేదు సుధాకర్‌కి. సుధాకర్ ఆ విషయం పట్టించుకోలేదు. విషయం విన్న సుబ్రహ్మణ్యం సుధాకర్ని ఏదన్నా ఉద్యోగం చూసుకోమన్నాడు.

రవీంద్రకి అటెండెన్స్ సరిగ్గా లేదని, కండొనేషన్‌కి డబ్బు కట్టమన్నారు కాలేజీ వాళ్ళు.

దక్షిణామూర్తి కొడుకుని అడిగాడు– "కాలేజీకి సరిగ్గా వెళ్ళలేదా?"

"ఎందుకెళ్ళలేదు?"

"మరి అటెండెన్స్ తక్కువయిందంటారేం?"

"నన్నొక్కడినే కాదు– అందర్నీ కట్టమంటున్నారు"

"అందర్నీ ఎందుకు?"

"కాలేజీకి డబ్బులు పోగు చేసేందుకదో పద్ధతి"

"మీరందరూ కలిసి దెబ్బలాడచ్చుగా"

"పరీక్షలముందు ఈ గొడవలెవరు చేస్తారు. అందరూ చదువు ధ్యాసలోవుంటారు. నీకు డబ్బివ్వడం ఇష్టం లేకపోతే మానెయ్యి. పరీక్ష మానేస్తాను– అంతేగా"

"ఇప్పుడు నువ్వు పరీక్ష మానేసేందుకేనా ఫీజులు కట్టి, ఇన్నాళ్ళూ నిన్ను చదివిచింది. రేపిస్తాలే" ఆ రాత్రి ఎవరి దగ్గరో అప్పు తెచ్చాడు దక్షిణామూర్తి.

మర్నాడు డబ్బు కట్టి హాల్ టికెట్ తీసుకున్నాడు రవీంద్ర.

ఆ పదిరోజులూ పుస్తకాలోసారి తిరగేశాడు. అయితే చదవడానికికాదు, స్లిప్స్ తయారుచేసుకుందుకు. నలుగుర్నీ అడిగి అన్ని సబ్జెక్ట్సులోనూ ముఖ్యమైన ప్రశ్నలు తెలుసుకున్నాడు. కాగితాల స్లిప్స్ తయారుచేసుకున్నాడు.

పరీక్షలు మొదలయ్యాయి.

బస్సుల్లో, రోడ్లలో కూడా చదివేస్తున్నారు, ఊళ్ళోని ఇంటర్మీడియేట్ పిల్లలు. కాలేజీ ఆవరణలలో రాబోయే ప్రశ్నల గురించి, తమ తమ ప్రిపరేషన్స్ గురించి మాట్లాడేసుకుంటున్నారు.

పరీక్షలు జరుగుతున్నాయి.

నాలుగురోజుల కాపీ బాగానే అయింది రవీంద్రకి. అయిదో రోజు ఫిజిక్స్ పరీక్షక్కావల్సిన కాగితాలు జేబులో పెట్టుకొచ్చాడు.

పరీక్ష మొదలైంది. పైన తిరుగుతున్న పాత ఫ్యాను శబ్దం తప్ప మరేం వినిపించని నిశ్శబ్దం, హాలునిండా, నెమ్మదిగా ఒక్కో కాగితం తీసి కాపీ చేస్తున్నాడు రవీంద్ర. ఇన్విజిలేటర్ దూరంగా నిలబడ్డాడు. కాపీ కాగితం బల్లమీదే పెట్టుకుని రాయసాగాడు.

హఠాత్తుగా చెకింగ్ స్క్వాడ్ లోపలకి వచ్చింది. ఒళ్ళంతా చెమట పట్టేసింది. కాగితం తీసి దాచేందుకు లేకుండా నలుగురూ నాలుగు వైపుల నుండి అందరి టేబుల్స్ దగ్గరికి వస్తున్నారు.

అందులో ఒకతను రవీంద్ర టేబుల్ దగ్గరకొచ్చాడు. అతని కళ్ళు కాపీ కాగితమ్మీద పడ్డాయి. అసంకల్పితంగా రవీంద్ర కాగితాన్ని వుండ చేసి నోట్లో పెట్టేసుకోబోయాడు. అతని బలమైన చేతిలో రవీంద్ర చేయి ఇరుక్కుపోయింది. జేబుల సోదాలో తక్కిన కాగితాలు కూడా దొరికాయి. అతని ఆన్సర్ పేపర్‌తో పోల్చి కాపీ అని నిర్ధారించారు. ఇంటర్మీడియెట్ బోర్డ్ రవీంద్రని

మూడేళ్ళు పరీక్షల నుండి డిబార్ చేసింది.

## 30

చిన్న దొంగతనం చేస్తూ పోలీసులకి దొరికాడు సుధాకర్.

ఆ రాత్రి మొదటిసారిగా లాఠీ దెబ్బలనుభవించాడు.

ఏ అవయవానికా అవయవం ఊడిపోతుందేమోననుకున్నాడు, పోలీసు తన్నులు, దెబ్బలు, తోపుళ్ళు అనుభవిస్తూ జుట్టంతా ఊడిపోతుందేమో ననుకున్నాడు, ఓ పోలీసు తన జుట్టు పట్టుకుని ఈడ్చేస్తుంటే, పళ్ళన్నీ రాలిపోతాయేమోననుకున్నాడు, దవడ మీద తగిలిన దెబ్బకి నోట్లోంచి రక్తం కారుతుంటే. అయితే తను చేస్తున్న పనులు నేరాలనీ, ఇది దానికి

శిక్షలాంటిదనీ అనుకోలేదు.

'దొంగనాకొడుకులు' అని మనసారా తిట్టుకున్నాడు.

మర్నాడు మధ్యాహ్నానికి సుధాకర్‌ను ఉంచిన సెల్‌లోకి మరొకణ్ణి తోశారు.

వాడేదో మాటల సందర్భంలో ఎవరి దగ్గర పని చేస్తున్నావని అడిగాడు సుధాకర్ని. సుధాకర్‌కి ఆశ్చర్యమేసి దొంగతనాలు, తార్పుళ్ళు చేసేవాళ్ళకొకరి దగ్గర పనేంటని అడిగాడు. వాడాశ్చర్యపోయాడు.

విడిగా ఇలాంటి పనులు చేస్తుంటే బతుకిలానే ఉంటుందన్నాడు. ఎవరో ఒకరి దగ్గర పనయితే వాళ్ళే మనల్ని కాపాడుతుంటారన్నాడు, తన్నీ సాయంకాలానికల్లా తన వాళ్ళు విడుదల చేయించుకుని తీసుకెళ్తారన్నాడు. తన బాస్ దగ్గర పనిచేసేందుకు అంగీకరిస్తే సుధాకర్ని కూడా విడిపింపచేస్తానన్నాడు.

ముందు రాత్రి దెబ్బల్ని తలచుకుని సరేనన్నాడు సుధాకర్.

సాయంత్రం ఎవరో వచ్చి ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడారు. సెల్‌లోంచి వాడిని బయటకు తీసుకెళ్ళారు. వాడు వచ్చినవాళ్ళతో మాట్లాడాడు, సుధాకర్ గురించి. వాళ్ళు ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడారు. సుధాకర్‌ని వదిలేశారు. వాళ్ళతోబాటే, బాస్ దగ్గరకెళ్ళాడు సుధాకర్.

బాస్ దగ్గర పాతికమందిదాకా వున్నారు. రకరకాల పనులు చేస్తూ, కొందరు దొంగతనాలు, కొందరు దొంగ సారా అమ్మకాలు. కొందరు బ్రోతల్స్ పనులు.

సుధాకర్ పూర్వానుభవం దృష్ట్యా, అతనికి బ్రోతల్స్ పని అప్పగించాడు.

రకరకాల మార్గాల్లో అమ్మాయిల్ని సంపాదించడం, మొండిగా వున్న అమ్మాయిల్ని దారిలోకి తీసుకురావడం సుధాకర్ ముఖ్యమైన పనులు. పనిని బట్టి ఆదాయం వుంటుంది. తర్వాత సుధాకర్‌కింకో విషయం తెలిసింది. ఈ బాస్‌కింకో బాస్, ఆ ఇంకో బాస్‌కి మరో సూపర్ బాస్ వున్నారు. ఆ సూపర్ బాస్‌కి కిందవాళ్ళతో డైరక్ట్ సంబంధం లేదు. అతనో రాజకీయనాయకుడు.

అయినా అవన్నీ మనకక్కర్లేని విషయాలని చెప్పారు వాళ్ళు సుధాకర్‌తో. అంతేకాదు. మనమంతా సుధా ట్రాన్స్‌పోర్ట్‌లో పనిచేస్తున్నవాళ్ళకింద లెక్క అని కూడా చెప్పారు.

ఆ రాత్రి ఆలస్యంగా చేరాడింటికి సుధాకర్.

"నిన్న రాత్రి నుండి కనబడ్డం లేదే" అడిగాడు సుబ్రహ్మణ్యం.

"నాకు ఉద్యోగం వచ్చింది"

"ఏం ఉద్యోగం"

"సుధా ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో లోడింగ్ పని"

"జీతం బాగా ఇస్తారా"

"ముందంతగా వుండదు. పోను పోను ఇస్తారు"

"అంతేలే– నెమ్మదిగా స్థిరపడు. నేను చూడు, నేనూ ముందలాగే చేరాను. ఇప్పుడు చూడు" అన్నాడు సుబ్రహ్మణ్యం గదిలోకి వెళ్తూ.

సుధాకర్ రాత్రి జీవితానికి ఇంట్లో ఉద్యోగం ముద్రపడింది. అంతకన్న తెలుసుకోవల్సిన బాధ్యత లేదనుకునే తండ్రి సుబ్రహ్మణ్యం ఒక్కడే కాదు, ఈ దేశంలో. అలాగైతే ఇందరు సుధాకర్‌లు వుండేవారు కాదు, సుధా ట్రాన్స్‌పోర్ట్‌లాంటి కంపెనీలలో.

## 31

నర్సపూర్– హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ విజయవాడ స్టేషన్‌కి వచ్చింది.

చేతిలో చిన్న బ్రీఫ్‌కేస్‌తో ఎక్కింది మహాలక్ష్మి.

పదిహేను రోజులక్రితం పేపర్లో 'కొత్త నటీనటులు కావలెను" అన్న ప్రకటన చూసి ఉత్తరం రాసింది. దాంతో రెండు ఫొటోలు కూడా పంపింది.

వారం రోజులక్రితం ఉత్తరం వచ్చింది. ఎనిమిదో తారీఖున వచ్చి కలుసుకోమని, బంజారాహిల్స్‌లో ఏదో అడ్రసుంది. ఎనిమిదో తారీఖునే మెడికల్ కాలేజ్ ఎంట్రన్స్ పరీక్ష, పరీక్షతేదీ మార్చడం కుదరదు. సినిమావాళ్ళకు తనింకో రోజున వస్తున్నానంటే ఒప్పుకునే వారేమో. మహాలక్ష్మికా ఆలోచన తీవ్రంగా రాలేదు. పరీక్ష రాయడం అనవసరం అనిపించింది. తను హైదరాబాద్ వెళ్ళి వాళ్ళను కలుసుకుంటే– తన అందాన్ని, నాట్యాన్ని చూసి – తన్ని తప్పకుండా సెలెక్ట్ చేసుకుంటారు. ఓ సినిమాలో నటిస్తే చాలా గుర్తింపు వస్తుంది. పెద్ద స్టారయిపోవచ్చు. అప్పుడీ చదువులు అనవసరం. ఇలా ఆలోచించుకుని ఎనిమిదో తారీఖుకి చేరేటట్లు రైలుకి రిజర్వు చేయించుకుంది. అయితే వెళ్తూన్నట్లు ఎవ్వరితోను చెప్పలేదు.

పరీక్ష ముందు రోజు సాయంత్రం చిన్న బ్రీఫ్‌కేస్‌లో బట్టలు సర్దుకుంది. మర్నాటి పరీక్షకి ఎవరో ఫ్రెండింట్లో కలిసి స్టడీ చెయ్యడానికి వెళ్తున్నానని చెప్పింది ఇంట్లోవాళ్ళకి. పరీక్ష అయ్యాక మర్నాటి రాత్రి సినిమా చూసి అక్కడే పడుకుంటానంది. అలాంటివి ఇంట్లోవాళ్ళకి అలవాటే.

బండి మర్నాటి పొద్దున్నకి హైదరాబాద్ చేరింది. అంతకుముందు రెండు మూడుసార్లు వచ్చింది మహాలక్ష్మి. ఊరు కొత్త కాదు. అయినా మరీ పొద్దున్నే వెళ్తే బాగుండదని, వెయిటింగ్ రూమ్‌లోనే మూడు గంటలు గడిపింది. అక్కడే స్నానం చేసి, రోజ్ కలర్ డ్రస్ వేసుకుంది.

ఆటో ఎక్కి పదింటికి బంజారాహిల్స్ చేరి, ఇంటి అడ్రస్ వెతుక్కుని వెళ్ళింది.

పెద్ద బంగళా గుమ్మం దగ్గర కాపలా మనిషికి సినిమాలో వేషానికి వచ్చానని చెప్పింది. లోపలకి పంపాడతను.

పెద్ద హాల్లో నలుగురు మగాళ్ళు కబుర్లాడుకుంటున్నారు. లోపలకి అడుగుపెట్టి, వాళ్ళకి నమస్కరించి, తనకు వచ్చిన ఉత్తరం చూపించింది. దాన్నొకసారి చూసి "అమ్మా కూర్చో" అన్నాడొకతను. తను సినిమాకి దర్శకుడిననీ, తక్కినవాళ్ళని నిర్మాతగా, కథారచయితగా, కెమెరామెన్‌గా పరిచయం చేశాడు. నిర్మాతగా పరిచయం చెయ్యబడ్డతను అడిగాడు.

"నీ పేరేంటమ్మా?"

"మహాలక్ష్మి"

"చూడమ్మా, నువ్వు మరీ చిన్నపిల్లలా వున్నావు. నీ పెద్దవాళ్ళెవ్వరూ రాలేదా?"

"లేదండీ– వాళ్ళతో నేనిలా వస్తున్నట్లు చెప్పలేదు కూడా" మహాలక్ష్మి నిష్కపటంగా ఉన్నదున్నట్లు చెప్పింది.

"అలా చెయ్యడం తప్పుకదమ్మా" అన్నాడు దర్శకుడు.

"ఛాన్సు రాకపోతే అందరూ వెక్కిరిస్తారని భయంవేసి, ఎవరికీ చెప్పలేదండీ" అంది.

"నిన్ను నువ్వెప్పుడైనా అద్దంలో చూసుకున్నావా? నీ అందానికి నీకు ఛాన్సు రాకపోడమేంటి? నిన్ను వెండితెరకి పరిచయం చేసే పేరు మాకు దక్కుతుందేమో"

"అంటే నాకు హీరోయిన్ ఛాన్స్ వచ్చినట్లేనా?" అంది మహాలక్ష్మి ఆనందంగా.

"నువ్వు చాలా అందంగా ఉన్నావన్నది నిజమే. అయితే స్క్రీన్‌టెస్ట్ చెయ్యాలి. అలాగే మేకప్‌మేన్ వచ్చి నీకు రకరకాల మేకప్‌లు వేసి చూడాలి. వాయిస్ టెస్ట్ కూడా చెయ్యాలి. వీటన్నింటికీ రెండు మూడు రోజులు పట్టచ్చు. వుంటావా మరి?"

"ఈ ఊళ్ళో నాకు తెలిసిన వాళ్ళెవరూ లేరు. రాత్రి బయల్దేరి వెళ్ళిపోతాను. ఈ రోజుకి అయిపోదా?"

"అవగొట్టేద్దాం. కానీ, మరీ అవసరమైతే ఉండాల్సి రావచ్చు. నువ్వు పైకెళ్ళి కుడిపక్క మూడో గదిలో విశ్రాంతి తీసుకో. అవసరమైనప్పుడు పిలుస్తాం"

మహాలక్ష్మి బ్రీఫ్‌కేస్‌తో పైకెళ్ళింది. గది తలుపులు తోసింది. ఎయిర్ కండిషన్డ్ గదిలో నుండి చల్లనిగాలి రివ్వున తాకింది. ఆ గాలిలోంచి మత్తైన సువాసన. గది మధ్య పెద్ద మంచం పైన మెత్తని పరుపుమీద తెల్లని దుప్పటి. ఓ గోడకి ఆ చివరనుండి ఈ చివరదాకా అద్దం.

మహాలక్ష్మి లోపలకి అడుగు పెట్టింది. ఆటోమేటిక్ డోర్ నెమ్మదిగా మూసుకుంది

వెనకే. ఓ పక్క బ్రీఫ్‌కేస్ ఉంచి మంచంమీద పడుకుంది. సంగీతం వినిపిస్తోంది నెమ్మదిగా. అలా పడుకునుండగా చిన్న కునుకు పట్టింది.

తలుపు తీస్తున్నట్లు మెలకువ వచ్చింది. నిర్మాత లోపలకి వచ్చాడు.

లేచి నిలబడింది మహాలక్ష్మి.

"పర్వాలేదు పడుకో" అంటూ లోపలకి వచ్చాడు నిర్మాత. తలుపు నెమ్మదిగా మూసుకుంది. మహాలక్ష్మి నిలబడే చూస్తోందతన్ని.

దగ్గరకొచ్చి మొహంలోకి చూస్తూ– 'చాలా బావున్నావు' అని బుగ్గమీద చిటికేసి మంచంమీద కూర్చుని పక్కనే కూర్చోమని చోటు చూపించాడు.

"మేకప్‌మేన్ వచ్చాడా" అంది మహాలక్ష్మి నిలబడి.

"మేకప్‌మేన్ నీకు రకరకాల బట్టలు కట్టి, రంగులు పూసి చూస్తాడు. అవేం లేకుండా నిన్నోసారి చూద్దామని" అని వెకిలిగా నవ్వాడు.

మహాలక్ష్మికి జరగబోయేది అర్థం అయింది. నెమ్మదిగా తలుపు దగ్గరకి వెళ్ళింది. వెనక్కి అడుగులు వేస్తూ.

మంచంమీద వెనక్కి వాలి పడుక్కుని, సిగరెట్ తీసి వెలిగించుకుని తాపీగా చెప్పాడతను– "ఆ తలుపు చూడు. దానికి గొళ్ళేలూ, హేండిల్సూ లేవు. తాళం వుంటే కానీ లోపల్నుండి తియ్యలేం. తాళం నా దగ్గరే తప్ప నీ దగ్గర లేదు. బయట నుండి తోసుకురావచ్చు. గంటదాకా ఎవర్నీ రావద్దని చెప్పా. అంతవరకూ ఎవ్వరూ రారు. నువ్వు అరిచినా ఎవ్వరికీ వినిపించదు. నువ్వు పారిపోయే ప్రయత్నం చెయ్యడం అనవసరం"

మహాలక్ష్మి గదంతా చూసింది. ఎక్కడా మరో తలుపు లేదు. భయం వేసింది. ఒళ్ళంతా కంగారు పుట్టింది. ఏడుపు వచ్చేస్తోంది. తలుపు నానుకుని మంచంమీదతన్ని చూస్తూ నిలబడింది.

సిగరెట్ రెండు దమ్ములు పీల్చి, మంచంమీదనుండి లేచి, సిగరెట్‌ని నేలమీద పడేసి, బొటనవేలితో రాసేసి, మహాలక్ష్మివైపు నడిచాడు.

మహాలక్ష్మి వెర్రిగా అరుస్తూ గదంతా తిరగసాగింది.

"వద్దు... ప్లీజ్... నన్నేమీ చెయ్యద్దు... నాకు మీ సినిమాలో ఛాన్సక్కర్లేదు... నన్నొదిలెయ్యండి... నేనెళ్ళిపోతాను.. మీ కాళ్ళు పట్టుకుంటాను... నా మీద దయచూపండి.. నేనలాంటి దాన్ని కాను... ఇలాంటి అవసరం వుంటుందని నాకు తెలియదు... వుంటే నేనసలు వచ్చేదాన్ని కాదు...మీక్కావలిస్తే నా దగ్గరున్న డబ్బంతా తీసేసుకోండి.. ఈ గొలుసూ, గాజులూ, రింగులూ కూడా తీసేసుకోండి.. బంగారంవే... నన్నేం చేయ్యకండి... మీ కూతుర్లాంటిదాన్ని..."

ఏ అమ్మాయినైనా కామం కళ్ళతో తప్ప మరోలా చూడ్డంరాని ఆ మగాడిని మహాలక్ష్మి అరుపులు ఇంకా రెచ్చగొట్టాయి. నిస్సహాయస్థితిలో మహాలక్ష్మి అతని కాళ్ళ దగ్గర పడి తల నేలకేసుకు కొట్టుకోసాగింది.

"బుద్ధి గడ్డితిని వచ్చాను. మళ్ళీ ఇలాంటి చోట్లకి రాను. నన్నొదిలెయ్యండి" అని హృదయవిదారకంగా ఏడ్చింది. లేడిపిల్లను వేటాడుతున్న పెద్దపులికి లేడిపిల్ల బాధ అర్థంకాదు. అయితే పెద్దపులికి తన ఆకలి తీర్చుకుందుకదొక్కటే మార్గం. అది సృష్టిధర్మాన్ని నెరవేరుస్తుంది. "కామపు ఆకలి"ని తీర్చుకుందుకు పెళ్ళి, భార్యలాంటి మార్గాలున్నాయి. సమాజపు విలువలున్నాయి. సినిమా హీరోయిన్ వేషం కోసం వచ్చిన అమాయకపు చిన్న పిల్ల అవసరంలేదు. అయితే అలాంటి సున్నిత భావాలు అర్థం కావు అతనికి. వద్దని ఏడ్చేపిల్లను అనుభవించడం థ్రిల్‌గా ఉందతనికి. దయ, కరుణ, వాత్సల్యం, మమత, ప్రేమ, అనురాగంలాంటి మాటలకు అతీతమైన మగాడు విజృంభించాడు.

తప్పించుకుందుకు ప్రయత్నించింది మహాలక్ష్మి. గింజుకుంది. గిల్లింది. కొట్టింది. బలమైన కాళ్ళగోళ్ళమధ్య పెట్టుకున్న డేగను ఏం చెయ్యగలదు పక్షిపిల్ల? మహాలక్ష్మి ప్రయత్నాలు శృంగార చేష్టలుగా అనిపించాయి అతనికి.

కామం మత్తు పూర్తిగా ఎక్కిన మగాడి బలానికి మహాలక్ష్మి ఒంటిమీద బట్టలు నిలబడలేదు.

ప్రపంచంలోని అందాన్నంతా తనలోనే ఉంచుకున్న అతిలోకసుందరి మహాలక్ష్మి– తనని ఒకసారి చూసిన వాళ్ళ కళ్ళను తనమీదే ఉంచుకోగల ఆకర్షణ శక్తి వున్న మహాలక్ష్మి– చిన్న ఎండపొడ తగిలితే కందిపోయే మహాలక్ష్మి – కాస్సేపు నడిస్తే అలిసిపోయే నాజుకు మహాలక్ష్మి– ఇన్నాళ్ళూ ఎంతో జాగ్రత్తగా ఒదిగి వున్న అనాఘ్రాత పుష్పం మహాలక్ష్మి– ఈనాడో బలవంతుడి బలత్కారానికి బలయిపోయింది. నిమిషాలు గడిచేసరికి ప్రతిఘటించేందుకు ఓపికలేక, పూర్తిగా లొంగిపోయింది.

తన పని పూర్తిచేసుకుని వెళ్ళిపోయాడు నిర్మాత.

తలుపు తెరుచుకుని ఇంకోడు లోపలకొచ్చాడు.

వచ్చిందెవరో కూడా చూసే ఓపిక లేని మహాలక్ష్మి మంచంమీద పడుకునే వుంది– ఏడుస్తూ.

డ్యూటీ మారినట్లు రెండవవాడు దగ్గరకొచ్చాడు.

నివ్వెరపోయింది మహాలక్ష్మి.

అయిన అనుభవాన్నే ఇంకా జీర్ణించుకోని చిన్నారి మనస్సు, మళ్ళీ అదే ఆపద ముంచుకొస్తోందంటే తట్టుకోలేక తల్లడిల్లింది.

పాశవికత్వం పెంచుకున్న మనిషి చేతుల్లో మళ్ళీ నలిగింది మహాలక్ష్మి సుందరరూపం. జరుగుతున్న అనాచారాన్ని తట్టుకోలేక కుమిలిపోయింది మహాలక్ష్మి లేత మనస్సు.

వాడెళ్ళి ఇంకోడు లోపలకొచ్చేసరికి ఏమీ అనుకునే స్థితిలో లేదు మహాలక్ష్మి. స్పృహలేనట్లున్న మహాలక్ష్మిని అనుభవించేందుకు వెనుకాడలేదు వచ్చినవాడు. వాడికి కావల్సింది అమ్మాయి శరీరంకానీ, ప్రాణం కాదు.

మహాలక్ష్మి శరీరంపై నాల్గవ మనిషి దురాక్రమణ జరగడం కూడా తెలియదు మహాలక్ష్మికి. తరువాత ఎన్ని గంటలకో, రోజులకో స్పృహ వచ్చి చూసుకునేసరికి, ఆ ఇంట్లో కానీ, ఆ గదిలోకానీ లేదు మహాలక్ష్మి.

పరీక్షకి మహాలక్ష్మి రాకపోవడంతో కంగారుపడి పరీక్షయ్యాక వాళ్ళింటికెళ్ళింది అనిత.

"మీ ఇంటికే వచ్చిందనుకున్నాం. ప్రిపరేషన్‌కి ఫ్రెండింటికి వెళ్తానంది" అన్నారు వాళ్ళింట్లో.

"పరీక్షక్కూడా రాలేదు" అంది అనిత.

"అదెప్పుడూ అంతే. ఏం చేస్తుందో ఎవరికీ చెప్పదు. రేపొస్తానందిగా చూద్దాం" అన్నారు వాళ్ళు ఏమీ కంగారుపడకుండా.

అనితకి పిచ్చెక్కినట్లయింది. వెంటనే కళ్యాణిని కలుసుకుని జరిగింది చెప్పింది.

"ఎక్కడకెళ్ళి వుంటుందంటావ్" అడిగింది కళ్యాణి.

"అదే నాకర్థంకావడం లేదు. అది బాగా తిరుగుతుందన్నమాట నిజమేగానీ, పరీక్ష మానేస్తుందంటావా?" అంది అనిత.

"వాళ్ళింట్లో తమాషాలే. ఇంట్లో ఎవరున్నారో ఎవరులేరో ఎవరికీ తెలియదు. ఇంట్లోనే వున్నా ఆశ్చర్యపడక్కర్లేదు"

"కానీ, వాళ్ళే బ్రీఫ్‌కేస్ తీసుకుని వెళ్ళడం చూశామంటున్నారు. నాకు కంగారుగా వుంది"

"వాళ్ళ వాళ్ళిళ్ళకెక్కడకన్నా వెళ్ళిందేమో– కనుక్కోమన్నావా వాళ్ళను?"

"వాళ్ళను చూస్తేనే చిరాకేసింది. అసలు ఇంట్లో ఒకళ్ళు కనిపించడం లేదన్న కంగారే లేదు. ఎంత నన్ను పట్టించుకోకపోయినా మా నాన్నే నయం" అంది అనిత.

"వాళ్ళెలాగుంటేనేం కానీ– ఇదేమయిందో"

"ఒకవేళ ఎవరన్నా సినిమా ఛాన్సిప్పిస్తామని తీసుకెళ్ళి వుంటారంటావా?" భయంగా అడిగింది అనిత.

"చెప్పలేం. ఎవరన్నా పిలిస్తే వెళ్ళిపోయేంత పిచ్చి ముదిరింది దానికి. ఎవరికీ చెప్పకుండా వెళ్తుందా?"

"అర్జెంటుగా పిలుపొచ్చుండచ్చు. అది నిజంగా ఛాన్సుకయితే పరవాలేదు. ఈ మగవెధవల్ని నమ్మకూడదు. అలా ఛాన్సిప్పిస్తామని చెప్పి తీసుకెళ్ళి ఏం చేసినా చేస్తారు" అంది అనిత కసిగా, మనసులో రాజు మెదల్తుండగా.

"నీకు మగవాళ్ళందరిమీదా అంత ద్వేషం పనికిరాదు- నువ్వు మగవాళ్ళతో అసలు మాట్లాడ్డం లేదుట. అలాగైతే కష్టం అనితా."

"నేననుభవించి తెలుసుకున్న నిజం అది. దాని గురించి మాట్లాడకు. నాకు తిక్కరేగుతుంది. ఇంతకూ మహాలక్ష్మి ఎవరి వలలోనన్నా పడిందంటావా? అంది అనిత బాధగా.

"అలా పడలేదని ఆశిద్దాం" అంది కళ్యాణి.

కానీ వాళ్ళ ఆశ అడియాశ అయింది.

మహాలక్ష్మి చేరుకున్నదో జైలులాంటి ఇల్లు. అక్కడకి జేరడమేకానీ, అక్కడ నుండి బయటకి రావడం వుండదు. బొంబాయిలో అలాంటి జైళ్ళు చాలా వున్నాయి.

అక్కడ పరిస్థితి తెలుసుకుని పారిపోయేందుకు ప్రయత్నించింది మహాలక్ష్మి. ఫలించని ప్రయత్నం అది. అక్కడకు ఆడపిల్లల్ని తెప్పించుకోడమేకాదు వాళ్ళనెలా మచ్చిక చేసుకోవాలో కూడా తెలుసు వాళ్ళకి.

విపరీతమైన ఆకలినీ, దాహాన్నీ తట్టుకోలేకపోయింది మహాలక్ష్మి. దెబ్బలను సహించలేకపోయింది కుసుమ సుకుమార శరీరం. రాత్రికో మగాడి శరీరావసరం తీర్చడానికి ఉపయోగించే సాధనమైంది మహాలక్ష్మి శరీరం. ఆ అందమైన సౌకుమార్యపు శరీరానికి గంటకి వేలలో వెల కట్టారు.

ప్రకటన ఇచ్చినవాళ్ళు సినిమా తీసే ఉద్దేశం వున్నవాళ్ళు కాదనీ, డబ్బు కోసం అమ్మాయిల కోసం ఈ మార్గం ఎంచుకున్నారని ఆలస్యంగా అర్థమైంది మహాలక్ష్మికి. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అరంగేట్రం జ్ఞాపకాల్లో మిగిలిపోయింది కళ్ళలో కన్నీళ్ళను చిప్పిస్తూ.

## 32

మెడికల్ ఎంట్రన్స్ రిజల్ట్సొచ్చాయి.

అనిత సెలెక్టయింది. వెంటనే వచ్చి కళ్యాణికి చెప్పింది.

"నీ పట్టుదలతో సాధించావు" అంది కళ్యాణి అనిత నోట్లో పంచదార పోస్తూ.

"సెలెక్షనొచ్చిందని నాకోపక్క సంతోషంగా వున్నా, మహాలక్ష్మి ఏమయిందోనని

పీకుతూనే వుంది” అంది అనిత.

“ఎప్పుడో వెండితెరమీదే దర్శనం ఇస్తుందింక– అంతవరకూ మనం వేచి చూద్దమే” అంది కళ్యాణి.

“అనే అనుకుంటూ వుందాం”

“శకుంతలదేమైంది?”

“అది కూడా సెలెక్టయింది”

“వాళ్ళింటికెళ్దాము, దాన్ని చూసి చాలా రోజులైంది”

“నాకు వాళ్ళ వాళ్ళతో అంత పరిచయం లేదు”

“మనం వెళ్ళేది శకుంతలని చూడ్డానికి కదా, రా. కంగ్రాట్స్ చెప్పినట్లుంటుంది. మీరిద్దరూ ఒకేచోట చదవచ్చు కూడా” అంటూ రెడీకాసాగింది.

ఇద్దరూ శకుంతల ఇంటికెళ్ళారు. ఇందిరాదేవికి కళ్యాణి తెలుసు.

“శకుంతలకి మెడికల్ సెలక్షనొచ్చింది. ఆ ఆనందంతో నిద్దరోతోందిలాగుంది తన గదిలో. తలుపు లోపల గడియ పెట్టుకోదు. మీరు పైకి వెళ్ళండి. నేను టీ పంపిస్తాను” అంది ఆవిడ కళ్యాణితో.

పైకెళ్ళి తలుపు తోశారు. లోపల దృశ్యానికి ఇద్దరూ ఒకేసారి కెవ్వుమన్నారు. సీలింగ్ ఫ్యాన్‌కి చీర ఉరిగా వేసుకు వేళ్ళాడుతోంది శకుంతల శరీరం. వాళ్ళ కేకలకి ఇంట్లోవాళ్ళంతా అక్కడకి చేరారు. ఇందిరాదేవి గొల్లుమంది. శరీరాన్ని దింపారు.

గదిలో శకుంతల రాసిన ఉత్తరం దొరికింది. “ఈ ఉత్తరం ఎందుకు రాస్తున్నానో నాకే తెలియడంలేదు. ఇన్నాళ్ళూ ఎవరితోనూ చెప్పని, చెప్పుకోలేని నా బాధను అందరికీ తెలియచేస్తే ఒరిగేదేముంది? అయినా అసలు ఆత్మహత్య ఎందుకు చేసుకుంటున్నానో కూడా నాకు తెలియదు. నేనెందుకో ఆత్మహత్య చేసుకుంటున్నానని ఎవరూ అనుకోకుండా ఉండేందుకు రాస్తున్నానేమో. ఈ రోజు నేను మెడికల్ ఎంట్రన్స్ పాసయ్యానని తెలిసింది. నాకు ఆనందం కలగలేదు సరిగదా, భయం వేస్తోంది.

ఈ లోకంలో ఎవ్వరికీ నేనంటే ఇష్టంలేదనీ. ఎవ్వరికీ నాతో ప్రమేయం లేదనీ, నేనెవ్వరికీ కావల్సినదాన్ని కాదనీ నాలో అభిప్రాయం ఏర్పడింది. చుట్టూ వున్న మనుషులు ఈ అభిప్రాయాన్ని బలపరిచారే తప్ప తప్పని ఋజువు చెయ్యలేదు. అన్నిటికన్నా మనిషి భరించలేనిది ఒంటరివాళ్ళమనే భావాన్ని. ఒంటరిజీవితానికి అర్థంలేదు. అయితే నా ఒంటరితనానికీ, నా ఆత్మహత్యకీ ఎవ్వరూ బాధ్యులు కారు. దీనికొక్కటే కారణం– నా శరీరంతో సమానంగా ఎదగలేని నా వయస్సు మాత్రమే”

కళ్ళలో నీళ్ళు తిరిగాయి కళ్యాణికి. అసలేమైందో అర్థంకాలేదు అనితకి.

## 33

విజయవాడ స్టేషన్ ఎప్పటిలాగే హడావుడిగా ఉంది. సర్కార్ ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాం మీదకొచ్చింది.

మోహన్ మద్రాసు ప్రయాణానికి సిద్ధంగా వున్నాడు. అతన్ని రైలెక్కించడానికి వచ్చింది కళ్యాణి.

మోహన్ ఇంటర్మీడియేట్ స్టేట్ ఫస్టొచ్చాడు. ఐ.ఐ.టి. ఎంట్రన్స్‌లో దేశం మొత్తానికి ఫస్టొచ్చాడు. ఇప్పుడు ఐ.ఐ.టి.లో చేరేందుకు మద్రాసు వెళ్తున్నాడు.

ఇద్దరికీ ఒకరిని విడవడానికి ఒకరికి బాధగా వుంది.

అయితే అందులో ఇద్దరు స్నేహితులు దూరంగా వుంటున్నందుకు కలిగే బాధేకానీ– అంతకుముందు సంవత్సరంలా విరహబాధలేదు.

కంపార్ట్‌మెంట్‌లో సామాను పెట్టి కిందికి దిగాడు.

గేట్ దగ్గరే నిలబడింది కళ్యాణి. పక్కనే మోహన్.

"కళ్యాణీ! జీవితంలో నేనింతవరకు సాధించినదానికీ, సాధించబోయేదానికీ– అన్నిటికీ కారణం నువ్వే" అన్నాడతను గొంతు కాస్త వణుకుతుంటే.

"నీ తెలివితేటలూ, పట్టుదలా నిన్ను గొప్పవాడిని చేస్తున్నాయి. నేనేం చేశాను. ఊరికే పొగడకు" అంది కళ్యాణి ఎటో చూస్తూ.

"నువ్వు కూడా తెలివైనదానివే. నువ్వూ రాయాల్సింది ఎంట్రన్స్. నీకూ సీటొచ్చేది. అప్పుడు ఇద్దరం ఒకేచోట చదివేవాళ్ళం" అన్నాడు మోహన్.

"నాకు సీటొచ్చేది కాదు. వచ్చినా నాకు ఇంజనీరింగ్ చెయ్యాలని లేదు. నాకెందుకో మీ అక్కలా ఎమ్మెస్సీ మేథమేటిక్స్ చేసి లెక్చరర్ అవాలనిపిస్తోంది. అలాగవుతానని దీవించు" అంది కళ్యాణి తల వంచుతూ.

మోహన్ కళ్యాణి తలని పైకెత్తి–

"నిన్ను నేను దీవించడమేంటి? నువ్వు దేవతవు. నా జీవితానికి అర్థం, గమ్యం కల్పించినదానవు. నువ్వే లేకుంటే ఏమయిపోయుండేవాడినో"

"ఏమీ అయ్యుండేవాడివి కాదు. నీకు పాడవడం చేతకాదు. అది కొందరికే సాధ్యం" అంది కళ్యాణి నవ్వుతూనే.

"మహాలక్ష్మి ఏమయిందో తెలుసా?" అడిగాడు మోహన్.

"పాడవడం అంటే మహాలక్ష్మి గుర్తొచ్చిందే నీకు. పాపం– ఏమయిందో తెలియదు. ఎక్కడో చిక్కుకుపోయుండచ్చు. ఇంట్లో ఒక్కరికీ దాని గురించి పట్టించుకునే తీరిక

లేకపోయింది. లేకపోతే రెండు రాత్రులు ఇంటికి రానని బ్రీఫ్‌కేస్ తీసుకుని వెళ్తే అలా వదిలేస్తారా? అసలిలాంటివాటన్నిటి మీదా ఇంటి వాతావరణ ప్రభావం చాలా వుంటుంది. మీ ఫ్రెండ్ సుధాకర్ చూడు. వాళ్ళింట్లో వాళ్ళు పట్టించుకోకేకదా- ఆ రౌడీ గుంపులో కలిసిపోయాడు"

"వాళ్ళింట్లో వాళ్ళని అమాయకులు అనుకోవాలో, అసలు పట్టించుకోని వాళ్ళను కోవాలో- పాపం, వాడి జీవితం నాశనం అయింది"

"రవీంద్ర కూడా అంతేనేమో"

"వాళ్ళనాన్న వాడిని అందలమెక్కించి చెడిపేసాడు. వాడంతవాడు లేడన్న అహంభావం కలిగింది వాడికి. ఇంక చదువుకోలేదు. ప్రస్తుతం డిబారయి ఇంట్లో కూర్చున్నాడు. ఇంక ఇప్పుడు రిగ్రెట్టయినా చెయ్యగలిగింది తక్కువే"

"అదే వచ్చింది. ఈ వయస్సులో ఎందుకో దారితప్పితే- మళ్ళీ దారిలో పడ్డం చాలా కష్టం. ఎవరో అనితలాంటి అదృష్టవంతురాళ్ళు తప్ప"

"అనిత బాగా చదువుతోందికానీ, పూర్తిగా పురుషద్వేషి అయిందిట. సైకలాజికల్‌గా అలాంటిది ఆరోగ్యం కాదు"

"నిజమే. అసలు మగవాళ్ళని నమ్మని స్థితికి వచ్చింది. అంతకన్నా విచారకరమైన అంతం శకుంతలది"

"అంతటి ఒంటరితనం ఎందుకు వచ్చిందో?" అని అడిగాడు మోహన్.

"దానికి చాలాకాలం నుండి ఓ కాంప్లెక్స్ వుంది. నువ్వు చూశావుగా శకుంతలని. బాగా లావుగా, పొడుగ్గా, పెద్దదాన్లాగుంటుంది. దానికన్న పెద్దవాళ్ళు దాని వయస్సు తక్కువని దాన్ని చేర్చరు. దాని వయస్సువాళ్ళు దాని ఆకారాన్ని చూసి అది పెద్దదని దానితో కలవరు. అందరూ ఏదో ఒకరకంగా దానికి వయసుని మించిన శరీరం వుంటుందని గుర్తు చేసేవారు. అలాంటి విషయాలతో దాని సున్నితమైన మనస్సు బాగా దెబ్బతింది. ఇంట్లోవాళ్ళు దాన్ని బాగుచేసే బదులు- ఇంకా బాధపెట్టారు. అది కూడా ఎవరితోనూ చెప్పుకోలేదనుకో"

"చిన్న వయసులోనే ఆత్మహత్య- ప్చ్" అన్నాడు మోహన్.

"శ్రీవిద్య జీవితమూ అంతే. అదీ ఇంట్లో ఏమీ లేదనుకుని అక్కడేదో వుంటుందనుకుని పెళ్ళి చేసుకుని వెళ్ళింది. అక్కడ అత్తవారింట్లోనూ ఇమడలేక, తను సుఖపడలేక వాళ్ళనూ సుఖపెట్టలేకపోతోంది"

"కానీ చూశావా- ఇప్పుడు మనం దారి తప్పారనుకుంటున్న వాళ్ళంతా ఈ రవీంద్ర, సుధాకర్, మహాలక్ష్మి, శకుంతల కొంతవరకూ అనిత, శ్రీవిద్య వీళ్ళంతా ఏదో ఒక ఆకర్షణకో, కాంప్లెక్స్‌కో బలయినట్లుందికదూ? అలానే వాళ్ళిళ్ళలో వాళ్ళు కూడా వాళ్ళని

పట్టించుకోకపోవడమో, వాళ్ళనింకా ఆ కాంప్లెక్స్‌లోకి దింపడమో అయినట్లుంది. చూస్తే, ఈ టీన్స్ చాలా భయంకరమైనవిగా వున్నాయి. నా అదృష్టంకొద్దీ నువ్వు నన్ను బయటపడేశావ్"

"మరి నన్నెవరు పడేశారో" అంది ఎటోచూస్తూ కళ్యాణి.

"కానీ చాలామంది ఇవేం తెలియకుండా, చూడకుండా మామూలుగా పెరిగి పెద్దవాళ్ళయిపోతారేమో. వాళ్ళకిది భయంకరమైన విషయంగా వుండి వుండకపోవచ్చు. మనం దారి తప్పినవాళ్ళనే చూస్తున్నాం".

"అది వాళ్ళ వాళ్ళ ఇళ్ళలో వుండే పరిస్థితుల్ని బట్టి వుంటుందిలే. రైలు కదులుతుందేమో– ఎక్కు" అంది.

"ఇంకా టైముంది" అన్నాడు మోహన్.

ఇద్దరూ మౌనంగా నిల్చున్నారు ఒకరి వంక ఒకరు చూసుకుంటూ.

ఇద్దరి గుండెల్లోనూ ఏదో తడి– కళ్ళల్లోనూ అదే తడి.

"ఉత్తరాలు రాస్తూండు" ఇద్దరూ ఒకేసారి అన్నారు. అని తడికళ్ళతోనే నవ్వుకున్నారు.

ఇద్దరికీ ఏం మట్లాడాలో తెలియడంలేదు.

గ్రీన్ సిగ్నల్ వచ్చింది.

గార్డు విజిల్ ఊదుతున్నాడు.

కళ్యాణికి కృతజ్ఞతలు చెప్పాలని చాలా రోజులుగా వుంది మోహన్‌కి. 'థాంక్యూ' అని ఎంత గాఢంగా అన్నా అది ఫార్మాలిటీగా వుంటుందనిపిస్తోందతనికి.

రైలింక కదలబోతున్నట్లు ఇంజను కూసింది.

"ఎక్కు" అంది కళ్యాణి బలవంతంగా తోస్తూ.

అతనికేదో చెయ్యాలని వుంది. ఏం చెయ్యాలో తెలియడంలేదు. ఏదో చేసి తన కృతజ్ఞతలు చెప్పాలని తీవ్రంగా అనిపిస్తోంది.

"ఎక్కు" అంది కంగారుగా కళ్యాణి.

హఠాత్తుగా వంగాడు మోహన్.

కళ్యాణికి ఏమీ అర్థం కాలేదు.

చుట్టూ వున్న జనానికి మతిపోయింది.

విజయవాడ రైల్వేస్టేషన్లో

ఎందరెందరో జనం చూస్తుండగా.

ఇంటర్మీడియెట్ స్టేట్ ఫస్ట్. ఐ.ఐ.టి. ఎంట్రన్స్ దేశం ఫస్ట్ వచ్చిన బ్రిలియంట్‌బాయ్ మోహన్.

ఓ మగాడు మోహన్

పూర్తిగా వంగి

ఓ ఆడపిల్ల కాళ్ళకి

తనకన్న చిన్నదైన ఆడపిల్ల కాళ్ళకి

కళ్యాణి కాళ్ళకి– నమస్కరించాడు.

జరిగిందేమిటో అర్థంకాక అయోమయంగా చూస్తూ నిల్చుంది కళ్యాణి.

కళ్ళలో నీళ్ళతో రైలెక్కాడు మోహన్.

రైలు కదిలింది.

రైల్లో వాళ్ళు మోహన్‌ని, ప్లాట్‌ఫాం మీద వాళ్ళు కళ్యాణిని వింతగా చూస్తున్నారు.

మోహన్ అదేం పట్టించుకోలేదు.

తనని దారి తప్పనీయని కళ్యాణికి నమస్కరించి కృతజ్ఞతలు తెలుపుకోగలిగినందుకు ఆనందంగా ఉందతనికి.

ఇద్దరూ రుమాళ్ళు ఊపుతున్నారు.

కళ్ళనీళ్ళతో ఒకరికొకరు మసగ్గా కనిపిస్తున్నారు.

రైలు వెళ్ళిపోయింది, తన గమ్యం వైపు

నెమ్మదిగా నడవసాగింది కళ్యాణి.

–: అయిపోయింది :–

*(స్వాతి అనుబంధ నవల, నవంబర్ 1990)*

# ఎరుపు తెల్లపోతోంది

## ఆదిపర్వం - అంతర్మథనం

## 1

పశ్చిమాకాశంలో ఎర్రని కాంతిని తనకి గుర్తుగా వదిలేస్తూ అస్తమిస్తున్నాడు సూర్యుడు.

నెమ్మదిగా చీకటి అలుముకుంటుంటే ఊరంతా దీపాలు వెలిగించబడుతున్నాయి.

సాయం చీకటిలో, దీపాల కాంతిలో అందంగా ఉంది విజయవాడ.

ప్రవహిస్తున్న కృష్ణానదికి అడ్డంగా కట్టిన బేరేజీకి ఓ పక్క నిండుగా ఉన్న నీళ్లు బేరేజి మీద వెలిగించిన దీపాల కాంతిలో మెరుస్తున్నాయి.

ఆకాశంలో నక్షత్రాలు కనిపించడం మొదలుపెట్టాయి.

ఇంద్రకీలాద్రి కొండ మీద నిలబడి ఆలోచిస్తున్నాడు మోహన్ -

మన చుట్టూ ఉన్న సమాజంలోని అసమానతల్ని తొలగిస్తే ఈ సమాజం సమసమాజంగా మారుతుందని చెప్పిన మార్క్స్ మాటలు నిజమయ్యే అవకాశం ఉందా? అలాంటి సమాజ స్థాపన కోసం ప్రాణత్యాగం చేస్తున్న యువతీ యువకుల ప్రయత్నం ఫలిస్తుందా?

తిండి, గుడ్డ, ఇల్లు - ఈ ప్రాథమిక అవసరాలు అందరికీ తీరే రోజు వస్తుందో, రాదో. ఆ రోజు వచ్చేందుకు తను చెయ్యవలసిందేమిటి? తన కర్తవ్యం ఏమిటి?

కష్టబడి తన్ని పెంచి పెద్దచేసి చదువు చెప్పిస్తున్న తల్లిదండ్రులకి తను చెయ్యవలసిందేమిటి? తన్ని ఎంతో అభిమానిస్తూ, తనతోనే తిరిగే చెల్లెలకి తనేం చెయ్యాలి? తన్ని ప్రేమిస్తూ తనతో పెళ్లికోసం ఎదురుచూస్తున్న కళ్యాణిపట్ల తన కర్తవ్యం ఏమిటి?

వీళ్లు కాకుండా తనతోపాటు చదువుకునే విద్యార్థులు, తన స్నేహితులు, తన బంధువులు-వీళ్లందరూ తన నుండి కోరుకునేదేమిటి? తను వాళ్లకివాల్సిందేమిటి? 'తన' వాళ్లని తను అనుకుంటున్నవాళ్లు కాకుండా ఈ సమాజంలో ఇంకొకరి సహాయం కావాల్సిన అసహాయులు ఎందరో ఉన్నారు. వాళ్లందరికీ తను చెయ్యవలసినదేమిటి?

అందరి కష్టాలు తీరి ప్రజలంతా సుఖంగా ఉండే రోజు వస్తుందా? కనీసం

మనుష్యులందరి కనీసవసరాలు తీరే రోజు వస్తుందా? అలాంటి రోజు రావాలంటే ఎవరి కృషి ఎంత ఉండాలి? తన వంతు కర్తవ్యం ఏమిటి?

తనకెందుకు ఎప్పుడూ ఇలాంటి ఆలోచనలే వస్తుంటాయి? తన చుట్టూ ఉన్న వాళ్లంతా కూడా ఇలానే ఆలోచిస్తుంటారో లేదో తెలియదు. అయినా ఆలోచనల వల్ల కూడా ప్రయోజనం లేదు. ఏదో చెయ్యాలి. ఏం చెయ్యాలో తెలియడంలేదు కానీ ఏదో చెయ్యాలి. తనేదో చెయ్యాలి.

– అని అనుకుంటూ కొండ దిగసాగాడు మోహన్.

చీకటి బాగా ముసురుకుంది.

బస్టాండ్‌కి వచ్చి, ఇంటికెళ్లే బస్సెక్కి దిగి, ఇంటివైపు నడవసాగాడు మోహన్.

గేట్ దగ్గర నిలబడి ఎదురుచూస్తున్నారు తల్లీ, చెల్లెలు.

"ఆలస్యం అయిందేం అన్నయ్యా" అని అడిగింది లోపలకి అడుగుపెడుతుంటే చెల్లెలు సుజాత.

"కాలేజీ నుండి అలాగే కనకదుర్గ గుడికెళ్లి వస్తున్నా. నాన్నింకా రాలేదా?" అడిగాడు మోహన్.

"ఇంకా ఎనిమిది కూడా కాలేదు. అప్పుడే వస్తారా మీ నాన్న? ఆఫీసులో ఎవ్వరికీ అక్కర్లేని పనులన్నీ ఈయనకే కావాలి. కాళ్లు కడుక్కురా" అంది లక్ష్మి ఓ కుర్చీలో కూర్చుంటూ.

"దుర్గగుడికని చెప్తే నేను కూడా వచ్చేదాన్ని కదా – పొద్దున్న నాతో అనలేదేం?" అంది సుజాత కాళ్లు కడుక్కుని వచ్చిన మోహన్‌కి తువ్వాలు అందిస్తూ.

"ఈ రోజు గుడికి వెళ్లాలని అనిపించిందేం ఎప్పుడూ లేంది?" అంది లక్ష్మి.

"సాయంత్రం గుడికి వెళ్లాలని పొద్దున్నే అనుకుని ఉంటే, నీతో అని ఉండేవాడిని. అయినా నేనే వెళ్లేది కనకదుర్గ గుడికి కాదు–కొండమీదికి మాత్రమే" అన్నాడు మోహన్ తనూ కూర్చుంటూ.

"లేకపోతే నువ్వు గుళ్లోకి వెళ్లి దేవుళ్లకి దండం పెట్టుకుని వస్తావని నేను భ్రమపడ్డంలేదులే" అంది లక్ష్మి.

"నువ్వు పెట్టే దండాలు చాలుటలే కనకదుర్గకి–నావి అక్కర్లేదందావిడ" నవ్వుతూ అన్నాడు మోహన్.

"మీ డిగ్రీ పరీక్షలు పోస్ట్‌పోన్ అవుతాయటగా, మా కాలేజీలో అనుకుంటున్నారు" అంది మోహన్ పక్కనున్న కుర్చీలో కూర్చుంటూ సుజాత.

"డిసెంబరులో సమ్మె కారణంగా ఓ నెలరోజులు పోయింది కాబట్టి, పరీక్షలు ఓ నెల వాయిదా వెయ్యమని అడుగుతున్నారు స్టూడెంట్ యూనియన్ లీడర్లు. యూనివర్సిటీ

అధికారులు ఒప్పుకోవచ్చునంటున్నారు. పరీక్షలెప్పుడయినా, మా కాలేజీ ఇంకో వారంలో మూసేస్తున్నారు"

"మాదీ మూసేస్తున్నారు ఇంకో నాలుగు రోజుల్లో. సెలవులు మొదలయితే ఇంక నువ్వు వెళ్లక్కర్లేదుగా"

"కాలేజీ మూసేసినా లైబ్రరీ తెరిచే ఉంటుంది. కొందరు లెక్చరర్లు వస్తూ ఉంటారు. అప్పుడప్పుడు వెళ్తుంటాను" అన్నాడు మోహన్.

"ఈ సంవత్సరంతో దాని ఇంటర్ అయిపోతుంది. తర్వాత దానిచేత ఏం చేయిస్తావు?" అంది లక్ష్మి.

"నా చదువు నా ఇష్టం–నాచేత అన్నయ్య చేయించడం ఏంటి? నాకిష్టమైతే డిగ్రీ చేస్తాను. లేకపోతే మానేస్తాను. అది నా ఇష్టం" అంది సుజాత.

"అంత కోపం ఎందుకు తల్లీ–నేనేం మాట్లాడినా నీకు తప్పుగానే వినిపిస్తుంది. మీ నాన్న గారికి చదువు గురించి పట్టించుకునే తీరిక లేదు. నీ చదువు సంగతి మీరిద్దరే ఆలోచించుకోవాలని అలా అన్నాను"

"పరీక్షలవనీ చూద్దాం" అన్నాడు మోహన్.

"రిజల్ట్స్ రానీ చూద్దాం అనా నీ అభిప్రాయం. నేనం ఫెయిలవనులే" అంది సుజాత.

"ఛ–ఛ–అలాంటిదేం కాదు. నాకా అభిప్రాయమే లేదు" అన్నాడు బాధపడుతూ మోహన్.

"నాకది తెలుసులే–ఇంతకీ మీ పరీక్షలు కూడా ఓ నెల ముందుకు జరుగుతాయా?" అంది సుజాత.

"తెలియదు. అయినా పరీక్షలెప్పుడయితేనేం–మనం ప్రిపేరవుతూనే ఉందాం" అన్నాడు మోహన్.

"పరీక్షల డేట్ తెలిస్తేకానీ సీరియస్ ప్రిపరేషన్ మొదలెట్టడం కష్టం"

ఆ మాట నచ్చనట్లు చెప్పసాగాడు మోహన్.

"అవును మరి. చదువు చదువుకోవడంలోని ఆనందం కోసం కాక పరీక్షల కోసం, డిగ్రీల కోసం అయిపోయింది. డిగ్రీలు ఉద్యోగాల కోసం అయిపోయాయి. ఉద్యోగాల కోసమే ఈ చదువంతా అని అనుకుంటే, అది మనల్ని మనం మోసం చేసుకోవడమే. గవర్నమెంటు ఆఫీసులో గుమాస్తా ఉద్యోగానికి, బ్యాంకులో డబ్బు లెక్కపెట్టడానికి ఫిజిక్స్‌లో గోల్డ్‌మెడలిస్ట్‌లెందుకు?

అంత కష్టపడి ఫిజిక్సో, ఎకనమిక్సో చదివినవాళ్లు తమ చదువుకి సంబంధం

లేని ఉద్యోగాల్లో చేరి చదువుని మర్చిపోతున్నారు. ఉద్యోగాలకీ చదువుకీ అక్కర్లేని సంబంధం అంటగట్టి అందరిచేతా డిగ్రీలు చేయిస్తున్నారు. కె.జి. దగ్గర్నుండి ఊపిరి సలపకుండా చదివించెయ్యడం తప్ప, ఈ లోకం గురించి, మన చుట్టూ ఉన్న సమాజం గురించి మనం తెలుసుకునే అవకాశం ఇవ్వడంలేదు. పరిసరాల్ని పుస్తక పరంగా చూడడం నేర్పే ఈ చదువు మనిషికి జీవితాన్ని అన్ని కోణాల్లోంచి చూపే దృక్పథం ఇవ్వడం లేదు.

వీళ్లంతా ఆఫీసులో కూర్చుని దేశ భవిష్యత్తు కోసం ఏం చేస్తారో తెలియదు"

మోహన్ ఆవేశపూరితమైన ఉపన్యాసం సాగుతూనే ఉంది. లక్ష్మి లేచి వీధి గుమ్మంవైపు నడిచింది.

"నాన్నకి రోజూ ఆలస్యం అవుతుందని మనతో అన్నా, అమ్మకి నాన్న వచ్చేదాకా తోచదు చూడు" అంది మోహన్ మాటలకి మధ్యలో అడ్డు వస్తూ సుజాత.

"నీకు నేను బోరు కొట్టిస్తున్నానా ఇలా మాట్లాడుతూ" అన్నాడు మోహన్.

"అలాంటిదేం లేదు. నువ్విలా మాట్లాడుతుంటే ఎంతసేపైనా తెలియకుండా గడిచిపోతుంది. నీ ఉపన్యాసాలు బావుంటాయి కాబట్టే నీకు పోటీలలో బహుమతులు వస్తున్నాయి" అంది సుజాత.

"అక్కడ వేరు. అక్కడ ఉపన్యాసం వినేందుకు వస్తారు జనం. ఇక్కడ నువ్వు తప్పనిసరి శ్రోతవవుతున్నావేమోనని నా భయం".

"ఇంత మొహమాటస్తుడవి-నువ్వెలా బతుకుతావోనని నా భయం" అంది సుజాత నవ్వుతూ.

నవ్వుతూ అన్న ఆ మాటల్లో ఎంతో ఆప్యాయతా, ప్రేమా ధ్వనించాయి మోహన్‌కి.

అతనికి తెలియకుండా కళ్లనీళ్లు తిరిగాయి.

"ఇంత సెన్సిటివ్‌గా ఉండకూడదు" అంటూ అతని చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంది సుజాత.

"ఇంకొకరి బాధలు భరించలేనట్లే, నేను మరొకరి ప్రేమను కూడా భరించలేను. మొదటిదాని వల్ల నా మనస్సు బాధతో బరువెక్కుతుంది. రెండవదాని వల్ల నా మనస్సు ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతుంది. ఈ రెండింటిలో ఏది జరిగినా నా కళ్లలో నీళ్లు వస్తాయి" అన్నాడు కళ్లు తడుచుకుంటూ మోహన్.

"నాన్నగారొస్తున్నారు" అంటూ ఇంట్లోకి వచ్చిన లక్ష్మి ఇద్దరివైపూ చూసి " అలా ఉన్నారెందుకు" అని అడిగింది.

"ఏం లేదు" అంటూ లోపలి గదిలోకి నడిచాడు మోహన్.

"ఆలస్యమైపోయింది" అంటూ నెమ్మదిగా నడుస్తూ వచ్చి కూర్చున్నాడు నారాయణమూర్తి.

"ఈ మాట నువ్వు రోజూ అనేదేకానీ–ఒక్క రోజయినా నీకు ఆఫీసులో పని లేకుండా ఉండదా?" అని అడిగింది సుజాత, నారాయణమూర్తి చేతిలోంచి బ్యాగ్ అందుకుని అల్మారాలో పెడుతూ.

"ఆఫీసుల్లో అందరూ పనిచెయ్యరమ్మా. మా ఆఫీసనేకాదు–ఏ ఆఫీసయినా అంతే. ఇరవై శాతం జనం ఎనభైశాతం పనిని చేస్తారు. దీన్నే 80–20 ప్రిన్సిపుల్ అంటారు. ప్రపంచంలో చాలా చోట్ల ఈ 80–20 ప్రిన్సిపులే నడుస్తోంది. మనదేశంలోనే చూడు– ఇరవై శాతం జనం ఎనభై శాతం సంపదను అనుభవిస్తున్నారు, ఇలా చాలా చోట్ల చెప్పు కోవచ్చు".

"నువ్వు కూడా ఎనభై శాతంలోనే ఉండవచ్చు కదా"

"అందరూ అలా అనుకుంటే దేశం గతి ఏమవుతుంది?"

"నువ్వు ఆఫీసులో పొద్దున్న నుండి సాయంత్రం దాకా పనిచేసే ఉంటావు. ఆఫీసు మూశాక కూడా ఇంకా నువ్వు పని చెయ్యకపోతే, దేశానికి వచ్చే నష్టం ఏంటి నాన్నా?"

"ఇవన్నీ ఇప్పుడెందుకులేమ్మా? నేను ఎంత పని చెయ్యగలిగితే అంత పనీ చెయ్యాలన్నది నా అభిప్రాయం. చిన్నప్పట్నుంచీ నాకదే అలవాటు. అది ఈ రోజు పోదు. అభిప్రాయాలూ, అలవాట్లూ శరీరంలానే మనల్ని వదిలిపోవు–చచ్చేంతవరకు"

"హాల్లో కూర్చుని హాయిగా కబుర్లు చెప్పుకోక చావుల గురించి మాట్లాడతా రెందుకు? మీకసలు ఎప్పుడు, ఎవరితో ఏం మాట్లాడాలో తెలియదండీ" అంది లక్ష్మి కోపంగా.

"నాకు తెలియదు కనకనే పిల్లల మంచి చెడ్డలన్నీ నీమీదే వదిలేశాను."

"నాకో చదువా, ఉద్యోగమా? నేనేం చూళ్లేను"

"మోహన్ ఏం చేస్తున్నాడు–చదువుకుంటున్నాడా?"

"లేదు నాన్నా–నేనూ ఇప్పుడే వచ్చాను ఇంటికి–కనకదుర్గ గుడికెళ్లి" అన్నాడు మోహన్ హాల్లోకి వస్తూ.

"పరీక్షలు వాయిదా వెయ్యాలని గొడవ చేస్తారటగా" అన్నాడు నారాయణమూర్తి విషయం తెలుసుకోవాలన్నట్లు.

"ముందుగా వి.సి.తో సంప్రదింపులు చేస్తున్నారు యూనియన్ లీడర్లు. అవి ఫెయిలయితే ఆందోళన చేస్తారట"

"వాయిదాలెందుకు? డిసెంబర్‌లో చేసిన సమ్మె కారణంగా పాఠాలు పోయాయనేనా? అసలు పాఠాలు పోయిందే వాళ్ల సమ్మె వల్ల కదా? మళ్లీ ఆందోళన ఎందుకు? ఇలాంటి గొడవల్లో పడి చదువు పాడుచేసుకోవద్దు"

"అన్నయ్య చదువు పాడుచేసుకోవడం ఏంటి నాన్నా? యూనివర్సిటీ గోల్డ్‌మెడల్ కొట్టేస్తాడు. చూస్తుండు" అంది సుజాత.

"అన్నయ్య సంగతి సరే–నీ సంగతి ఏంటి?" అన్నాడు నారాయణమూర్తి.

"తనూ బాగా చదువుతోంది నాన్నా. ఇంటర్ తర్వాత ఇంజనీరింగ్ ఎంట్రన్స్ రాయనియ్యండి. పాసయితే ఇంజనీరింగ్ చదువుతుంది" అన్నాడు మోహన్.

"మీ చదువులు మీ ఇష్టం. ఇంటర్ అయ్యాక ఇంజనీరింగ్ చెయ్యను, ఎకనిమిక్స్ బి.ఎ. చేస్తానని నువ్వంటే వద్దన్నానా నేను? మీ మానాన మీరు ఆలోచించుకుని ఏం చెయ్యాలో తెలుసుకోగలిగితే అంతకన్నా నాకు కావల్సింది లేదు. అన్నిటికన్నా మనిషికి ముఖ్యంగా కావల్సింది–స్వయంగా ఆలోచించుకుని నిర్ణయాలు తీసుకునే కెపాసిటీ. అది మీకు రావాలని నా కోరిక. మీ అమ్మని చూడండి. ఏ పూట ఏ కూర వండాలో మిమ్మల్నో, నన్నో అడుగుతుంది" అన్నాడు నారాయణమూర్తి.

"నేను స్వయంగా నిర్ణయించుకోనట్లే మీ నాన్నానూ. ప్రతిరోజూ ఆఫీసుకి ఆయన వేసుకెళ్లే డ్రెస్ నేను తీసిపెట్టాల్సిందే" అంది లక్ష్మి.

అందరూ హాయిగా నవ్వేసుకున్నారు.

అలా హాయిగా నవ్వుకుంటూ కాలం గడపగల కుటుంబాలు చాలా తక్కువ.

కానీ, అలాంటి కుటుంబాల్లో కూడా కష్టాలు రావచ్చు.

పరిస్థితుల ప్రభావం వల్ల కన్నీళ్లు చోటుచేసుకోవచ్చు.

అలా సుఖఃదుఖాలు, సంతోష విచారాలు ఒకదాని తర్వాత ఒకటి రావడం చూసినవాళ్లే విధిని నమ్మడం మొదలెట్టి ఉంటారు.

## 2

తన ఇంటి ముందున్న గార్డెన్‌లోని ఉయ్యాలలో కూర్చుని ఆరున్నరకి వస్తానన్న మోహన్ కోసం ఆరింటి నుండి ఎదురుచూడ్డం మొదలెట్టింది కళ్యాణి.

పొద్దున్న కాలేజీకి వెళ్తూ కనిపించినప్పుడు సాయంత్రం వస్తానన్నాడు మోహన్. చెప్పిన సమయానికి తప్పకుండా రావడం మోహన్ అలవాటు. అతను వస్తానన్న సమయానికి ముందు నుంచే ఎదురుచూడ్డం కళ్యాణి అలవాటు. అలా ఎదురుచూస్తూ మోహన్ గురించి ఆలోచించుకుంటూ కాలం గడపడంలో చాలా ఆనందం ఉంది కళ్యాణికి.

ఇప్పుడూ అదే పని చేస్తోంది.

మోహన్‌ని తను ప్రేమిస్తోందేమో తెలియదు. తను మోహన్‌తో కానీ, మోహన్ తనతో కానీ 'నిన్ను గాఢంగా ప్రేమిస్తున్నాను' లాంటి డైలాగులు చెప్పుకోలేదు. అసలీ

సినిమా ప్రేమల గురించి తమ ఇద్దరికీ చులకనభావమే. సినిమా ప్రేమల గురించే కాదు– అసలు సినిమాల గురించి తనకి సదభిప్రాయం లేదు.

ఈ సినీ మాయా గారడీలో పడికొట్టుకుపోతున్నారు ప్రజలంతా. సినిమాల నిండా పచ్చి శృంగారమే. శృంగారం కాకపోతే పగ తీర్చుకోడాలు, చంపుకోడాలు. నవలలూ అంతే. ఇలాంటి సినిమాల, నవలల ప్రభావంతో నేటి యువత దారీ తెన్నూ తెలియకుండా రకరకాల మానసిన ఆందోళనలకి లోనవుతున్నారు. దాంతో సమాజంలో ఆందోళనలు లేవదీస్తున్నారు. ఈ పరిస్థితికి చేరుకున్న ఈ సమాజానికి విముక్తి లేదా?

ఈ ప్రశ్నే తన్నీ, మోహన్నీ కలవరపరుస్తోంది. అసలిలాంటి భావాలే ఇద్దరినీ దగ్గర చేశాయి. దానికి తోడు ఇద్దరికీ డిబేట్లలో పాల్గొనడం అలవాటేమో–ఒకరినొకరు కలుసుకుందుకు అవకాశం కలిగింది, ఇద్దరూ వేర్వేరు కాలేజీవాళ్లయినా. అలా చాలాసార్లు కలుసుకోవడంతో ఒకరి విషయాలు ఒకరు తెలుసుకోవడం, ఇద్దరూ ఒకరికొకరు దగ్గరవడం జరిగింది.

"ఏంటి ఆలోచిస్తున్నావ్?" అంటూ ఉయ్యాల ముందున్న గార్డెన్ చెయిర్‌లో కూర్చుంటూ మోహన్ అంటుంటే, ఈ లోకంలోకి హఠాత్తుగా వచ్చినట్లు చూసి, మోహన్ పక్కనున్న కుర్చీలో కూర్చుంది కళ్యాణి.

ఉదయమే లేచి అరగంటపైగా ఎక్సర్‌సైజ్ చెయ్యడం వల్ల సన్నగా, దృఢంగా అయిన శరీరం కళ్యాణిది. అయితే ఆ దృఢత్వంలో నాజూకుతనం ఏమాత్రం తగ్గలేదు.

ఇరవై ఏళ్లు నిండుతున్న కళ్యాణి ఇరవై ఏళ్ల పిల్లలానే ఉంటుంది–వయస్సుకి సరిపోయినట్లు పెరుగుతూ.

కళ్యాణి కంఠంలో–శరీరంలోలాగానే–దృఢత్వం, నాజూకుతనం కలిసిపోయాయి. ఎక్కడో మోగుతున్న సితార్ లాలిత్యం, పక్కనే సాగుతున్న నాదస్వర గాంభీర్యం కలిసి వినిపిస్తాయి కళ్యాణి మాట్లాడుతుంటే. వింటేనే తప్ప ఇలాగుంటుందని ఊహించలేని కంఠస్వరం కళ్యాణిది.

"మీ గురించి ఆలోచిస్తున్నా. ఇంకా సరిగ్గా చెప్పాలంటే మన గురించి ఆలోచిస్తున్నా" అంది కళ్యాణి.

లోపల్నుండి పనిమనిషి ట్రే తీసుకొచ్చి, వాళ్ల దగ్గరకో చిన్న బల్లను లాగి బల్లమీద ట్రే ఉంచి వెళ్లిపోయింది.

చిన్న చిన్న లతల డిజైన్ ఉన్న నీలిరంగు పింగాణీ కెటిల్‌లోంచి, అదే డిజైనున్న కప్పులోకి టీ నీళ్లు ఒంచి, అందులోకి మరో గిన్నెలోంచి పాలు ఎక్కువగా పోసి, పంచదార రెండు చెంచాలు కలిపి మోహన్‌కిచ్చింది కళ్యాణి. మరో కప్పులోకి అర చెంచా పంచదార

వేసుకుని, టీ నీళ్లు నిండా పోసుకుని, చెంచాతో ఓసారి కలిపి తాగడం మొదలెట్టింది.

"పాలు పోసుకోలేదు. పంచదార తక్కువగా వేసుకున్నావు. చేదుగా అనిపించడం లేదా?" అని అడిగాడు మోహన్.

"నా మనస్సులోనే ఉంది చేదు. లోపలంతా ఏదో అలజడి, అశాంతి" అంది కళ్యాణి టీ తాగుతూనే.

"అశాంతి నాలోనూ ఉంది. అంతేకాదు. నాలో ఉన్న అశాంతికి కారణం తెలియదు కూడా" అన్నాడు మోహన్.

"కారణం తెలిస్తే ఇంక అశాంతి లేదు. అది తెలియనంతవరకే అశాంతి"

"కాదు. కారణం తెలిసినా మనం ఏమీ చెయ్యలేని అసహాయ స్థితిలో ఉంటే మిగిలేది అశాంతే"

"మన చుట్టూ ఉన్న పరిస్థితుల్ని మనం నిశ్చయంగా మార్చలేమని తెలిసినప్పుడు మనం అశాంతితో గడపడంలో అర్థం లేదు. మనం చుట్టూ ఉన్న పరిస్థితులకి అనుగుణంగా మారాలి. ఇది జీవించడానికి నేర్చుకోవాల్సిన మొదటిపాఠం. మన మనస్సులో ఉన్న దానికీ, మన చుట్టూ ఉన్నదానికీ భేదం ఉండకూడదు. సాధ్యమైనంతవరకు చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మార్చాలి. కాకపోతే మనం మారాలి"

"అదే అసలు సమస్య కళ్యాణీ! మనం దేన్ని మార్చగలం? దేన్ని మార్చలేం? ఈ విషయం తెలియదు మనకి. మనకు అంతకు ముందున్న అనుభవంతో, అందువల్ల కలిగిన అవగాహనతో పరిస్థితుల్ని అంచనా వేస్తాం. ఒక్కొక్కరి అనుభవం వేరు. అంతేకాదు, ఒకే అనుభవంలోంచి ఒక్కొక్కరికి కలిగే అవగాహన వేరు. అది అంతకు ముందున్న అనుభవాల మీదో, మరింకేదో విషయం మీదో ఆధారపడి ఉంటుంది. అందుకే ఎందరో రాజులు రాజ్యాలు ఏలినా కొందరి పేర్లే చరిత్రలో మిగిలాయి. తక్కినవాళ్లు అసాధ్యం అని అనుకుని వదిలేసినవి వాళ్లు సాధ్యం అని సాధించారు. సాధించలేమనుకోవడం ఓ బలహీనత"

"అన్నీ సాధించగలం అనుకోవడం కూడా ఓ బలహీనతే. అలా అనుకుని మొదలెట్టినవారంతా ఏం చెయ్యగలిగారు?"

"సాధించడం, సాధించలేకపోవడం ఆ మనిషికి మాత్రం సంబంధించినవి కావు. అవి ఎన్నో పరిస్థితుల వల్ల, మరెన్నో శక్తుల ప్రభావం వల్ల జరుగుతాయి. సమస్య అది కాదు. అసలు సాధించగలుగుతామా లేదా అన్నది ఏ విషయంలోనయినా ఎలా తెలుస్తుంది? అది తెలిస్తే ఇంక గొడవ లేదు. దేనికోసం ప్రయత్నించవచ్చు. దేనికోసం ప్రయత్నించక్కర్లేదు అన్నది తేలిపోతుంది"

"ఈ ప్రశ్నని ప్రతిమనిషి తనకు తానే వేసుకోవాలి. వేసుకున్న తర్వాత బాగా

ఆలోచించుకుని సమాధానం చెప్పుకోవాలి. సమాధానం తెలుసుకున్నాక–తను చెయ్యగల ననుకుంటే, అది సాధించేందుకు అన్ని ప్రయత్నాలు చెయ్యాలి. అలా కాక అది తనవల్ల కాదనుకుంటే, తన్ని తాను సమాధానపరుచుకోవాలి. సాధ్యాసాధ్యాలు తెలుసుకున్న మనిషి నిజమైన జ్ఞాని అవుతాడు. లేకపోతే కొండను ఢీకొనే పొట్టేలయినా అవుతాడు. ఏ పనీ చెయ్యని పిరికిపందయినా అవుతాడు"

"ఆ జ్ఞానం నీకు ఉంది కళ్యాణి"

"నీకెలా తెలుసు?"

"అని నాకు అనిపిస్తోంది. అలా అనిపించడం ఊరికే కాదు. నా ప్రతి రక్తపు బొట్టులోనూ కళ్యాణికా జ్ఞానం ఉందని అనిపిస్తోంది. అలాంటి జ్ఞానం నాకు ప్రసాదించవూ?" అడిగాడు మోహన్.

"అలా ప్రసాదించడానికి నేనం దేవతను కాను. ఒకవేళ నువ్వలా అనుకున్నా, వరాలిచ్చే దేవత నుండి వరాలు కోరుకుందుకు, దేవతని ప్రసన్నం చేసుకోవాలి. అది చెయ్యి ముందు" అంది కళ్యాణి.

"ఏం చెయ్యమంటావో చెప్పు" అన్నాడు మోహన్.

"దేవతని ఎలా ప్రసన్నం చేసుకోవాలో తెలుసుకుని చేసుకోవాల్సింది భక్తుడే. దేవతలు చెప్పరు" అంది కుర్చీ అంచుకి తల వాలుస్తూ.

కళ్యాణి అలా తల వెనక్కి వాల్చుకు కూర్చోడంలో–

ఎత్తుగా కొనదేలిన ముక్కూ, చుబుకం నుండి కిందకి సన్నగా సాగిన మెడా, తల నుండి నేలమీదకి జారుతున్న జడా–అందంగా కనిపించాయి మోహన్‌కి.

"సామాన్యంగా దేవతలు నగలకో, చీరలకో, పువ్వులకో తృప్తిపడతారు. ఎంతో ధనవంతురాలైన ఈ దేవతకు ఈ పేద భక్తుడు ఏమి సమర్పించుకోగలడు?" అన్నాడు మోహన్.

"నాతో నిరంతరం ఉంటానని అనవూ?' అని కళ్యాణి అందామనుకుంటుండగా–

"భోజనం సిద్ధమైంది" అని చెప్పింది అక్కడికొచ్చిన పనిమనిషి.

"నేనింటికి వెళ్తాను" అంటూ లేవబోయాడు మోహన్.

"ఇక్కడ భోంచేసి వెళ్లు. నీ కోసమే తొందరగా వండెయ్యమన్నాను" అంది కళ్యాణి అతను వెళ్లిపోకుండా అడ్డు నిలుస్తున్నట్లు లేస్తూ.

"మా ఇంట్లో సంగతి తెలిసే ఆ మాట అంటున్నావా? ఏ రాత్రయినా నేను భోజనానికి ఇంటికి వెళ్లకపోతే, తక్కినవాళ్లకి అభోజనం కింద లెక్కే. ఏదో కూర్చుని లేస్తారు. మా చెల్లెలయితే చెప్పక్కర్లేదు. ఒక్కోసారి ఏడుస్తుంది. అందుకే నన్నొదిలెయ్యి"

"కారు డ్రైవర్ని పంపి నువ్వు రావడం లేదని చెప్పిద్దాం. ఇంక కంగారుపడరు" అంది డ్రైవర్ని పిలవడానికి చూస్తూ.

"కంగారుపడేది వాళ్లే కాదు కళ్యాణీ–నేను కూడా. ఇంట్లో అమ్మ వడ్డించే పచ్చడి మెతుకులు నయం నాకు. ఏమీ అనుకోకు–నువ్వు నాకోసం తయారుచేయించిన గ్రాండ్ డిన్నర్ తినడం లేదని"

"మోహన్. నువ్వలా లేనివాడిలా మాట్లాడకు. మనుష్యుల మధ్య స్నేహానికి డబ్బు అడ్డు కాకూడదు. డబ్బు వల్ల జీవితానికి ఎన్నో సుఖాలు వస్తాయన్నది నిజమే కానీ, డబ్బే జీవితం కాదు. ఒకరినొకరు అభిమానించుకోవడం, కలిసి కష్టసుఖాలు పంచుకోవడం, అందులో ఉన్న ఆనందం నాకూ తెలుసు. అవును– నీకోసం మీ ఇంట్లో ఎదురు చూస్తుంటారు. నాకోసం చూసేందుకు మా అమ్మ లేదు. ఆ లోటు నాకీ రోజు కొత్తగా తెలుస్తున్నది కాదు. నా చిన్నప్పట్నుంచీ ఉంది ఈ లోటు. నాకేదో ఇంత డబ్బున్నట్లు కనిపిస్తోంది కానీ– నీకు తెలుసా– ఈ డబ్బు సంపాదించడం కోసమే నాన్న ఈ ఇంటిని పట్టించుకోవడం లేదు. ఆయన అలా పట్టించుకోకపోవడం వల్లనే అమ్మ పోయిందని నా నమ్మకం. ఆయనకి మా మీద ప్రేమా, అభిమానం లేవని కాదు. అయితే డబ్బు మాయలో పడ్డవాళ్లకి తక్కిన వాటికి సమయం ఉండదు. అది వదిలెయ్యి. నీకు ఇక్కడ భోంచెయ్యడం ఇష్టం లేకపోతే బలవంతం లేదు. కలిసి భోంచేద్దామనుకున్నాను. అంతే. తినకపోతే పరవాలేదు కానీ– కొంచెంసేపు కూర్చుని వెళ్లు"

"ఇక్కడ తినడం లేదని ఏమీ అనుకోకు. అలానే ఉండడం లేదని కూడా. ఇంక నేను వెళ్తాను. ఇంట్లోవాళ్లు ఎదురుచూస్తుంటారు" అంటూ కదిలాడు మోహన్.

"ఈసారి సుజాతని కూడా తీసుకురా. ఎక్కువసేపు కూర్చోవచ్చు" అంది గేట్ దాకా వస్తూ కళ్యాణి.

మోహన్ సందు తిరిగేదాకా చూసి, గార్డెన్ మధ్యనున్న దారిమీద మేడవైపు నడవడం మొదలెట్టింది కళ్యాణి, ఇంట్లోని ఒంటరితనం గురించి ఆలోచించుకుంటూ.

# 3

మోహన్ ఇంటికి చేరేసరికి ఇంటి గుమ్మం దగ్గర నిలబడి కబుర్లు చెప్పుకుంటున్నారు లక్ష్మి, నారాయణమూర్తి. అమ్మా నాన్నలిద్దరూ అలా కబుర్లు చెప్పుకోవడం చూసేడప్పుడల్లా ఎంతో ఆనందంగా ఉంటుంది మోహన్‌కి. తన స్నేహితుల దగ్గర విన్నప్పుడు–భార్యాభర్తలంటే ఎప్పుడూ దెబ్బలాడుకునేవాళ్లుగా అనిపిస్తుంది. అయితే తమ ఇంట్లో ఏదో సరదాకి ఒకరినొకరు అనుకోవడం తప్ప దెబ్బలాడుకోడం లేదు అమ్మానాన్నల మధ్య.

"కళ్యాణి వాళ్లింటికి వెళ్తున్నానని నువ్వు చెప్పినప్పుడే అనుకున్నా-బాగా ఆలస్యమవుతుందని" అంది లక్ష్మి మోహన్ ఇంటి గుమ్మం దగ్గరకు చేరేసరికి.

"వాడింట్లోకి ఇంకా రాలేదు- అప్పుడే ఆలస్యమైందని అడుగుతున్నావా? ఏం తల్లివే నువ్వు" అన్నాడు నారాయణమూర్తి లోపలికి నడుస్తూ.

"అవును- వాణ్ణి చిన్నప్పట్నుంచి చూసి వాడి అవసరాలన్నీ తీర్చింది మీరే కదా- అందుకే వాడికి తల్లీ తండ్రీ రెండూ మీరే" అంది లక్ష్మి ఆయన వెనకే నడుస్తూ.

"అసలు వాళ్లింట్లోనే భోజనం చెయ్యమంది కళ్యాణి. నేనే ఇంకా ఆలస్యం అవుతుందని తినకుండా వచ్చేశాను" అన్నాడు మోహన్ అమ్మ పక్కనే నడుస్తూ.

"మంచి పని చేశావు. ఇంతకీ ఏం మాట్లాడుకున్నారేం ఇద్దరూ? దేశంలో దరిద్రులెందరున్నారూ, వాళ్లని ఉద్ధరిచడం ఎలాగనేనా?" అంది లక్ష్మి.

"ఆ పని వాళ్లు పూర్తిగా కాకపోయినా కొంతయినా చెయ్యగలిగితే ఎంతో గర్వించాలి మనం లక్ష్మీ. మనుషులందరూ తమ స్వార్థం చూసుకుంటే ఎలా? సమాజంలో లేనివారి కష్టాలని ఉన్నవాళ్లు తీర్చేందుకు ప్రయత్నించాలి" అన్నాడు నారాయణమూర్తి.

"మీరూ అంతే. తక్కినవాళ్లెవ్వరికీ లేని బాధ మనకి మాత్రం ఎందుకు?"

"ఎవరికి వాళ్లు తక్కినవాళ్లెవ్వరూ చెయ్యడం లేదనుకుంటే, ఎవ్వరూ ఏమీ చెయ్యరు. తక్కినవాళ్ల సంగతి మనకి అనవసరం. నువ్వు ఎవరికెంత సాయం చెయ్యగలవో అంతా చెయ్యి. అలా ఎంతమంది ప్రయత్నం చేస్తే అంత మంచిది. కొందరలా చేసేవాళ్లుండబట్టి సమాజం ఈ మాత్రమైనా నడుస్తోంది"

"మీరు పాతకాలం మాటలు చెప్తున్నారు. ఎప్పుడో స్వాతంత్ర్యం రావడానికి ముందరయితే ఈ మాటలకి అర్థం ఉండేది. అప్పుడు పరాయి పాలనని పారద్రోలడానికి ప్రజలంతా కలసికట్టుగా పోరాడి స్వరాజ్యం తెచ్చుకున్నారు. ఇప్పుడలా కాదు. ఎవరి జీవితం వాళ్లది. ఎంత సంపాదించుకుని దాచుకోగలమన్నదే ముఖ్యం. డబ్బే అన్నిటికన్నా ప్రధానం ఈ రోజుల్లో. మీరేదో త్యాగాల మాటలతో పిల్లల్ని చెడిపోనివ్వకండి. మిగతా అందరు పిల్లలూ ఎలాగున్నారో వాళ్లనీ అలానే ఉండనివ్వండి"

"ఇలానే ఉండండి అని పిల్లలకి నేనెప్పుడూ చెప్పలేదు. ఇప్పుడూ చెప్పడం లేదు. అయితే ఓ విషయం గుర్తుంచుకో లక్ష్మి. అరవై ఏళ్ల క్రితం అయినా, ఈ రోజయినా, మరో వంద ఏళ్ల తర్వాతయినా- కొందరు మనుషులు నలుగురి కోసం బతుకుతారు. కొందరు నలుగురి మీద బతుకుతారు. చాలామంది తటస్థంగా గడిపేస్తారు. స్వతంత్ర్య పోరాట సమయంలో కూడా చాలామంది భారతీయులు బ్రిటీషు వాళ్ల పక్కనే ఉన్నారు. స్వార్థం అప్పుడూ, ఇప్పుడూ ఉంది. అయితే అప్పుడు దేశంలోని ప్రజలందరికీ ఓ ఆశయం ఉండేది-

భారతదేశానికి స్వరాజ్యం రావాలని. స్వరాజ్యం వచ్చాక అలాంటి 'గోల్' ఏదీ కనిపించలేదు. అలా చూపించే నాయకుడు లేడు. నిజానికి దేశంలోని దారిద్ర్య నిర్మూలనో, నిరక్షరాస్యత నిర్మూలనో యుద్ధ ప్రాతిపదికమీద చేపట్టే నాయకుడు– రాజకీయనాయకుడు కాదు, సిన్సియర్ నాయకుడు– వస్తే మళ్లీ ప్రజలంతా కలసికట్టుగా పనిచేసి ఆ పని సాధిస్తారు.

ఆ పనులు యువతీ యువకులు చేపట్టాలి. దేశ భవిష్యత్తు వాళ్లమీదే ఆధారపడి ఉంది. అయితే యువకులేం చేస్తున్నారు? సినిమాల్లో, నవలల్లో మునిగిపోతున్నారు. అంటే నవలలు చదవడం, సినిమాలు చూడడం తప్పనికాదు. అయితే అదేలోకంగా బతకడం మంచిది కాదు. ఇంతకీ ఆ నవలలూ, సినిమాలూ అందిస్తున్నవేమిటి– కలలు. అవును లక్ష్మి–ఇవేగా ఈ కాలం సినిమాల్లో ఉన్నవి. చదువుకుంటున్నవాళ్లు, చదువుకోనివాళ్లు అందరూ ఈ పిచ్చిలోనే ఉన్నారు"

నారాయణమూర్తి మాటలకి మధ్యలో అడ్డొస్తూ అంది లక్ష్మి– "ఇంక చాల్లెండి మీ ఉపన్యాసం. నోరెత్తితే చాలు అందరూ ఉపన్యాసాలే. కాస్త పిల్లే నయం, మామూలుగా మాట్లాడుతుంది"

"ఏంటి నాన్నా– నేనూ, అన్నయ్యా దేశానికి ఏం చెయ్యలేదంటున్నారు కదూ?" అంది లోపలి గదిలోంచి వస్తూ సుజాత.

"మీరంటే మీ ఇద్దరే కాదమ్మా. మీ వయసువాళ్లు అందరూనూ" అన్నాడు నారాయణమూర్తి.

"అదే మేమందరమూనే– అసలు చెయ్యాల్సిందేమిటి?" అంది సుజాత.

"చెయ్యాల్సింది భోజనం" అంది లక్ష్మి. అంటూ లోపల గదిలోకి నడుస్తూ– "మీరీ మాటల్లో పడితే ఇంక భోజనం సంగతి మర్చిపోతారు. రండి భోంచేస్తూ మాట్లాడుకుందురుగాని" అంది.

సుజాతా, మోహన్ కంచాలు, నీళ్ల గ్లాసులు పెడుతూంటే అందరికీ వడ్డించడం మొదలెట్టింది లక్ష్మి.

''ఏం చేశారీపూట వంట?'' అంటూ కంచం ముందు కూర్చున్నాడు నారాయణమూర్తి.

"దోసకాయ పప్పు, అరటికాయ కూర , గోంగూర పచ్చడి, చారు, వడియాలు– చాలా ఇంకా ఏదన్నా కావాలా?" అంది లక్ష్మి కంచంలో పప్పు కలుపుకుంటూ.

"నువ్వు చేసిన దోసకాయ పప్పు ఉండగా ఇంకా ఏదన్నా కావలిసి రావడం ఏమిటి– కాస్త నెయ్యి వెయ్యి" అన్నాడు నారాయణమూర్తి.

కంచంలో అన్నం కలపకుండా కూర్చుని ఉన్న మోహన్‌ని చూసి–

"ఏంటన్నయ్యా ఆలోచిస్తున్నావు. కళ్యాణి వాళ్లింట్లో అరెకరం వైశాల్యం ఉన్న రోజ్‌ఉడ్ బల్లమీద వెండి కంచాల్లోని పంచభక్ష్య పరమాన్నాలు వదిలేసుకుని వస్తే, ఈ తిండి ఏమిటా అనా" అంది సుజాత.

"నువ్వెప్పుడూ అలాంటి మాటలనకు. వాళ్లింట్లోది వదిలేసుకు రావడమేంటి? అది వాళ్లిల్లు. ఇది మనిల్లు. మనింట్లో మనం ఏం చేసుకుంటే అది తింటాం. అయినా అమ్మ చేతి వంట రుచి ఇంకెక్కడా ఉండదు" అన్నాడు మోహన్.

ఆ మాటలకి ఆనందిస్తున్నట్లు నవ్వుకుంటూ అంది లక్ష్మి– "ఇంతకీ సుజాత అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పలేదు. ఎందుకు అదోలా ఉన్నావు?"

"మా క్లాసులో సుందరం అని ఓ బీద విద్యార్థి ఉన్నాడని చెప్తుంటాను చూశావా– వాడు నాలుగు రోజుల్నుండి కనపడ్డంలేదుట. ఈ రోజే వాళ్లమ్మ కాలేజీ గేట్ దగ్గర కొచ్చి వాడెక్కడున్నాడో తెలుసా అని మమ్మల్ని అడగడానికి వచ్చారు. ఇలా కూర్చుని హాయిగా భోంచేస్తోంటే, వాడూ వాళ్లమ్మా గుర్తొచ్చారు– కళ్యాణి ఇంటి భోజనం కాదు" అన్నాడు మోహన్ గొంతు కాస్త వణుకుతుంటే.

"నువ్వింకేదో విషయం ఆలోచిస్తున్నావని తెలియక సరాదాగా అన్నానన్నయ్యా– ఛ– నువ్వేదో తిండి కోసం బాధపడుతున్నావని నేననుకుంటున్నానని ఎలాగనుకున్నావు? ఊరుకో. సుందరం పరీక్షలకి ఫీజు లేకపోతే ఓ నెల రోజుల క్రితం నువ్వే కదా చందాలు వసూలుచేసి కట్టానని చెప్పావు. అసలేమయిందో తెలిసిందా?" అంది సుజాత తినడం ఆపేసి.

"అసలేం జరిగిందో స్పష్టంగా తెలియదు కానీ– సుందరం రాజకీయాల్లో చేరాడనుకుంటున్నారు కాలేజీలో. అంతకు ముందు పదిరోజుల నుండి సాయంత్రం కాలేజీలో జరిగే మీటింగులకి వెళ్తున్నాడట.

"మీటింగులేంటి" అంది లక్ష్మి మోహన్ మాటలకి అడ్డొస్తూ.

"సమాజంలో జరుగుతున్న అన్యాయాల గురించీ, వాటిని నిర్మూలించేందుకు మార్గాల గురించీ ఆలోచించేందుకు విద్యార్థులు మరి కొందరితో కలిసి సాయంత్రాలు మీటింగులు పెట్టుకుంటున్నారు. అక్కడకి అలాంటి భావాలు ఉన్నవారే వెళ్తారు" అన్నాడు మోహన్.

"నీకీవిషయాలన్నీ ఎలా తెలుసు?" అని అడిగింది లక్ష్మి మోహన్‌వైపు వింతగా చూస్తూ.

"నేను కూడా అప్పుడప్పుడు వెళ్తుంటాను కాబట్టి" అన్నాడు మోహన్.

"నువ్వు ఆ మీటింగులకి వెళ్తున్నావా?" అంది లక్ష్మి ఎంతో కంగారుపడుతూ.

"అవి ఒట్టి మీటింగులేనమ్మా–" అన్నాడు మోహన్ నవ్వేస్తూ

నారాయణమూర్తి అడిగాడు మోహన్‌ని–

"అయినా అలాంటి మీటింగులకి మనమెందుకు వెళ్ళడం? ఇంకో విషయం నాకు అర్థం కాలేదు. ఆ మీటింగులకి ఆ భావాలున్న వాళ్ళే వెళ్తారన్నావు. అంటే నీకూ ఆ భావాలున్నట్లేనా?"

ఎవ్వరూ కంచాల్లోంచి ముద్దలు తియ్యడం లేదు. మోహన్ ఏం చెప్తాడా అని చూస్తున్నారు ముగ్గురూ. మోహన్ చెప్పడం మొదలెట్టాడు.

"మన కళ్ళెదురుగుండా చాలా అన్యాయాలు, అక్రమాలు జరుగుతున్నాయి. డబ్బు ఉన్న వర్గం, డబ్బు లేని వర్గాన్ని దోచేస్తున్న మాట నిజమే. పల్లెటూళ్ళలో భూస్వాములు వ్యవసాయదారుల శ్రమనీ, నగరాల్లో ఇండస్ట్రియలిస్ట్‌లు కార్మికుల శ్రమనీ తమ డబ్బుగా మార్చుకుంటున్నారు. లేనివాడి శ్రమ ఉన్నవాడి డబ్బుగా మారుతుందన్నాడు మార్క్స్. అందులో అబద్ధం కనిపించడంలేదు.

నిజాయితీగా ఆలోచించేవాడెవ్వడూ ఈ దోపిడీ ఇలానే సాగాలని అనుకోడు. చాలామంది కష్టపడి తయారుచేసినదాన్ని కొందరు అనుభవించడం సరయిన పద్ధతి కాదు. అయితే ఈ అసమానతలకి కారణం పెట్టుబడిదారీ విధానం అనీ, సమాజంలోని ఆస్తి ఏ ఒక్కరికీ స్వంతం కాకుండా సమాజంలోని అందరూ ఆస్తికి భాగస్వాములై కలసికట్టుగా పనిచేస్తే ఈ అసమానతలు పోతాయని అన్నాడు మార్క్స్. అలా అవడమే కాకుండా అది చారిత్రక అనివార్యత అంటూ సమసమాజం తప్పకుండా వస్తుందన్నాడు. అలాంటి సమసమాజం లేనివాళ్ళు ఉన్నవాళ్ళ మీద సాగించే పోరాటంలోంచి వస్తుందన్నాడు.

పోరాటం సమసమాజాన్ని స్థాపించగలదో లేదో తెలియదు. స్థాపించేందుకు అవకాశం ఉందేమోనని నా ఊహ. లేదని కళ్యాణి ఆలోచన"

"కళ్యాణి కూడా మీ మీటింగులకి వస్తుందా?" అంది లక్ష్మి.

"వస్తుంది. కళ్యాణికి కూడా నాలానే వాళ్ళు మాట్లాడే విషయాలు తెలుసుకోవాలన్న కోరిక ఉంది. వాళ్ళ కార్యక్రమాల్లో ఎంతో తీవ్రంగా పాల్గొనే అమ్మాయిలు ఎందరో ఉన్నారు. ఒక్కోసారి వాళ్ళే అబ్బాయిల కన్నా కూడా ఉద్రేకంగా ఉంటారు".

"కళ్యాణికి కూడా ఉద్రేకం వస్తుందా? నాకసలు నమ్మకం కలగడం లేదు" అంది సుజాత కళ్యాణి రూపాన్ని తలచుకుంటూ.

"కళ్యాణి అసలు ఉద్రేకపడదు. తక్కినవాళ్ళు ఎంత గట్టిగా అరుస్తున్నా, తను చెప్పదలచుకున్నది నెమ్మదిగా, స్పష్టంగా చెప్తుంది. అందుకే అక్కడ చాలామందికి కళ్యాణి అంటే భయం. కళ్యాణి ఆలోచన ప్రకారం మార్క్స్ చెప్పిన సమసమాజం ఊహ మాత్రమే.

'ఉతోపియన్ సొసైటీ' అంటుంది దాని గురించి మాట్లాడుతున్నప్పుడు. తక్కినవాళ్ళకది నచ్చదు. వాళ్ళు అరుస్తారు. ఒక్కోసారి తిడతారు. దేనికీ చలించదు కళ్యాణి" అన్నాడు మోహన్ గర్వంగా కళ్యాణి గొప్పతనం తనదయినట్లుగా.

ఆ విషయం గ్రహించనట్లు అంది లక్ష్మి– "నీకెంతయినా కళ్యాణి అంటే ఇష్టం. అందుకే అంత గొప్పగా చెప్తున్నావు"

"వ్యక్తిగత ఇష్టాయిష్టాలు వేరు. మీటింగుల్లో కళ్యాణి ప్రవర్తన నచ్చడం వేరు. దానికీ దీనికీ సంబంధం లేదు" అన్నాడు మోహన్.

"అంటే కళ్యాణి అంటే ఇష్టమేనన్నమాట" అంది లక్ష్మి అతని ముఖంలోకి చూస్తూ.

"అవునేమో" అన్నాడు మోహన్ తల వంచుకుని.

"ఇంతకీ ఈ మీటింగుల్లో ఇంతిలా అరిచి మాట్లాడేవాళ్ళంతా ఉద్యమనాయకులై పోతారా?" అన్నాడు నారాయణమూర్తి.

"అందరూ అవరు. కొందరు అవుతారు. ఎక్కువమంది ఇలా మాట్లాడేవాళ్ళే కానీ– చదువయి ఉద్యోగాలు రాగానే ఈ విషయాలు మరిచిపోతారు. ఎక్కువ మాట్లాడనివాళ్ళే చివరికి ఉద్యమంలో చేరతారు. నిజానికి సుందరంలాంటివాళ్ళే ఎక్కువమంది. వాళ్ళు ఉపన్యాసాల వల్లో, పుస్తకాల వల్లో ప్రభావితులై ఉద్యమాల్లో చేరతారు. అలా చేరేవాళ్ళలో చాలామంది వ్యక్తిగత కారణాలతో చేరతారనిపిస్తోంది. సుందరం కూడా బీదరికాన్ని భరించలేక వెళ్ళాడని నా ఊహ".

"అసలు ఉన్నవాళ్ళు లేనివాళ్ళని దోచుకోవడం అన్న అభిప్రాయం సరయినదేనా?" అంది సుజాత.

"ఎకనామిక్స్ చదివితే అందులో కొంత నిజమున్నట్లే తోస్తోంది. మనది పెట్టుబడిదారీ వ్యవస్థ. అంటే కొందరు పెట్టుబడి పెట్టగలిగినవాళ్ళు పొలాల్ని పండించుకోడం, కార్ఖానాలు నడిపించడం చేస్తారు. అయితే పొలాల నుండి పంటనీ, కార్ఖానాల నుండి అవసరమైన సరుకునీ బయటకి తీసుకొచ్చేది కూలీల శ్రమశక్తి. ఆ కూలీలకి వాళ్ళ శ్రమకి తగ్గ ఫలితం లభించదు. కూలీలకి వేతనాలు ఇవ్వగా మిగిలింది పెట్టుబడిదార్లకి లాభం అవుతుంది. పంటలు పండేనేల, వస్తువులు తయారుచేసేందుకు అవసరమైన ముడిసరుకు ప్రకృతి ప్రసాదిస్తోంది. వాటి నుండి పంటనీ, వస్తువులనీ తయారుచేసేది కూలీలు. అప్పుడు పెట్టుబడిదార్లకి లాభం ఎలా వస్తోంది. అది కూలీలకి చెందాల్సింది. వాళ్ళకి ఇవ్వకపోవడం వల్ల లాభం వస్తుందని అన్నాడు మార్క్స్"

"నువ్వు చెప్పిందంతా మార్క్స్ రాసిన పుస్తకంలోది. నిజానికి ప్రపంచంలో జరిగేవి ఇంకా ఎన్నో ఉన్నాయి" అంటూ ప్రారంభించాడు నారాయణమూర్తి.

"ఉన్నవాడు, లేనివాడు అన్న భావం మార్క్స్ అందరిమీదా రుద్దాడు. కానీ, నిజానికి, అన్యాయాలకి కారణం డబ్బు ఉండడం, లేకపోవడం కాదు అవకాశం ఉండడం, లేకపోవడం మాత్రమే. ఏ రాత్రయినా ఎక్కువ సామానుతో విజయవాడ రైల్వేస్టేషనులో దిగితే పోర్టర్, రిక్షావాడు నీ దగ్గర నుండి ఎంత వసూలు చేస్తారు? ఆ సమయంలో నువ్వు వాళ్ళు అడిగినంతా ఇస్తానని వాళ్ళకి తెలుసు. ఎవరు ఉన్నవాళ్ళు? ఎవరు లేనివాళ్ళు? అవకాశాన్ని వాడుకోడం మానవనైజం.

అలానే సంపదను అనుభవించడం కూడా. అవకాశం ఉన్నవాడు అనుభవిస్తాడు. అవకాశం పరిస్థితులని బట్టి ఉంటుంది. శారీరకమైన బలమో, బుద్ధి బలమో కాలానుగుణంగా ఆస్తుల్ని సంపాదించిపెడతాయి.

ప్రస్తుతం డబ్బు రాజ్యమేలుతోంది. డబ్బు అధికారాన్ని, అధికారం డబ్బునీ ఇస్తాయి.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే సమస్యని ఒక కోణంలోంచి కాకుండా అన్ని కోణాల్లోంచి చూడాలని. ఈ ప్రపంచం, ప్రపంచంలోని మనుషులూ, వాళ్ళ మధ్య సంబంధాలూ అనుకున్నంత సింపుల్‌గా ఉండవు. వాటినన్నిటినీ ఒకే కోణంలోంచి చూడద్దు. చూసి తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దు. ఏదయినా చెయ్యడానికి ముందు బాగా ఆలోచించుకోవాలి.

ఉద్యమం, విప్లవాలు– వయసులో ఉన్నవారికి చాలా ఆకర్షణీయంగా కనపడతాయి. ఇలాంటి విప్లవాలు చాలా చోట్ల చాలా రూపాల్లో వచ్చాయి. అవి దేశగతినో, ప్రపంచ గతినో మార్చలేదు. మానవనైజం అంత త్వరగా మారిపోయేది కాదు.

వ్యక్తిగతమైన కక్షలతో ఉద్యమాలు నడవ్వు. తనకున్న ఏదో బాధ కారణంగా సుందరం చేరాడంటున్నావు. అతనికి సామాజిక స్పృహ ఉందో లేదో తెలియదు. తెలియని కసి కొద్దీ చేరడం అంత ఉచితం కాదు.

ఇంతకన్నా మాట్లాడితే మీ అమ్మ ఉపన్యాసం ఆపమంటుంది. ఇంక మాట్లాడను లక్ష్మీ" అంటూ భోజనం చెయ్యడం మొదలెట్టాడు నారాయణమూర్తి.

సమస్యలనింత చక్కగా విశ్లేషించగలిగిన తన తండ్రి తను మీటింగులకి వెళ్తున్నా నంటే వద్దని తిట్టకుండా ఆలోచించుకోమని ఎంత శాంతంగా చెప్పగలుగుతున్నాడో అనుకుంటుంటే గౌరవం, గర్వం, ఆనందంలాంటి భావాలన్నీ కలగాపులగంగా మెదడులో తిరగసాగాయి. ఆ ఆలోచనల్లో అన్యమనస్కంగా భోంచేస్తున్నాడు మోహన్.

ఇద్దరిలో ఎవరు మాట్లాడుతుంటే వాళ్ళు మాట్లాడుతున్నప్పుడు వాళ్ళు మాట్లాడించే సరయినదనిపిస్తున్న తన బుర్ర కూడా ఎప్పుడు స్వయంగా ఆలోచించగలుగుతుందా అని అనుకుంటూ తినసాగింది సుజాత.

తన కడుపున పుట్టిన కొడుకు ఉద్యమంలో చేరతాడేమోనన్న భయం – అలా చేరుతాడనుకుంటున్న కొడుకుని గట్టిగా మందలించని భర్తపైన కోపం– ఈ సంభాషణని ఎంతో ఆసక్తితో వింటున్న కూతురి మీద అదేం ప్రభావం చూపిస్తుందోనన్న కంగారు– వాళ్ళిలా మాట్లాడుతారు కానీ, తన పిల్లలు అవకతవక పనులు చెయ్యరన్న ధైర్యం – ఇలా ఒక దాని తర్వాత ఇంకో భావం మనస్సులో మెదలుతుండగా అంతా బాగా చూసుకుంటాడు తను నిత్యం ఆరాధించే భగవంతుడు అని అనుకుంటూ తినసాగింది లక్ష్మి.

ఆ భగవంతుడు అసలు ఉన్నాడో లేదో తెలియదు. ఉన్నా తను సృష్టించిన మనుషులు తనకి చేసే పూజలు బట్టి వాళ్ళకి కావల్సింది చేస్తాడో లేదో తెలియదు. అయితే అలా మంచి చేస్తాడనుకోవడంలో ఆనందం ఉంది. లక్ష్మి ప్రస్తుతం ఆ ఆనందంలో ఉంది.

## 4

ఓ సాయంత్రం ఆరింటికి ఓపెన్ హౌస్ రెస్టారెంట్‌లో ఓ మూలగా ఉన్న టేబుల్‌కి ఓ పక్కగా కూర్చుని ఉన్నారు కళ్యాణి మోహన్‌లు. వచ్చి పది నిమిషాలయినా వాళ్ళకేం కావాలో కనుక్కుందుకు వెయిటర్ రాలేదు. వాళ్ళలా వచ్చి రెండు మూడు గంటలు కూర్చుని, ఓ కప్పు కాఫీ కలిసి తాగడమో, ఓ ఐస్‌క్రీం కలిసి తినడమో తెలుసు అక్కడ వెయిటర్లకి. కళ్యాణి ఓ పెద్ద ఇండస్ట్రియలిస్ట్ కూతురని కూడా తెలుసు వాళ్ళకి.

గజమో, ఇంకా పొడుగో ఉన్న మల్లెలదండని నాలుగయిదు సార్లు మడిచి జళ్ళో ముడుచుకుంది కళ్యాణి. మొగ్గలు నెమ్మదిగా విచ్చుకోడంతో, కళ్యాణి చుట్టూ మల్లెల వాసన అలుముకుంటోంది. ఎడం చెయ్యి టేబుల్‌మీద ఆన్చి, అర చేతిలోకి తలని వాల్చి, మోహన్‌ని చూస్తూ అతను చెప్పేది వింటోంది.

“ఏదో సాధించాలన్న ఆలోచన, తపన లేనివాళ్ళ జీవితం కులాసాగా, హాయిగా సాగిపోతుందేమో. అలాకాక, ఏదో చెయ్యాలనుకుంటున్న వాళ్ళకి కూడా చెయ్యాల్సింది ఏమిటో స్పష్టంగా తెలిస్తే బాధ లేదు. డబ్బు సంపాదించాలనో, డాక్టరవ్వాలనో, నవల రాయాలనో, గాయకుడవ్వాలనో– ఓ నిర్దిష్టమైన కోరిక ఉన్నవాళ్ళకి బాధేముంది. అలాకాక మనవల్ల ఈ లోకంలోని బాధితుల బాధలన్నీ తీరిపోయి, సమాజం ఉద్ధరించ బడాలనుకున్న వాళ్ళకి, అది చేసేందుకు మార్గం తెలియకే ఈ తికమక అంతా” అంటూ ఆగాడు మోహన్.

“ఆగావేం– చెప్పు” అంది కళ్యాణి.

“నువ్వు వింటున్నావా?”

“వింటున్నాను. నా చెవులకీ, నా మనస్సుకీ ఇంకా చెవుడు రాలేదు” అంది ‘నా’ని నొక్కి పలుకుతూ.

"అంటే నా చెవులకు కానీ, నా మనస్సుకు కానీ వచ్చిందా?" అడిగాడు మోహన్.

"నీకు స్పష్టంగా వినపడుతోంది కాబట్టి చెవులకి వచ్చినట్లు లేదు"

"అంటే మనస్సుకి వచ్చినట్లా?"

"అని నేను విడిగా చెప్పక్కర్లేదనుకుంటాను"

"ఎందుకలా అంటున్నావు"

"అది నీకూ తెలుసు."

"మన పెళ్ళి గురించేగా నువ్వు మాట్లాడేది?"

"నేనింత స్పష్టంగా చెప్తున్నా నీకు అర్థం కావడంలేదంటే నీ మనస్సుకి చెవుడు వచ్చినట్లే" అంది కళ్యాణి.

"నువ్వు చెప్పింది నాకు అర్థం కావడంలేదని నువ్వు అనుకుంటున్నట్లే, నేను చెప్పేది నీకు అర్థం కావడంలేదని నేననుకుంటున్నాను"

"నువ్వు చెప్పేదాంట్లో అర్థమే లేదు. నేను చెప్పేదాంట్లో అర్థం లేదని అనకు. ఓ వయస్సు దాటిన అమ్మాయి, అబ్బాయి మధ్య ఆకర్షణ సహజం. అది మనం కల్పించుకున్నది కాదు. ప్రకృతి మనుషుల్లో సహజంగా కలిగించేది. దానికి నువ్వేం పేరు పెట్టినా నాకు అభ్యంతరం లేదు. దాన్ని నేను ప్రేమ అంటున్నాను. అదేమయినా నాకు అనవసరం. మన మధ్య పరస్పరం అలాంటి ఆకర్షణ ఉంది. మనం కలసి ఉంటే ఇద్దరికీ ఆనందంగా ఉంటుంది. కాదని తప్పించుకోకు. కలిసి ఉండడానికి మార్గం పెళ్ళి. నేను చెప్పిందాంట్లో అర్థం లేనిది ఏముంది?"

"మనకి ఒకరంటే ఒకరికి చాలా ఇష్టమన్న విషయం నాకూ అర్థమైంది. అయితే ఆ ఇష్టంతో మనం ఒకరినొకరం పెళ్ళి చేసుకోవాలో లేదో నాకు అర్థం కావడం లేదు. రెండంతస్తుల మేడలు రెండూ, నాలుగు కార్లూ, స్వంత కంపెనీలు పది, ఎన్నో కంపెనీల్లో షేర్లూ ఇవన్నీ ఉన్న ఓ పెద్ద ఇండస్ట్రియలిస్ట్‌గారమ్మాయి గవర్నమెంటాఫీసులో ఓ మామూలు ఉద్యోగిగారి అబ్బాయిని పెళ్ళి చేసుకుంటే ఎలాగుంటుందోననే నా అనుమానం" అన్నాడు కాస్త నాటకీయంగా మోహన్.

"నేనిందాక అన్నది దీన్ని గురించే. ఆకర్షణ సహజం. అది ప్రకృతి ప్రసాదించిన వరం. అయితే నువ్వు చెప్పే డబ్బు మనం కల్పించుకున్నది. అది ప్రేమకి అడ్డుగోడ కాకూడదు"

"కాకూడదని నేనూ అంగీకరిస్తున్నా. అయితే డబ్బుకీ, డబ్బు వల్ల వచ్చే సుఖానికి అలవాటుపడ్డ నువ్వు డబ్బు లేకుండా బతకలేవు"

"ఒకవేళ డబ్బు లేకుండా బతకడం నాకు కష్టం అయితే, డబ్బుతో బతకడం నీకు కష్టం కాదుగా"

"పెళ్ళయ్యాక నన్ను మీ ఇంటికి వచ్చి ఉండమంటావు. అంతేనా?"

"ఏం. తప్పా?"

"ఇందులో తప్పొప్పుల ప్రసక్తి లేదు కళ్యాణీ! అలవాట్లూ, ఆచారాలే ముఖ్యం. పెళ్ళయ్యాక భార్య భర్త ఇంటికి వచ్చి ఉండడం మన దేశంలో ఆచారం"

"ఆచారం అంటే ఏంటి? సమాజంలోని కొన్ని అవసరాల కారణంగా సమాజంలోని చాలామందికి మంచిదనుకునో, సమాజంలోని పెద్ద మనుషులకి లాభం ఉండడం వల్లనో ఏర్పడ్డ కొన్ని నియమాలు, అంతేనా? నువ్వీ ఆచారాల్ని సమర్థిస్తే వర్గ వ్యవస్థనీ, కుల వ్యవస్థనీ కూడా సమర్థించాల్సి వస్తుంది"

"వర్గం వేరు..." అని అడ్డు రాబోయిన మోహన్ నోటి మీద తన పొడుగాటి వేళ్ళని అడ్డుపెట్టి అంది కళ్యాణి.

"ప్రస్తుతం నేను వర్గం గురించి వినే మూడ్‌లో లేను. మనం జీవితాంతం కలిసి ఉండే మార్గం చెప్పు"

నాదస్వరం, సితార్‌లు కలిసినట్లు వినిపించే కళ్యాణి సన్నని, గంభీరమైన స్వరంలో లాలింపు, బుజ్జగింపు, అభ్యర్థనలాంటివి ఎన్నో కలిసిపోయి వినిపించాయి మోహన్‌కి.

"ఏం చెయ్యమంటావో చెప్పు" అన్నాడు మోహన్.

"మన పెళ్లి గురించి మన ఇళ్లలో మాట్లాడుదాం" అంది కళ్యాణి.

"ఎప్పుడు?"

"ఏది పెళ్ళా? మాట్లాడ్డమా?"

"పెళ్ళి మన చదువులయ్యేవరకూ వద్దు. ఇంక మాట్లాడ్డం ఎప్పుడనే నేనడిగేది"

"పెళ్ళి పరీక్షలయిపోగానే చేసేసుకుందాం. నాకేదో భయంగా ఉంది మోహన్. నా చిన్నప్పుడే అమ్మ పోవడంతో నాకు చిన్నప్పట్నుంచీ ఒంటరితనం అలవాటే. అయితే ఈ ఒంటరితనాన్ని మించిన ఒంటరితనంలో మునిగిపోతానని అనిపిస్తోంది. నేనిలా బేలగా మాట్లాడుతున్నానని ఏమీ అనుకోకు. నాకున్న ఒకే ఒక ఆప్తుడివి నువ్వు. నిజానికి నువ్వు తప్ప నాకు దగ్గరవాళ్ళెవ్వరూ లేరు. నువ్వు ఎదురుగా ఉన్నా లేకున్నా నీ గురించే ఆలోచిస్తుంటాను నేను. అలాంటి నువ్వు నాకు దూరమై పోతావని అనిపిస్తోంది. ఎందుకలా అనిపిస్తోందో నాకు తెలియదు. అలా అనిపించడంతో ఒళ్ళంతా తేలిపోయి గుండె బరువెక్కిపోతోంది. ఈ బాధ నుండి విముక్తి కావాలంటే మనం కలిసిపోవాలి. అందుకే పెళ్లికి తొందరపడుతున్నాను మోహన్.

నీకు నేను అర్థం అవుతానన్న ఆశతో అంతా చెప్పుకుంటున్నా. నాకెంతో ఇష్టమైన చదువు మీద కూడా నా మనస్సు నిలవడం లేదు, ఈ భయంవల్ల. నేను మామూలు

మనిషినయి ఏదన్నా సాధించాలంటే మన పెళ్ళి అవ్వాలి”

అలా మాట్లాడుతున్న కళ్యాణిని చూసేసరికి మోహన్ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

మోహన్ కన్నీళ్ళని తన సన్నని వేళ్ళతో తుడిచి అంది కళ్యాణి “ఏంటది చిన్నపిల్లాడిలా?”

“పద, మా ఇంటికి వెళ్దాం” అంటూ లేచాడు మోహన్.

“ఎందుకు?” అంది తనూ లేస్తూ కళ్యాణి.

“మా ఇంట్లో మన పెళ్ళి గురించి చెప్పేందుకు” అంటూ నడవడం మొదలెట్టాడు మోహన్.

వెనకే నడిచింది కళ్యాణి.

హోటల్‌కొచ్చి ఓ గంటపైగా కూర్చుని ఏమీ తినకుండా, తాగకుండా వెళ్ళిపోతున్నవాళ్ళని చూసి ఆశ్చర్యపోలేదు వెయిటర్లు. అదేమీ కొత్తకాదు వాళ్ళకి.

హోటల్ బయటకొచ్చాక కనిపించిన రిక్షాలో కూర్చుని, కళ్యాణిని కూడా కూర్చోమని, వెళ్ళాల్సిన చోటు చెప్పి, పోనియ్యమన్నాడు మోహన్. బేరం ఏమీ మాట్లాడకుండా.

“కారుంది ఇక్కడే” అంది కళ్యాణి రిక్షా కదిలాక.

“తెలుసు నాకు. అయితే కారులో ఈ దగ్గరతనం ఉండదు” అన్నాడు మోహన్.

మోహన్ అన్న దగ్గరతనం దేని గురించా అని ఆలోచించసాగింది కళ్యాణి.

రిక్షాలో అయితే ఒకరికి తగలకుండా ఒకరు కూర్చోలేరు. మోహన్ అన్న దగ్గరతనం శారీరకమైనదా?

కారులో అయితే తెలిసిన డ్రైవర్ ఉంటాడు. అతని ఎదురుగుండా మనస్సు విప్పి మాట్లాడుకోడం కుదరదు. ఈ విషయం ఇద్దరికీ తెలుసు. రిక్షాలో అయితే రిక్షా తొక్కే మనిషి తమకి తెలియదు కాబట్టి కావల్సింది మాట్లాడుకోవచ్చు. అంటే రిక్షాలో మానసికమైన దగ్గరతనం ఉందనా మోహన్ ఊహ?

కారయితే తనది. తన కారులో కూర్చుని రావడం మోహన్‌కి తక్కువగా అనిపించి, అందులో దూరం కనిపించిందా?

“ఎందుకంత మౌనంగా ఉన్నావు?” అడిగాడు మోహన్.

‘ఏంలేదు” అని కొంచెంసేపు ఆగి “మనం పెళ్ళి ఎప్పుడు చేసుకుందాం” అని అడిగింది కళ్యాణి.

“పరీక్షలవగానే చేసుకుందాం. చేసుకున్నాక కూడా నువ్వు మీ ఇంట్లోనూ, నేను మా ఇంట్లోనే ఉందాం. ఇద్దరి చదువులూ పూర్తయి, నాకు ఉద్యోగం దొరికాక కాపురం పెడదాం” అన్నాడు మోహన్. ‘కాపురం పెడదాం’ అన్నమాట అనడానికి మోహన్

మొహమాటపడ్డాడు. వినడానికి కళ్యాణి సిగ్గుపడింది.

"బి.ఏ. తర్వాత నేనింక ఏమీ చదవదలచుకోలేదు" అంది కళ్యాణి.

"నువ్వు చదవకపోయినా నాకు ఉద్యోగం వచ్చేవరకూ నా కాళ్ళ మీద నేను నిలబడేవరకూ ప్లీజ్" అన్నాడు మోహన్, కాపురం అన్నమాట మళ్ళీ అనకుండా.

"నేను సివిల్ సర్వీసెస్‌కి ప్రిపేరవుదామనుకుంటున్నా" అంది కళ్యాణి.

"పూర్తిగా కరప్షన్‌తో కుళ్ళిపోతున్న గవర్నమెంటు ఉద్యోగంలో చేరతావా?" అన్నాడు మోహన్ ఏదో వినరానిది వింటున్నట్లు.

"పోలీస్ సర్వీస్‌లో చేరాలని ఉంది" అంది కళ్యాణి స్థిరంగా.

"ఇప్పుడొస్తున్న సినిమాల ప్రభావమా? అమ్మాయిల్ని పోలీస్ ఇన్‌స్పెక్టర్లుగా చూపిస్తున్నారు చాలా సినిమాల్లో" అన్నాడు మోహన్ నవ్వుతూ.

"కాదు నాకు చాలా రోజులుగా ఉంది ఈ కోరిక. నీకు నచ్చదనీ, నువ్వు నవ్వుతావనీ నీతో అనలేదు. పోలీస్ సర్వీస్‌లో చేరితే నాకు చేతనయినంతవరకూ క్రిమినల్స్‌ని పట్టుకుని, కొన్ని చోట్లయినా అన్యాయాల్ని అరికట్టేందుకు అవకాశం ఉంటుంది. చాలా పవర్‌ఫుల్ పోస్ట్ అది"

"అది చాలా కుళ్ళిపోయిన వ్యవస్థ కళ్యాణీ"

"నువ్వు దగ్గరుండి చూశావా? చూడకుండా ఎలా చెప్తావు? నువ్వు కూడా నలుగురూ అనుకునేది నమ్ముతున్నావు. అందులో దిగితేకానీ దాని స్వరూపం తెలియదు. అంత అధ్వానంగా ఉంటే రిజైన్ చేసేస్తాను. నువ్వుండగా నాకు ఆ ఉద్యోగపు జీతంమీదే బతకాలని లేదుగా" అంది కళ్యాణి మోహన్ కళ్ళలోకి చూస్తూ.

"ఆడవాళ్ళకి పోలీస్ డ్రెస్ చాలా బావుంటుంది. నిన్ను ఆ డ్రెస్‌లో ఊహించు కుందుకు ప్రయత్నిస్తున్నాను కానీ, చీరలో తప్ప మరోలా ఊహించుకోలేకపోతున్నా" అన్నాడు మోహన్.

"ఈ పక్కకి తిప్పి ఆపు" అంది రిక్షావాడితో కళ్యాణి.

ఇద్దరూ రిక్షా దిగాక, మోహన్ రిక్షావాడికి డబ్బెంత కావాలని అడిగి, అతను అడిగినంతా ఇచ్చి, లోపలకి వెళ్ళేలోగానే, ఇంట్లోకి వెళ్ళింది కళ్యాణి. హాల్లో సుజాత, లక్ష్మీ, నారాయణమూర్తి కూర్చుని ఉన్నారు.

కళ్యాణిని తన పక్కన కూర్చోపెట్టుకుంది సుజాత.

మామూలుగా ఎంతో ఆప్యాయంగా పలకరించేవాళ్ళు ఎవ్వరూ మాట్లాడక పోవడానికి కారణం ఊహించుకుంటూ కూర్చుంది కళ్యాణి.

లోపలకి అడుగుపెట్టిన మోహన్‌కి అందరూ మౌనంగా కూర్చోడం ఆశ్చర్యం

కలిగింది. అంతకన్నా తండ్రి అంత తొందరగా ఇంటికి రావడం ఇంకా ఆశ్చర్యంగా అనిపించింది. సుజాతవైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"నాన్నని సస్పెండ్ చేశారట" అంది సుజాత. అలా అనడంలో చెప్పేద్దామన్న తొందర ఉంది.

"ఎందుకని?" అడిగాడు మోహన్ నారాయణమూర్తిని.

"ఏదో ఆఫీసు గొడవలే" అని మోహన్‌తో అని, "ఏమ్మా! నాన్నగారు కులాసాగా ఉన్నారా?" అంటూ కళ్యాణివైపు తిరిగాడు నారాయణమూర్తి.

"ఆ ఆరోగ్యంగా ఉన్నారండీ" అని వెంటనే "మీరేదో విషయం గురించి మాట్లాడుకుంటున్నారు. నేనింకోసారి వస్తాను" అంటూ లేచి బయటకి నడిచింది కళ్యాణి. కళ్యాణి వెళ్తానంటే ఎప్పుడూ వెంటనే వెళ్ళనివ్వని లక్ష్మీ, సుజాతలు ఏమీ మాట్లాడకపోవడంతో–

"రిక్షా ఎక్కించి వస్తాను" అంటూ కళ్యాణి వెనకే నడిచాడు మోహన్.

రిక్షాలు దొరికే చోటుకి నడుస్తూ అన్నాడు "సారీ, ఇంట్లో ఎవ్వరి మూడ్ సరిగ్గా లేదు. ఇంకోసారి మాట్లాడతాను"

"అలా మాట్లాడతావేంటి మోహన్? మీ నాన్నగారిని సస్పెండ్ చేశారని వింటే నాకు ఏదోలాగుంది. ఎప్పుడూ తన పని తాను చేసుకోడమే కానీ అన్యాయం, అక్రమం తెలియని మనిషి ఆయన. అలాగే ఎవ్వరితోనూ దెబ్బలాడని మనిషి. ఆయనకి సస్పెన్షన్ ఏంటో?"

"ఎవరో తెలియకుండా చేసిన పనయ్యుంటుంది" అన్నాడు మోహన్.

"ఈ లోకంలో చెడు ఎంత పెరిగిపోయిందంటే, మంచివాళ్ళకి చోటు లేదు. అలా మంచిగా ఉండాలనుకుంటున్న వాళ్ళలో మంచితనాన్ని ఉండనియ్యడం లేదు. ఎవరన్నా చెడుని ఎదిరిద్దామనుకుంటే, అసలు వాళ్ళనే ఉండనియ్యడం లేదు"

"అంటే ఎవరో కావాలనే ఇలా చేయించారనా నీ ఉద్దేశం?"

"ఏం జరిగిందో నాకు తెలియదు. ఎవరయినా కావాలని చేయించేందుకు అవకాశం లేకపోలేదు. ఏదయినా అవసరం వస్తే నాతో చెప్పు. నాన్నగారు ఇలాంటి విషయాల్లో బాగా సాయం చెయ్యగలరు. ఆయనకి రాజకీయ నాయకుల్లో బాగా పలుకుబడి ఉంది"

"ఆ అవసరం రాకపోవచ్చును"

"ఆ అవసరం రాకూడదనే నా కోరిక కూడా" అంటూ పక్కనున్న రిక్షా అతనితో "ఓపెన్ హౌస్ దగ్గరికి ఎంత తీసుకుంటావు?" అని అడిగి అతను చెప్పింది విని రిక్షా ఎక్కింది కళ్యాణి.

"మళ్ళీ కలుద్దాం" అంటూ వెనక్కి తిరిగి ఇంటివైపు నడిచాడు మోహన్.

ఇంట్లో ముగ్గురూ హాల్లో కూర్చునే ఉన్నారు.

"అసలేమయింది నాన్నా?" అన్నాడు నారాయణమూర్తి పక్కన కూర్చుంటూ మోహన్.

"ఓ టెండర్ ఓ కంపెనీకి ఇవ్వడంలో నేనా కంపెనీకి సాయం చేశానుట, లంచం తీసుకుని. దాని గురించి ఎంక్వయిరీ ప్రారంభిస్తూ నన్ను సస్పెండ్ చేశారు" అన్నాడు నారాయణమూర్తి.

సామాన్యంగా ఆఫీసు విషయాలేవీ ఇంట్లో మాట్లాడడు నారాయణమూర్తి. అందుకే ఇంట్లోవాళ్ళకి ఆఫీసు గొడవలు తెలియవు.

"అసలు కేసు మీ మీదకెందుకొచ్చింది"

"అంతకుముందు రెండు మూడు సార్లు కొన్ని టెండర్లు ఒక కంపెనీకి అన్యాయంగా ఇప్పించుకుందామని మా ఆఫీసర్ ప్రయత్నిస్తే, ఆ విషయం పైఆఫీసర్‌కి చెప్పి అలా జరగనివ్వలేదు నేను. అందుకని ఆయనకి నా మీద కోపం ఉంది. ఈ కేసులో ఏవో లొసుగులు చూపించి నేను లంచం తీసుకున్నానని రాశాడు"

"మీరు మళ్ళీ ఆ పై ఆఫీసర్ని కలవచ్చు కదా?"

"ఆయన కొన్నాళ్ళ క్రితమే ట్రాన్స్‌ఫర్ అయ్యి వెళ్ళిపోయారు. ఆయన ఉన్నన్నాళ్ళూ వీళ్ళ ఆటలు సాగేవికావు. ఆయన న్యాయంగా పని చేసుకునేవారు. ఆయన వెళ్ళగానే వీళ్ళకి నా మీద ఉన్న పాతకోపం తీర్చుకుందుకు ప్రయత్నిస్తున్నారు"

"అయితే మీరు లంచం తీసుకున్నట్లు నిరూపించాలి కదా?"

"అది చాలా విషయాల మీద ఆధారపడుతుంది. రకరకాల ఎవిడెన్స్‌లు పుట్టించవచ్చు. ఇంక్వయిరీ ఆఫీసర్ ఎలాంటివాడయినా కావచ్చు"

"మనం కూడా అవసరమైతే కళ్యాణి వాళ్ళ నాన్నగారి సాయం తీసుకోవచ్చు. ఆయనకి రాజకీయ నాయకుల్లో పలుకుబడి ఉందట. కళ్యాణి చెప్పింది"

"ఇంత జరిగాక నాకు ఆఫీసుకి వెళ్ళాలని లేదు. చాలా చిరాగ్గా ఉంది మనస్సంతా. ఆఫీసులో వాళ్ళంతా మంచివాళ్ళయినట్లు అందరూ నన్నో లంచగొండిగా చూడ్డం చాలా అసహ్యంగా అనిపిస్తోంది నాకు. మనం మన ఊరెళ్ళిపోదాం లక్ష్మి. అక్కడ మనకున్న పదెకరాల పొలంతో మన నలుగురికీ సరిపోయేంతా వస్తుంది. మనకి కావాల్సింది చూసి పెట్టేందుకు మీ అన్నయ్య ఆ ఊళ్ళోనే ఉన్నాడు" అన్నాడు నారాయణమూర్తి.

"మీరేం కంగారుపడకండి. ఇక్కడ వ్యవహారమంతా అనుకూలంగా సర్దుకుంటుంది. ఎప్పుడూ ఎవ్వరినోటా చెడ్డగా అనిపించుకోలేదు కాబట్టి, ఇలా జరగ్గానే మీకు బాధగా

ఉంది. ఇక్కడ నచ్చకపోతే మనం మన ఊరెళ్ళిపోదాం, అయితే ఇప్పుడు వెళ్ళిపోతే, మీ మీద అనుమానం ధృవపడుతుంది. మీరు లంచం తీసుకోలేదని ఋజువు చేసుకుని వెళ్ళిపోదాం. కొన్నాళ్ళు తప్పదు. మనం మన ఊరెళ్తే అన్నయ్య ఎంతో సంతోషిస్తాడు. ఏ సాయం కావాలన్నా చేస్తాడు. మీరేమీ కంగారుపడకండి" అంది లక్ష్మి నారాయణమూర్తిని అనునయిస్తూ.

ఒక్కోసారి భార్య భర్తకి తల్లవడం అంటే ఇదేనేమో అని అనుకుంటూ లోపల గదిలోకి వెళ్ళాడు మోహన్.

అతని వెనకే వెళ్ళి సుజాత మోహన్‌ని అడిగింది.

"అన్నయ్యా నాన్న ఉద్యోగం పోతుందా? జైల్లో పెడతారా?"

అలా అడుగుతున్నప్పుడు సుజాతకి ఏడుపు ఆగడం లేదు.

"పిచ్చి పిల్లా! ఇందులో బాధపడాల్సింది ఏమీ లేదు. ఇవన్నీ మామూలే. ఆఫీసుల్లో సస్పెన్షన్ సామాన్యమైన విషయం. వీటి గురించి ఆలోచించకుండా బాగా చదువుకో. పరీక్షలు దగ్గరపడుతున్నాయి" అన్నాడు సుజాత జుట్టు నిమురుతూ మోహన్.

ఆ రాత్రి ఎవ్వరూ సరిగ్గా భోంచెయ్యలేదు. తనలో ఏదో ఆలోచించుకుంటూ బాధపడుతూనే ఉన్నాడు నారాయణమూర్తి.

తండ్రినలా చూడ్డంతో మోహన్ మనస్సు తల్లడిల్లింది. మంచం మీద పడుకున్నా నిద్ర రాలేదు. పక్క మంచం మీద సుజాత చాలాసేపు మోహన్‌తో ఏదో మాట్లాడాలని ప్రయత్నించింది. మోహన్ సరిగ్గా సమాధానాలు చెప్పకపోవడంతో ఇంక ఏం చెయ్యాలో తెలియక నిద్రపోయింది.

మోహన్ ఆలోచనలన్నీ తండ్రి సస్పెన్షన్ మీదే ఉన్నాయి. చెల్లెలికయితే చెప్పాడు కానీ, మోహన్ ఆ విషయాన్నంత తేలికగా తీసుకోలేకపోయాడు. తనకే అంత బాధగా ఉంటే తండ్రికి ఎలాగుందోనన్న ఆలోచన మోహన్‌ని బాగా వేధించసాగింది.

ఆఫీసుల్లో లంచగొండితనం అసలు ఉండకూడదనీ, ఒకవేళ తక్కినవాళ్ళు లంచం తీసుకున్నా తను ఆ పని చెయ్యననీ నిర్ణయం తీసుకున్న మనిషి ఆయన. ఆయన్ని లంచగొండిగా సస్పెండ్ చేశారు. దాన్ని చూసి తక్కినవాళ్ళు నవ్వుతున్నారని అంటున్నారాయన. ఎలాంటి వ్యవస్థ ఇది?

ప్రజాస్వామ్యం మన దేశానికి సరిపోదు. ఇందులో ఏదో లోటు ఉంది. ప్రజాసేవ చేద్దామన్న ఉద్దేశం ఉన్నవాళ్ళు కాదు, రాజకీయాల్లో చేరేది – పదవినీ, పదవితో పాటు బోల్డు డబ్బునీ, పలుకుబడినీ సంపాదించుకోవాలనుకుంటున్న వాళ్ళు రాజకీయాల్లో చేరుతున్నారు. వాళ్ళు ప్రజల దగ్గర నుండి ఓట్లు సంపాదించేందుకు వాగ్దానాలనీ, డబ్బునీ

పంచి పెడుతున్నారు.

డబ్బు ఖర్చుపెట్టి పదవిలోకి వచ్చినవాడు మళ్ళీ ఆ డబ్బుకి కొన్నిరెట్ల డబ్బుని సంపాదించుకుందుకు ప్రయత్నిస్తాడు. కాంట్రాక్టులు, లైసెన్సులు, ఉద్యోగాలు ఏది కావాలన్నా లంచం ఇస్తేకానీ పని జరగనివ్వరు.

అలా లంచాలు ఇచ్చి కంట్రాక్టులు, లైసెన్సులు తెచ్చుకునేవాళ్ళు వ్యాపారస్తులు. వాళ్ళకి మనస్సంతా లాభం మీదే.

ఓ పక్క రాజకీయనాయకులు, మరోపక్క వ్యాపారస్తులు– వీళ్ళు చెరోపక్క పొందుతున్న లాభాల్ని చూసే ఉద్యోగస్థులకి సులభంగా డబ్బు సంపాదించే మార్గం తెలుస్తుంది. అసలందులో కొందరు ఉద్యోగులు, తమ ఉద్యోగాలు వేలు పోసి వేలాల్లో కొని ఉంటారు. వాళ్ళు లంచాలు తీసుకుంటారు.

ఇలా తిరుగుతోంది రాజకీయ వ్యాపార ఉద్యోగ చక్రం.

ఎలక్షన్లకి పార్టీ ఫండుల పేరన వ్యాపారస్తుల దగ్గర డబ్బు తీసుకుని గెలవడం. గెలిచాక ఆ వ్యాపారస్తులకి కావల్సింది చెయ్యడం. వాళ్ళకి అండగా ఉన్నాయి ప్రభుత్వ ఆఫీసులు, కోర్టులు, పోలీసు స్టేషన్లు.

ఇదంతా మారితే కానీ దేశం మారదు. అప్పుడు కానీ దేశంలో సమానత్వం రాదు. ఈ వ్యవస్థ తుడిచిపెట్టుకుపోవాలి. దానికి సాయుధ పోరాటమే మార్గం అయ్యుంటుంది. మనస్సంతా చిందరవందరగా ఉంది మోహన్‌కి ఏం చెయ్యాలో తెలియక.

ఏం చెయ్యాలి అన్న విషయం మీద మోహన్ మనస్సులో అంతర్మథనం సాగుతూనే ఉంది.

అయితే అది ఇంకో ఇరవై నాలుగు గంటలేనన్న విషయం తెలియదు మోహన్‌కి.

## 5

రాత్రి చాలా ఆలస్యంగా కలత నిద్రలోకి జారిన నారాయణమూర్తికి తెల్లారడానికింకో గంట ఉందనగా హఠాత్తుగా గుండెలో తీవ్రంగా నొప్పి అనిపించడంతో లేచి లక్ష్మిని లేపాడు.

ఏమయిందంటూ లక్ష్మి లేచేసరికి, గుండెలమీద అరచేతుల్తో రుద్దుకుంటూ నొప్పి భరించలేనట్టు మెలికలు తిరిగిపోసాగాడు. ఒళ్ళంతా చెమటపట్టేసింది. మాట్లాడలేనంత ఆయాసం వచ్చింది.

కంగారుగా లేచి మోహన్‌ని పిలిచి డాక్టర్‌ని తీసుకురమ్మంది లక్ష్మి.
మోహన్ లేచి చొక్కా తొడుక్కుని, చెప్పులు వేసుకుని నాన్నెలా ఉన్నారో చూద్దామని గదిలోకి

వెళ్ళేసరికి పడుక్కున్నట్లుగా కాకుండా పడి ఉన్నట్లుగా కనిపించాడు నారాయణమూర్తి. గబగబా వెళ్ళి గుండెమీద చెయ్యి వేసి చూస్తే చప్పుడు వినిపించలేదు.

పక్క సందులో ఉన్న తెలిసిన డాక్టర్ దగ్గరికి వెళ్ళి, విషయం చెప్పి, తొందరపెట్టి తీసుకొచ్చాడు ఆయన్ని. ఆయన వచ్చి చూసి మోహన్‌ని పక్కకి పిలిచి "గుండె పోటుతో పోయారు" అన్నాడు.

ఆ మాట వినగానే గొల్లుమంది లక్ష్మి.

లక్ష్మి ఏడుపు విన్న ఇరుగూ పొరుగూ వచ్చి విషయం తెలుసుకుని, మోహన్‌ని ఎవరెవరికి తెలియపర్చాలని అడిగారు.

నారాయణమూర్తికి దగ్గర బంధువులంటూ ఎవ్వరూ లేరు. లక్ష్మి అన్నయ్యా, వదినా తప్ప.

అన్నయ్యని చూసేసరికి దుఃఖం ఎక్కువయింది లక్ష్మికి. లక్ష్మిని దగ్గరికి తీసుకుని ఓదార్చసాగింది వదిన.

ఆఖరి సంస్కారాలకి కావల్సిన ఏర్పాట్లన్నీ లక్ష్మి అన్నయ్య చూడసాగాడు. ఆయనే కర్మకాండకి కావల్సిన డబ్బు ఖర్చు చెయ్యడం మొదలెట్టాడు. చుట్టుపక్కలవాళ్ళ సాయంతో పనులు జరగసాగాయి.

ఇలాంటి దుఃఖాన్ని తట్టుకోగల వయస్సు లేని చెల్లినీ, భర్తతోనే తన జీవితాన్ని ముడేసుకుని బతుకుతున్న తల్లినీ చూస్తుంటే ఏడుపు ఆగడంలేదు మోహన్‌కి.

తండ్రి అంత్యక్రియల భారమంతా అతనిమీదే పడింది.

ఇన్నాళ్ళూ తనతో ఉన్న తండ్రి–తన్ని కొడుకులా కాకుండా ఓ స్నేహితుడిలా చూసుకున్న తండ్రి– తన కష్టసుఖాలూ, బాగోగులూ చూసిన తండ్రి ఇంక లేడు. తండ్రి శరీరం చితిమంటల్లో కాలిపోతోంటే చూడలేకపోయాడు మోహన్.

కర్మ చేయించే ఆయన చెప్తున్నట్లు చేస్తున్నాడు కానీ, మోహన్ మనస్సు కర్మకాండ మీద లగ్నమవడం లేదు. తండ్రి చనిపోయాడన్న బాధని భరించలేకపోతున్నాడు.

కర్మకాండ పూర్తయి ఇంటికి చేరేసరికి నాలుగు దాటింది. పొద్దున్న నుండీ కొంచెం నీళ్ళయినా తాగలేదు మోహన్. సుజాత కూడా అలానే ఉంది.

అంతకుముందు రోజు దాకా తమతో ఉన్న నారాయణమూర్తి చనిపోవడం వాళ్ళ ముగ్గురికీ తీరని లోటయింది. వాళ్ళలోని ముఖ్యమైన భాగం వాళ్ళ నుండి హఠాత్తుగా విడిపోయినట్లయింది. అంతా శూన్యంగా కనిపించసాగింది.

వాళ్ళ దుఃఖం తీర్చేందుకు ప్రయత్నించారు లక్ష్మి అన్నా వదినలు. ఎంతో బతిమాలి ముగ్గురినీ కాస్త ఎంగిలిపడేట్లు చేశారు.

లక్ష్మి అన్నయ్య వాళ్ళకి ధైర్యం చెప్పసాగాడు.

"పుట్టిన ప్రతి మనిషికి మరణం తప్పదు. పోవడంలో ముందు వెనకలు నిర్ణయించేది ఆ భగవంతుడేకానీ మనం కాదు.

ఆయన ఎలా నిర్ణయిస్తే అలానే జరుగుతుంది. బావగారు చాలా మంచి జీవితం గడిపారు. తొందరగా పోవడం ఆయన అదృష్టం. మంచితనానికి రోజులుపోయి లోకం అంతా చెడుతో నిండిపోతోంది. ఈ చెడు కాలాన్ని చూడాల్సిన అవసరం లేని పుణ్యాత్ముడాయన. ఆయన మన మధ్య లేకపోవడం మన దురదృష్టం. ఇది మనకి కష్టంగా ఉంటుంది. అయితే ఆయనకి ఈ లోకంలో ఉండడం కష్టంగా ఉంటుంది. అందుకే ఆ పుణ్యపురుషుడిని దేవుడు తన దగ్గరికి తీసుకెళ్ళిపోయాడు.

ఆయన నాతో అంటుండేవారు ఈ ఆఫీసు ఉద్యోగం మానేసి మన ఊరు వచ్చి పొలం చూసుకుంటూ బతకాలని ఉందని. అలాగే వచ్చి ఉంటారేమోనని ఆశపడుతున్నా. నా ఆశ తీరలేదు. ఆ పొలం నేనే చూస్తున్నానింకా. అయితే దానిమీద ఆదాయం ఆయనెప్పుడూ ఆడగలేదు. అంతా ఆ ఊళ్ళో బ్యాంక్‌లోనే ఉంది.

మీకు ఏవిధంగానూ ఎవరి ఆర్థిక సహాయం అక్కర్లేదు. పొలంమీద వచ్చేది, బ్యాంక్‌లో ఉన్న డబ్బుమీద వచ్చే వడ్డీ చాలు మీ చదువులకి, పెళ్ళిళ్ళకీ. మీరు దేని గురించీ బాధపడకండి. అందరికీ మంచే చేసి వెళ్ళారాయన. మీక్కూడా మంచే జరుగుతుంది"

రోజంతా ఏడవడం వల్ల కలిగిన అలసటవల్లా, ఆయన అనునయంవల్లా నెమ్మదిగా నిద్రపోగలిగారు లక్ష్మి, సుజాతలు పదకొండు ప్రాంతానికి. నిద్రపట్టని మోహన్ ఆలోచిస్తున్నాడు.

మంచివాళ్ళని దేవుడు తన దగ్గరికి ముందుగా తీసికెళ్ళిపోవడంలాంటి మాటలు మావయ్య అమ్మని సముదాయించడానికి అన్నాడు కానీ అలాంటివాటిలో నిజం లేదు. నిజానికి తను సృష్టించిన లోకం బాగుండాలని అనుకుంటే దేవుడు మంచివాళ్ళని ఎక్కువ రోజులు ఉంచాలి. అసలు ఓ దేవుడూ, మంచి చెడ్డలు చూసి తీసికెళ్ళడం అంతా ఒక బూటకం. ఆ విషయం గురించి ఆలోచించాల్సింది ఏమీలేదు.

నాన్న నిజంగా చచ్చిపోయాడా? నమ్మకం కలగడంలేదు. ఏ కారణం కనిపించక డాక్టర్ గుండెనొప్పితో మరణించారని అన్నాడు. అసలు గుండెనొప్పి ఎందుకు వచ్చింది? తన్ని సస్పెండ్ చేశారన్న బాధను భరించలేక వచ్చి ఉంటుంది.

అంటే నాన్న చచ్చిపోలేదు. చంపబడ్డాడు. ఆయన చుట్టూ ఉన్న సమాజం ఆయన్ని చంపేసింది.

చంపడానికి కత్తులూ, తుపాకులూ అవసరం అని తను ఇన్నాళ్ళు అనుకుంటున్నాడు

కానీ, నిజానికి వాటి అవసరం లేకుండా చేసిన హత్య ఇది. పూర్తిగా కుళ్ళిపోయిన సమాజం తనతోపాటు కుళ్ళిపోని నేరానికి తండ్రిని హత్య చేసింది.

ఇలాంటి సమాజం ఇంక ఉండకూడదు. దీన్ని మార్చెయ్యాలి. కూకటివేళ్ళతో సహా పెకిలించి వెయ్యాలి. అది ఒక్క సాయుధ పోరాటంతోనే సాధ్యమవుతుంది. క్లాసురూముల్లోనూ, సభా వేదికలపైనా ఉపన్యాసాలు ఇవ్వడంవల్ల ప్రజలు మారరు. పుస్తకాలు సమాజాన్ని కొంచెం కూడా మార్చలేవు. మార్పు రావాలంటే పోరాటం సాగించాల్సిందే. మంచికి నిలవనీడనివ్వని చెడ్డ మనుషులందర్నీ పిట్టల్ని కాల్చినట్లు కాల్చేస్తే మిగిలేదంతా మంచే. ఆ మంచి కోసం కొన్ని ప్రాణాలు బలికాక తప్పవు. ఎందరో యువకుల ఆత్మత్యాగం తప్పదు.

సుందరం చేసిన పనే తనూ చెయ్యాలి. అలా అందరూ కలిస్తేనే ఉద్యమం ఉద్ధృతమవుతుంది. పెల్లుబికిన ప్రజావాహినిలో రాజకీయనాయకులూ, లంచగొండి ఉద్యోగులూ కొట్టుకుపోతారు. అప్పుడు సమసమాజం వస్తుంది. అప్పుడే నాన్న ఆశయం నెరవేరుతుంది.

నాన్నని చంపిన ఈ సమాజాన్ని సరిచెయ్యాలి. నాన్న ఆత్మకి శాంతి కలిగించాలి. అందుకు తను ముందుకు కదలాలి.

తనెళ్ళిపోతే తనవాళ్ళ గతి ఏంటి? అమ్మా, చెల్లీ కూడా అమాయకపు ప్రాణులే. అందుకే మావయ్య ఉండగానే వెళ్ళిపోవాలి. ఆయనే వాళ్ళ సంగతి చూసుకుంటారు. అదృష్టం బావుండి ఆయన ఇక్కడే ఉన్నారు. ఇదే సరయిన సమయం తను ముందడుగు వేసేందుకు. మోహన్ లేచాడు. గదిలోకి వెళ్ళి ఓ కాగితం మీద రాశాడు

"నాన్నని చంపిన ఈ సమాజాన్ని మార్చేందుకు వెళ్తున్నాను. మళ్ళీ ఎప్పుడు మిమ్మల్ని కలుస్తానో తెలియదు. మిమ్మల్ని మావయ్య జాగ్రత్తగా చూసుకుంటాడన్న ధైర్యంతో వెళ్తున్నాను. నా కోసం ఏడవకండి"

కాగితం బల్లమీద పెట్టి అది ఎగిరిపోకుండా దానిమీద తన పెన్ను పెట్టాడు. ఆ పెన్ను కావాలని తన్ని చెల్లెలు ఎన్నోసార్లు అడగడం, తను ఇవ్వకపోవడం గుర్తొచ్చింది మోహన్‌కి.

అమ్మనీ, చెల్లెలినీ చూసి అనుకున్నాడు, మళ్ళీ కలుస్తానా అని.

నాన్న శరీరాన్ని పడుకోపెట్టిన చోట చిన్నదీపం వెలుగుతోంది.

ఆ చిన్న దీపం తనకి దారి చూపే అఖండ జ్యోతిలా అనిపించింది.

ఆ వెలుగులో తలుపులు తీసుకుని నడవసాగాడు మోహన్.

# 6

అర్ధరాత్రి పన్నెండింటికి కాలింగ్ బెల్ మోగిస్తున్నదెవరా అని అనుకుంటూ లేచి కళ్యాణి తన గది తలుపులు తెరిచేసరికి ఎదురుగా మోహన్ కనిపించాడు.

పల్చని తెల్లని నైటీలో ఉంది కళ్యాణి.

తను అలాంటి డ్రెస్‌లో ఉన్నానే అన్న ఊహ కళ్యాణికి, అలా నిద్రపోతున్న కళ్యాణి గది దగ్గరికి వచ్చానే అన్న ఆలోచన మోహన్‌కి కలగలేదు.

ఎర్రబడ్డ కళ్ళతో, చింపిరి జుట్టుతో నిలబడి ఉన్నాడు మోహన్.

ఈలోగా మోహన్‌కి తలుపు తీసిన పనిమనిషి కళ్యాణి గది దగ్గరకొచ్చి "నేను వద్దంటున్నా వినకుండా ఇక్కడికి వచ్చేశారండి" అంది.

"నువ్వెళ్ళు" అని పనిమనిషిని ఆజ్ఞాపిస్తున్నట్లుగా అని, "లోపలికి రా" అని ఎంతో ఆప్యాయంగా పిలిచింది మోహన్‌ని.

పెద్ద పందిరి మంచం ఎక్కి నీలం రంగుదీపం కాంతిలో నీలంగా కనిపిస్తున్న తెల్లరంగు దుప్పటి పైన కూర్చుని పక్కన కూర్చోమంది కళ్యాణి.

పక్కనున్న పడక్కుర్చీలో కూర్చుంటూ అన్నాడు మోహన్ "నేనెక్కువసేపు కూర్చోను. తొందరగా వెళ్ళిపోవాలి"

"ఇంత రాత్రివేళ వచ్చావేంటి? అమ్మా, చెల్లీ ఎలాగున్నారు? ఇలాంటి సమయంలో వాళ్ళని వదిలేసి ఎందుకు వచ్చావు? రమ్మంటే నేనే వచ్చేదాన్ని కదా?" అంది కళ్యాణి.

"వాళ్ళని కొంచెంసేపటికి కాదు, ఎప్పటికీ వదిలేసి వెళ్తున్నా" అన్నాడు మోహన్.

"నీకేం పిచ్చెక్కిందా? బాధలో నీకు ఆలోచించే శక్తిపోయింది. వాళ్ళని వదిలేసి ఎక్కడికి వెళ్తావు? వాళ్ళకి నీ అవసరం చాలా ఉంది ఇప్పుడు. పద, ఇంటికి వెళ్దాం" అంటూ మంచం దిగబోయి –

"నేను ఉద్యమంలో చేరబోతున్నాను" అన్న మోహన్ మాటలకి షాక్ తిన్నట్లు ఆగిపోయింది కళ్యాణి. వెంటనే అంది.

"నీకు నిజంగానే మతిపోయింది. లేకపోతే ఇలాంటి మాటలు ఇప్పుడు ఏంటి? ఈరోజే కదా కర్మకాండ చేశావు. మీ అమ్మగార్ని ఓదార్చడం పోయి, ఇంటిని వదిలిపెట్టి వెళ్ళిపోతానంటావేంటి? నువ్వసలు ఇంట్లో చెప్పే బయల్దేరావా?"

"లేదు, ఇంట్లోవాళ్ళకి ఈ విషయం తెలియదు"

"మరి నాకెందుకు చెప్తున్నావు?" అంది కళ్యాణి కోపంగా.

"నీకు చెప్పాల్సిన బాధ్యత నాకుంది. నిన్న మనం పెళ్ళిచేసుకుందామనుకున్నాం.

ఈ విషయం తేల్చుకోకుండా వెళ్ళిపోవడం నాకిష్టం లేదు. అందుకే వచ్చాను"

"కన్నతల్లికి దిక్కులేదు. నాకోసం వచ్చావా?"

"అది చెప్పడానికే వచ్చాను. నేనిప్పుడు అజ్ఞాతంలోకి వెళ్ళిపోతున్నాను. ఏనాడు ఎవరి చేతుల్లో ఏమవుతానో తెలియదు. ఇలాంటి పరిస్థితుల్లో నేను పెళ్ళి చేసుకోవడం సరయిన పని కాదు. అందుకే మన పెళ్ళి సంగతి మర్చిపో"

"మోహన్, మన పెళ్ళికి ఏం తొందరలేదు. ఈ రోజు నువ్వు ఈ విషయం గురించి మాట్లాడకు"

"ఈరోజు కాకపోతే నాకు మళ్ళీ ఈ విషయం గురించి నీతో మాట్లాడే అవకాశం రాకపోవచ్చు కళ్యాణీ అందుకే మాట్లాడనీ. ఈరోజు నా జీవితంలో మరపురాని రోజు. నేనింతవరకూ ఇలాంటి హత్యని చూడలేదు. అలా హత్య చేసిన వాళ్ళని నేను ఊరికే వదిలెయ్యలేను. వాళ్ళ అంతం చూడాలి. అందుకు ఒక్కటే మార్గం ఉంది. అది సాయుధ పోరాటం. అందుకే నేను ఆ మార్గంలో వెళ్తున్నాను ఈ రోజు నుండీ. ఆలస్యమైన ప్రతిక్షణం భరించలేనంత బాధగా ఉంది నాకు. నేనెళ్ళిపోతాను. వెళ్ళే ముందు నీతో చెప్దామని వచ్చాను. మన పెళ్ళి జరగదు. ఏరోజు ప్రాణాలు పోగొట్టుకుంటానో తెలియని నన్ను నువ్వు పెళ్లి చేసుకోవద్దు. పూర్తిగా అజ్ఞాతంలో జీవితం గడపబోయే నేను పెళ్ళి చేసుకోవడం తప్పు. మన పెళ్ళి సంగతి మర్చిపో"

"మన పెళ్ళి సంగతి మర్చిపోతాను. నిన్ను కూడా మర్చిపోనా?" అంది మోహన్ కళ్ళలోకి సూటిగా చూస్తూ కళ్యాణి.

"నన్ను మర్చిపోయి ఇంకొకర్ని పెళ్ళి చేసుకో" అన్నాడు మోహన్ ఆ కళ్లలోకి చూడలేనట్లు ఎటో చూస్తూ.

"అది అసంభవం మోహన్. నీదాన్ని కాలేని నేను ఇంకెవ్వరినీ పెళ్ళిచేసుకోను. అయినా నా పెళ్ళి ప్రస్తుతం అంత ముఖ్యమైన విషయం కాదు. నువ్వు ఇలా ఇంట్లో వాళ్ళని వదిలేసి వెళ్ళడం మంచిది కాదు. మళ్ళీ ఆలోచించు"

"నాకు బంధాల్ని తగిలించకు కళ్యాణీ! నేను చెడులేని మంచి సమాజాన్ని స్థాపించేందుకు వెళ్తున్నాను. దానికి అడ్డు రావద్దు"

"చెడు లేని మంచి సమాజం ఉండదు మోహన్"

"సమసమాజంలో చెడుకి ఆస్కారం లేదు"

"అసలు సమసమాజం అన్న మాటకి అర్థం లేదు"

"అది మీలాంటి ఉన్నవాళ్ళ మాట. నేనొప్పుకోను. అయినా ఇప్పుడా విషయం గురించి చర్చ అనవసరం."

"కాదు. చాలా అవసరం. ఒక పని చేసేముందు దాని మంచి చెడ్డలూ, బాగోగులూ, పర్యవసానాలూ బాగా  ఆలోచించుకోవాలి. ఈమాటే మీ నాన్నగారు కూడా అనేవారు. నువ్వు క్షణికమైన ఉద్రేకంతో ఇవన్నీ మర్చిపోతున్నావు. నెమ్మదిగా ఆలోచించు. అప్పుడు పని ప్రారంభించు"

"కార్యం చెయ్యలేనివాడు ఆలోచిస్తున్నానన్న భ్రమలో కాలం గడుపుతాడు. ఈ సూడోఇంటెలెక్చువల్స్ అంతా ఇంతే. నేను పని చెయ్యడంలోకి దిగుతున్నాను. ఇన్నాళ్ళూ నేనూ ఆలోచనల్లో, కబుర్లలో కాలక్షేపం చేశాను. ఓ హత్య నా కళ్ళు తెరిపించింది. ఈ సమాజం బాగా పాడయిపోయింది. పాడయిపోయిన భాగాన్ని పూర్తిగా తీసేస్తేకానీ తక్కిన భాగం బతకదు. డాక్టర్ మనిషిని కాపాడ్డానికి శరీరంలోని ఒక భాగాన్ని కోసి తీసేసినట్లు, ఈ సమాజాన్ని కాపాడ్డానికి కొందరి మనుషుల తొలగింపు తప్పదు"

"కానీ నువ్వు తొలగించబోయే మనుషులెవ్వరు?"

"లంచగొండి ఉద్యోగులు, దొంగ వ్యాపారం చేసేవాళ్ళు, బూటకపు రాజకీయ నాయకులు"

"అందరినీ తొలగించగలవా?"

"నేనొక్కడినే ఆ పని చెయ్యలేను. అందుకే సమిష్టిగా కలిసి చేసేది"

"మీ నాన్నని హత్య చేశారని నువ్వనుకుంటున్నవాళ్ళని చంపగలవా?"

"వాళ్ళు ఒకళ్ళూ, ఇద్దరూ కాదు కళ్యాణీ–వాళ్ళంతా ఒక వర్గం. ఆ వర్గం మొత్తం నాశనమయిపోవాలి. అయిపోతుంది మనలాంటి వాళ్ళందరూ కలిస్తే"

"నన్నిందులో ఇరికించకు"

"నిన్ను రమ్మనడం లేదు నేను"

"ఇలాంటి అన్యాయాల్ని అరికట్టేందుకు పోలీసులున్నారు, కోర్టులున్నాయి"

"అవన్నీ సమాజంలోని ఒక వర్గం కోసం మాత్రమే"

"అది నీ ఊహ. వాటిని నువ్వు చూడలేదు"

"నువ్వు చూడబోతున్నావుగా ఓ ఐ.పి.ఎస్. ఆఫీసర్గా"

"నువ్వు వ్యంగ్యంగా అన్నా, వెటకారంగా అన్నా నేను పట్టించుకోను. నీకున్న బాధలో నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలియడం లేదు. నేను నిజంగా పోలీస్ ఆఫీసర్ అయ్యేందుకు ప్రయత్నిస్తాను. ఎవరికన్నా మంచి చెయ్యాలన్నా, చెడుని తొలగించాలన్నా న్యాయమైన మార్గంలో వెళ్తాను"

"నేను కాదు ఊహల్లో ఉన్నది –నువ్వు"

"ఏం – నేను సెలెక్ట్ అవనా?"

"నువ్వు సెలెక్ట్ అవకపోవడమేంటి? అది కాదు నా ఉద్దేశం. పోలీసుల్లో చేరి ప్రజలకి మంచి చేద్దామనుకోడం నీ ఊహ"

"చూద్దాం. ఏం చెయ్యగలుగుతానో. నువ్వు మాత్రం నీ నిర్ణయం మార్చుకోవా?"

"మార్చుకోలేను కళ్యాణీ"

"అయితే మీ అమ్మనీ, చెల్లెల్నీ మా ఇంట్లో ఉంచి వెళ్ళు"

"అలా ఉంచగలిగే స్థితిలో నేను లేను"

"అవును నేను వాళ్ళకేమవుతాను?"

"అంతా సవ్యంగా జరిగి ఉంటే ఒకరికొకరు బాగా దగ్గరవాళ్ళమయ్యేవాళ్ళం. ఇప్పుడు కాదు. అందుకని వాళ్ళు ఇక్కడకొచ్చి ఉండే ప్రసక్తి లేదు. మా మావయ్య వచ్చారు. ఆయనకి మా అమ్మంటే ఎంతో ఇష్టం. మా అమ్మకి కూడా మా మావయ్య దగ్గర బాగా చనువు. ఆయన వాళ్ళని తీసికెళ్తాడు. వాళ్ళ గురించి బెంగలేదు. నా గురించి బాధపడద్దని వాళ్ళకి ధైర్యం చెప్పు"

"నేనా? నేనెవరిని వాళ్ళకి ధైర్యం చెప్పేందుకు? నువ్వన్నట్లు అంతా సవ్యంగా జరిగి ఆ ఇంటి కోడలినయ్యుంటే చెప్పేదాన్ని. నాకు ఆ అదృష్టం లేదు"

"అది నువ్వు అదృష్టం అనుకోడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. అంతకు ముందు సరే ఇప్పుడూ నన్ను పెళ్ళి చేసుకోడం అదృష్టం అనే అనుకుంటున్నావా నువ్వు?"

"నువ్వు నమ్మినా నమ్మకపోయినా అది మాత్రం నిజం"

"ఏది?"

"నిన్ను పెళ్ళిచేసుకోడం నా అదృష్టం అని నేననుకోడం"

"మన పెళ్ళి సంగతి మర్చిపో ఇంకొకర్ని చేసుకో"

"అది జరగని పని"

"అయితే ఒంటరిగా ఉండిపోతావా?"

"నీ జ్ఞాపకాల్లో నేనొంటరిని కాను. నువ్వు నా తలపుల్లో నిరంతరం ఉంటావు. ఏదో ఒక రోజు మనం మళ్ళీ కలుసుకుంటాం అని నా మనస్సు చెప్తోంది"

"నేన్నీకు దూరం అవుతానని అనిపించిందన్నావు. అది నిజమయింది. ఇదీ నిజమవుతుందేమో"

"అవుతుందనే అనిపిస్తోంది నాకు. మనం మళ్ళీ కలుసుకుంటాం. అంతవరకూ నీకోసం ఎదురుచూస్తుంటాను చెయ్యిజారిన అదృష్టాన్ని తలచుకుంటూ"

"నీకంతలా అనిపిస్తే మనం పెళ్ళి చేసుకుందాం"

"నీకిష్టం లేని పని వద్దు"

"నిన్ను పెళ్ళిచేసుకోవడం నాకో వరం కళ్యాణీ! అదే సంభవిస్తే నా జీవితానికి అంతకన్నా కావల్సిందేముంది? అయితే నన్ను పెళ్ళి చేసుకోడంవల్ల నీకు సుఖం కలగదన్న కారణంతో వద్దంటున్నాను. ఇద్దరికీ ఇష్టమైతే ఆలస్యం దేనికి? లే" అన్నాడు మోహన్.

లేచింది కళ్యాణి.

ముందు నడిచాడు మోహన్.

అనుసరించింది కళ్యాణి.

ఇద్దరూ వంటింట్లోకి వెళ్ళారు.

పసుపుకొమ్మునీ, పసుపునీ, దారాన్నీ తెమ్మన్నాడు మోహన్.

తెచ్చింది కళ్యాణి.

వాటితోపాటు కొవ్వొత్తినీ, అగ్గిపెట్టెనూ తెచ్చింది.

అగ్గిపెట్టెలోంచి పుల్ల తీసి, వెలిగించి, దాంతో కొవ్వొత్తిని వెలిగించి పట్టుకుంది. దారానికి పసుపు రాసి, పసుపు తాడుకి పసుపు కొమ్ముని కట్టి పట్టుకున్నాడు మోహన్.

కళ్యాణి చేతిలోని కొవ్వొత్తి అగ్ని హోత్రం అయింది.

మోహన్ చేతిలోని పసుపుతాడు మంగళసూత్రం అయింది.

కళ్యాణి మెడ వంచింది.

చేతిలోని పసుపుతాడుని కళ్యాణి మెళ్ళో కట్టాడు మోహన్.

అగ్ని సాక్షిగా

అంతకన్నా ముఖ్యంగా, వాళ్ళిద్దరి మనస్సాక్షిగా

వాళ్ళ పెళ్ళయింది

ఒకరి చేతులు పట్టుకుని ఒకరు నడవసాగారు.

ఇంటి గుమ్మం దగ్గరికి చేరాక "ఇంక వస్తాను" అన్నాడు మోహన్. అలా అంటున్నప్పుడు అతని కంఠం వణికింది. ఏడుపుని ఆపుకోలేనట్లు.

"ఇప్పుడింక మీ ఇంటికి వెళ్ళి మీ వాళ్ళకి ధైర్యం చెప్పగలను" అంది కళ్యాణి తాళిని గర్వంగా చూసుకుంటూ. అలా అంటున్నప్పుడు కళ్యాణి కంఠం వణికింది ఆనందం పట్టలేనట్లు.

"ఈసారి నిన్ను కలిసినప్పుడు నువ్వు పోలీస్ డ్రెస్‌లో ఉంటావేమో ఎంత అందంగా ఉంటావో" అంటూ కదిలాడు మోహన్.

"తప్పకుండా కలుస్తాం" అంది అతన్నే చూస్తూ కళ్యాణి.

సాగిపోయాడు మోహన్ అజ్ఞాతంలోకి.

**అజ్ఞాత పర్వం - బహిర్యుద్ధం**

# 7

అర్ధరాత్రి పన్నెండయింది.

చుట్టూ ఏ పక్కయినా రెండు మైళ్ళ దూరంలో ఊరులేని అడవిలో ఓ పెద్ద మర్రిచెట్టు కింద రాలిన ఆకులమీద పడుకుని ఆలోచిస్తున్నాడు మోహన్.

అతనికి కొంచెం దూరంలో ఓ రాయిని ఆనుకుని కూర్చునుంది అరుణ.

అడవిలోని ఎండు కొమ్మలతో వాళ్ళు వెలిగించుకున్న నెగడు వెలుగు తప్ప మరో కాంతి లేదు పరిసర ప్రాంతాలలో.

ఎక్కడో దూరంగా అప్పుడప్పుడు ఓ నక్క కూత, ఓ గుడ్లగూబ అరుపు వినిపిస్తున్నాయి. కీచురాళ్ళ రొద నిర్విరామంగా వినిపిస్తోంది. ఆ వాతావరణానికి బాగా అలవాటుపడ్డవాళ్ళలా స్థిరంగా ఉన్నారిద్దరూ.

మోహన్ నిశ్శబ్దంగా ఉండడం చూసి అడిగింది అరుణ.

"ఏమిటి ఆలోచిస్తున్నారు అంత తీవ్రంగా?"

"సరిగ్గా మూడేళ్ళక్రితం ఈరోజు నేను ఆలోచనలకి స్వస్తి చెప్పాను కార్య రంగంలోకి దూకడానికి. టైం ఎంతయింది? అన్నాడు" అరుణ కూర్చున్నవైపుకి తిరిగి, తల బరువును చేతిమీదకి ఆనిస్తూ.

"పన్నెండు దాటింది" అంది చేతికున్న వాచీ చూసుకుంటూ అరుణ.

"కళ్యాణి దగ్గర సెలవు తీసుకున్న టైం ఇది. ఎలాగుందో కళ్యాణి?"

"ఆ తర్వాత మీరు మీ వాళ్ళని కలుసుకోలేదా?"

"మా అమ్మనీ, చెల్లెలినీ అప్పుడప్పుడు కలుసుకుంటున్నాను. చెల్లెలు డిగ్రీ చదువుతోంది. అమ్మ అరోగ్యంగా ఉంది. నేను లేని జీవితానికి అలవాటుపడిపోయారు వాళ్ళు. కళ్యాణిని కలవడం అవలేదు. అవలేదు కాదు కలవాలనిపించక నేనే వెళ్ళడం లేదు విజయవాడ"

"ఎందుకని?"

"ఏమో తెలియదు"

"అమ్మా, చెల్లెలూ మావయ్యగారి దగ్గరే ఉన్నారా?"

"ఊఁ!"

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం మళ్ళీ.

కొంచెంసేపయ్యాక అరుణ అడిగింది

"వాళ్ళని – ముఖ్యంగా కళ్యాణిని వదిలివచ్చేసినందుకు బాధగా ఉందా ఇప్పుడు?"

"వెనక్కి తిరిగి చూసుకుని నేను చేసింది తప్పా, కాదా అన్న ప్రశ్న నేనెప్పుడూ వేసుకోలేదు. తాళికట్టిన వెంటనే భార్యను వదిలేసివచ్చినవాడిని. నాకు బాధేంటి?" అంటూ నవ్వాడు మోహన్.

"మీరు కొన్ని సంఘటనల కారణంగా ఓ ఆవేశంతో అందరినీ వదిలిపెట్టి వచ్చేశారు ఆరోజు. ఆ ఆవేశం చల్లారాక ఆలోచిస్తే మీరు చేసింది తప్పని మీకనిపించిందా?"

"నాకు ఇక్కడికి రావాలన్న ఆలోచన ఆవేశంలోంచి వచ్చింది కాదు. నా చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూసేవాణ్ణి నేను. అందులో కొందరి స్వార్థం, మోసం కారణంగా ఎందరో అనుభవిస్తున్న వేదనను చూశాను. ఆ వేదన నాలో ఆవేదనను కలిగించింది. ఆ ఆవేదనలో నుండి వచ్చిన ఆలోచన నాది. ఆ ఆలోచన చాలా రోజులుగా ఉంది. అది నాన్న హత్యతో కార్యరూపం దాల్చింది"

"మీ నాన్నగారు గుండెనొప్పితో మరణించారని డాక్టర్ చెప్తే, మీరు హత్య అంటున్నారేంటి?" అంది అరుణ నవ్వుతూ.

"తెలిసే అడుగుతున్నావు నువ్వు అందుకే నవ్వుతున్నావు కూడా. ఈ రోజు ఇలా కూర్చుంటే నాకెందుకో నీ గతం గురించి తెలుసుకోవాలని ఉంది. నేనెప్పుడూ నిన్నడగలేదు. నువ్వు చెప్పలేదు. నీకు అభ్యంతరం లేకపోతే చెప్పు. హైదరాబాద్‌లో హాయిగా బి.ఏ. చదువుకునే అమ్మాయి అక్కడ నుండి ఈ భీకరారణ్యంలోకి ఎలా చేరిందో?"

అరుణ ఆకుల మధ్యనుండి ఆకాశాన్ని చూస్తూ చెప్పసాగింది

"మీకు వినాలన్న కోరిక ఉండదనుకుని నా గురించి నేనెప్పుడూ చెప్పుకోలేదు. నిజానికి చెప్పుకోవాల్సింది కూడా ఏమీ లేదు. నాకు ఇంటర్ చదివే రోజుల నుండి విప్లవం అంటే ఇష్టం ఉండేది. చుట్టూ జరుగుతున్న అన్యాయాల్ని సహించడం నాకు చేతకాని పని. ఆ అన్యాయాల్ని ఎదిరించడానికి యువతీ యువకుల్ని పోగుచేసుకుని మీటింగులు పెట్టించేదాన్ని. బంద్‌లు చేయించేదాన్ని. స్టూడెంట్ యూనియన్ యాక్టివిటీస్‌లో చాలా చురుగ్గా తిరుగుతుండేదాన్ని. అలాంటి రోజుల్లో గద్దర్ పాటలు వినే అవకాశం కలిగింది.

డిగ్రీలో చేరాక ఇలాంటి అభిప్రాయాలున్నవాళ్ళతో స్నేహం పెరిగింది. అయితే ఈ స్నేహాలు నేను పుట్టి పెరిగిన వాతావరణానికి పూర్తిగా వ్యతిరేకం. మా నాన్న వైదిక కర్మలు చేయించే బ్రాహ్మణుడు. ఆయన బాగా డబ్బున్నవాళ్ళ ఇళ్ళకి వెళ్లి వాళ్లకి కావాల్సినట్టు వైదిక కర్మలు చేయించేవాడు. చేయించుకునేవాళ్ళ ఇష్టాయిష్టాలకనుగుణంగా ఆయన కర్మ చేయించడం చూశాక, నాకు వైదిక కర్మలమీద నమ్మకం పోయింది. అలానే డబ్బున్నవాళ్ళని దగ్గరనుండి చూడ్డంతో, వాళ్ళు డబ్బు సంపాదించేందుకు చేసే మోసాలు, సంపాదించాక చేసే దౌర్జన్యాలు బాగా చూశాను.

దాంతో నాకీ వ్యవస్థమీద రోత పుట్టింది. ఈ వ్యవస్థని మార్చేందుకు ఇదొక్కటే మార్గం అని నిర్ణయించుకుని ఇలా వచ్చేద్దామనుకున్నాను.

"నాలుగేళ్ళక్రితం ఓ రాత్రి మరో ఇద్దరితో కలిసి వచ్చేశాను"

"ఎవరా యిద్దరు?"

"పోరాటంలో మరణించారు సుధాకర్. సురేంద్ర. ఇద్దరూ బి.ఏ. చదువుతుండేవారు. వాళ్ళే నాకు ఆర్థిక, సామాజిక శాస్త్రాల్ని మొదట్లో నేర్పింది. తర్వాత నేనే చదువుకున్నాను. కొన్నాళ్ళు యూనివర్సిటీ లైబ్రరీలోనే రోజులు రోజులు గడిపేశాను క్లాసులకి వెళ్ళకుండా. క్లాసు రూముల్లో చెప్పే పాఠాలు జీవితానికి అనవసరం అని నాకానాడే తెలుసు"

"ఆర్థికశాస్త్రం, మార్క్సిజం– ఇవన్నీ క్లాసుల్లో కూడా నేర్పిస్తున్నారుగా" అని మోహన్ అంటూంటే గట్టిగా నవ్వింది అరుణ.

నవ్వి అంది

"మార్క్సిజాన్ని నేర్పేవాడు మార్క్సిజాన్ని శ్వాసగా పీల్చాలి. అనుక్షణం అందులోనే మునిగి ఉండాలి. కీన్స్‌ని, మాల్థూస్‌ని చెప్పినట్లు కాదు మార్క్స్‌ని చెప్పడం. మనుషుల్ని, మానవ సమాజాల్ని, మానవ నాగరికతల్ని అన్నిటినీ ఒక సూత్రంతో సమన్వయపరిచాడు మార్క్స్. తక్కినవాళ్ళు సమస్యని తప్పుగా చూసినవాళ్ళే. ఒక్కమార్క్స్ తప్ప.

అలాంటి ఋషి ప్రవచించినదాన్ని ఈ లెక్చరర్లు చెప్పగలరా? వాళ్ళు నేర్చుకున్నదెక్కడా? ఇలాంటి మనస్తత్వం ఉన్న లెక్చరర్లు చెప్పింది విని. అలా నేర్చుకున్నవాళ్ళకి ఏం అవగాహన వస్తుంది? ఇలాంటి మోసం చదువుల్ని మీరెందుకు సమర్థిస్తున్నారు?"

"నేను సమర్థించడంలేదు. అలాగని సమర్థించకపోవడమూ లేదు. సమస్యని మార్క్స్ కూడా ఓ కోణంలోంచే చూసుండచ్చు. ఈ విషయం నాకింకా పూర్తిగా అర్థం కాలేదు. అయినా అర్థం చేసుకునే ప్రయత్నంలో కాలం వ్యర్థం అవుతోందేమోనని ఇలా గన్ను చేతబట్టాను" అన్నాడు పక్కనున్న రైఫిల్‌ని చూసుకుంటూ.

"ఒకవేళ తెలియకే మీరీ పని చేసినా మంచిపని చేసినట్లే" అంది అరుణ.

"మంచి చెడ్డల్ని మనం నిర్ణయించలేం. మనమే కాదు ఎవ్వరూ నిర్ణయించలేరు. ఎందుకంటే లోకంలో ఒకరికి మంచి అయింది మరొకరికి చెడు అవుతోంది. సమాజంలో చాలామందికి మంచి అయింది మంచి అని మనం అనుకుంటే మనం చేస్తున్నది మంచి అవచ్చు. అయితే చివరికి మంచి చెడ్డల్ని నిర్ణయించాల్సింది కాలం"

"మీలో మెట్ట వేదాంత ధోరణి కొంత ఉంది. అది ఈ ఉద్యమంలోని వాళ్ళకి ఉండకూడనిది"

"అయినా నేనీ ఉద్యమంలో ఉన్నాను. ఊరికే కాదు ఉద్యమంలో సంపూర్ణంగా

ములిగిపోయి ఉన్నాను. బయట శక్తులతో మూడేళ్ళుగా పోరాడుతున్నాను. అందుకని నువ్వు మెట్ట వేదాంతం అంటున్నది నాలో ఉండడం వల్ల పెద్ద నష్టం లేదు"

"మీకు కోపం తెప్పించి ఉంటే సారీ. నా ఆలోచనల్ని నాలో దాచుకోకుండా ఎదుటివాళ్ళతో అనడం నా అలవాటు. ఏమీ అనుకోకండి"

"నాకేం కోపం రాలేదు. అభిప్రాయాలు కలవకపోవడం మనుషుల మధ్య సహజం. దాన్ని పర్సనల్‌గా తీసుకోను నేను. కళ్యాణికి, నాకూ కూడా అభిప్రాయాలు కలవలేదు. అయినా పెళ్ళి చేసుకున్నాం"

"మీరంతగా ప్రేమిస్తున్న కళ్యాణిని చూడాలని ఉంది నాకు" అంది కొంత అసూయ కంఠంలో వినిపిస్తుండగా అరుణ.

"దాన్ని ప్రేమని నేను అనుకోవడం లేదు. దాన్ని ప్రేమని నువ్వు అన్నా అది సాధారణంగా యువతీయువకుల మధ్య ఉండే ప్రేమలాంటిది కాదు"

"ప్రేమిస్తున్నవాళ్ళంతా అలానే అనుకుంటారు వాళ్ళ ప్రేమ మాత్రం గొప్పదనీ, తక్కినవాళ్ళది శారీరకాకర్షణలనీ" అంది మధ్యలో.

"నువ్వేం అనుకున్నా నాకు అభ్యంతరం లేదు. నాకు తెలిసినంతవరకూ కళ్యాణి నాలో భాగం. నేనూ, కళ్యాణీ వేరుగా అనిపించడంలేదు నాకు. అయినా మా విషయం ప్రస్తుతం అప్రస్తుతం. నువ్వు కళ్యాణిని చూసే రోజు రావాలని నేనూ కోరుకుంటున్నాను"

"కళ్యాణిగారు కూడా ఉద్యమంలో చేరాలని మీ ఆశా?"

"మనం కలిసేందుకు కళ్యాణి ఉద్యమంలో చేరక్కర్లేదు"

"మనం ఉద్యమంలోంచి తప్పుకుంటామా?"

మోహన్ ఏమీ మాట్లాడలేదు. అరుణ రెట్టించలేదు.

చాలాసేపు ఇద్దరూ మౌనంగా ఉన్నాక "టైం ఎంతయింది" అని అడిగాడు మోహన్. తన వాచీ చూసుకుని– "ఒంటిగంటన్నర అయింది" అంది అరుణ. అని తనే మళ్ళీ అడిగింది

"మీరెందుకు వాచీ పెట్టుకోరు?"

"డిగ్రీ చదువుతున్న రోజుల్లో నేనోసారి మా నాన్నగార్ని వాచీ కొనివ్వమని అడిగాను. ఆయన డిగ్రీ అయ్యాక కొనిస్తానని అన్నారు. ఆయన పోయాక నాకెందుకో వాచీ పెట్టుకోవాలని అనిపించడంలేదు. అయినా పైసా సంపాదనలేని నేను వాచీ ఎలా కొనుక్కుంటాను?"

"సంపాదన పైసల్లో లేదు– లక్షల్లో ఉంది. ఈ ఉద్యమం ఎలా నడుస్తోంది? దానికెంత ఖర్చవుతోంది? ఈ డబ్బంతా ఉద్యమకారులది. ఇక్కడ ఆస్తి సమిష్టి ఆస్తి"

"మనం దోచుకున్న డబ్బది. అది మనదెలాగవుతుంది?"

"మనం చేసేది దోపిడీ కాదు. దోపిడీ ఈ సమాజంలో ఉంది. లేనివాళ్ళ శ్రమని

దోపిడీచేసి కొందరు ఉన్నవాళ్ళవుతున్నారు. వాళ్ళనుండి లేనివాళ్ళకి చెందాల్సినదాన్ని మనం తీసుకుంటున్నాం"

"బ్యాంకుల్లో డబ్బు దాచుకుంటున్నవాళ్ళందరూ డబ్బున్న వాళ్ళు కాదు"

"అసలు బ్యాంకులున్నవి డబ్బులున్నవాళ్ళకోసం. పేరుకి మాత్రం పేదల కోసం స్కీములు పెడతారు. కానీ చివరికి డబ్బంతా చేరేది ఉన్నవాళ్ళ దగ్గరికే. బ్యాంకులే కావు ఈ దేశంలోని సంస్థలన్నీ ఉన్నవాళ్ళకే. అలాంటివాటి నుండి మనం డబ్బు తీసుకుని లేనివాళ్ళకివ్వడంలో తప్పులేదు"

"తప్పొప్పుల్ని నిర్ణయించేటంతవాళ్ళం కాదు మనం. అందుకే ఆ ప్రసక్తి వదిలెయ్యి. అక్కడనుండి మనం తీసుకుంటున్న డబ్బంతా లేనివాళ్ళకి వెళ్ళడం లేదు. అందులో కొంత మనం అచ్చువేసే కాగితాలకీ, మన ఆయుధాలకీ, మన మందులకీ, మన తిండికీ, మన వాచీలకీ కూడా ఖర్చవుతోంది"

"మనకయ్యే ఖర్చంతా ఉద్యమం ఖర్చు. ఉద్యమం సమాజంలోని బలహీనవర్గాల కోసం. అందుకని అందులో దోషంలేదు"

"మన పనులు మనకి సమర్థనీయంగా కనిపిస్తాయి. దానికోసం ఎంతతర్కమైనా దొరుకుతుంది. అది వదిలెయ్యి. రేపు మనం ఇక్కడనుండి ఎక్కడకి వెళ్దాం? తక్కినవాళ్ళు ఎప్పుడు వస్తారో?"

"వాళ్ళు పక్కనున్న గూడెంలో మందులు పంచేందుకు వెళ్ళారు. రేపు సాయంత్రానికికానీ రాకపోవచ్చు. అంటే మనం ఇంకో రోజు ఉండాలి ఇక్కడ"

"ఇలా పని లేకుండా ఉండడం కష్టం. ఏదో ఒక పని ఉండాలి. రేపటికి మనం కూడా ఏదో ఒక గ్రామానికి వెళ్దాం. ఈ పరిసరాలు నాకు కొత్త. నీకు బాగా తెలుసా?"

"రెండేళ్ళ క్రితం ఒక్కసారి వచ్చాను. నాకూ బాగా తెలియదు"

"ఓ వారంలో ఇక్కడ మీటింగ్ జరుగుతుంది. అప్పుడు మనకి ఇక్కడ ఉన్న సమస్యలు బాగా తెలుస్తాయి"

"అడవి ప్రాంతాలలో కూడా ఇది బాగా వెనకబడిన ప్రదేశం. ఇక్కడ వెనకబడ్డ జాతులవారికి చెందాల్సిన పొలాల్ని దూరప్రాంతాల నుండి వచ్చినవారు లాగేసుకుని వాళ్ళచేతే సేద్యం చేయిస్తున్నారు. నేల వీళ్ళది శ్రమ వీళ్ళది ఫలితం వాళ్ళనుభవిస్తున్నారు. అన్నిచోట్లా జరిగేదే ఇక్కడ ఎక్కువ జరుగుతోంది"

"మనం వాళ్ళలో చైతన్యం తెచ్చేందుకు ప్రయత్నించాలి"

"అదంత సులభం కాదు. మనం అంతకు ముందు పనిచేసిన ప్రాంతంలో మనుషులకి తిరుగుబాటు మనస్తత్వం లేకపోయినా తమకి అన్యాయం జరుగుతోందని

తెలుసు. ఇక్కడ ప్రజలు ఇదే జీవితమనుకుంటున్నారు. వాళ్ళకి మనం ముందు అవగాహన తెప్పించాలి. ముందే తిరుబాటు గురించి మాట్లాడితే, అది బెడిసికొట్టవచ్చు"

"ఇంతవరకూ ఇక్కడ పనిచేస్తున్నవారు ఏం చేస్తున్నారో వారం రోజుల తర్వాత జరిగే మీటింగ్‌లో తెలుస్తుంది మనకి"

"విడివిడిగా మనం అందరితోనూ కమ్యూనికేషన్ ఏర్పరుచుకోగలిగాం. ఇంక అందరం కలిసే మీటింగ్ ఉంది"

"అంతవరకూ మీకు మనస్థిమితం లేనట్లుంది" అంది అరుణ.

"అసలు స్థిమితం రాదేమో. ఎందుకంటే మన అంతిమ ఆశయం సమసమాజం. అది ఇప్పుడే రాదు. మనం జరుపుతున్నది తొలి పోరాటం. మన పోరాటపు ఆశయాలూ, విధానాలూ చాలా మందికి తెలిసి, వాళ్ళకవి నచ్చి, వాళ్ళందులో చేరి, అలా ఉద్యమం పెరిగి పెద్దదై ఇప్పటి వ్యవస్థని కూకటి వేళ్ళతో సహా పెకిలించి వెయ్యాలి. అప్పుడే కదా నిజమైన స్థిమితం. అంతవరకూ అంతా యుద్ధమే. సమసమాజం సంపూర్ణంగా స్థాపించేవరకూ మనకు శత్రువులు ఉంటూనే ఉంటారు. యుద్ధం జరుగుతూనే ఉంటుంది"

"అవును ఈ యుద్ధం జరుగుతూనే ఉంటుంది. ఉన్న వర్గం, ఆ వర్గాన్ని కాపాడుకోడం కోసం, ఆ వర్గమే నిర్మించుకున్న రక్షణ వ్యవస్థలు నాశనమయ్యేవరకూ"

"లేకుంటే మనం చచ్చిపోయేవరకూ"

"మనం చచ్చిపోతే మనలాంటివాళ్ళు వందలూ, వేలూ ఉద్యమంలోకి వస్తారు. విప్లవం మరణించదు"

"ఓ విప్లవగీతం పాడు అరుణా" అన్నాడు మోహన్.

"ఏ పాట పాడను?" అంది అరుణ.

"నీ ఇష్టం నీకిష్టమైంది ఏదయినా సరే"

"నాకిష్టమైంది మీక్కూడా ఇష్టమేనా?"

"నీకిష్టమైంది నువ్వు పాడితే, అది ఒక్క గొంతుతోనే కాకుండా గుండెతో కూడా పాడతావు. అలా పాడిన పాట చాలా బావుంటుంది"

అరుణ పాడ్డం మొదలెట్టింది.

వడిగా ప్రవహించే సెలయేరు సవ్వడిలా ప్రారంభమైన పాట ఎత్తైన కొండల మీద నుండి దూకే జలపాతం హోరులా మారింది.

కొన్ని వందల వేల అనాథల బాధలు వినిపించాయి అరుణ గొంతులో. అదే గొంతులో ఆ బాధితుల విప్లవ నినాదాలు వినిపించాయి.

కురుక్షేత్ర సంగ్రామంలో కృష్ణార్జునులిద్దరూ ఒకేసారి శంఖాలు పూరించినట్లు

వినిపించసాగింది ఆ పాట.

అది యుద్ధానికి సైనికుల్ని సన్నద్ధం చేసేందుకు వినిపించే మార్చింగ్ బ్యాండ్‌లా ఉంది.

విన్నవారి శరీరాల్లోని రక్తం సుడులు తిరుగుతూ ప్రవహింపచేసేట్లుంది.

ఆ స్థితిలోకి చేరుకుంటున్నాడు మోహన్.

నెమ్మదిగా వీస్తున్న గాలి అరుణ గొంతులోంచి వస్తున్న ఆ పాటని అడవిలోని ప్రతి ఆకు దగ్గరికీ, కొమ్మ దగ్గరికి, చెట్టు దగ్గరికి తీసికెళ్ళింది. ప్రతి పక్షికీ, ప్రతి జంతువుకీ వినిపించింది.

అడవిలోని ఆ పరిసర ప్రాంతమంతా అరుణ పాటకి మేలుకొని, పూర్తి ఏకాగ్రతతో వింటున్నట్లు ప్రశాంతంగా, గంభీరంగా ఉంది.

అరుణ పాడే పాటలోని చరణాలు కిరణాల్లా ప్రకాశిస్తుంటే అడవిలో అర్ధరాత్రి అరుణోదయమైనట్లుంది.

## 8

"ఈ కిడ్నాపులు నాకు కొంచెం కూడా ఇష్టంలేదు" అన్నాడు మోహన్.

ఓ చిన్న పల్లెటూరికి పక్కనున్న పెద్ద చెరువు గట్టుమీద ఉన్న చెట్లనీడలో చర్చ జరుగుతోంది.

మోహన్, అరుణలతోపాటు మరికొంతమంది ఆ ప్రాంతంలో పని చెయ్యడానికి కొత్తగా వచ్చారు. అప్పటికే అక్కడ పని చేస్తున్న మరికొందరితో కలిసి కూర్చుని ఆ ప్రాంతంలోని ప్రజల కష్టాల గురించీ, అంతకుముందు నుండి అక్కడ జరుగుతున్న కార్యక్రమాల గురించీ, భవిష్యత్తులో చెయ్యాల్సిన పనుల గురించి చర్చించుకుంటున్నారు.

సాయంత్రం సూర్యుడు అస్తమించాక ప్రారంభమైన మీటింగ్ గంటపైగా సాగుతోంది.

"మనవాళ్ళని విడిపించుకుందుకు అదే సులభమైన పద్ధతి" అన్నారొకరు.

అక్కడున్నవాళ్ళందరూ వలయాకారంలో కూర్చునున్నారు. ఒకరు మాట్లాడు తున్నప్పుడు మరొకరు మాట్లాడ్డంలేదు. అందరూ తమ అభిప్రాయాల్ని నిర్భయంగా చెప్తున్నారు. ఒకళ్ళు చెప్పింది పూర్తిగా విన్న తర్వాతే ఇంకొకళ్ళు మాట్లాడుతున్నారు. నలభై మందికి పైగా కూర్చుని మాట్లాడుకుంటున్నా అక్కడ ప్రశాంతంగా ఉంది.

"అది సులభమైన పద్ధతి అవచ్చు కానీ మంచి పద్ధతి కాదు" అన్నాడు మోహన్.

"మంచి చెడ్డల్ని మనం ఎవ్వరం నిర్ణయించేందుకు?" అంది అరుణ.

"అవును–చెడుని నిర్మూలించే ప్రయత్నంలో మనం రకరకాల పనులు చెయ్యాల్సి రావచ్చు. మన గమ్యం మనకి స్పష్టంగా తెలిసినప్పుడు మనం మార్గం గురించి పట్టించుకో కూడదు. ఈ సమాజంలోని కుళ్ళుని తొలగించే ప్రయత్నంలో ఉన్నాం మనం. అందుకు సాయుధ పోరాటాన్ని మార్గంగా ఎన్నుకున్నాం. పోరాటంలో ఎవరు మరణిస్తారో చెప్పలేం. మనల్ని అన్నివైపుల నుండి చుట్టిముట్టి కాల్చి చంపెయ్యడం లేదా పోలీసులు? ఒంటరిగా దొరికితే జైళ్ళలో పడెయ్యడం లేదూ? అలాంటప్పుడు మనవాళ్ళని విడిపించుకుందుకు కిడ్నాప్ చేస్తే తప్పేముంది? కిడ్నాప్ చేసి చంపడం మన ఉద్దేశం కాదు. మనవాళ్ళని విడిపించుకుందుకు మాత్రమే మనమీ పని చేస్తున్నాం" అన్నారెవరో అరుణని సమర్థిస్తున్నట్లు.

తన వాదనని వదలకుండా అన్నాడు మోహన్– "మనం పోరాడుతున్నది ఈ సమాజంలోని అసమానతల్ని తొలగించేందుకు. అసమానతలు ఎందుకు, ఎవరివల్ల ఉన్నాయో అని ప్రశ్నించుకుని వాళ్ళని తొలగించితే అసమానతలు పోతాయి. దానికోసం అమాయకుల్ని కష్టపెట్టడం సరియైన పనికాదు"

"అసమానతలకి, అన్యాయాలకి కొందరు మనుషులు మాత్రం కారణం కాదు. ఈ సమాజం వర్గాలుగా విడిపోయి వుంది. ఓ వర్గం మరో వర్గాన్ని దోస్తోంది. ఏ వర్గం ఏ వర్గాన్ని దోస్తోందో స్పష్టంగా తెలుస్తోంది. రాజకీయనాయకులూ, పరిశ్రమలు నడిపేవాళ్ళూ, వ్యాపారస్తులూ, భూస్వాములు–వీళ్ళంతా దోస్తున్నారు. తమ దోపిడీ సవ్యంగా జరుపుకుందుకు వాళ్ళు నియమించుకున్న సేవకులు పోలీసులూ, జడ్జీలూ, గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నవాళ్ళు. అలాంటివాళ్ళని కిడ్నాప్ చెయ్యడంలో తప్పు లేదు" అన్నారు కిడ్నాప్‌ని సమర్థిస్తూ మరొకరు.

సమాధానంగా మోహన్ అన్నాడు "నేను తప్పొప్పుల గురించి మాట్లాడ్డం లేదు. మనం ఈ కిడ్నాపుల వ్యవహారంలో ఇరుక్కుంటే మన గమ్యం మర్చిపోతాం. అసలు పనిని వదిలేసి చిన్న గొడవల్లో పడిపోతాం. మనం మన గోల్‌ని ఫోకస్‌లో ఉంచుకోవాలంటే, ఇలాంటి గొడవల్లో పడకపోవడం మంచిదికదా?"

"కిడ్నాప్‌లు చెయ్యచ్చా, చెయ్యకూడదా అన్న వాదన ఇంక అనవసరం. మన ఉద్యమకారుల్ని మనం రక్షించుకుందుకు మనకున్న ముఖ్యమైన ఆయుధం కిడ్నాప్. అంతగా మీకు నచ్చకపోతే ఇక్కడున్నవాళ్ళలో మెజారిటీకి నచ్చిందా లేదా అని ఓటింగ్‌కి పెట్టుకుందాం" అన్నారెవరో.

"ఓటింగ్ అవసరం లేదనుకుంటాను. ఫారెస్టాఫీసర్ని కిడ్నాప్ చెయ్యడానికి ఇక్కడ మోహన్‌గారికి తప్ప ఇంకెవ్వరికీ అభ్యంతరం ఉన్నట్లు లేదు. ఇంకెవరికన్నా అభ్యంతరం ఉంటే చేతులెత్తండి" అంది అరుణ.

ఒక్క చెయ్యికూడా లేవలేదు.

"మనం కిడ్నాప్ చెయ్యడానికి ఎవ్వరికీ అభ్యంతరం లేదు కాబట్టి, ఎలా చెయ్యాలో, ఎవరు చేస్తారో నిర్ణయించుకుందాం" అంది అరుణ.

"నేనూ, మావాళ్ళు చేస్తాం" అన్నాడు మోహన్.

"ఇంతసేపూ అసలు చెయ్యక్కర్లేదని వాదించారుకదా మీరు" అన్నారొకరు నవ్వుతూ.

"నా అభిప్రాయాలు చెప్పడం తప్పు కాదుగా, మనం అందరం కలిసి ఒక అభిప్రాయానికి వచ్చాక, అది అమలు జరపడం కోసం నేను పని చేస్తాను. కొత్తగా వచ్చినవాళ్ళం కదా మాకీ అవకాశం ఇవ్వండి" అన్నాడు మోహన్.

"కొత్తగా వచ్చిన మీకు ఇంకా ఇక్కడ పరిస్థితులు పూర్తిగా తెలిసి ఉండవు. ఈసారికి మాలో ఒకరిని చెయ్యనియ్యండి" అన్నారు అంతకుముందు నుండి అక్కడ పనిచేస్తున్న వాళ్ళలోని ఒకరు.

"మీ ఇష్టం" అని ఊరుకున్నాడు మోహన్.

తర్వాత అక్కడ అంతకుముందు నుండి ఉన్నవాళ్ళు వాళ్ళలో ఎవరా పని చెయ్యాలా అని వాదించుకోసాగారు. అందరూ ఆ పనిని తాము ఎందుకు చెయ్యాలో వివరించుకుని చివరికి ఎవరు చెయ్యాలో తెగక సతమతమవుతున్న సమయంలో

"కొత్తగా వచ్చినవాళ్ళకి ఇలాంటి పనితో మొదలెడితే ఇక్కడి విషయాలు బాగా తెలుసుకునే అవకాశం కలుగుతుంది. ఆ అవకాశం మాకు ఇవ్వండి" అంది అరుణ కల్పించుకుని.

"పోనీ అలా చేద్దామా" అని అడిగారందులో ఒకరు. తక్కినవాళ్ళు సరేననక పోయినా, సరేనన్నట్లు మౌనంగా ఉండిపోయారు.

"అయితే అందరూ ఒప్పుకున్నట్లేకదా. ఈ పనిని నేనూ, మోహన్, మావాళ్ళం చేస్తాం. మాకు కావాల్సిన సమాచారాలు, సలహా సహకారాలూ మీరందరూ అందిస్తారని ఆశిస్తున్నాను" అంది అరుణ.

"తప్పకుండా" అన్నారందరూ.

"త్వరలోనే ఫారెస్టాఫీసర్ని కిడ్నాప్ చేస్తాం. తర్వాత పోలీసుల్ని కాంటాక్ట్ చేసి మనవాళ్ళని విడిపించుకుందాం. ఈ కిడ్నాప్ గురించి మాట్లాడేందుకింక ఏమీ లేనట్లేకదా?" అంది అరుణ.

ఎవ్వరూ మాట్లాడలేదు.

"ఈ ఊళ్ళోని ప్రజలకి మనం అంటే గౌరవం పెరిగింది. అందుకే మనం ఈ చెరువు గట్టుమీద ఇలా మీటింగ్ పెట్టుకోగలిగాం. ఇలాంటి ఊళ్ళు మనకింకా కావాలి.

అయితే ఇక్కడకొచ్చిన కొన్నాళ్ళలో నేను చూసిందేమిటంటే, ఈ ప్రాంతంలోని చాలా ఊళ్ళలోని ప్రజలకి మనమంటే నమ్మకం లేదు. మన ఉద్యమం బలం పుంజుకోవాలంటే మనకి ప్రజల మద్దతు కావాలి. అందుకు అవసరమైన పనులు మనం చేపట్టాలి. దాని గురించి ఆలోచించాలి" అన్నాడు మోహన్ మరో విషయాన్ని ప్రస్తావిస్తూ.

"ప్రజలకి మన మీద నమ్మకం కలగాలంటే వాళ్ళకి మనం చేస్తున్న పనులు తెలియాలి. ఆ పనులు వాళ్ళకి ఉపయోగకరం అని వాళ్ళు అనుకోవాలి. అంతకుముందు వాళ్ళతో మనకి స్నేహం కావాలి. వాళ్ళకి చదువు చెప్పడం, వాళ్ళకి మందులు ఇవ్వడం, వాళ్ళ పనుల్లో వాళ్ళకి సాయం చెయ్యడం వల్ల మనం స్నేహాన్ని సాధించవచ్చు. అలా వాళ్ళకి మనం వాళ్ళకోసమే పని చేస్తున్నామని చెప్తే, వాళ్ళసాయం మనకి దొరుకుతుంది" అంది అరుణ.

"ఈ పనులు మేం చాలా రోజులుగా చేస్తున్నాం. కానీ ప్రజల్లోకి వెళ్ళలేకపోతున్నాం. దానికి ముఖ్యమైన కారణం మన గురించి పోలీసులూ, భూస్వాములూ చేసే ప్రోపగాండా. మనం గూండాలమనీ, ప్రజల పచ్చి నెత్తురు తాగుతామనీ, జనం కాళ్ళూ, చేతులూ నరికేస్తామనీ వాళ్ళ అభిప్రాయం. ఇలాంటి అభిప్రాయాలు వాళ్ళకి కలిగిస్తున్నది ఇక్కడి భూస్వాములు" అన్నారొకరు.

"మనం మన పనులతో ఆ అభిప్రాయాల్ని పోగొట్టాలి. మన ప్రవర్తన వాళ్ళ అభిప్రాయాల్ని ధృవపరిచేటట్లు ఉండకూడదు. ప్రజాకోర్టుల పేరన మనం కొందరి మనుషుల్ని చంపడం, నరకడం చేస్తుండడంవల్లనే వాళ్ళకీ అభిప్రాయం కలిగి ఉంటుందని నా ఊహ" అన్నాడు మోహన్.

"ప్రజా కోర్టులే మనకి చాలా చోట్ల మంచి పేరు తెచ్చిపెట్టాయి. అందులో తప్పుందని నేననుకోను" అన్నారొకరు.

"అవును–నాకూ అనిపించడంలేదు" అంటూ మొదలెట్టింది అరుణ. "అన్యాయాల్ని అరికట్టేందుకు కావాల్సినవి ప్రజాస్వామ్యపు కోర్టులు కావు– ప్రజా కోర్టులే. అక్కడ కోర్టులలో న్యాయం జరగదు. డబ్బున్నవాళ్ళ కోర్టులవి. ఒకవేళ పొరపాటున ఎక్కడన్నా న్యాయం జరిగినా, అది జరిగే కాలానికి న్యాయం జరగాల్సినవాళ్ల జీవించి ఉండరు. ఇలాంటి కోర్టులకి సరయిన సమాధానం ప్రజా కోర్టులే. ఇందులో అన్యాయం చేసినవాళ్ళకి వెంటనే శిక్షపడ్డమే కాకుండా న్యాయం జరగాల్సినవాళ్ళకి ఆలస్యం లేకుండా న్యాయం జరుగుతుంది"

"అది కరెక్టే. కానీ ప్రజా కోర్టుల్లో మనం ఎలాంటి శిక్షలు విధిస్తున్నాం? కాళ్ళూ, చేతులూ నరుకుతున్నాం. కొరడాలతో కొడుతున్నాం. కొన్నిచోట్ల మనుషుల్ని చంపేస్తున్నాం. ఇవన్నీ చూసినవాళ్ళకి మనం రాక్షసుల్లా కనిపించవచ్చు. అంతేకాదు. అలా చెయ్యడంతో

మనకీ వాళ్ళకీ తేడా లేకుండా పోతోంది" అన్నాడు మోహన్.

"మనుషుల్ని కాటేసి చంపుతున్న పాముకీ, ఆ పాముని చంపిన మనిషికీ తేడా లేదని అంటారా మీరు? నేనిందాక అన్నట్లు మన గమ్యం కోసం మనం కొన్ని పనులు చెయ్యాల్సి వస్తే మనం వెనకాడకూడదు. మీ భయాల్ని మాకు కలిగించకండి" అన్నారొకరు.

అరుణ ఆ మాటలకి సమాధానంగా అంది "మోహన్‌గారిలో భయం లేదు. అయితే ఆయనకి కొన్ని అనుమానాలున్నాయి. ఆ అనుమానాలు జీవితాన్ని రకరకాల కోణాల్లోంచి విశ్లేషణ చెయ్యడంవల్ల వచ్చినవి. అంతమాత్రాన ఆయనకి ఉద్యమం అంటే ఇష్టంలేదనో, పోరాటం అంటే భయం అనో మీరనుకోనక్కర్లేదు. అలా భయం ఉన్న మనిషే అయితే ఫారెస్టాఫీసర్ని కిడ్నాప్ చేస్తానని ముందుకు వచ్చేవారు కాదు. ఇంక ఈ విషయం వదిలేద్దాం. మా వాళ్ళం కూడా ఈ పరిసరాలని బాగా స్టడీ చేశాక మళ్ళీ కలుసుకుందాం. అంతవరకూ ప్రస్తుతం చేస్తున్న పనులే చేస్తూందాం సరేనా?"

అందరూ సరేనన్నట్లు తలలూపారు.

"టైం ఎంతయింది?" అడిగాడు మోహన్ అరుణని.

"పది దాటుతోంది. ఇంక ఈ మీటింగ్ చాలిద్దామా?" అంది అందరివైపూ చూస్తూ అరుణ.

"భోంచేసి బయల్దేరుదాం" అంటూ లేచారొకరు.

దొన్నెలలా కుట్టిన విస్తళ్ళలోకి పులిహోర వడ్డించుకుని ఒకరికొకరు అందించుకుంటూ తినసాగారు. ఊళ్ళోవాళ్ళ సాయంతో వంట జరిగింది. తిన్నాక పల్చటి మజ్జిగ తాగి, ఊళ్ళోవాళ్ళకి కృతజ్ఞతలు చెప్పి, వాళ్ల దగ్గరా, తక్కిన వాళ్ళ దగ్గరా సెలవు తీసుకుని బయల్దేరారు అందరూ.

తమ వాళ్ళతో కలిసి నడక సాగించారు మోహన్, అరుణలు.

రాత్రి పదకొండు దాటినా ఆ అడవి దారిలో భయం లేకుండా నడుస్తున్నారు వాళ్ళు. అందరి దగ్గరా బ్యాటరీ లైట్లూ, పిస్తోళ్ళూ ఉన్నాయి. నడవడంలో అందరూ ముందుకెళ్ళిపోవడంతో అరుణా, మోహన్‌లు చివరగా నడవసాగారు.

"నీలో సహజంగా నాయకత్వ లక్షణాలున్నాయి. ఇక్కడవాళ్ళు కొత్తయినా, నువ్వే నాయకురాలివయినట్లు నడిపావు మీటింగ్‌ని. ఎలా అబ్బింది నీకీ విద్య?" అని అడిగాడు మోహన్.

నవ్వేసింది అరుణ.

"నీ కమిట్‌మెంట్ వల్ల జనం నీ మాటలు వింటారేమో. నాకు ఆ కమిట్‌మెంట్ లేదు" అన్నాడు మోహన్.

"ఎందుకని లేదు?" అడిగింది అరుణ.

"నేను జనారణ్యంలో వున్న రోజుల్లో నాకు ఏదో చెయ్యాలన్న కోరిక ఉండేది–ఏం చెయ్యాలో తెలియకపోయినా. నాన్న హత్యతో నాలో కసి పెరిగింది. దాంతో ఏదో చెయ్యాలన్న కోరిక పోయింది ఎందుకంటే ఏదో చెయ్యడంలో మునిగిపోయాను" అన్నాడు మోహన్.

"పోరాటం జరుగుతున్నప్పుడు పోరాటం ఎందుకు చేస్తున్నామని ఆలోచించ కూడదు. యుద్ధంలోకి దిగకముందే ఆలోచన. దిగాక యుద్ధమే. అదేకదా గీతాసారం?" అంది అరుణ.

"తల నుండి కాళ్ళదాకా కమ్యూనిజం భావాలు నిండి ఉన్న అరుణ నోటివెంట భగవద్గీత గురించి వింటున్నానా?" అన్నాడు నవ్వుతూ మోహన్.

"అందులో దేవుడి గురించి ఉన్న అనవసరపు ప్రసంగం వదిలేస్తే గీత కర్మని బోధిస్తుంది. కమ్యూనిజం కూడా అదే చెప్తుంది. ఏ పని చేసినా ఏకాగ్రతతో చెయ్యాలని చెప్పే గ్రంథం గురించి మాట్లాడ్డంలో తప్పులేదు. ఇంక మీ విషయం పోరాటం చెయ్యాలని వచ్చారు కాబట్టి పోరాడుతూనే ఉండండి" అంది అరుణ.

"యుద్ధం ఆపాలని లేదు నాక్కూడా. చాలా రోజులు నాలో నేనే యుద్ధం చేసుకున్నాను. ఇప్పుడు చుట్టూ వున్న అవినీతితో చేస్తున్నాను" అంటూ మోహన్ అరుణవైపు చూశాడు.

అరుణ కళ్ళు అతన్నే చూస్తున్నాయి.

ఆ కళ్ళలో అతనికి ఓ వింత కోరిక కనిపించింది.

ఆ కోరిక కళ్యాణి కళ్ళలో ఉన్నదాన్లానే ఉందతనికి.

అలా అనిపించగానే భయం వేసింది మోహన్‌కి.

"ఎందుకలా చూస్తున్నావు?" అని అడిగాడు.

"తెలియదు. కానీ అలా మిమ్మల్ని చూస్తూండిపోవాలనిపిస్తోంది" అంది అరుణ మోహన్ దగ్గరకి జరిగి నడుస్తూ.

"నీక్కూడా ఇలాంటి ఫీలింగ్స్ ఉంటాయన్నమాట" అన్నాడు మోహన్. అలా అంటుంటే అతని కంఠం వణికింది.

"ఏం నేను మనిషిని కానా? ఫీలింగ్స్ ఉండవా" అంది అరుణ అతన్నే చూస్తూ.

"అలా కాదు–మనకి పదార్థంలోనేకానీ ఫీలింగ్స్‌లో నమ్మకం లేదు కదా అందుకని" అన్నాడు మోహన్.

"నమ్మకాల సంగతి వదిలెయ్యండి. వాటి గురించి మాట్లాడాలంటే చాలా ఉంది.

అసలు పదార్థం అంటే ఏమిటీ, ఆలోచనలంటే ఏమిటీ, ఫీలింగ్స్‌కీ, ఆలోచనలకీ తేడా ఉందా ఈ ప్రశ్నలని వదిలేద్దాం. మనం కలిసి ఉందామా?" సూటిగా అడిగింది అరుణ.

"మనం ప్రస్తుతం కలిసే నడుస్తున్నాం" అన్నాడు మోహన్ అరుణ అడిగింది అర్థంకానట్లు.

ఆ విషయం అర్థమైనట్లు అంది అరుణ– "అర్థంకానట్లు మాట్లాడకండి. కలిసి ఉ ఒడడం అంటే తెలియదా మీకు?"

"పెళ్లి చేసుకుందామనా నీ ప్రశ్న?"

"పెళ్ళిమీద నమ్మకం లేదు నాకు"

"నాకు ఉంది. చాలా నమ్మకం ఉంది. నేను కళ్యాణిని పెళ్ళి చేసుకున్నాను. ఇంకొకరితో కలిసి ఉండలేను" అన్నాడు

మోహన్ స్థిరంగా.

"కళ్యాణిగారితో మీరు కలిసి ఉండే అవకాశం లేదు. అప్పుడు ఇంకొకరితో కలిసి ఉండడంలో తప్పేముంది?"

"ఒక ఆడా, ఒక మగా ఒకరితో ఒకరు కలిసి ఉండవలసిన అవసరం ఉందా?"

"భౌతికావసరాలు తీరడం ప్రతి మనిషికీ అవసరమే"

"నాకు తెలియదు. నాకు ఆ అవసరం కనిపించడం లేదు. అంతేకాదు. అలా ఉండడం నేను కళ్యాణికి ద్రోహం చేసినట్లు. నన్నొదిలెయ్యి. ఏ రోజున పోతానో తెలియని నన్నెందుకు కట్టుకుంటావు?"

"మనిద్దరికీ ఒకే ప్రణాళిక ఉంది. ఒకే ఉద్దేశం ఉంది. ఒకే పని చెయ్యాలన్న కోరిక ఉంది. ఒకేచోట కలిసి ఉంటాం. అందుకే కలిసి జీవిస్తే బాగుంటుందని అనుకున్నాను. మీకిష్టం లేకపోతే సరి. ఉద్యమంలో చాలామంది ఇలా కలిసి ఉంటున్నారు" అంది అరుణ ఆకాశంలోకి చూస్తూ.

"నిన్ను డిసప్పాయింట్ చేస్తే సారీ" అన్నాడు మోహన్.

"మన మధ్య సారీలు వద్దు. ఎవరి అభిప్రాయం వాళ్ళది. ఈ విషయం మర్చిపోదాం ఇద్దరమూ"

తలవంచుకు నడుస్తున్నాడు మోహన్.

పక్కనే నడుస్తోంది అరుణ.

నిశ్శబ్దం ఆవరించుకుంది ఇద్దరి మధ్యా.

వాళ్ళ కాళ్ళకింద పడి నలుగుతున్న ఎండు ఆకుల శబ్దం ఒక్కటే ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తోంది.

ఆ నిశ్శబ్దంలో, ఆ చీకటిలో ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నా ఇద్దరూ నడుస్తున్నారు ఒకే గమ్యం వైపు.

# 9

"మీరెటూ కదలద్దు. పారిపోయేందుకు ప్రయత్నించద్దు. మేం మీకు ఏమీ కీడు చెయ్యడం లేదు. కొన్నాళ్ళు మీరు మాకు అతిథిగా ఉండాలి. అంతే. జీపు దిగండి" మోహన్ కంఠం ఆజ్ఞాపిస్తున్నట్లు వినిపించింది జీపులో కూర్చున్న ఫారెస్టాఫీసర్‌కీ, అతని పక్కనే కూర్చున్న డ్రైవర్‌కి.

ఫారెస్టాఫీసర్ని కిడ్నాప్ చెయ్యాలన్న నిర్ణయం తీసుకున్ననాటి నుండి అతని రాకపోకల్ని జాగ్రత్తగా గమనించి, సాయంత్రం అతను ఇంటికి వెళ్ళేదారిలో అతన్ని పట్టుకోవడం సులభం అనుకుని దానికి తగ్గ పథకం వేసుకున్నారు మోహన్‌వాళ్ళు.

అతను ఇంటికి చేరుకునే దారిలో చెట్టుకొమ్మల్ని అడ్డంగా పెట్టారు. డ్రైవర్ తప్ప మరో సాయం లేకుండా ఉన్న ఫారెస్టాఫీసర్‌కి సెక్యూరిటీ లేదు. అడవిలో తిరుగుతున్నప్పుడు అవసరమవుతుందని ఉంచుకున్న రివాల్వర్ ఉంది. పెద్ద గన్నులు పట్టుకున్న నలుగురిని ఎదిరించేందుకు అది చాలదు. అతనికున్న సెక్యూరిటీ, అతను మామూలుగా తనతో తీసుకెళ్లే ఆయుధాలూ, మనుషులూ వీటన్నిటినీ నాలుగు రోజులుగా చూశాకే సాయంత్రం ఇంటికి వెళ్ళే సమయంలో ఫారెస్ట్ గార్డ్‌లెవ్వరూ ఫారెస్టాఫీసర్‌కి తోడు ఉండరనే, ఆ సమయాన్ని ఎన్నుకున్నారు కిడ్నాప్‌కి.

ఆ ఏరియాలో ఇంకా కిడ్నాప్‌లు జరగకపోవడంతో, దానికి సంబంధించిన జాగ్రత్తలు ఎక్కువగా తీసుకోవడంలేదు పోలీసులు. అది మోహన్‌వాళ్ళకి బాగా ఉపయోగించింది. ఒకవేళ జాగ్రత్తలు తీసుకుందామనుకున్నా ఆ ప్రాంతంలో ఉన్న ఎంతమందికి రక్షణ కలిగించడం కుదురుతుంది?

మోహన్ తాలూకు నలుగురు జీప్‌ని అటకాయించడం కిడ్నాప్‌లోని మొదటిభాగం. కొమ్మలు అడ్డంగా ఉండడంతో జీప్‌ని ఆపాడు డ్రైవర్. రోడ్డుకటూ ఇటూ ఉన్న చెట్ల వెనగ్గా దాక్కున్న నలుగురూ జీప్ చుట్టూ నిలబడ్డారు. నలుగురి చేతుల్లోనూ గన్నులున్నాయి.

పూర్తిగా అడవి ప్రాంతం కావడంతో చీకటిపడే సమయానికి దగ్గరలో ఉన్న పల్లెటూళ్ళలో వాళ్ళందరూ ఇళ్ళకి చేరుకుంటారన్న విషయాన్ని తమ స్టడీలో గ్రహించారు మోహన్‌వాళ్ళు.

గన్నులు చేతుల్లో ఉన్న నలుగురినీ చూశాక, మోహన్ చెప్పింది విన్నాక ఫారెస్ట్ ఆఫీసర్ చేతులెత్తి నిల్చున్నాడు. అతని జేబులు సోదాచేసి అతని దగ్గరున్న రివాల్వర్ తీసి

తన జేబులో పెట్టుకున్నాడు మోహన్. తనతో ఉన్న ఒకరిని ఫారెస్టాఫీసర్ చేతులు వెనక్కి విరిచి పట్టుకోమన్నాడు. ఇంకొకతన్ని జీప్ డ్రైవర్ని పట్టుకోమన్నాడు. మరో అనుచరుడిని జీప్ ఎక్కి ఇంకేమన్నా ఆయుధాలు ఉన్నాయేమో చూడమన్నాడు. అతను జీప్ ఎక్కిలోపల వెతికి ఆయుధాలేమీ లేవని దిగాడు.

తమ దగ్గరున్న తాళ్ళలో ఒకదానితో జీప్ డ్రైవర్ కాళ్ళూ చేతులూ కట్టేసి జీప్‌లో ముందు సీట్లో పడుకోబెట్టారు. ఇంకో తాడుతో ఫారెస్టాఫీసర్ చేతుల్ని వెనక్కి కట్టారు. మరో తాడు కొసని అతని కాలికి కట్టి ఇంకో కొసను మోహన్ తన చేతిలో ఉంచుకున్నాడు.

మోహన్ ఇద్దరు అనుచరుల్ని అక్కడే ఉండమన్నాడు. "ఇంతవరకూ మనం అనుకున్నట్లే జరిగింది. ఇప్పుడెవ్వరూ ఈ ప్రాంతానికి రాకపోవచ్చు. ఒకవేళ ఎవరన్నా వచ్చి జరిగింది తెలుసుకుని వెంటనే వెతకడం మొదలెడితే మనం దొరికిపోతాం. మీరిక్కడే ఉండి ఎవరన్నా వస్తే వాళ్ళని దగ్గరికి రానియ్యకుండా చెయ్యడమో, అలా కుదరకపోతే మాకు వెంటనే చెప్పడమో చెయ్యండి. ఓ రెండు గంటలు చాలు మనం మన అనుకున్న చోటుకి చేరుకుందుకు. ఇప్పుడు టైం ఎంతయింది?".

"ఏడయింది"

"తొమ్మిదింటికి బయల్దేరి వచ్చెయ్యండి" అని వాళ్ళతో అని "మీకు నడవడం ఇబ్బందికావచ్చు అయినా తప్పదు మాతో నడవడం" అన్నాడు ఫారెస్టాఫీసర్‌తో.

వాళ్ళు ఎవరో, ఎక్కడకు తీసుకువెళ్తున్నారో వాళ్ళ మాటల్లో తెలుస్తాయనుకున్న ఫారెస్టాఫీసర్‌కి వాళ్ళ మధ్య ఆ ప్రస్తావనే లేకపోవడంతో చాలా నిరుత్సాహంగా అనిపించింది. నడుస్తుంటే ఎటు వెళ్తున్నారో తెలుస్తుందనుకుంటున్న సమయంలో మోహన్ తన దగ్గరున్న పొడుగాటి నల్లని గుడ్డతో అతని కళ్ళకి గట్టిగా గంతలు కట్టేశాడు.

"నన్నెక్కడికి తీసుకెళ్తున్నారు?" అని అడిగాడు ఫారెస్టాఫీసర్.

"ఆ విషయం మీకు తెలియాల్సిన అవసరం లేదు. అయితే మీరు భయపడాల్సిన అవసరం కూడా లేదు. మాతో రండి" అంటూ కదిలాడు మోహన్. మోహన్ కదలడంతో అతని చేతిలోని తాడు జరిగింది. తాడు అవతలికొస ఫారెస్టాఫీసర్ కాలికి కట్టి ఉండడంతో అతను కొంచెం తూలాడు. ఇంకో అనుచరుడు అతన్ని పట్టుకున్నాడు.

మోహన్ ఓ చేతినీ, అనుచరుడు రెండో చేతినీ పట్టుకుని నడిపించసాగారు ఫారెస్టాఫీసర్ని.

కళ్ళు నల్లగుడ్డతో కట్టెయ్యబడి ఉండడంతో తాము ఎటు నడుస్తున్నామో తెలియడం లేదు ఫారెస్టాఫీసర్‌కి. అయితే అతనికి విషయం నెమ్మదిగా అర్థం కాసాగింది. వీళ్ళెవరో తన్ని కిడ్నాప్ చేస్తున్నారు. అయితే చేస్తున్నవాళ్ళెవరో, ఎందుకు చేస్తున్నారో తెలియదు.

డబ్బుకోసం కిడ్నాప్ చేసేవాళ్ళయి ఉండరు. వాళ్ళయితే తన జోలికి రారు. వీళ్ళు తననొక్కడినే పట్టుకున్నారో, ఇంకా ఎవరినన్నా తీసుకువెళ్తున్నారో కూడా తెలియదు. ఎందుకు తీసుకువెళ్తున్నారో తెలియదు.

"మీరు నన్నెందుకు తీసుకెళ్తున్నారు?" అని అడిగాడు.

"మేం ఎవరమో, ఎందుకు, ఎక్కడకి మిమ్మల్ని తీసుకువెళ్తున్నామో మీకు అనవసరం. మీరు మా దగ్గర కొన్నాళ్ళు ఉండాల్సిన అవసరం మాకుంది. మీరు ఎదురు ప్రశ్నలు వేసి మమ్మల్ని విసిగించద్దు. మీకు ఏదయినా అవసరం అయితే చెప్పండి. మాకు వీలయినంతవరకూ తీరుస్తాం" అన్నాడు మోహన్ కొంచెం గట్టిగా.

"నేను ప్రశ్నలు వేసి విసిగిస్తున్నానని మీరనుకున్నా సరే నన్నెక్కడికి తీసుకెళు తున్నారో, ఎన్నాళ్ళు ఉంచుతారో నాకు తెలియాలి. నేనింటికి రాకపోతే బాగా బెంగపెట్టు కుంటుంది మా శ్రీమతి. నేనీ అడవిలో తిరుగుతుండడంవల్ల రోజూ ఇంటికి వస్తానో, రానో అని భయపడుతూనే ఉంటుందావిడ"

"ఇంటికి చేరక మీరు ఇంకెక్కడకెళ్తారని అనుకుంటారావిడ?" అన్నాడు మోహన్ అనుచరుడు.

"స్వర్గానికి. ఇంకెక్కడికెళ్తానని అనుకుంటుంది? అడవిలో క్రూరజంతువేదన్నా నన్ను చంపి తినేస్తుందని ఆవిడ భయం. అవి నన్నేం చెయ్యవని చెప్పినా నమ్మదావిడ" అన్నాడు కొంచెం గర్వం నిండిన స్వరంతో ఫారెస్టాఫీసర్.

"ఇక్కడ నాకు రెండు అనుమానాలున్నాయి. ఒకటి మీరు స్వర్గానికి వెళ్తారని ఆవిడకేంటి నమ్మకం? రెండు అంత భయపడే ఆవిడ ఫారెస్టాఫీసర్ని ఎందుకు పెళ్ళి చేసుకున్నారు?" అన్నాడు అనుచరుడు సంభాషణని కొనసాగిస్తూ.

ఫారెస్టాఫీసర్ చెప్పసాగాడు– "మా ఆవిడ పేరు కనకదుర్గ. తను నాకు మరదలే. తను నేను స్వర్గానికే ఎందుకు చేరతానని అనుకుంటుందో తన్నే అడగండి. ఇంక పెళ్ళి గురించి. చాలా మరదళ్ళ పెళ్ళిళ్ళు పుట్టడానికి ముందే నిర్ణయించబడతాయి. అందుకని ఆవిడ పెళ్లాడింది. ఫారెస్టాఫీసర్ని కాదు బావయిన నన్ను. నేను ఫారెస్టాఫీసర్నయినంత మాత్రాన నన్ను పెళ్ళిచేసుకోనని అనే స్వార్థంకానీ, స్వేచ్ఛగానీ తనకి లేవు"

'స్వార్థంకానీ, స్వేచ్ఛకానీ లేవు' అన్న వాక్యం చాలా అర్థవంతంగా ధ్వనించింది మోహన్‌కి. అడవుల్లో జంతువుల మధ్యా, నాగరికత నేర్వని మనుషుల మధ్య ఉండే ఫారెస్టాఫీసర్‌కి ఇలాంటి భావాలుంటాయని అనుకోలేదు మోహన్. అందుకే అడిగాడు

"మిమ్మల్ని కాకుండా మరొకర్ని చేసుకోడం స్వార్థం అవుతుందా? స్వేచ్ఛ అవుతుందా?"

మోహన్ ఆ ప్రశ్న అడగడం ఎంతో సంతోషంగా అనిపించినట్లు మాట్లాడసాగాడు ఫారెస్టాఫీసర్.

"పెళ్ళిళ్ళు పెళ్ళి కోసమో, ప్రేమ కోసమో కాకుండా వ్యాపారం కోసం జరుగుతున్నాయి. వ్యాపారం అంటే మీకు అర్థం అవుతుందో లేదో నాకు తెలియదు. కట్నాలూ– కానుకలూ ఇవి కావు నే చెప్పేది. అవి పెళ్లి సమయంలో మాత్రం ఉండేవి. నేను చెప్పేది వాటి గురించి కాదు. ఈ పెళ్లి చేసుకోడం వల్ల నా జీవితం ఎంత సుఖంగా ఉంటుందని బేరీజు వేసుకుని పెళ్లి చేసుకుంటున్నారు. సుఖం ధనంతో ముడిపడి ఉంది కాబట్టి పెళ్లి తర్వాత తమకెంత డబ్బుంటుందని ఆలోచిస్తున్నారు. కట్నంవల్ల డబ్బు రావడం అందరికీ కనిపించే విషయం. మంచి ఉద్యోగం చేస్తూనో, పెద్ద వ్యాపారం చేస్తూనో ఉన్నవాళ్ళని చేసుకోవాలని అనుకోడంలోని అంతరార్థం ఏంటి? మంచి మనసుండి తన్ని బాగా ప్రేమించేవాళ్ళని పెళ్లి చేసుకోవాలనుకోవడంలోనూ స్వార్థం ఉంది. అయితే అది కొంత నయం. బాగా డబ్బు సంపాదించేవాళ్ళను కోరుకునే స్వార్థంతో పోలిస్తే అలాంటి స్వార్థం మా ఆవిడలో లేదు.

ఇంక స్వేచ్ఛ వేరే చెప్పక్కర్లేదు. సామాన్య కుటుంబాల్లో పుట్టి పెరిగిన అమ్మాయిలకి చిన్న చిన్న విషయాల్లోనే తమకి కావల్సింది అడిగి చేయించుకునే స్వేచ్ఛ ఉండదు. ఇంక పెళ్ళి విషయంలో వాళ్ల మాట వినేదెవరు? అసలు తాము చెప్పచ్చనే అభిప్రాయమే ఉండదు వాళ్ళకి. అలాంటి స్పృహ లేకపోవడం మానసిక బానిసత్వం. వాళ్ళకి స్వేచ్ఛ ఉండదు"

సమాజంలోని సగం మందికి పైగా మనుషుల్ని ఆడవాళ్ళని బానిసలుగా ఫారెస్టాఫీసర్ చిత్రీకరించడంతో ఏదో కొత్త విషయం విన్నట్లయింది. మోహన్‌కి. అంతమంది బానిసలుగా ఉంటే ఎవరి విముక్తి కోసం జరుగుతోంది పోరాటం. ఆ విషయం గురించి ఇంక ఆలోచించలేనట్లు ఫారెస్టాఫీసర్‌తో అతని కుటుంబ విషయాల గురించి మాట్లాడసాగాడు మోహన్.

ఫారెస్టాఫీసర్ పేరు నరసింహారావు. మేనమామ దగ్గర ఉండి చదువుకున్నాడు. ఉద్యోగం వచ్చాక మేనమామ కూతుర్నే పెళ్ళి చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు, అమ్మాయి పెద్ద ఆరేళ్ళు. అబ్బాయి చిన్న మూడేళ్ళు. భార్యకి అడవి వాతావరణం కొత్తలో ఆహ్లాదంగా అనిపించినా, పిల్లలు పుట్టాక భయంగా అనిపించసాగింది. తనింటికి ఆలస్యంగా వెళ్తే ఆవిడ ఎంతో కంగారుపడుతుందని అంటున్నప్పుడు అతని కంఠంలో వినిపించిన సిన్సియారిటీకి విస్తుపోయాడు మోహన్.

"కళ్ళకి గంతలు కట్టించుకుని ఎవరో, ఏం చేస్తారో తెలియనివాళ్ళ మధ్య అడవిలో నడుస్తుంటే మీకు ఏమీ భయం వెయ్యడంలేదా?" అన్నాడు మోహన్.

"దేనికి భయం? నా ప్రాణం పోతుందనా? ఆ భయం నాకెప్పుడూ లేదు. అయితే మీరు కళ్ళకి గుడ్డ కట్టేశారు. దాంతో దారి కనపడకుండా నడవాలి. అది కష్టంగా ఉంది. అలానే చేతుల్ని వెనక్కి కట్టేశారు. కాలికి తాడు కట్టి పట్టుకున్నారు. ఇవి బాధగా ఉన్నాయి. అయితే ఈ బాధ శారీరకమైంది. నా అసలు బాధంతా మా ఆవిడ గురించీ, పిల్లల గురించీ. మీరు జీప్ డ్రైవర్ని ఏం చేస్తున్నారు?"

"అది మీకు అనవసరం. నేనో పని చేయిస్తాను. ఓ మనిషిని మీ ఇంటికి పంపి, మీరు క్షేమంగా ఉన్నారనీ, ఏదో అర్జంట్ పనిమీద మరో ఊరు వెళ్ళారనీ, తొందరలో వచ్చేస్తారనీ చెప్పిస్తాను సరేనా?"

"మీరా పని చేయిస్తే నాకు చాలా సాయం చేసినవారవుతారు. వెంటనే చేయించండి"

"ఇప్పుడేకాదు మనం మన గమ్యం చేరాక"

ఇంక మాట్లాడకుండా నడవసాగారు అందరూ తొందరగా గమ్యం చేరాలన్నట్లు.

దారిలో రాళ్ళూ, పైకి పొడుచుకు వచ్చిన చెట్ల వేళ్లూ తగిలి పడబోతూ, తప్పుకుంటూ నడుస్తున్నాడు నరసింహారావు. కళ్ళు లేకపోతే మనిషి జీవితం ఎంత దుర్భరం అవుతుందో ననిపిస్తోందతనికి. వాళ్ళు ఏం చేస్తారో తెలియదు. ఒకవేళ కళ్ళు పొడిచేస్తే ఈ ఆలోచన రాగానే సన్నగా వణుకు వచ్చింది. అంతకుముందు ఎప్పుడూ లేని భయం కలగసాగింది. జంతువులన్నా, జంతువుల్లాంటి మనుషులన్నా భయం లేదనుకున్న తనకి భయం కలగడం ఎంతో ఆశ్చర్యం అనిపించింది నరసింహారావుకి. అంతకుముందు తను ఎన్నడూ ఇలాంటి నిస్సహాయ స్థితిలో లేడు. ప్రమాదం వస్తూంటే చూసి ఏదన్నా చెయ్యగలిగే స్థితిలో ఉండేవాడు. ప్రస్తుతం చూడలేకుండా, చేతులు కదపలేకుండా ఉండడం చాలా భయం కల్గిస్తోంది. ఆ భయం భయంకరమైన ఆలోచనల్ని కలిగిస్తోంది.

ఇంతవరకూ మాట్లాడుతుండడంతో ఆలోచనలు కలగలేదు. ఏదన్నా పని చేస్తోంటే పిచ్చి ఆలోచనలు రావు. ఇప్పుడు బుర్ర పనిలేక ఏదో ఆలోచిస్తోంది. తన కాళ్ళూ, చేతులూ నరికివేస్తున్నట్లూ, తన భార్యని తనెదురుగుండానే బలాత్కారం చేస్తున్నట్లూ, తన పిల్లల్ని చంపేస్తున్నట్లూ –

ఓ మనిషి భయానికి ఎలా లొంగిపోతాడో స్వయంగా అనుభవిస్తున్నాడు నరసింహారావు.

తాము తీసికెళ్తున్న మనిషి భయంతో సంబంధం లేకుండా నడుస్తున్నారు మోహన్, అనుచరుడూ. అయితే వాళ్ళకీ ఓ భయం ఉంది. తమ గమ్యం చేరేవరకూ ఎవ్వరూ అడ్డగించకూడదని. అక్కడకి చేరితే తమ అనుచరులు ఇంకా కొందరుంటారు. అప్పుడు

అడ్డంకుల్ని తొలగించుకోడం సులభం. ఇప్పుడు ఈ ఫారెస్టాఫీసర్ని వదలకుండా ఎవరితోనన్నా యుద్ధం చెయ్యడం కష్టం. అందుకే సాధ్యమైనంత తొందరగా గమ్యం చేరుకోవాలి. రెండు గంటలకి పైగా నడిచేసరికి వాళ్ళు ఓ పాడుబడ్డ దేవాలయాన్ని చేరుకున్నారు. ఆ ఆలయం ఊరికి చివరగా ఉన్న పెద్ద చెరువుకి అవతల పక్కన ఉంది. చుట్టూ దట్టంగా పెరిగిన చెట్లు ఉండడంతో అక్కడ ఆలయం ఉన్నట్లు ఎవ్వరికీ తెలియదు. ఊళ్ళోవాళ్ళకి తెలిసినా, పాడుపడిన గుడివైపుకి రారు. అంతేకాక ఆ ఊళ్ళోవాళ్లకి మోహన్‌వాళ్ళతో బాగా స్నేహం కుదిరింది. వాళ్ళని ఎంతో ప్రేమగా, గౌరవంగా చూస్తున్నారు. అందుకే కిడ్నాప్‌చేసి ఫారెస్టాఫీసర్ని ఉంచేందుకు ఆ చోటుని ఎంచుకున్నారు మోహన్, అరుణలు.

ఫారెస్టాఫీసర్ని తీసుకుని గుడి దగ్గరకి చేసేసరికి, అక్కడ అరుణతోపాటు మరో నలుగురు ఎదురుచూస్తున్నారు.

ఇద్దరు మనుషులు ఎదురొచ్చి, ఫారెస్టాఫీసర్ని గుడి లోపలకి తీసుకెళ్ళి కళ్ళకి కట్టిన గంతల్ని విప్పేశారు.

గుళ్ళో వెలుగుతున్న నూనె దీపాల కాంతిలో ఏమీ కనిపించలేదు, ఫారెస్టాఫీసర్‌కి కొంచెం సేపటిదాకా.

కొంచెంసేపు అలవాటుపడ్డాక కనిపించసాగింది.

"మన డిమాండ్లు పోలీసులకి అందాలి. ఎవరినన్నా రేపు ఉదయం పక్కనున్న పోలీసుస్టేషన్‌కి పంపించి ఇన్‌స్పెక్టర్‌కి అందచేయించాలి. ఆ పని నువ్వు చూడు అరుణా. అలాగే ఫారెస్టాఫీసర్ ఇంటికి ఎవరినైనా పంపించి, అతను రెండు రోజుల్లో తిరిగి వస్తాడని చెప్పించాలి" అన్నాడు మోహన్.

"సరే" అంటూ ఓ పక్కగా కూర్చుంది అరుణ.

"ఇంత దూరం నడిచి వచ్చాం మనకి అలవాటే. ఆయనకి కష్టంగా ఉండొచ్చు. మంచినీళ్ళు ఇవ్వండి ముందుగా" అన్నాడు మోహన్ అరుణకి దగ్గరగా కూర్చుంటూ.

మోహన్‌తోపాటు వచ్చిన అనుచరుడు ఫారెస్టాఫీసర్ చేతులకీ, కాళ్ళకీ కట్టిన తాళ్ళని విప్పేశాడు.

రెండు చేతుల్నీ ఒకదానికొకటి కొంతసేపు రాసుకుని, కాళ్ళకున్న బూట్లు విప్పుకోసాగాడు నరసింహారావు.

"పక్కనున్న బకెట్ నీళ్ళలో కాళ్ళు, చేతులూ కడుక్కోండి. భోంచేద్దురుగానీ" అన్నాడు మోహన్.

లేచి మొహం కడుక్కుని వచ్చి కూర్చున్నాడు నరసింహారావు.

ఆకులో చపాతీలూ, కూరా, పలావ్ వడ్డించబడి ఉన్నాయి.

తినడం మొదలెట్టాడు నరసింహారావు. ఆకలీ, నీరసంతో ఉన్నందువల్లనేమో, ఎంతో రుచిగా అనిపించాయి పదార్థాలు. తింటూ తలెత్తి చూశాడు. మోహన్‌తోపాటు తక్కినవాళ్ళందరూ రెండేసి బన్నుల చొప్పున తింటూ కనిపించారు.

కిడ్నాప్‌చేసి తీసుకొచ్చిన తనకి మంచి ఆహారం పెడుతూ, వాళ్ళు బన్నులు మాత్రం తింటుంటే, లోపలెక్కడో కలుక్కుమంది నరసింహారావుకి.

ఇంకేమీ మాట్లాడకుండా తినసాగాడు.

తినడమయ్యేసరికి, ఓ గ్లాసులో అరుణ మజ్జిగ అందించింది.

ఆ రోజు తను తింటున్నది భోజనంలాకాక, అమృతంలా అనిపించింది నరసింహారావుకి.

ఆ భావన అతని కళ్ళలో నీళ్ళని నిలవనివ్వలేదు.

ఫారెస్టాఫీసర్ ఏడ్వసాగాడు ఆగకుండా.

అరుణ వెళ్ళిపోయింది, అక్కడింక ఆగలేనట్లు.

మోహన్ వెనకే వెళ్ళాడు. అరుణని ఆపేందుకు.

అయితే కాలం సాగుతూనే ఉంది. ఎవరికోసం ఆగకుండా.

## 10

రెండు రోజులు గడిచాయి కిడ్నాప్ చేసింతర్వాత.

ఇంట్లోవాళ్ళెలాగున్నారోనన్న భయం, మోహన్‌దళం వాళ్ళు చూపిస్తున్న ఆదరంపట్ల సంతోషం, ఇలా ఎన్ని రోజులుండాలోనన్న ఆందోళన రకరకాల ఆలోచనలతో భారంగా గడిచాయి రెండు రోజులూ నరసింహారావుకి.

పోలీసులకి తామిచ్చిన 72 గంటల గడువు ఇంకో రోజున తీరుతుంది. తాము ఎవరిని విడుదల చెయ్యమని అడిగారో వాళ్ళని పోలీసులు అప్పగిస్తారో లేదో తెలియదు. పేపర్లో ఈ వార్త బాగా ప్రాముఖ్యత వహిస్తోంది. రాజకీయ నాయకులు, ఇన్‌స్పెక్టర్లు, ప్రజలూ అందరూ దీని గురించే మాట్లాడుతున్నారు. వాళ్ళు తామున్న స్థావరం కనుక్కుని వస్తారేమోనన్న భయం ఓ పక్క, రాలేరన్న ధైర్యం మరోపక్క. మోహన్‌కీ, అనుచరులకీ కూడా భారంగా గడిచాయి రెండు రోజులూ. అరుణా మోహన్‌లు మాట్లాడుకుంటున్నారు ఫారెస్టాఫీసర్‌కి కొంచెం దూరంగా కూర్చుని.

“నరసింహారావు గారింట్లో ఏం చేస్తున్నారో?” అన్నాడు మోహన్ కొంచెం దిగులుపడుతూ.

“నిన్న పోలీసులకి ఉత్తరం అందచేయించి, అక్కడ నుండి వాళ్ళింటికి వెళ్ళానుగా.

ఆవిడ నరసింహారావుగారి శ్రీమతి బాగా బాధపడుతున్నారు. పిల్ల కాస్త పెద్దది. ఆరేడేళ్ళుంటాయి. నాన్న ఇంకా రాలేదని ఏడుస్తోంది. నాక్కూడా బాధగా అనిపించింది. ఓ రెండు రోజుల్లో వస్తారని చెప్పి వచ్చేశాను" అంది అరుణ.

"నువ్వే వెళ్ళావా?" అడిగాడు మోహన్.

"ఎందుకో వెళ్ళాలనిపించింది"

"నువ్వెవరివని చెప్పుకున్నావు?"

"ఆఫీసులో టైపిస్టునని చెప్పాను"

"ఆవిడ నమ్మారా?"

"తెలియదు. అయితే నేనెవరినని పట్టించుకునే స్థితిలో లేదావిడ. ఆ రాత్రి నిద్రపోలేదు. ఎవ్వరినీ లేపి అడిగేందుకు పక్కన ఇళ్ళు లేవు. నేను వెళ్ళేసరికి ఇంక గార్డ్‌లెవ్వరూ లేరు. ఆ ఒంటరితనంలో బాధతో వున్న ఆవిడకి నేను వాళ్ళ ఆయన గురించి ఏం చెప్పినా ఆనందంగానే వుంటుంది"

"ఇప్పుడెలాగున్నారో?"

"ఇప్పుడింక వెళ్ళడం కుదరదు. ఆవిడకి కూడా ఇప్పటికి అసలు విషయం తెలిసిపోయుంటుంది. పోలీసులూ, దగ్గర చుట్టాలూ ఇంట్లోనే వుండి వుంటారు. వెళ్తే ప్రమాదం" అంది అరుణ.

"అవును ప్రమాదం" అన్నాడు నాటకీయంగా మోహన్.

"పోలీసులేం చేస్తారు?" అడిగింది అరుణ.

"ఏం చేస్తారు–మన వాళ్ళని వదిలేస్తారు. అయితే ఒక చిక్కుంది. మనం నలుగుర్ని విడుదల చెయ్యమని అడిగాం మన ఉత్తరంలో. ఆ నలుగురూ ఎక్కడున్నారో పోలీసులకి తెలియాలి. కొందర్ని ఇప్పటికే లేపేసి వుండవచ్చు"

"అప్పుడేమవుతుంది?"

"అప్పటి సంగతి అప్పుడు చూద్దాం. ఎల్లుండి ఉదయంతో మన గడువు పూర్తవుతుంది. రేపు సాయంత్రందాకా వాళ్ళ నుండి మనకి జవాబు రాకపోతే, గడువు ఇంకో రెండు రోజులు పెంచుతున్నట్లు వాళ్ళకో ఉత్తరం పంపాలి"

"ఉత్తరం ఎలా పంపిస్తాం? ఈసారి పోలీసుస్టేషన్‌కి మనిషిని పంపడం కుదరదు"

"ఈలోగా పోలీసులే మనల్ని కాంటాక్ట్ చేసేందుకు ప్రయత్నిస్తారు. ఏ కారణంగానైనా వాళ్ళకాపని చెయ్యడం కుదరకపోతే అప్పుడేం చెయ్యాలో ఆలోచిద్దాం"

"నరసింహారావుగారు పారిపోయేందుకు ప్రయత్నం చెయ్యడం లేదెందుకు?"

"ప్రయత్నించినా ఫలించదని ఆయనకి అర్థం అయి వుంటుంది. మనందరి

దగ్గరా గన్నులున్నాయి. ఈ పరిసర ప్రాంతాలు ఆయనకి తెలిసి వుండవు. ఈ గుడి కూడా ఒక కోటలాగుంది. తప్పించుకునే అవకాశం లేదనే ఆయన ప్రయత్నిస్తుండకపోవచ్చు.

"ఈ కిడ్నాప్ వ్యవహారం గురించి మీకేమనిపిస్తోంది?"

"ఏమీ అనిపించడంలేదు. ఎందుకంటే నేను ఆలోచించడం మానేసి మూడేళ్ళపైనే అవుతోంది. ఆలోచన మనస్సు లోపల జరిగే కార్యక్రమం. నేను దాన్ని వదిలేసి యుద్ధరంగంలోకి దిగాను. అలా దిగాక లక్ష్యం ఒక్కటే. అది యుద్ధమే. ప్రస్తుతం నాలో సంఘర్షణ లేదు. అంతా బహిర్యుద్ధమే. అందుకే నేనీ వ్యవహారంలోని మంచి చెడ్డల్ని గురించి ఆలోచించడంకానీ, సుఖదుఖాలని అనుభించడంగానీ చెయ్యలేకపోతున్నాను"

"ఆలోచన లేకుండా పని చెయ్యలేం. మీరూ ఆలోచిస్తున్నారు" అంది అరుణ ఆలోచిస్తూ.

"అది ఒక పని ఎలా చెయ్యాలన్న ఆలోచనే. ఒక పని ఎలా చెయ్యాలన్న ఆలోచన పని చెయ్యడానికి అవసరం. రాజీవ్‌గాంధీని చంపాలని నిర్ణయం తీసుకున్నాక శివరాసన్‌లోగానీ, థానులోకానీ, శుభలోకానీ అంతర్మథనం లేదు. అయితే ఆలోచన వుంది. ఆ పని మంచి చెడ్డల్ని బేరీజు వేసుకుంటుంటే, వారా హత్యని చెయ్యలేరు. అలానే హత్య ఎలా చెయ్యాలన్న ఆలోచన మానేసినా హత్య సాధ్యం కాదు.

గీతలో కృష్ణుడు అర్జునుడికి చెప్పింది కూడా ఇదే అయ్యుంటుంది. కర్మ ముఖ్యం. అయితే ఆ కర్మవల్ల కలిగే కష్టసుఖాలూ, ఆ కర్మ తాలూకు మంచి చెడ్డలూ ఈ ఆలోచనల్లో ఇరుక్కోకు. అందులో ఇరుక్కుంటే కర్మ చెయ్యలేవు. కృష్ణుడు దేవుడని నేను నమ్మను. ఈ ప్రపంచ స్వరూపాన్ని సంపూర్ణంగా ఆకళింపు చేసుకున్న గొప్ప రాజకీయవేత్తగా అతన్ని అనుకుంటే కృష్ణుడు చెప్పింది సరిగ్గానే అనిపిస్తుంది. అందుకే శివరాసన్ చర్య సమర్థనీయం. మన పనులు సమర్థనీయం. గెలుపు ఓటములను బట్టి చరిత్ర మంచి చెడ్డల్ని నిర్ణయిస్తుంది. అది చరిత్ర రాసేవాడి దృక్పథం మాత్రమే. గాంధీని చంపిన గాడ్సే గొప్ప దేశభక్తుడు కొందరి దృష్టిలో. ఇందిరాగాంధీని చంపినందుకు కొందరు భారతీయులే పండగ చేసుకున్నారట".

అలా మాట్లాడుతూ అరుణవైపు చూశాడు. అరుణ తన్నే చూస్తున్నట్లు గ్రహించి, కొంచెం సిగ్గుపడి, "పెద్ద ఉపన్యాసంలా అయిపోయిందికదూ– నీకు నవ్వుగానో, బోర్‌గానో వుందా?" అన్నాడు.

"లేదు. చాలా బావుంది. అయితే మీరిలా మాట్లాడుతుంటే ఆశ్చర్యంగా వుంది"

"ఇంతకుముందు నా ఉపన్యాసాలు ఎక్కువగా మా నాన్నకీ, చెల్లెలికీ, కళ్యాణికీ పరిమితమయ్యేవి. నాన్న పోయారు. చెల్లెలు మావయ్య దగ్గరుంది. కళ్యాణి ఎక్కడ ఉందో

తెలియదు. అందుకేనేమో గత మూడేళ్ళుగా ఎక్కువ మాట్లాడ్డంలేదు"

"ఇప్పుడు మళ్ళీ మాట్లాడుతున్నారు. అంటే వాళ్ళలో ఎవరినన్నా కలుస్తారేమో" అంది అరుణ నవ్వుతూ.

"ఏ మాత్రం పొరపాటు జరిగినా నాన్నని కలవచ్చు" అన్నాడు ఆకాశంలోకి చూస్తూ మోహన్.

అరుణ లేచి, అతని దగ్గరకొచ్చి నోటిని మూసి "అలాంటి మాటలనద్దు" అంది.

"అలాగంటే అయిపోతుందేంటి? నీకూ ఈ సెంటిమెంట్లున్నాయా?" అన్నాడు మోహన్.

"సెంటిమెంట్‌కాదు. కానీ మీరలా మాట్లాడితే నాకు నచ్చదు" అంది అరుణ మోహన్ మొహంలోకి చూస్తూ.

అంతలో ఒకతను అక్కడకి హడావిడిగా వస్తూ అడిగాడు– "ఈరోజు పేపర్ చూశారా? గోర్బచెవ్ తొలగించబడ్డాడట. కొత్త ప్రభుత్వం ఏర్పడింది రష్యాలో"

"బాగా అయింది. ఇలా అవుతుందని ముందే అనుకున్నాను నేను" అంది అరుణ.

"అసలు వివరాలు ఏంటి?" అడిగాడు మోహన్.

"సరిగ్గా తెలియదు. పేపర్‌లో హెడ్‌లైన్ కనిపించింది. పేపర్ దొరకలేదు కొనేందుకు. న్యూస్‌లో తెలుస్తుందేమో– ట్రాన్సిస్టర్ లోపలే వుందిగా"

"మన న్యూస్ వినడం అనవసరం. అన్నీ తప్పులే వుంటాయి అందులో" అంది అరుణ.

"ప్రపంచంలోని మొట్టమొదటి విప్లవజనిత కమ్యూనిస్టు రాజ్యం ముక్కలైపోతోంది" అన్నాడు మోహన్.

"ముక్కలు కాదు. మళ్లీ కమ్యూనిజం వైపు వెళ్తుంది. మార్పుల పేరిట కమ్యూనిజంకి దూరంగా అమెరికాకి బానిసగా రష్యాని చేస్తున్నాడు గోర్బచెవ్. ఇలా అవడమే మంచిది" అంది అరుణ ఆవేశంగా.

"రష్యాలోనే కమ్యూనిజం నిలవకపోతే మార్క్స్ కన్న కలలకి అర్థం ఏంటి? విప్లవం వచ్చింది. ప్రజా విజయం సిద్ధించింది. డెబ్బై ఏళ్ళు నిలిచింది. అంతే– అంతా అయిపోయింది" అన్నాడు మోహన్.

"మీరేంటి ఇలా మాట్లాడుతున్నారు? రాజకీయ కుతంత్రాలు పోతాయి. పోయి కళ్ళీ కమ్యూనిజం వస్తుంది" అంది అరుణ నమ్మకంగా.

"అలాంటి తియ్యటి కలల్లో నువ్వుండిపోగలిగితే అది నీకు బానే వుండచ్చు. కానీ అది నిజం కాదు. జర్మనీలు కలిసిపోయాయి. ఎంత కష్టపడి వుంచుదామని అనుకున్నా

తన పొరుగు రాష్ట్రాల్లో కమ్యూనిజం వుంచలేకపోయింది సోవియెట్ యూనియన్. ఇప్పుడు అక్కడా అదే జరుగుతోంది. యూనియన్ నామమాత్రంగా కొన్నాళ్ళు మిగలచ్చు. స్వతంత్ర దేశాలు ఏర్పడుతాయి. అవి నెమ్మదిగా యూరప్ దేశాలమీద ఆధారపడ్డం మొదలెడతాయి. క్యాపిటలిజం మీద ఆధారపడ్డ ప్రజాస్వామ్యాలు వస్తాయి"

"జోస్యం చెప్తున్నారా?" అంది అరుణ.

"కాదు-ముందుచూపుతో చూస్తున్నా. ఏ దేశంలో సమసమాజ స్థాపనోద్దేశంతో- కొడవళ్ళతో కత్తులతో- తుపాకులతో యుద్ధంచేసి, రాజులను పడగొట్టి, కమ్యూనిజం ఏర్పడిందని ఏటేటా పండుగ చేసుకుంటున్నారో- ఏదేశం ప్రపంచానికి కమ్యూనిజం దారిచూపిందో ఆ దేశంలోనే కమ్యూనిజం అన్నది లేకుండా పోతోంటే తక్కిన దేశాలేమవుతాయి? అంతేకాదు అసలిలాంటి విప్లవాలు సమసమాజాన్ని స్థాపించగలవా అన్న మౌలికమైన ప్రశ్నకి బలం చేకూరుతుంది. మనం మళ్లీ మళ్లీ మనల్ని ప్రశ్నించుకోవాల్సిన ప్రశ్న- మనం సమసమాజాన్ని ఈ పద్ధతిలో స్థాపించగలమా?"

"మీరు మళ్ళీ ఆలోచించడం మొదలెట్టినట్లున్నారు" అంది అరుణ లేస్తూ. అరుణ చెయ్యి పట్టుకుని కూచోపెట్టి అన్నాడు మోహన్.

"అవును అరుణా! నువ్వన్నట్లు నేను ఆలోచిస్తున్నాను. అలాగే నువ్వూ ఆలోచించు. అప్పుడు ఈ ప్రశ్నకి సమాధానం దొరకచ్చు. నిజం చెప్పు, సాయుధపోరాటం సమసమాజాన్ని సాధిస్తుందా? ఒకవేళ అలా జరిగినా, అది ఎన్నాళ్లు నిలుస్తుంది. రష్యాలో ఎన్నాళ్లు నిలిచింది? ఏడు దశాబ్దాలు నిండకుండా సోవియట్ యూనియన్ స్వరూపం మారిపోయింది. సమిష్టి ఆస్తిని నాయకులు పంచుకుంటున్నారు. లోపం ఎక్కడుంది?"

"కొందరు స్వార్థపరులవల్ల జరిగిందానికి మార్క్స్‌ని శంకించకూడదు" అంది అరుణ సమాధానంగా.

"ఎవ్వరినీ తప్పుపట్టడం కాదు అరుణా! లోపం మానవ ప్రవృత్తిలో పెట్టుకుని మార్క్స్ అసమానతలకి కారణం సామాజిక వ్యవస్థలో వెతికాడేమో. మనిషిలో ధనదాహం, అధికారదాహం చాలా ఏళ్ళుగా ఉన్నవి. అవి విప్లవంతో పోవు. పోతాయని నేనింక భ్రమించడం లేదు. కానీ సమసమాజం కావాలన్న ఆశ నాలో ఉంది. దానికి మార్గం ఇదన్న ఆలోచన నన్నిటు నడిపింది"

"సోవియట్ యూనియన్‌లో కొన్నాళ్ళు సమిష్టి ఆస్తి మాత్రం నడిచే ఉంటుంది. అందుకే చాలా రంగాల్లో యూనియన్ అభివృద్ధిని సాధించింది" అంది అరుణ.

"అది మనకి తెలిసిన కథ. ఎందరికో తిండి లేకపోయినా పైకి మాత్రం బింకంగా కనిపించిందేమో. ఇనపతెర వెనక ఏముందో, తెర విరిగాకే తెలుస్తుంది. తెర విరిగేరోజు

వస్తోంది" అని మోహన్ అంటున్న సమయానికి, ఓ అనుచరుడు కంగారుగా లోపలికి వస్తూ అన్నాడు.

"పోలీసులు మన స్థావరాన్ని చుట్టుముడుతున్నారు"

ఒకేసారి లేచారు మోహన్, అరుణలు.

"నీకెలా తెలిసింది? వాళ్ళెంతవరకూ వచ్చారు?" అంటూ ఓ చేత్తో అరుణనీ, మరో చేత్తో ఆ అనుచరుడినీ గుడిలోకి లాక్కెళ్తూ అడిగాడు మోహన్.

"రాత్రి మనం తిండానికి ఏమన్నా తీసుకువద్దామని వెళ్తూ కొందరు కొత్త మనుషుల్ని చూసి, అనుమానమొచ్చి, వాళ్ళ వెనకే వెళ్ళి, వాళ్ళు మాట్లాడుకుంటున్నది విన్నాను. వాళ్ళు మారువేషాల్లో ఉన్న పోలీసులు, వాళ్ళ మాటల్లో నాకు తెలిసింది వాళ్ళు గుడిని అన్నివైపుల నుండి ముట్టడించి వీలైతే ఫారెస్టాఫీసర్ని తీసుకుపోదామనుకుంటున్నారని"

"వాళ్ళకి మనం ఇక్కడ ఉన్నట్లు ఎలా తెలిసింది? వాళ్ళు ఇలా వచ్చేసేవరకు మనకెందుకు తెలియలేదు?" అన్నాడు మోహన్ గుడి తలుపులు లోపల్నుండి వేస్తూ.

"ఎవరో మనలోవాళ్ళే చెప్పినట్లు తెలుస్తోంది వాళ్ళ మాటల్లో" అన్నాడా అనుచరుడు.

"ఎవరయి ఉండచ్చు" అన్నాడు మోహన్.

"ఇక్కడ ఇంతకుముందునుండి పని చేస్తున్న వాళ్ళలోని వాళ్ళయి ఉంటారు. వాళ్ళకి మన మీద అసూయ ఉంది. వాళ్ళే చుట్టుపక్కల గ్రామాల్లో ఉండి ఇలాంటి సమాచారాలు మనకి ముందుగా అందించాలి. పోలీసులు ఇంతవరకూ వచ్చేవరకు మనకి సమాచారం అందించలేదు. దాన్నిబట్టే తెలుస్తోంది" అన్నాడతను కోపంగా.

"ఒకే గమ్యం కోసం పోరాడుతున్న మన మధ్య సయోధ్య సహకారాలు లేకపోతే, ఈ పోరాటం సాగించడం ఎలా? అయినా ఇప్పుడు దాని గురించి మాట్లాడి ప్రయోజనం లేదు. ఏం చెయ్యాలో చూడాలి" అన్నాడు మోహన్.

"మనం పదిమందిమి ఉన్నాం. అందరి దగ్గరా గన్నులున్నాయి. పోలీసులెంతమంది వస్తారో తెలియదు. ఎంతమంది వచ్చినా వాళ్ళు ఫారెస్టాఫీసర్ని చంపుకుందుకు రారు. అతన్ని అడ్డంగా పెట్టుకుని మనం పారిపోవచ్చు" అన్నాడో అనుచరుడు.

"మనకి వాళ్ళ ఉద్దేశం తెలియదు. కానీ సామాన్యంగా వాళ్ళకి ఇలాంటి విషయాల్లో నేర్పు ఉండకపోవచ్చు. మనం తప్పించుకోడం సులభం అవచ్చు" అన్నాడు మోహన్.

"మామూలు పోలీసులైతే మీరన్నమాట నిజం కావచ్చు. అయితే వచ్చింది మామూలు పోలీసులయ్యుండరు. పోలీసులకి సాయం చేసేందుకు ఈ ప్రాంతాలకి ఓ టాస్క్ ఫోర్స్ వచ్చింది. అందులో ఉన్నవాళ్ళంతా ఇలాంటి విషయాల్లో బాగా తర్ఫీదు పొంది

ఉంటారు" అన్నాడో అనుచరుడు.

"నీకెలా తెలుసు?" అన్నాడు మోహన్ ఆశ్చర్యంగా అతన్ని చూస్తూ.

"ఈ విషయం నేను పదిరోజుల క్రితమే విన్నాను. ఆ టాస్క్ ఫోర్స్‌కి లీడర్‌గా కొత్తగా ఐ.పి.ఎస్. ట్రైనింగ్ అయిన ఓ లేడీ ఆఫీసర్ని వేశారట. ఆవిడ మూడు రోజుల క్రితమే రిపోర్టు ఇచ్చిందట. ఈ విషయం గురించి చెప్దామనుకునేలోగానే మనం కిడ్నాప్ చెయ్యడం జరిగింది. చెప్పడం కుదరలేదు"

"ఇప్పుడు, ఆ టాస్క్ ఫోర్స్, ఆవిడా మనల్ని చుట్టుముట్టారా?" అడిగింది అరుణ.

"ఆ విషయం తెలియదు. కొందరు పోలీసులున్నారు. అదే నేను చూసింది. వాళ్ళ మాటల్లో ఈ టాస్క్‌ఫోర్స్ వ్యవహారం లేదు. వాళ్ళకి ఈ విషయం తెలియకపోవచ్చును. ఆ లేడీ ఆఫీసర్ జాయినింగ్ అవడాన్ని కూడా రహస్యంగా ఉంచిందట. ఈ విషయం ఎస్పీ, డీయస్పీలకి తప్ప ఇంకెవ్వరికీ తెలియకపోవచ్చు" అన్నాడు ముందుగా వచ్చిన అనుచరుడు.

"మనకీ విషయం ముందే తెలిసింది. తెలిసినా మనం ఆ విషయాన్ని విశ్లేషించుకుని వాడుకోలేకపోయాం. తెలిసి ప్రయోజనం ఏముంది?" అని అతనితో అని, "టాస్క్ ఫోర్స్‌ని ఎలా ఎదుర్కొందాం?" అని అరుణని అడిగాడు మోహన్.

"ఆవిడ కొత్తగా ట్రైనింగ్ అయి వచ్చిందంటున్నారు. ఈ మధ్య ఐ.పి.ఎస్. ట్రైనింగ్‌లో కిడ్నాప్‌లను డీల్ చెయ్యడం గురించి స్పెషల్‌గా కోచింగ్ ఇస్తున్నారని విన్నాను. ఈవిడ బాగా ట్రైనింగ్ అయ్యుండచ్చు. ఇంతకీ ఆవిడ పేరేంటి?" అంది అరుణ.

"కళ్యాణి" అన్నాడా అనుచరుడు.

ఏవో ఆలోచనల్లో ఉన్న అరుణకి ఆ మాట సరిగ్గా వినిపించలేదు.

ఆ మాట వినిపించిన మోహన్‌కి ఆలోచన సాగలేదు.

## 11

తర్వాత సంఘటనలు తొందరగా జరిగిపోయాయి.

మకాం అక్కడ నుండి తొందరగా మార్చేస్తే మంచిదని నిర్ణయించింది అరుణ. అక్కడ నుండి మరో ఊరికి వెళ్ళిపోవాలని ఆదేశించింది. అరుణ ఇలా ఆదేశిస్తుంటే, అందరూ ఆ ఆదేశాల్ని పాటించసాగారు. ఫారెస్టాఫీసర్ రెండు చేతులూ వెనక్కి కట్టించి, నోట్లో గుడ్డలు కుక్కించి, ఇద్దరు అనుచరుల మధ్య నడిపించింది అరుణ.

ఆ దారిన ఎవరన్నా ఉన్నారేమోనని చూడ్డానికి కొంచెం ముందుగా ఇద్దర్ని పంపించింది. వెనకే మరో యిద్దరు, వారి వెనక ఫారెస్టాఫీసర్ని నడిపిస్తున్న ఇద్దరు. వాళ్ళ వెనకే మరో యిద్దరు. చివరగా మోహన్, అరుణలు నడవసాగారు.

అడవిలో నిశ్శబ్దంగా ఉంది. చీకటిగా ఉంది. ఆ చీకటిలో, నిశ్శబ్దంలో నడుస్తున్నారందరూ. ఎటునుండి పోలీసులెదురవుతారో తెలియదు. అసలు నిజంగా ఉన్నారో లేదో కూడా తెలియదు. అంతా భయం కావచ్చు. అయినా రిస్క్ తీసుకునే అవకాశం లేదు. పక్క ఊరు సుమారు నాలుగు కిలోమీటర్లుంటుంది. దారంతా అడవే.

అయితే వాళ్ళు అలా బయల్దేరినట్లు పోలీసులు చూశారన్న సంగతి వాళ్ళకి తెలియదు. పోలీసులు అలా చూసిన వెంటనే టాస్క్‌ఫోర్స్‌కి ఆ సంగతి తెలిసే ఏర్పాటు కళ్యాణి చేయించుకుందని కూడా వాళ్ళకి తెలియదు. అందుకే అంత చీకటిలో, అంత నిశ్శబ్దంలో కూడా ఆ అడవిలో కొండంత ధైర్యంతో నడుస్తున్నారు వాళ్ళు.

ఫారెస్టాఫీసర్ని అక్కడనుండి తీసుకువెళ్ళిపోతున్నారని తెలియగానే తన టాస్క్‌ఫోర్స్‌తో బయల్దేరింది కళ్యాణి. ఊరి చివరిదాకా జీపులో వెళ్ళి, పక్క ఊరికి వెళ్ళే దారిలో ఆపు చేయించింది. అక్కడే కొందరిని ఉండమని, మరికొందరితో అడవి దారిలో బయల్దేరింది. ముందు అరుణ దళం నడుస్తోంది.

వెనకే కళ్యాణి టాస్క్‌ఫోర్స్ వెళ్తోంది.

కొంతదూరం నడిచేసరికి కళ్యాణికి ముందు నడుస్తున్నవాళ్ళు చెట్లచాటు నుండి లీలగా కనిపించసాగారు. వాళ్ళెంత జాగ్రత్తగా నడుస్తున్నా వాళ్ళ కాళ్ళ కింద నలుగుతున్న ఎండుటాకుల శబ్దం వినిపిస్తోంది.

అయితే అలాంటి శబ్దం అరుణకి కూడా వినిపించింది. తమ వెనక ఎవరో వస్తున్నారన్న అలికిడి తెలిసింది.

తప్పించుకుందుకు ఏం చెయ్యాలా అని ఆలోచిస్తోంది అరుణ.

పట్టుకోడం ఎలా అని ఆలోచిస్తోంది కళ్యాణి.

తమ వెనక వస్తున్న కళ్యాణి మోహన్ అర్ధాంగి అని అరుణకి తెలియదు.

ఇవేమీ తెలియకుండా నడుస్తున్నాడు మోహన్.

హఠాత్తుగా "ఛార్జ్" అంటూ ముందుకు నడిచింది కళ్యాణి.

అలాంటి మెరుపుదాడిని ఊహించలేదు అరుణ.

మిషన్ గన్నులు కాలుస్తూ ముందుకు వచ్చారు టాస్క్‌ఫోర్స్‌లోని వాళ్ళు. చాలా ఏళ్ళ ట్రైనింగ్‌తో ఎటునుండి అటాక్ చెయ్యాలని తమ లీడర్ ఆదేశిస్తుందో, అర్థం చేసుకుని చెయ్యడం తెలిసినవాళ్ళు.

అలాంటి ట్రైనింగ్ లేకపోయినా తమ మధ్య ఉన్న కామ్రెడరీతో ఒకరినొకరు అర్థం చేసుకుని పనిచేస్తున్న అరుణ దళం

వాళ్ళు, అరుణ ఆదేశానుసారం నడుస్తున్నారు.

ఓ పక్క అరుణ–మరో పక్క కళ్యాణి.

అక్కడున్న నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ గన్నులు పేలుతున్న శబ్దం అలుముకుంది. తమని నిద్ర నుండి లేపినందుకు బాధతో అరుస్తూ ఎగిరిపోసాగాయి పక్షులు, అంతవరకూ ఉన్న శాంతి ఉన్నట్లుండి మాయమైనందుకు అదిరిపడి పారిపోసాగాయి చిన్న చిన్న జంతువులు.

ఎవరెక్కడున్నారో, ఎవరెవర్ని చంపుకుంటున్నారో అంత చీకటిలో వాళ్ళకి తెలుస్తోందో లేదో కూడా తెలియని స్థితిలో చెట్ల చాటున నిలబడి కాల్చుకోసాగారు.

కళ్యాణి పన్నిన ఉపాయం ఏమిటో టాస్క్‌ఫోర్స్‌లోనివాళ్ళు అన్నివైపుల నుండి తమని చుట్టేస్తున్నట్లు తెలిసేదాకా తెలియలేదు అరుణకి. ఇంక పారిపోయేందుకు మరో మార్గం లేదనుకుని ఫారెస్టాఫీసర్ని తన పక్కనే నిలపెట్టుకుని, గన్నుని అతనివైపే గురిపెట్టి అరిచింది అరుణ– “ముందుకు రావడంకానీ, కాల్చడంకానీ చేస్తే, ఇతన్ని చంపేస్తాం”

అది వినగానే కళ్యాణి మనుషుల నుండి గన్నులు కాల్చడం ఆగిపోయింది.

అరుణ నెమ్మదిగా తనవాళ్ళని తీసుకుని నడవసాగింది.

ఎటువెళ్తే తనకీ, తనవాళ్ళకీ క్షేమమో తెలియకపోయినా, అటు నుండి వెళ్ళిపోతే చాలన్నట్లు నడుస్తోంది అరుణ.

వాళ్ళెటువెళ్లినా, ఆ పక్క టాస్క్‌ఫోర్స్‌లోని తక్కినవాళ్ళు చేరుకుంటారని తెలిసిన కళ్యాణి, వాళ్ళని కొంచెంసేపు అక్కడ ఉంచడానికన్నట్లు గట్టిగా అరిచింది “ఆగండి” అని. ఆ అరుపు గాలిలో తేలుతూ మోహన్ చెవులని తాకింది.

సితార్, నాదస్వరాల కలయిక ఆ కంఠస్వరం.

ఆ గొంతు కోసమే మూడేళ్ళ నుండి ఎదురుచూస్తున్నాడు మోహన్. అతని గుండె ఒక్కసారి ఆగి మళ్లీ కొట్టుకోసాగింది. మోహన్ ఆగిపోయాడు.

అరుణ ఊహించని పరిణామం అది.

అందరూ వెళ్ళిపోతామనుకుంటున్న అరుణకి మోహన్ ఆగిపోవడం ఆశ్చర్యంతో పాటు కోపం కూడా కలిగించింది.

“వచ్చెయ్యండి” అంది నడకని ఆపకుండా కోపంగా మోహన్‌తో.

మోహన్ అటు చూడలేదు. అంతేకాదు. ఆగండి అన్న పిలుపు వచ్చినవైపు పరిగెత్తసాగాడు.

మోహన్ తమవైపు పరుగెత్తుకురావడం చూస్తున్న టాస్క్ ఫోర్స్‌లోని ఓ మనిషి అతనివైపు గురిచూస్తూ కాల్చసాగాడు.

అది గమనించి చెట్టు చాటునుండి బయటకి పరుగెత్తుకుంటూ వచ్చి మోహన్‌ని

పట్టుకుంది కళ్యాణి.

అలా పట్టుకోవడంలో బులెట్ కళ్యాణికి తగిలింది.

వెంటనే నేలమీదకి కూలిపోయింది కళ్యాణి.

కళ్యాణితోపాటే పడ్డాడు మోహన్.

కళ్యాణి పడ్డంతో టాస్క్‌ఫోర్స్‌లో వాళ్ళు అటు రాసాగారు.

అదే అదనన్నట్లు ఫారెస్టాఫీసర్ని తీసుకుని పారిపోసాగారు అరుణ దళంవాళ్ళు. తన దగ్గరికి వస్తున్న మనుషుల్ని ఉద్దేశించి కళ్యాణి ఆజ్ఞాపిస్తున్నట్లు అంది "నా దగ్గరికి రాకండి. వాళ్ళు పారిపోతున్నారు. అవతల మనవాళ్ళు వస్తారు. రెండు పక్కల నుండి అటాక్ చేసి అందర్నీ పట్టుకోండి"

ఆ మాట కోసం ఎదురుచూస్తున్నట్లు వాళ్ళు పరుగెత్తారు.

కళ్యాణి, మోహన్‌లు ఇద్దరే మిగిలారు.

మోహన్ ఒడిలో కళ్యాణి.

మోహన్ మొహంలోకి చూసి పల్చగా నవ్వింది కళ్యాణి.

"హాస్పిటల్‌కి వెళ్దాం పద" అన్నాడు మోహన్ లేవబోతూ.

"వెనకనుండి వచ్చిన బులెట్ గుండెల దగ్గర చేరినట్లుంది. రక్తం చూశావా" ఎలా కారిపోతోందో పోనీ పోతే ప్రాణాలేకదా నీ ఒళ్ళో పోతే మరీ మంచిది" అంది కళ్యాణి.

"నువ్విలాగుంటే నేను చూస్తూ కూర్చోనా?" అన్నాడు మోహన్.

"ఊరికే కూర్చోకు. కబుర్లు చెప్పు. చివరిక్షణాల్లో నీతో గడపడం చాలా హాయిగా ఉంది నాకు. మనం మళ్ళీ కలుస్తామని నాకు అనిపిస్తోందని అన్నాను నీతో. అలాగే కలిశాం. ఎంత బావుందో"

"ఇలానా కలవడం?" అన్నాడు బాధగా మోహన్.

"కలవడం ముఖ్యం. ఎలాగున్నానీ డ్రెస్‌లో?" అంది కళ్యాణి.

"అందంగా, అద్భుతంగా ఉన్నావు. ఇలా నిన్ను చూడాలని ఉందనేవాడిని నేను. ఇంకో విషయం. నీవల్ల ఈ డ్రెస్‌కి గౌరవం వచ్చింది. ఇంతకుముందు ఈ డ్రెస్ చూసినప్పుడు ఇది లంచగొండితనానికి, అన్యాయాలకీ ప్రతీకగా అనిపించేది. నిన్ను చూస్తుంటే ఈ డ్రెస్‌కి ఓ నిండుదనం, ఓ గౌరవం ఉన్నట్లనిపిస్తోంది" అన్నాడు మోహన్.

"నువ్వు వెళ్ళిపోయిన రాత్రి నీతో అన్నాను. ఈ రోజు మళ్ళీ చెప్తున్నాను. అవ్యవస్థకన్నా ఏదో ఒక వ్యవస్థ మంచిది. అన్ని వ్యవస్థల్లోనూ మంచిచెడ్డలూ, కష్టసుఖాలూ ఉంటాయి. ఓ వ్యవస్థలో చెడు ఎక్కువగా ఉన్నప్పుడు, ఆ చెడుని నిర్మూలించే ప్రయత్నం జరుగుతుంది. జరిగిన కొత్తలో కొన్ని మంచి మార్పులు వస్తాయి. అవి కొన్నాళ్ళు నిలుస్తాయి.

మళ్ళీ కొంత చెడు చేరుతుంది. మళ్ళీ మార్పులొస్తాయి. ఇలా వ్యవస్థ మారుతూనే ఉంటుంది. ప్రపంచంలో ఎన్నో రాజ్యాల్లో ఎన్నో విప్లవాలు వచ్చాయి. ఆ విప్లవాలు ఒక రాజునో, ఒక రకం రాజరికాన్నో మార్చి, మరో రాజునో, మరో రాజరికాన్నో నిలిపాయి. అయితే అంతమాత్రాన అక్కడ అసమానతలన్నీ పోయి సమసమాజం వచ్చిందా? రాలేదు. రాదు. ఎందుకంటే అసమానత సమాజ లక్షణం. ఓ విధంగా చూస్తే అసమానతలు లేకపోతే సమాజ పురోగతి ఉండదు. పారిశ్రామిక విప్లవం యూరప్‌లో విస్తరించిన కాలంలో తను చూపిన సమస్యల కళ్ళద్దాలు వేసుకున్న మార్క్స్ గతాన్నీ, భవిష్యత్తునీ కూడా అవే కళ్ళద్దాలతో చూశాడు. చరిత్ర గతి –గతితార్కికం అంటూ సిద్ధాంతీకరించాడు. చరిత్ర గతి అదికాదని ఋజువవుతోంది కమ్యూనిజాన్ని ఆశ్రయించిన దేశాలు వంద సంవత్సరాలన్నా కాకుండా కమ్యూనిజాన్ని దులిపేసుకోడం చూస్తే. ఇక్కడ అడవుల్లో మీరో పదిమందో, వందమందో తుపాకుల్ని పేలిస్తే సమసమాజం వస్తుందా? ఆ భ్రమని వదిలెయ్యి'' అంటూ ఆయాసపడసాగింది కళ్యాణి.

"కళ్యాణి–ఇంక మాట్లాడకు" అన్నాడు మోహన్. కళ్యాణి తలమీద ఉన్న కేప్‌ని ఓ చేత్తో తీసుకుని, మరో చేత్తో జుట్టుని సవరిస్తూ.

"మాట్లాడనీ మోహన్. నేనెక్కువసేపు మాట్లాడలేను. ఆ తర్వాత నేనే ఉండను. నీతో మాట్లాడేందుకు"

"అలా అనకు–కళ్యాణీ–ప్లీజ్" అన్నాడు మోహన్ కళ్యాణి పెదవుల మీద వేళ్ళని ఆనుస్తూ.

"ఎందుకలా కంగారుపడుతున్నావు మోహన్? తాళి కట్టిన మొగుడి ఒడిలో తల పెట్టుకుని మరణించడం ఎంతో పుణ్యం చేసుకున్నవాళ్ళకే దక్కుతుందిట. నేనెంత పుణ్యం చేసుకుంటే నాకా అదృష్టం కలిగిందో?" అంది తనో అనిర్వచనీయమైన తన్మయస్థితిలో ఉన్నట్లు.

"ఏం సాధించాలని ఈ యుద్ధం మొదలెట్టానో మూడేళ్ళ క్రితం నిన్ను చంపుకున్నానీ రోజు. ఇదే ఆ రోజు తెలిస్తే ఇలా వచ్చేవాడిని కాదు" అంటూంటే మోహన్ కళ్ళవెంట కన్నీళ్ళు కారసాగాయి.

"ఒక విషయం నిజం మోహన్. నువ్వు నన్ను చంపుకోలేదు. ఆ ఆలోచనని వదిలెయ్యి. ఇంకో విషయం కూడా విను. నేను చచ్చిపోతున్నందుకు నువ్వు ఏడుస్తున్నావు. కానీ మీరు చంపిన మొదటి మనిషిని నేను కాను. ఎందరినో ఉరి తీశారు. కొందరిని కాల్చేశారు. మరికొందరిని కాళ్ళూ చేతులూ నరికేసి చంపేశారు. రైళ్ళలో వెళ్తున్న సామాన్యులు ఎందరో మీ చర్యలవల్ల చనిపోయారు. ఎందరు పోలీసులు మీ చేతుల్లో చచ్చిపోలేదూ?

పోలీసులంటే ఎవరు? వాళ్ళూ మనుషులే. వాళ్ళు జీతంకోసం ఉద్యోగం చేస్తున్నారు. వాళ్ళని ఎందుకు చంపారు? పోలీసుజీతం ఎంతో తెలుసా? వాళ్ళకి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలెన్ని? దానికి వాళ్ళు తమ జీవితం పణంగా పెట్టి ఈ అడవుల్లో తిరగడం లేదా? మీరు ప్రజలకోసం పని చేస్తున్నామనుకుంటున్నారు. వాళ్ళూ ప్రజల కోసమే పని చేస్తున్నారు. వాళ్ళని ఎందుకు చంపారు? వాళ్ళకి మీకూ యుద్ధం ఎందుకు? మీరు ఏ వ్యవస్థనయితే కూకటివేళ్ళతో పెకలించి వెయ్యాలనుకుంటున్నారో ఆ వ్యవస్థని ఇలా పోలీసుల్ని చంపడంతో, ఫారెస్టాఫీసర్ని కిడ్నాప్ చెయ్యడంతో, సామాన్య ప్రజల్ని చంపడంతో మార్చలేరు. ప్రజల్లో మౌలికమైన మార్పు రావాలి. దానికోసం ప్రయత్నించాలి" అంది కళ్యాణి.

"నిజమేననిపిస్తోంది కళ్యాణి. నేనెన్నుకున్న మార్గంలో లోపాలున్నాయని ఈ మార్గంలో నడవడం మొదలెట్టిన కొన్నాళ్ళకే తెలిసింది. అయితే ఒక మార్గాన్ని ఎన్నుకున్నాక దాన్ని మార్చుకోడం అంత సులభం కాదు. అంతేకాదు ఏదో చెయ్యాలన్న కసి నాలో ఉండేది. అది ఈ మూడేళ్ళలో తగ్గింది. ఇప్పుడు లోకం మీద కసి తగ్గినట్లుంది. ఈ రోజు నీతో మాట్లాడుతోంటే నాకు మనస్సులోని బరువులూ బాధలూ అన్నీ పోయినట్లున్నాయి. ఓ ప్రశాంతత నన్ను ఆవరిస్తోంది. ఇది నీ భిక్ష కళ్యాణీ" అన్నాడు మోహన్.

"ఒకవేళ ఇది నిజంగా నేను నీకిచ్చిన వరమే అయితే, నాకు నువ్వేం ఇస్తావు? అంది కళ్యాణి.

"ఏం కావాలి కళ్యాణీ. చెప్పు ఏం కావాలన్నా ఇస్తాను" అన్నాడు మోహన్.

"ఇస్తానని అన్నాక ఇవ్వకుండా ఉండకూడదు" అంది కళ్యాణి".

"చెప్పు" అన్నాడు మోహన్.

"నా నుదుటన బొట్టు దిద్దు" అంది నొప్పి భరించలేనట్లు మోహన్ ఒళ్ళో కదుల్తూ.

"కళ్యాణి" అన్నాడు మోహన్.

"తిలకం ఎక్కడుంటుందని ఆలోచిస్తున్నావా మోహన్. నాకో గాయం అయింది. అందులోంచి రక్తం కారుతోంది. రక్తం ఎర్రగా ఉంటుంది. ఎర్రని బొట్టు అందంగా ఉంటుంది" అంది మాట్లాడ్డానికి కష్టపడుతూ కళ్యాణి.

కళ్యాణిని దగ్గరకి తీసుకున్నాడు మోహన్. బాధగా మూలిగింది కళ్యాణి.

"కళ్యాణీ!" అన్నాడు బాధగా మోహన్.

"తొందరగా పెట్టవా?" అంది కళ్యాణి.

తన వేళ్ళకంటిన రక్తాన్ని కళ్యాణి నుదుటన తిలకంలా దిద్దాడు మోహన్. తన జీవితాశయం తీరినట్లు సన్నగా నవ్వింది కళ్యాణి. నవ్వి అంది "ఏడుస్తూ సాగనంపుతావా నన్ను? నువ్వు అడవుల్లోకి వెళ్ళిపోతానని అన్నరోజున నిన్నిలా పంపానా నేను? ఏడ్చానా?

ఇంతకీ ఆ రోజు ఎలాంటి రోజు? నాకు పెళ్ళయిన రోజు. ఆ రోజు నిన్ను పంపలేదూ? అలానే నువ్వూ నన్ను పంపాలి"

"అలా మాట్లాడకు. చూడు-నీకెంత ఆయాసం వస్తోందో-ఒళ్ళంతా చెమట పడ్తోంది" అన్నాడు మోహన్.

"కొంచెం నా షర్ట్‌ని వదులు చెయ్యి" అంది కళ్యాణి.

షర్ట్ బటన్స్‌పైవి రెండు విప్పేసరికి లోపల పసుపు తాడూ, పసుపు కొమ్మూ కనిపించాయి.

మోహన్ పసుపు కొమ్ముని పైకి పట్టుకున్నాడు. దాన్నే చూస్తూ, కళ్యాణి కొంచెం పైకి లేచి పెదాల్ని పసుపు కొమ్ముని ముద్దు పెట్టుకుంటున్నట్లుగా ఆన్చింది.

అలా ఆనుస్తూ మోహన్‌వైపు చూసింది.

ఆ కళ్ళలో ఆరాధనా, అభిమానం, ప్రేమా కనిపించాయి.

ఆ కళ్ళనలా చూస్తున్నాడు మోహన్.

కొన్ని క్షణాల్లో ఆ కళ్ళు మూసుకుపోయాయి.

అలా మూసుకుంటున్న క్షణాల్లో

కళ్యాణి పెదవులు నెమ్మదిగా కంపిస్తూ అన్నాయి- 'జైహింద్' అని.

# 12

కళ్యాణీ మోహన్ ఐ.పి.ఎస్. అంతిమ సంస్కారాలు పోలీసు మర్యాదలతో జరగసాగాయి.

అన్ని రికార్డుల్లోనూ కళ్యాణికి పెళ్ళయిందనీ, భర్త పేరు మోహన్ అనీ ఉంది. మోహన్ చితికి నిప్పంటించాడు.

తన తండ్రికి అంటించిన చితిమంటలు తన గుండెల్ని కూడా మండించాయి.

అయితే కళ్యాణికి అంటిస్తున్న చితి మంటలు అంతవరకూ తనలో మండుతున్న జ్వాలల్ని ఆర్చేశాయి.

అతని గుండె అగ్నిలో పునీతం అయినట్లయింది.

చీఫ్ మినిస్టర్, మరి కొందరు మినిస్టర్లు, పోలీసు కమీషనర్, ఇంకెందరో ప్రముఖుల సమక్షంలో కళ్యాణి దేహం బూడిదయింది.

ఆ బూడిదని పిడికిళ్ళలో తీసుకుని ఒళ్ళంతా పూసుకున్నాడు మోహన్. అలా బూడిద నిండిన శరీరంతో పిచ్చివాడిలా అక్కడనుండి మోహన్ వెళ్ళిపోతోంటే ఎవ్వరూ ఆపలేదు.

అంతకుముందు మూడేళ్ళ నుండి మోహన్ తీవ్రవాదిగా ఉన్నాడని అక్కడ చాలామందికి తెలియదు. తెలిసినవారిలో కొందరు మోహన్ కళ్యాణి భర్త అని తెలియగానే, అతడ్ని గౌరవంగా చూడసాగారు. మరికొందరు అతని ధోరణికి జాలిపడ్డారు.

మోహన్ నడిచాడు. అక్కడనుండి – పోలీసుల నుండి, నక్సలైట్ల నుండి, యుద్ధాల నుండి దూరంగా.

నడుస్తూ సాగిపోయాడు.

అడవులు దాటాడు. కొండలెక్కి దిగాడు. నదులూ, వాగులూ దాటాడు. లేళ్ళతో పరుగెత్తాడు. కుందేళ్ళని ముద్దెట్టుకున్నాడు. పక్షులతో కబుర్లు చెప్పాడు. దొరికింది తిన్నాడు.

గడ్డం పెరిగింది. బట్టలు మాశాయి. ఇవన్నీ అతనికి పట్టలేదు.

నడుస్తూనే ఉన్నాడు.

నడుస్తూ అలిసిపోయాడు. అలిసి సొమ్మసిల్లి పడిపోయాడు.

అలా ఎంతసేపు గడిచిందో తెలియదతనికి.

మొహం మీద చన్నీళ్ళు చిలకరించినట్లయి కళ్ళు తెరచి చూశాడు. ఎదురుగా కనిపించింది.

## శాంతిపర్వం–సమన్వయం

## 13

... తెల్లని చీరలో పాతికేళ్ళు నిండిన స్త్రీ, తన భుజానికి తగిలించి ఉన్న వాటర్ బాటిల్‌లోంచి చల్లని నీళ్ళను మోహన్ మొహం మీద చిలకరిస్తూ.

మోహన్ కళ్ళు తెరిచి లేచి కూర్చుకున్నాడు.

ఆవిడ చెయ్యి అందించింది.

మోహన్ అందుకున్నాడు.

ఆవిడ మోహన్‌ని నడిపించసాగింది.

అలా నడుస్తూ మరీ ఎత్తుగా లేని గుట్టమీదకి చేరారిద్దరూ.

ఆ గుట్టని ఆనుకుని ప్రవహిస్తోంది నది.

నిలబడి చూస్తూ ఓపిక లేనట్లు నడిచాడు మోహన్.

ఇంటి తలుపు తీసి, లోపలకి తీసికెళ్ళి, మోహన్‌ని పక్క మీద కూర్చోపెట్టి, లోపలింకో గదిలోకి వెళ్ళి, వెచ్చని పాలూ, అరటిపళ్ళూ తీసుకొచ్చి ఇచ్చిందావిడ.

పాలు తాగి, పళ్ళు తిన్నాక నీరసం తగ్గినట్లయి –

"మీరెవరూ నాకు తెలియదు. మీరు నా మీద చూపించిన దయకి నా కృతజ్ఞతలు"

అంటూ నెమ్మదిగా లేవబోయాడు మోహన్.

"మీరు బాగా అలసిపోయినట్లున్నారు. కాస్సేపు పడుకోండి" అంటూ ఆ గది నుండి వెళ్ళిపోయిందావిడ.

మంచం మీద వాలాడు మోహన్. అలా వాలిన వెంటనే మత్తుగా నిద్రలోకి జారిపోయాడు.

అలా ఎంతసేపు పడుక్కున్నాడో తెలియదు.

మెలకువ వచ్చి లేచేసరికి, అప్పుడే తెల్లవారుతోంది.

తను పడుకున్న గదినీ, పక్కనీ పరిశీలనగా చూశాడు.

మట్టి గోడలకి సన్నని రెల్లు గడ్డి అద్ది కట్టిన తాటాకిల్లు అది. బయట నుండి లోపలకి వచ్చేందుకు ఉన్న తలుపు కొంచెం తెరిచే ఉంది. తనున్నగదిలోంచి లోపల గదిలోకి వెళ్ళే దారికి అడ్డంగా వెదురు తడక వెళ్ళాడుతోంది. గదికి ఉన్న కిటికీలకు కూడా వెదురు తడకలు లోపలకి ఎండ రాకుండా అడ్డంగా ఉన్నాయి.

గదిలో ఓ పక్క గోడకి ఆనుకుని నాలుగు అరలున్న అల్మారా ఉంది. అందులో పుస్తకాలు అందంగా పేర్చబడి ఉన్నాయి. అన్ని పుస్తకాలకీ తెల్ల కాగితం అట్టలు వేసి ఉన్నాయి. అట్టల పైన రకరకాల రంగుల సిరాలతో పుస్తకాల పేర్లు, రచయితల పేర్లు రాయబడి ఉన్నాయి. మరో గోడకి పెద్ద కాన్వాసు చిత్రం ఉంది. కాన్వాసంతా తెలుపురంగు, దానిమీదే మరో రకం తెలుపులో గీతలు గియ్యబడిన చిత్రం. తెలుపులో తెలుపయినా స్పష్టంగా కనిపిస్తోంది బొమ్మ. రెండు తెల్లటి పావురాలు అటూ ఇటూ ఉండి ఓ మల్లెల దండని తమ ముక్కుతో పట్టుకున్నట్లున్నాయి. ఆ చిత్రం దగ్గర నిలబడ్డవాళ్ళకి పావురాలు దండని వాళ్ళ మెడలో వెయ్యడానికి ఎగిరి వస్తున్నట్లు కనిపించేలా ఉంది ఆ చిత్రం.

తను పడుక్కునున్న పక్కమీద తెల్లని దుప్పటి ఉంది. గదిలో ఎటు చూసినా తెలుపు కనిపిస్తూ ప్రశాంతంగా అనిపించింది మోహన్‌కి.

లేచి తెరచి ఉన్న తలుపు దగ్గరకొచ్చి చూశాడు.

ఒక్కసారిగా మరో లోకంలోకి వెళ్ళిపోయినట్లయింది.

తను ఉన్న ఇల్లు ఓ చిన్న గుట్టమీద ఉంది.

ఆ గుట్ట ఓ నది పక్కనే ఉంది.

ఇంకాస్సేపటికి ఉదయించబోతున్న సూర్యుడు తన రాకకి సంకేతనంగా పంపిన సంధ్యారుణిమ ఆకాశంలో అలుముకుంటోంది.

నది నిర్మలంగా, నీలంగా ప్రవహిస్తోంది.

గుట్టంతా పెరిగిన గడ్డి ఆహ్లాదంగా, ఆకుపచ్చగా ఉంది.

ఇంటి ముందు గడ్డి లేకుండా చదునుచేసిన ప్రదేశంలో నీళ్లు చల్లి ముగ్గు లేస్తోందావిడ.

తెల్లని చీరలో తెల్ల జాకెట్టులో ఉంది. అప్పటికే తలంటు పోసుకుంటున్నట్లు జుట్టు కొంచెం తడిగా ఉంది. నల్లగా, ఒత్తుగా ఉన్న జుట్టుని జారుముడిగా వేసుకుంది. పొడవైన వేళ్ళ మధ్యలోంచి సన్నగా జారుతున్న తెల్లనిపిండి ముగ్గుగా మారిపోతోంది. ముగ్గంతా పూర్తయ్యాక లేచి కొంచెం దూరం వెళ్ళి ముగ్గుని చూసుకుని తృప్తిగా తలాడించుకుని ఇంట్లోకి వెళ్ళబోతూ చూసింది మోహన్‌ని. చూసి పలకరింపుగా నవ్వి "బాగా నిద్రపోయారు. సుమారు పదిహేను గంటలు. మొహం కడుక్కుని స్నానం చేసి రండి. ఇదిగో – ఈ పక్కనుండి దిగడం సులభం. గోదావరి నీళ్ళు చల్లగా, హాయిగా ఉంటాయి" అంటూ నవ్వుతూ లోపలకెళ్ళి తువ్వాలూ, సబ్బూ, పేస్టూ తీసుకొచ్చి ఇచ్చి నవ్వుతూనే లోపలకి వెళ్ళిపోయింది.

ఆవిడలా నవ్వుతూ ఉండడం చాలా బావున్నట్లనిపించింది. మోహన్‌కి. ఒత్తుగా పెరిగిన మెత్తని గడ్డిమీద నడుస్తూ గుట్ట దిగేసరికి ఇసుక తగిలింది పాదాలకి. ఇసుక మీద నడుస్తూ వెళ్ళి నదిలోకి కాళ్ళు పెట్టేసరికి చల్లగా తగిలాయి నీళ్ళు. ఇంకొంచెం నీళ్ళలోకి దిగి, దోసిళ్ళ నిండా నీళ్లు తీసుకుని ముఖం కడుక్కున్నాడు. ఎంతో హాయిగా అనిపించింది. స్నానం చేసి మళ్ళీ గట్టెక్కుతున్న సమయానికి సూర్యుడు పూర్తిగా ఉదయించాడు.

గట్టెక్కి ఇంటి దగ్గరకెళ్ళేసరికి తలుపు సగం తీసి ఉంది. ధైర్యం చేసి లోపలకి వెళ్ళిపోదామనుకుని, ఆవిడేం చేస్తోందోనని అనుమానం వచ్చి, తలుపుమీద శబ్దం చేద్దామన్న ఆలోచనని విరమించుకుని, "ఏమండీ!" అని గట్టిగా అరిచాడు.

లోపల్నుండి ఆవిడ గొంతు వినిపించింది– "స్నానం అయిపోయిందా? ఏమంది గోదావరి? బయటే నిలబడిపోయారా? లోపలకి రండి"

లోపలకి నడిచాడు మోహన్. ముందు గదిలో లేదావిడ. వెదురు తడిక తప్పించుకుని లోపల గదిలోకి వెళ్ళాడు. అది వంటిల్లని తెలిసింది మోహన్‌కి, గదిలో ఓ పక్కనున్న గట్టునీ, దాని మీద స్టవ్‌నీ, కొన్ని గిన్నెలను చూడగానే.

ఆవిడ గట్టు దగ్గర నిలబడి రెండు గ్లాసుల్లోని పాలలో పంచదార కలుపుతోంది. పక్కనే రెండు అరటి ఆకుల్లో వేడి ఉప్మా ఉంది. పాలు కలపడం అవగానే రెండు పాల గ్లాసుల్ని గదిలో ఓ పక్కగానున్న పీటల ముందు ఉంచింది. రెండు గ్లాసుల్లో నీళ్ళు పెట్టి, ఉప్మా ఆకుల్ని తీసుకొచ్చి, తనోపీట మీద కూర్చుని, ఎదురుగా ఉన్న పీట చూపించి కూర్చోమంది.

టీచర్ మాట వింటున్న విద్యార్థిలా వెళ్ళి కూర్చున్నాడు.

ఇద్దరూ మౌనంగా ఉప్మా తినసాగారు.

ఎదురెదురుగా కూర్చోడంతో, ఆవిడ స్పష్టంగా కనిపిస్తోంది మోహన్‌కి.

కళ్ళు చెదిరే అందం కాదు. కాదు కానీ ఏదో చెప్పలేని ఆకర్షణ ఉందావిడలో. రంగులు పూసుకున్న సినిమా హీరోయిన్ల అందంలాంటిది కాదు. నిండా ప్రేమ నిండి ఉన్న నిండు స్త్రీ మూర్తి సౌందర్యం కనిపిస్తోందావిడలో. అయితే ఆ ప్రేమ ఓ యువతి ఓ యువకుడి మీద చూపించే ప్రేమ కాదు. జ్వరంతో ఏడుస్తూ అమ్మే కావాలని ఏడ్చే పసిపిల్లాడిని రొమ్ములకద్దుకుని ముద్దుపెట్టుకుంటున్న మాతృమూర్తి ప్రేమ. ఆ ప్రేమ ఆవిడ కళ్ళలో ఉంది. కళ్ళలోనే కాదు. ఆవిడ మొహమంతా, శరీరమంతా ఆ ప్రేమే నిండి ఉంది.

ఆ ప్రేమని వ్యక్తీకరించడానికన్నట్లు ఆవిడ నిరంతరం నవ్వుతూనే ఉంది.

తెల్లని బట్టల్లో ఆవిడ.

ప్రపంచంలోని ఆనందం అంతా ఒక చోట కలబోసినట్లు

యుగయుగాలుగా విశ్వమంతా ఆవరించుకొని ఉన్న ప్రేమ ఆకారం దాల్చినట్లు

ప్రకృతిలోని అందం అంతా స్త్రీ రూపం దాల్చుకుని వచ్చినట్లు కనిపించింది మోహన్‌కి.

ఇద్దరి మధ్యా ఉన్న మౌనాన్ని భంగపరుస్తూ అందావిడ

"మీ పేరూ, ఊరూ, ఇలాంటి వివరాలేవీ నాకు తెలియవు. మిమ్మల్ని చెప్పమని నేనడగడంలేదు కూడా. కానీ మనమిద్దరం ఇలా మౌనంగా తినడం మీకెలాగుందో తెలియదుకానీ నాకు బాలేదు. మీ గురించి చెప్పండి. నేను వింటాను" అంటూ మోహన్‌వైపు చూసింది.

ఆవిడ మొహంలోకే చూస్తున్న మోహన్ ఒక్కసారి ఉలిక్కిపడి తల వంచుకుని గొంతు సవరించుకున్నాడు.

"అదో విషాదమైన గాథ అని నాటక ఫక్కీలో మొదలెట్టకండి" అందావిడ నవ్వుతూనే.

అసలావిడ నవ్వని క్షణం ఉందా అని అనుకుంటూ చెప్పాడు మోహన్– "నా పేరు మోహన్. పుట్టి ఇరవై ఏళ్ళదాకా పెరిగిన ఊరు విజయవాడ. గత మూడేళ్ళుగా అడవుల్లో తుపాకీ పట్టుకుని తిరిగాను ప్రజలని ఉద్ధరించుదామని. ఓ వారం క్రితం నన్ను నేనే ఉద్ధరించుకోలేదని గుర్తించి, స్వీయోద్ధారణ కోసం తిరుగుతున్నాను"

"అంటే ఉద్యమకారులన్నమాట" అందావిడ.

"మీకెలా తెలుసు?" అన్నాడు మోహన్ ఆశ్చర్యంగా.

"నాకేం తెలుసు? అసలు ఉద్యమకారులంటే ఎవరో తెలియదు నాకు. అయితే ఈ పరిసరాల్లో తుపాకులు పట్టుకు తిరిగేది ఇద్దరే– పోలీసులు, ఉద్యమకారులు. మీరు

పోలీసులు కాదు. కాదు కనక ఉద్యమకారులు" అంది.

"మీకు వాళ్ళంటే చులకనభావంలాగుందే"

"ఛ-ఛ-నాకెవరన్నా చులకన భావం లేదు. మీకలా అనిపించేలా మాట్లాడితే క్షమించండి"

ఆ కంఠంలో వినిపించిన సిన్సియారిటీకి చలించాడు మోహన్.

"క్షమించడంలాంటి మాటలనకండి. మీరు నన్ను ఇంటికి తీసుకొచ్చి బతికించారు. మీకు నా కృతజ్ఞతలు" అన్నాడు.

"కృతజ్ఞతలులాంటి మాటలు వద్దు మన మధ్య. నేను చేసిందేమీ లేదు. అప్పుడు మీరు నాకు కనిపించారు. అంతే"

ఇద్దరికీ ఉప్మా తినడం అయింది. పాలు తాగడం మొదలెట్టారు.

"ఉద్యమ జీవితానికి స్వస్తి చెప్పేశారా?" అని అడిగిందావిడ.

"ఓ వారం క్రితం అక్కడ నుండి వచ్చేశాను"

"మరిప్పుడు ఏం చెయ్యబోతున్నారు?"

"ఏమో-ఏం చెయ్యాలో" అంటూ గొణుకున్నాడు.

"ఏం చదువుతూ ఆపేశారు?" అడిగిందావిడ.

తనేదో చదువుతూ ఆపేసినట్లు ఈవిడకెలా తెలిసిందా అని అనుకుని, అదే ప్రశ్న అడిగాడు మోహన్.

నవ్వేసిందావిడ, అదే సమాధానమైనట్లు.

పాలు తాగడం పూర్తయ్యాక, ఆకుల్ని మూలనున్న ఓ పాత బుట్టలో వేసి, పక్కనున్న బకెట్‌లోని నీళ్ళతో గ్లాసులు కడిగి, చేతులు కడుక్కుని, కడిన గ్లాసుల్ని మళ్ళీ తీసిన చోటులో పెట్టి ముందు గదిలోకి నడుస్తూ అంది- "మీరు కాసేపు విశ్రాంతి తీసుకోండి. పుస్తకాలేవన్నా కావాల్సి వస్తే తీసుకోండి. ఒక్కరే ఉండడానికి ఇష్టంలేకపోతే నాతో రండి"

అలా అంటూ ఓ తెల్లని సంచీ భుజానికి తగిలించుకుంది.

"మీరెక్కడికి వెళ్తున్నారని అడగడం సభ్యత కాకపోవచ్చు. మీకు అభ్యంతరం లేకపోతే మీతో వస్తాను" అన్నాడు మోహన్ ఆవిడ వెనకే నడుస్తూ.

ఆవిడ బయటకి నడిచి, ఇంటికి ఓ పక్కనున్న సైకిల్ని తియ్యబోయి, మానేసి, ఇంటి వెనక పక్కనుండి కిందకి దిగసాగింది. పక్కనే మోహన్ నడవసాగాడు.

"టైం ఎంతయింది" అన్నాడు మోహన్.

ఆకాశంలో సూర్యుడు వైపొకసారి చూసి, కళ్ళు మూసుకు తెరిచి "ఏడుంపావుదాటి ఉంటుంది" అందావిడ.

ఆవిడ చేతికి కూడా వాచీ లేదు. రెండు చేతులకి రెండు అరడజన్ల తెల్లగాజులున్నాయి. ఖరీదైనవి కాకపోయినా చక్కగా ఉతికి ఇస్త్రీ చేసుకున్న తెల్లచీరా, జాకెట్టూ కట్టుకుందావిడ.

ఆవిడ నల్లగా ఉంది. నల్లగా వున్నవాళ్ళు సామాన్యంగా తెల్లబట్టలేసుకోరు. తామింకా నల్లగా కనిపిస్తామని. అయితే ఈవిడ తెల్లబట్టలే వేసుకుంది. అలా వేసుకోవడం ఆవిడకెంతో నప్పింది.

ఇద్దరూ ఇంటి వెనక పక్కనుండి గుట్ట దిగసాగారు. గుట్టమీద నుండి ఊరు చిత్రంగా కనిపిస్తోంది. మరీ చిన్నది కాని ఊరు అలాగని పెద్దది కూడా కాదు. గుట్టదిగి పొలం గట్ల మీద నుండి నడుస్తుంటే దారిలో కనిపించిన వాళ్ళందరూ "నమస్కారం" అంటూ ఆవిడకి దండం పెడుతుంటే "ఎలాగున్నారు?" అంటూ పేరు పేరునా పలకరిస్తూ నడుస్తోంది ఆవిడ. ఆ పలకరింపుకి పులకరిస్తున్నట్లున్నారు వాళ్ళు.

ఊళ్ళోకెళ్ళి ఓ సందులోకి తిరిగి అందులోని ఇళ్ళకి వెళ్ళసాగిందావిడ. ఎవరింటికెళితే ఆ ఇంటిలో వాళ్ళు తమ ఇంటికి ఓ ప్రత్యేకమైన అతిథి వచ్చినట్లు మర్యాద చేస్తున్నారు. ఆవిడ వాళ్ళ పక్కనే కూర్చుని వాళ్ళ కష్టసుఖాల గురించి అడిగి తెలుసుకోడం మొదలెట్టేది. కొందరి ఇళ్ళల్లో పిల్లల అనారోగ్యాలు, మరికొందరిళ్లల్లో ముసలివాళ్ళ కష్టాలు, ఇంకొందరి ఇళ్ళల్లో ఆడవాళ్ళ సమస్యలు. ఇంకా కొందరి ఇళ్ళల్లో భార్యాభర్తల, అన్నదమ్ముల, అక్కాచెల్లెళ్ళ, వదినామరదళ్ళ గొడవలు, అన్నిటినీ చిరునవ్వుతో వింటోందావిడ. అవసరమైన చోట మందులూ, సలహాలు ఇచ్చి నడుస్తోంది.

అలా రెండు గంటలుపైగా తిరిగారిద్దరూ. అంతసేపు తిరిగినట్టు తెలియలేదు మోహన్‌కి.

తాము కూడా ప్రజల కష్టాలు వినేవారు. వాళ్ళకి సాయం చేసేవారు. మందులు ఇచ్చేవారు. కానీ ప్రజలకి తమకీ మధ్య ఉన్న సంబంధానికీ, ఈ ఊరి ప్రజలకీ ఈవిడకీ మధ్య వున్న సంబంధానికీ తేడా వున్నట్లనిపించింది మోహన్‌కి. ప్రజలకి సాయం చెయ్యడం ఒక్కటే తమ ఉద్దేశంలా వుండేది కాదు. మరేదో కార్యక్రమం కోసమన్నట్లుండేవి తమ పనులు. అందులో కొంత స్వార్థం ఉన్నట్లనిపిస్తోంది. పేదప్రజల కోసం మొదలెట్టిన ఉద్యమమైనా అది ముఖ్యంగా పోలీసులతో, ఊరి పెద్దలతో యుద్ధంలా తయారయింది. వాళ్ళతో చేసే యుద్ధానికి తమ అవసరమైన సాయం పొందడానికి మాత్రమే ప్రజలతో మంచిగా వున్నట్లనిపించింది. అందుకే తమకీ ప్రజలకీ మధ్యనున్న సంబంధంలో కృత్రిమత్వం వున్నట్లూ, ఈవిడకీ ప్రజలకీ మధ్య వున్న స్నేహం చాలా సహజమైనదిగానూ అనిపించింది. ఇంటికి వెళ్తోంటే ఏదో తెలియని ఆనందంలో మునిగిపోయినట్లుంది మోహన్‌కి.

ఇంటికెళ్ళాక తలుపు తీసిందావిడ. తాళం లేని తలుపు. కుక్కలకూ, పిల్లులకూ అడ్డం వచ్చేదేకానీ, దొంగలకు కాదు. అదే అన్నాడావిడతో మోహన్.

"నమ్మకం లేనిచోట కావాలి తాళాలు మోహన్‌గారూ. ఈ చుట్టూ వున్న ప్రజల్ని చూశారుకదా వీళ్ళలో నేనెవర్ని నమ్మకుండా వుండగలను? నా దగ్గర పోయేందుకు విలువైనవేమీ లేవన్నది కూడా తాళం వెయ్యకపోడానికి ఒక కారణమే. అంతకన్నా ముఖ్య కారణం నమ్మకం"

"ఈలోకం నమ్మేటట్లుందా?" అని అడిగాడు మోహన్.

"అది మన మానసిక స్థితి మీద ఆధారపడి వుంటుంది. నమ్మి మనం మోసపోవచ్చు. కాదన్ను. అయితే ఎవరో ఒకరు మోసం చేశారని అందరినీ నమ్మడం మానేస్తామా? లోకంలో మోసం చేసేవాళ్ళున్నారని నేనొప్పుకుంటాను. అయితే అందరూ మోసగాళ్ళూ, దొంగలూ కాదని మీరు ఒప్పుకుంటారా? అందావిడ.

ఇద్దరూ ఇంట్లో ముందు గదిలోకి వచ్చారు.

"రండి, కూరలు కోసుకుని వద్దాం. ఈలోగా మీరు ప్రశ్నకి సమాధానం ఆలోచించండి" అంటూ వంటింట్లోంచి ఇంటి వెనక వున్న పెరట్లోకి నడిచింది. ఆవిడ వెంటే వెళ్ళాడు మోహన్.

వంకాయలు, బెండకాయలు, చిక్కుడుకాయలు, టమోటాలు, కాకరకాయలు లాంటి రకరకాల కూరల మొక్కలూ, తీగలూ ఒక పక్కా– మల్లె, చేమంతి, బంతి జాజి, కనకాంబరంలాంటి పూలమొక్కలూ, తీగలూ మరోపక్కా వున్న పెద్ద తోట. తోటకి నాలుగు మూలలా నాలుగు పళ్ళచెట్లు సీతాఫలం, సపోటా, జామ, మామిడి వున్నాయి. తోటకి నాలుగు పక్కలా ఓ చెట్టు నుండి మరో చెట్టుదాకా అరటి చెట్లున్నాయి. కొన్ని పళ్ళవి, కొన్ని కాయలవి. రెండు మూడు సంసారాలు సుఖంగా బతికేందుకు సరిపడేనన్ని తీగలూ, మొక్కలూ, చెట్లూ వున్నాయి ఆవిడ తోటలో.

"ఒప్పుకుంటాను" అన్నాడు మోహన్ ఆవిడ ఇంతకుముందు అడిగిన ప్రశ్నకి సమాధానంగా.

"ఏం తినాలనుకుంటున్నారీపూట. ఫ్రెష్‌గా తోట నుండి కోసిన కాయలతో వండిన కూర. మీ ఇష్టాయిష్టాలు నాకు తెలియవు. చెప్పండి వంకాయ కొయ్యనా?" అంది వంగమొక్కల దగ్గర నిలబడి. ఒకటి రెండు ఎండు ఆకుల్ని కోసి దగ్గర వున్న చెత్తబుట్టదాకా నడిచివెళ్ళి అందులో వేస్తూ.

అంత తోటలోనూ ఎక్కడా చెత్తలేదు బుట్టలోతప్ప. అంత చక్కగా ఇంటినీ, తోటనీ చూసుకుంటున్న ఆవిడని చూస్తుంటే చాలా ముచ్చటగా అనిపించింది మోహన్‌కి.

“ఏమీ సమాధానం చెప్పలేదు మీరు వంకాయ తింటారా?” అంది మళ్ళీ

“వంకాయ నాకిష్టమే” అన్నాడు మోహన్.

కొన్ని వంకాయల్ని కోసి చీర కొంగులో వేసుకుని ‘పదండి” అంటూ ముందు గదిలోకి కత్తిపీట తెచ్చుకుని కింద కూర్చుని తరగడం మొదలెట్టింది. మంచం మీద కూర్చుని చూస్తున్నాడు మోహన్. ఆవిడ కూర్చోడంలో, తరగడంలో ఓ ప్రత్యేకత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

“అందరూ మోసగాళ్ళు దొంగలు కాదని మీరొప్పుకున్నారు కదా ఇందాక?” అంది ఆ సంభాషణని కొనసాగిస్తూ.

“అంతేకాదు. ఏ మనిషీ పూర్తిగా చెడ్డవాడు కాడు. అందరి మనుషుల్లోనూ రెండు గుణాలు వుంటాయి. మనం మంచిని చూసి నీలో మంచి వుంది సుమా అని చెప్పామనుకోండి, వాళ్ళు మనతో మంచిగానే వుంటారు”

“కొందరి మనుషుల్లో మంచి ఎక్కువగానూ, చెడు తక్కువగానూ వుంటుంది. అలాంటివాళ్ళ దగ్గర మీరు చెప్పింది సాగుతుంది. కానీ మరికొందరిలో చెడుభాగం ఎక్కువగా వుంటుంది. వాళ్ళ దగ్గర మనమలా చేస్తే, మనల్ని వెర్రివాళ్ళకింద జమకట్టి ఇంకా ఎక్కువ దగా చేస్తారు” అన్నాడు మోహన్.

“అయ్యుండచ్చు. లోకంలో ఎక్కువమంది ఎక్కువ మంచిగలవాళ్ళు, తక్కువమందే తక్కువ మంచిగలవాళ్ళు వుంటారని నా నమ్మకం. మీకలాకాక ఎక్కువమంది చెడ్డవాళ్ళు వున్నట్లు కనిపించవచ్చు. అది మీ దృక్పథం. దృక్పథాలు మనం పుట్టిన వాతావరణంవల్ల కొంతా, మన అవగాహనవల్ల కొంతా వస్తాయేమో. నాకీ చుట్టుపక్కల ఊళ్ళలోని మనుషులూ మంచిగానే కనిపిస్తారు. అది నా దృష్టి దోషం కావచ్చు” అందావిడ.

“మంచివాళ్ళకి లోకం మంచిగానే కనిపిస్తుంది” అన్నాడు మోహన్.

“అలాగా” అంటూ లేచి తరిగిన కూరతో లోపలకి వెళ్ళింది.

మోహన్ లేచి పుస్తకాల అల్మారాలోంచి పుస్తకాలు తీస్తూ, పేర్లు చూడసాగాడు.

అరవిందుడు, రమణ మహర్షి, కృష్ణమూర్తి, రస్సెల్, సార్త్ర్, ఫ్రాయిడ్, మార్క్స్, శంకరుడు– ప్రపంచంలోని ఎందరో మహానుభావుల ఆలోచనలన్నీ పుస్తకాలుగా నిలిచాయి మోహన్ ముందు. వివేకానందుడి ఉపన్యాసాల పుస్తకాల్లో ఒకటి తీసుకుని చదవడం మొదలెట్టాడు. అలా చదువుతుండగానే ఆవిడ “భోజనం తయారయింది. తిందామా?” అంటూ వచ్చింది.

ఇద్దరూ భోజనానికి కూర్చున్నారు. అరటి ఆకుల్లో అన్నం, పప్పు, కూర, పచ్చడి, నెయ్యి, పెరుగులతో భోజనం. అమ్మ దగ్గర కూర్చుని తింటున్నట్లనిపించింది మోహన్‌కి.

ఎందుకో ఏడుపు వచ్చింది మోహన్‌కి – అమ్మమీద బెంగతో కాదు. ఈవిడ చూపిస్తున్న ఆదరాభిమానాలకు. భోజనం అయ్యాక నడుం వాల్చాడు మోహన్.

మంచం కింద నుండి చాపనీ, పరుపునీ తీసుకుని మంచానికి కొంచెం దూరంగా వేసుకుని అందుమీద కూర్చుని, ఏదో రాసుకోడం మొదలెట్టిందావిడ. రాసేటప్పుడు కళ్ళకి కళ్ళజోడు పెట్టుకుంది. ఎంతో అందంగా వుంది అలా. ఆవిడనలా చూస్తూ నిద్రలోకి జారిపోయాడు మోహన్.

# 14

నిద్రలేచేసరికి ఆవిడ గదిలో లేదు. పక్క కూడా లేదు. ఇంటి బయట నుండి సంగీత సాధన వినిపిస్తోంది. అందులో సంగీతం నేర్పుతున్న గొంతు ఆవిడదిలాగుంది. పదిమందిదాకా నేర్చుకుంటున్నట్లు వినిపిస్తోంది.

"శాంతమా లేక సౌఖ్యమూ లేదు..." కీర్తన నేర్పుతోంది. మోహన్ వింటున్నాడు. వింటూ ఆలోచిస్తున్నాడు. ఈవిడ తన్నిక్కడ వుండమనలేదు. అలాగని వెళ్ళమనీ అనలేదు. తను వుంటానని అడగలేదు. అయినా వుంటున్నాడు. చిత్రంగా వుంది తనిక్కడ వుండడం. ఈవిడ ఒంటరిగా వుందిక్కడ. తల్లిదండ్రులుకానీ, తక్కిన బంధువులుకానీ వున్నట్లులేదు. ఇంట్లో సామాను కూడా ఎక్కువలేదు. ఈ రాత్రి పడుకోడం ఎలా? ముందు రాత్రి ఆవిడ ఎక్కడ పడుకుందో? ఈ గదిలోనే చాపా, పరుపూ వేసుకుని పడుకుందేమో. ముక్కూ మొహం తెలియని తను వున్నాడన్న భయం లేదు ఆవిడకి. మనుష్యుల మీద ఎంత నమ్మకం. ఈ నమ్మకాన్ని ఎలా సాధించిందో, ఆవిడనే అడగాలి అని అనుకుంటూ లేచి బయటకి వచ్చాడు.

ఇంటి ముందు ఓ పక్కనున్న పెద్ద బొగడచెట్టు నీడలో కూర్చుని సంగీతం నేర్పుతోందావిడ. ఆవిడ చుట్టూ కూర్చుని పదిమంది పిల్లలు పదీ పన్నెండేళ్ళవాళ్ళు నేర్చుకుంటున్నారు. కొంచెం నీడగా వున్న చోట కూర్చుని వాళ్ళని చూస్తూ వింటున్నాడు మోహన్. సంగీతమంటే పెద్ద ఇష్టంలేకపోయినా, ఆవిడ గొంతులోని మాధుర్యమేదో అతన్ని ఆకర్షిస్తోంది. అలానే పదిమంది గొంతులూ ఒకేసారి వినిపించడం బావుంది. పాట కూడా అర్థవంతంగా వుంది.

శాంతమంటే కోపానికి వ్యతిరేకం. మనమీదో, ప్రపంచం మీదో మనకి కోపం రావచ్చు. ఎవరిమీద కోపం వున్నా మనశ్శాంతి వుండదు. దాంతో సౌఖ్యం వుండదు.

అలా మోహన్ ఆలోచనల్లో వుండగానే, పాట నేర్చుకోడం ముగించుకుని వెళ్ళిపోసాగారు పిల్లలు.

మోహన్ దగ్గరకొచ్చి ఓ గిన్నె అందిస్తూ అడిగిందావిడ "జున్ను ఇష్టమేనా?"

"చాలా ఇష్టం ఎలా వచ్చింది" అన్నాడు.

"జున్ను ఎలా వస్తుందో నాకు తెలియదు. ఈ గిన్నెలోని జున్ను మాత్రం పిల్లల్లో ఒకరు తీసుకొచ్చి ఇస్తే వచ్చింది. తినండి" అంది.

"మీకోసం తెచ్చింది నాకిచ్చేస్తున్నారేం?"

"మీరు ప్రస్తుతం నాకు అతిథులు. మిమ్మల్ని నేను ఆదరించాలి. మీకు పెట్టకుండా తింటే నాకు కడుపునొప్పి వస్తుంది" అందావిడ.

"మీరు తినకుండా తింటే నాకూ వస్తుంది. సగం సగం తిందాం" అంటూ లేచి ఇంటికింకొక పక్కనున్న బాదం చెట్టు దగ్గరకి నడిచి, రెండు ఆకులు కోసుకుని, ఆవిడ కూర్చున్న చోటుకి వచ్చి, ఆకుల్ని రెండు చేతులతోనూ దగ్గరగా పట్టుకుని "భవతి భిక్షాందేహీ" అన్నాడు.

గిన్నెలోంచి కొంత జున్ను ఆకుల్లోకి పెట్టింది. కొంచెం తీసుకుని అది ప్రసాదమైనట్లు కళ్ళకద్దుకుని తినడం మొదలెట్టాడు మోహన్.

"మీకు నిద్రెక్కువలాగుండే" అందావిడ.

"మూడేళ్ళ కాలం నిద్ర లేకుండా గడిపాను. ఎప్పుడు ఎక్కడ యుద్ధం చేయాల్సి వస్తుందోనన్న ఆలోచనల్తో, ఆ నిద్రంతా ఇప్పుడు వచ్చేస్తోందేమో" అన్నాడు మోహన్.

"ఎందుకు చేరారు ఉద్యమంలో?" అందావిడ సూటిగా మోహన్ మొహంలోకి చూస్తూ.

మోహన్ తలవంచుకుని తన గతాన్నంతా చెప్పాడు.

మొహంలో ఏ భావమూ లేకుండా విందావిడ. విని అంది "గడచిన మూడేళ్ళూ యుద్ధం చేసి ఏం సాధించారు? మీ నాన్నగారి హత్యకి ప్రతీకారం తీర్చుకున్నారా?"

"నేను ప్రతీకారం తీర్చుకోవాలని అనుకోలేదు. సమాజంలో వున్న అన్యాయం చేసేవాళ్ళను అంతం చేద్దామనుకున్నాను. అన్యాయం అంతమైతే మిగిలేది న్యాయమే కదా అనుకున్నాను"

"అని మిమ్మల్ని మీరు సమాధానపరచుకున్నారు. మనకో అన్యాయం జరిగిందనుకోండి ఆ అన్యాయం ఎవరివల్ల అయిందని మనం అనుకుంటున్నామో వాళ్ళని చంపడం న్యాయమా?"

"తెలియదు"

"తెలియదని తప్పించుకోకండి. మీ అంతరాత్మకి తెలుసు నిజం. అదే న్యాయమైతే మహాత్మాగాంధీని చంపడం న్యాయం. ఇందిరాగాంధీని చంపడం న్యాయం. రాజీవ్‌గాంధీని

చంపడం న్యాయం"

"వాళ్ళని చంపినవాళ్ళు ఏవో చిన్న కారణాలని పెద్దవిగా ఊహించుకుని చంపారు. మతపరమైనవో, జాతిపరమైనవో కారణాలుగా, అయితే సమసమాజ స్థాపనకోసం జరిపే హత్యల్ని వాటితో పోల్చడం సమంజసం కాదు"

"కాదు మీ ఉద్దేశంలో. చంపినవాళ్ళ ఉద్దేశంలో కాదు. శ్రీలంకకి శాంతిసేన పేరుతో సైన్యాన్ని పంపి అక్కడ తమిళుల్ని నిర్దాక్షిణ్యంగా రాజీవ్‌గాంధీ చంపించేశాడని నమ్ముతున్నారు తమిళపులులు. అక్కడెందరో అమాయకపు అబలల బలాత్కారానికి రాజీవ్ కారణం అని నమ్మే 'థాను' తాను హ్యూమన్ బాంబ్‌గా మారిందట. తాను మరణించినా, రాజీవ్ మరణిస్తే చాలని. రాజీవ్‌ని చంపి వాళ్ళు సాధించిందేమిటి? పైశాచికానందం తప్ప"

"అయితే మేం ధనవంతుల్ని చంపడం మా ఆనందం కోసం కాదు పేదల ఆనందం కోసం. లేనివాళ్ళ కోసం మేం వున్నవాళ్ళని చంపుతున్నాం. అందులో పైశాచికం లేదు ధర్మం తప్ప"

"అది మీ నమ్మకం. అంతే. నేనిందాక అన్నట్లు తమిళపులుల నమ్మకం వేరు. అలానే పంజాబు టెర్రరిస్టులు, కాశ్మీరు టెర్రరిస్టులు, ఉల్ఫావాదులు అనుకుంటున్నారు చంపి సాదిద్దాం అని"

"వాళ్ళతో మమ్మల్ని పోల్చకండి ప్లీజ్"

"ఇంకా మీరు ఉద్యమకారుణ్ణనే అనుకుంటున్నారా?"

"నేను నా గురించి ఏమనుకుంటున్నానన్నది కాదు ముఖ్యం. ఉన్నవర్గం లేని వర్గాన్ని దోస్తోందా? లేదా?

"దోస్తోంది"

"దోపిడీ జరుగుతున్నంత కాలం, లేని వర్గం కష్టపడుతూనే వుంటుందా? వుండదా?"

"ఉంటుంది"

"ఉన్నవర్గం, లేనివర్గం అన్న వర్గాలు లేకుండా చేస్తే, సమసమాజం వస్తుందా? రాదా?"

"రావచ్చును"

"ప్రశ్న వస్తుందా? రాదా?"

"ప్రశ్నలన్నింటికీ అవును, కాదు అని సులభంగా సమాధానం ఇయ్యగలిగితే జీవితం చాలా సుఖంగా వుండేది. కానీ అలా కుదరదు. వర్గరహిత సమాజం వస్తే అంతా

సమానత్వం అన్న మాటకి అర్థం నాకు తెలియదు. వర్గం అంటే ఏమిటి? కొందరు మనుష్యుల గుంపు. ఉన్నవాళ్ళంతా ఒక గుంపు, లేనివాళ్ళంతా మరో గుంపు అని అనుకోడం ఎలా? ఏ మనిషీ ఇంకో మనిషిలా వుండడు. మనిషి మనిషికీ తేడా వుంది. తేడాలు లేని సమాజం లేదు. సమాజంలో గుడ్డివాళ్ళూ, కుంటివాళ్ళూ వున్నారు. అందమైనవాళ్ళూ, అందవిహీనులూ వున్నారు. తెలివైనవాళ్ళూ, తెలివితక్కువవాళ్ళూ వున్నారు. ఆరోగ్యవంతులూ, అనారోగ్యంతో బాధపడేవాళ్ళూ వున్నారు. బలవంతులూ, బలహీనులూ వున్నారు. స్త్రీలూ, పురుషులూ, పిల్లా పెద్దలూ ఎన్ని తేడాలున్నాయి? ఈ తేడాలన్నీ ఎలా పోతాయి? ఇవన్నీ ఆస్తితో వచ్చినవి కావుగా"

"ఇవన్నీ సృష్టిలో వున్నవి. ఆస్తి మానవుడు సృష్టించుకున్నది"

"సృష్టి అంటే ఏమిటో నాకు తెలియదు. ఆ వేదాంత చర్చ పక్కన పెడదాం. మానవుడు సృష్టించుకోడం అంటే ఏమిటి? తమ పిల్లలకి ఏదో ఒకటి చెయ్యాలనుకోడం మనిషిలో సహజ గుణం. పిల్లలకెందుకు చదువు చెప్పిస్తున్నారు. వాళ్ళు ఉద్యోగం చేసి డబ్బు సంపాదించుకోవాలనే కదా. ఏం మన పిల్లలకే ఎందుకు చదువు చెప్పించడం? అవకాశం వస్తే తమకీ, తమ పిల్లలకీ, తమ తరువాతి తరాలవారికి ఏదో ఒకటి చెయ్యడం మనిషికి సహజం. దాన్ని పోగొట్టలేం. అసమానత్వం లోకలక్షణం"

"అలాగనుకుంటూ చూస్తూ ఊరుకోవాలా?"

"ఊరుకోకూడదు"

"అందుకే సాయుధ పోరాటం సాగిస్తున్నారు ఉద్యమకార్లు"

"పోరాటం కాదు. హత్యలు చేస్తున్నారు. కిడ్నాపులు చేస్తున్నారు. చేతులూ, కాళ్ళూ నరుకుతున్నారు. రైళ్ళను కూల్చేస్తున్నారు. వీటివల్ల సాధించగలిగేది సమ సమాజం కాదు. సంఘంలో అశాంతి, ప్రజల్లో భయం మాత్రమే. అలాకాక సాయుధ పోరాటం ద్వారా సంపూర్ణ విప్లవం సాధ్యమనీ, ప్రభుత్వ విధానం మారుతుందనీ అనుకుందాం. అప్పుడేమవుతుంది? దోపిడీ పోతుందా? ప్రజలందరికీ కావల్సినవన్నీ దొరుకుతాయా? అలా జరిగిందా? జరగలేదే. యుగోస్లేవియా, జకోస్లోవేకియా, సోవియట్ యూనియన్‌లో ఏం జరుగుతోంది? కొత్త విధానం కొన్నాళ్ళు నడుస్తుంది. అందరికీ బావుంటుంది. అందులోంచి మళ్ళీ అసమానతలు పుడతాయి. అలాగే పుట్టాయి రష్యాలాంటి కమ్యూనిస్టు దేశాల్లో. అంతేకాదు మానవుడికి కనీసావసరాలు తీరడం ఎంత ముఖ్యమో స్వేచ్ఛ కూడా అంత ముఖ్యం అని తేలింది ఈ దేశాల్లో. ఇది చరిత్ర చెప్తున్న పాఠం. చూడకపోవడం మన అంధత్వం"

"అంధులని మీరంటున్నవాళ్ళు ఓ ప్రయోజనం కోసం పోరాడుతున్నారు"

"దాన్ని నేను అంగీకరిస్తున్నాను. వాళ్ళు ఓ మంచి ఆశయంతోటే ఉద్యమం నడుపుతున్నారు. ఆ విషయంలో తక్కిన టెర్రరిస్టులకీ, వీళ్ళకీ తేడా వుంది. అయితే ఆశయమొక్కటే ముఖ్యం కాదు. కొన్ని ఆశయాలని ఆశయాలనలేం. ఆశలని అనవచ్చు, కలలని అనవచ్చు. ఎవ్వరికీ కలతలు లేని సమాజం ఒక కల. కల నిజం కాదు. కల నిజమవాలని విప్లవమార్గం ఎన్నుకున్నారు వాళ్ళు"

"అది మంచి మార్గం కాదా? మార్క్స్ అదే సరయిన మార్గం అనీ, అందులో వెళ్తే సమసమాజం సిద్ధిస్తుందనీ అన్నాడు కదా?"

"ప్రపంచంలో మనుష్యులందరూ సుఖంగా వుండాలని అనడానికి మార్క్స్ అక్కర్లేదు. ప్రపంచంలోని ప్రజలందరూ సుఖంగా వుండాలనే అన్ని గ్రంథాలూ, అన్ని మతాలూ చెప్తున్నాయి. ఆదిమానవుడు నాగరికత నేర్చిననాటి నుండీ, అందరూ కోరేది లోకకళ్యాణమే. అయితే మానవుల బాధలకి ఒక్కో ప్రవక్త ఒక్కో కారణం ఊహించాడు. ఊహించి వాటి విముక్తి మార్గం ఉపదేశించాడు. అంత మాత్రాన ఆ కారణం, ఆ మార్గం అన్నిచోట్లా, అన్ని కాలాల్లోనూ సరయిందని అనగలమా? మన పరిసరాల్ని బట్టి, మనకున్న అవగాహనబట్టి, మనకు కావల్సిన మార్గం ఎన్నుకుంటాం. నక్సలైట్లు ఎన్నుకున్న మార్గం వాళ్ళది. అయితే ఏ మార్గంలో వెళ్తున్నా, ఇతరులకి హాని చెయ్యకూడదు. కష్టం కలిగించకూడదు. అంతేకాదు. మనం ఎన్నుకున్న మార్గం మనల్ని గమ్యం చేర్చగలగాలి. లేకపోతే ప్రయాణం సాగుతూనే వుంటుంది గమ్యం చేరకుండా.

"అయితే నాకు సరయిన మార్గం చూపించండి"

"మీరు నన్ను ఎగతాళి చేసినా నాకు బాధ లేదు" అందావిడ.

"ఛ-ఛ-ఎగతాళి కాదు. నిజంగా అడుగుతున్నాను"

"నాకు మీరు మార్గం ఉపదేశించండి. నేను మిమ్మల్ని గురువుగా స్వీకరిస్తాను. పొద్దున్న నుండి మీ వెంట తిరుగుతోంటే మీమీద గౌరవం పెరిగింది. ఇక్కడ తిష్ట వేసేందుకు ఇది నేనెన్నుకున్న మార్గం అని మీరనుకుంటే నేనేం చెయ్యలేను. అలా అనుకోకపోతే నన్ను శిష్యుడిగా స్వీకరించి, మార్గోపదేశం చెయ్యండి"

"అది నావల్ల అయ్యే పనికాదు. నేను గురువునవలేను. మీరిక్కడ వుండడం నాకు సంతోషమే. ఇక్కడ వుండండి. నేను చేసే పనులు చూడండి. నా జీవన విధానం నాకు నచ్చింది. మీకు నచ్చితే మీరూ ఇలానే వుండచ్చు. నచ్చకపోతే మరోమార్గం వెతుక్కోవచ్చు. అయితే ఇక్కడ వుండాలంటే ఒక షరతుంది" అందావిడ.

"చెప్పండి" అన్నాడు మోహన్.

"మొహమాటపడకుండా మీ స్వంత ఇంట్లో వున్నట్లు వుండాలి" అంది.

"అసలు వుండడానికే మొహమాటపడ్డం లేదు. అయితే నాకూ ఒక షరతుంది. ఇంటి పనులన్నీ మీరే చెయ్యకూడదు. ఇంట్లో మనిషిగా నాకు కూడా పనులు చెప్పాలి. సరేనా?" అన్నాడు మోహన్.

"సరే పదండి. పాలు తాగి వద్దాం. సాయంత్ర సమావేశాలకి సమయం అవుతోంది" అంది లేస్తూ.

"మీ పేరు చెప్తారా?" అన్నాడు తనూ లేస్తూ.

"శాంతి" అందావిడ.

"మీకు సరయిన పేరు" అన్నాడు మోహన్.

నవ్వింది శాంతి.

# 15

లోపలకెళ్ళి కొన్ని పళ్ళు తిని, పాలు తాగి బయటకి వచ్చేసరికి సూర్యాస్తమయ మవుతోంది.

అప్పటికే కొందరు గట్టుమీద గడ్డిలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

శాంతిని చూసి అందరూ బొగడచెట్టు దగ్గరకొచ్చారు. శాంతి కూర్చుంది. చుట్టూ కూర్చున్నారు వాళ్ళు.

పాతికమందిదాకా వుంటారు–యువకులూ, పెద్దవాళ్ళు, ఆడా, మగా అందరూ కలిసి. వాళ్ళని పరిచయం చేస్తున్నట్లుగా మోహన్‌తో అంది శాంతి –

"వీళ్ళంతా ఇక్కడికో రెండు కిలోమీటర్ల దూరంలోని గ్రామంవాళ్ళు. పది రోజులకోసారి ఇక్కడ సమావేశం అవుతారు. నిజానికి రోజూ ఇక్కడో సమావేశం వుంటుంది. ఏదో ఒక గ్రామం ప్రజలది. ఈరోజు పొద్దున్న మనం వెళ్ళిన ఊరుకాక మరికొన్ని ఊళ్ళు వున్నాయి దగ్గర్లో. వాళ్ళు వాళ్ళ ఊళ్ళో సమావేశమయి చర్చించుకొని సాధించుకోగలిగిన పనులే– ఈ గోదావరి తీరం బావుంటుందని ఇక్కడ చేసుకుంటారు"

"అది నిజంకాదులెండి. ఇక్కడ శాంతమ్మగారుంటారనే ఇక్కడకొస్తాం. ఆవిడే మా సమస్యల్ని పరిష్కరిస్తారు" అన్నారొకరు.

"వీళ్ళు వారి ఊరి గ్రామ పెద్దలు. పెద్దలంటే వయస్సులో పెద్దలని కాదు. అలాగని ఎన్నికల్లో నిలిచి గెలిచనవాళ్ళు కాదు. వాళ్ళు వేరే వున్నారు కూడా. వీళ్ళు ఆ ఊరివారందరి గౌరవాభిమానాలకు పాత్రులైనవాళ్ళు. ఊరి ప్రజలకి చేతనైనంత సాయం చేద్దామన్న అభిప్రాయం వున్నవాళ్ళు. వీళ్ళు పదిరోజులకోసారి ఇక్కడ కలుసుకుని ఊళ్లోని సమస్యల గురించి చర్చించుకుంటారు. తర్వాత పది రోజుల్లో చెయ్యాల్సిన కార్యక్రమాల గురించి

నిర్ణయించుకుంటారు. ఊళ్ళోకి వెళ్ళి చేతనైనంత సాయం చేస్తారు. సమస్యలు రకరకాలుగా వుంటాయి. నీళ్ళ సమస్య, రోడ్ల సమస్య, బస్సుల సమస్య, కరెంట్ సమస్య, కుటుంబ కలహాల సమస్య ఇలా ఏదన్నా కావచ్చు. వీళ్ళు నిర్ణయించుకున్నదానికోసం కలిసే పనిచేస్తారు. ఎప్పుడన్నా గొడవలు వస్తే వాళ్ళే తర్జన భర్జనలు చేసుకుని ఓతాటిమీదకొస్తుంటారు"

"మేం రావడం ఏంటి? మమ్మల్ని ఓ తాటిమీద నడుపుతున్నది శాంతమ్మగారే" అన్నారా గుంపులోని ఒకరు.

"సరే-ఇంక మొదలెడదామా?" అంది శాంతి.

వాళ్ళు ఊళ్ళోని సమస్యల గురించి మాట్లాడసాగారు. ప్రతి సమస్యపూర్వాపరాలు ముందే తెలిసినట్లు, ఆ సమస్యని విశ్లేషించి అందరికీ నచ్చిన సలహాలిస్తోంది శాంతి.

మోహన్ వాళ్ళ మాటలు వింటూ ఆలోచిస్తున్నాడు.

అక్కడ ప్రజల జీవితాలని సంపూర్ణంగా అర్థం చేసుకుని అందులో లీనమయి పోయింది శాంతి.

ప్రతి మనిషికీ రెండు లోకాలుంటాయి. ఒకటి బయట తన చుట్టూ వున్నలోకం. రెండు మనస్సులో నిర్మించుకున్న లోకం. ఏ మనిషియినా లోకం ఇలా వుండాలని అనుకుని, దానికి తన మనస్సులో ఓ రూపం ఏర్పరచుకుంటాడు. బయట ప్రపంచాన్ని తను నిర్మించుకున్న ప్రపంచంతో పోల్చుకుంటాడు. చాలా సందర్భాలలో రెండింటికీ పొంతన కుదరదు. బయట ప్రపంచాన్ని మార్చేందుకైనా ప్రయత్నిస్తాడు. మనస్సులోని ఆలోచనా లోకాన్ని మార్చుకుందుకైనా ప్రయత్నిస్తాడు. రెండు యుద్ధాలే. ఒకటి బయట ప్రపంచంతో, రెండు తనతో తాను. తను నిర్మించుకున్న లోకం, చుట్టూ వున్న లోకం ఒకటైనప్పుడు ఇంక యుద్ధం లేదు.

ఆ స్థితిలో మనిషికి పూర్తిగా ప్రశాంతత వుంటుంది. శాంతి ఆ స్థితిలో వుంది. అందుకే శాంతి అంత హాయిగా నవ్వగలుగుతోంది. అందరితోనూ అంత చక్కగా మాట్లాడగలుగుతోంది. ఇంత చిన్న వయస్సులో ఎంత సాధించిందో?

మోహన్ ఆలోచనలు సాగుతూనే వున్నాయి, శాంతి గురించి.

రెండు గంటలుపైనే చర్చించుకున్నాక, గ్రామస్తులు వెళ్ళడానికి లేచారు. వెళ్ళిపోతూ శాంతికి పళ్ళూ, చక్రపొంగలీ ఇచ్చి, ఇంట్లోని హరికెన్ లాంతర్లలో కిరసనాయిలు పోసి, వాటిని వెలిగించి వెళ్ళారు.

"రాత్రికి నేనింక వండుకోను. మీకు కావాలంటే చేస్తాను. అలాకాక మీరూ నాలానే ఈ ఫలాలమీదా, ఫలహారాల మీదా బతుకుతానంటే మీ ఇష్టం" అంది శాంతి.

"టైం ఎంతయుంటుంది?" అన్నాడు మోహన్.

ఆకాశంలోని చుక్కల్ని చూసింది శాంతి. పౌర్ణమి దగ్గరపడుతున్నట్లు సుమారు నిండు చంద్రుడు ఉదయిస్తున్నాడు గోదావరి మీద.

"ఏడు దాటుంటుంది" అంది శాంతి.

"పదండి– ఇసుక తిన్నెమీద కూర్చుని తిందాం. తిని గోదావరి నీళ్ళు తాగుదాం" అంటూ లేచాడు మోహన్.

వెన్నెల్లో గోదావరి మెరుస్తోంది. ఇసుకమీద కూర్చున్నారిద్దరూ. చల్లని గాలి నెమ్మదిగా వీస్తోంది. శాంతి గోదావరికేసి చూస్తూ కూర్చుంది.

"ఈ గోదావరి నీళ్ళూ, ఈ ఇసుకతిన్నే, ఈ చల్లనిగాలీ, ఈ పున్నమి రేయీ, ఈ పచ్చని పచ్చికా, మీ పర్ణశాలా, మీరూ ఇక్కడ ఇలా కూర్చుంటే ఏ లోకంలోనో వున్నట్లుంది" అన్నాడు మోహన్.

"ఏ లోకంలో?" అడిగింది శాంతి.

"వేల సంవత్సరాల క్రితం గంగానదీ తీరంలో పర్ణశాలలు కట్టుకుని తపస్సు చేసుకున్న వేదర్షులు గుర్తుకొస్తున్నారు మిమ్మల్ని చూస్తుంటే. మీలోనూ అదేజ్ఞానం, అదే ప్రశాంతత" అన్నాడు మోహన్.

"మీకు పొగడ్తలు అలవాటా?"

"పొగడ్డం, పొగిడించుకోడం చిరాకు నాకు. నా మనస్సులో అనిపించింది చెప్తున్నా నేను. నమ్మడం, నమ్మకపోవడం మీ ఇష్టం"

"వేదాలని అందించిన ఋషులెక్కడ? నేనెక్కడ?"

"నిజానికి మీరు వారికన్న గొప్పవాళ్ళు. వాళ్ళు ముక్కు మూసుకుని తపస్సు చెయ్యడమో, తమ కోసం జ్ఞానార్జన చెయ్యడమో చేశారు. మీరు మీ జీవితాన్ని పది మందికోసం వినియోగిస్తున్నారు. కార్యాచరణలో మీరు ఒక మెట్టుపైనే వున్నారు"

"ఆ సంగతి వదిలేద్దాం. కార్యాచరణ అందరూ చేస్తున్నారు. ప్రభుత్వోద్యోగులూ, కార్మికులూ, కర్షకులూ, పోలీసులూ, విప్లవకారులూ– అందరూ పని చేస్తున్నారు పనులు వేరైనా"

"చేస్తున్నారు. అందులో కొంత స్వార్థం వున్నట్లుంటోంది. మీరు చేస్తున్నది స్వార్థరహితమైంది"

"మీరు మళ్ళీ పొగడ్తల్లోకి వెళ్తున్నారు. ఆ విషయం వదిలెయ్యమన్నాగా. మనం ఎందుకు పుట్టామో మనకి తెలియదు. ఏ మనిషి ఎన్నాళ్ళు జీవిస్తాడో కూడా తెలియదు. మనం జీవించి వున్న కొన్నాళ్ళు మనం ఏం చెయ్యాలన్న ప్రశ్న అందరం వేసుకుంటాం. ఒక్కొక్కరికీ ఒక్కో సమాధానం దొరుకుతుంది. నాకు ఈ సమాధానం దొరికింది. ఈ పల్లెలలో

ఈ ప్రజల మధ్య వాళ్ళ కష్టసుఖాలు పంచుకుంటూ కాలం గడిపెయ్యాలనిపించింది. ఇలా గడుపుతున్నాను"

"మీరంతకు ముందు ఏం చేసేవారు?"

"నేను ఫిలాసఫీ, సైకాలజీ, హిస్టరీలలో ఎమ్మే చేశాను. కాలేజీల్లో లెక్చరర్ ఉద్యోగం చేస్తూ చేస్తూ ఆ జీవితం నచ్చక దేశాటన మొదలెట్టాను. గంగోత్రి నుండి గంగానది పుట్టడం చూశాను. మూడు సముద్రాలు కలిసేచోట సూర్యాస్తమయం చూశాను. అగ్రకులాలవారు హరిజనులను చంపడం చూశాను. పెద్ద కార్మిక యూనియన్లు యజమాన్లని పెట్టే కష్టాలు చూశాను. అలా చూస్తూ చూస్తూ ఓసారి ఈ గట్టుమీదకొచ్చాను. అప్పుడు ఈ ఇల్లు–మీరు పర్ణశాల అని అందంగా పేరు పెట్టిన ఈ ఇల్లు లేదు. గోదావరిని చూస్తూ ఈ గుట్ట మీద, ఈ ఇల్లుండే చోట కూర్చున్నాను.

గోదావరి నాకేదో చెప్తున్నట్లనిపించింది. ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్లు విన్నాను. ఏం చెయ్యాలో అర్థమైనట్లయింది. గుట్టకిటుపక్క చూశాను. సారాయి ప్రవహిస్తోంది. సీసాలలోంచి, గొంతుకలలోంచి, పాడుబడ్డ లివర్లలోంచి, తాగుబోతుల ప్రేలాపనలలోంచి, వాళ్ళచేత దెబ్బలు తింటున్న ఆడవాళ్ళ ఆక్రందనల్లోంచి, అలాంటి తల్లిదండ్రులకి పుట్టిన చిన్నపిల్లల దీనావస్థలోంచి. నిర్మలంగా గోదావరి ప్రవహిస్తున్నచోట సారాయి కూడా ప్రవహించడం నచ్చలేదు నాకు.

నా తొలి ప్రయత్నం ప్రారంభమైంది.

అయితే హింసతో కార్యం సాధించలేమన్న నమ్మకం నాకు ఈరోజే కాదు. ఆరోజు కూడా వుంది. సారాయి కొట్టు నడుతుపున్న రంగన్నని చంపేస్తే సారాయి వ్యాపారం ఆగిపోదు. మరో సింగన్న వస్తాడు– వ్యాపారం చేసేందుకు, అలవాటుపడ్డ మనసులు నిలవ్వు. మరో మార్గం చూసుకుంటాయి. ప్రజల్లో మౌలికమైన మార్పు కావాలి. ఈ త్రాగుడు మంచిది కాదన్న విషయం అర్థమైతే వాళ్ళింక తాగరు. అర్థం అవడం అంటే ఉత్తినే విషయం తెలియడం కాదు. మనసు పొరల్లో నిక్షిప్తం కావాలి. అంటే వాళ్ళ మనసుల్లో పూర్తి మార్పు రావాలి. ఆ మార్పు కోసం ప్రయత్నించాను. ఏం చేశాను, ఎలా చేశానన్నది ఇప్పుడు చెప్పుకునే కథ కాదు.

నిరాహారదీక్షలు చేశాను. వాళ్ళు త్రాగిన ప్రతి సారా సీసాకి నన్ను నేను హింసించుకున్నాను.

నవ్వేవారు. నేను పట్టించుకోలేదు. యుక్తాయుక్త విచక్షణలేని తాగుబోతులు బండబూతులు మాట్లాడేవారు. సహించాను నేను. కొట్టేవారు. జుట్టు పట్టుకులాగేవారు. నా ప్రయత్నం మానలేదు.

నెమ్మదిగా వాళ్ళే ఆలోచించుకోడం మొదలెట్టారు. వాళ్ళకి ఏమీకాని నేను, వాళ్ళకోసం ఎందుకు కష్టపడుతున్నానో అర్థం చేసుకోసాగారు. నెమ్మదిగా మారారు. ఆ మార్పు పైపైకి వచ్చింది కాదు. వాళ్ళ మనస్సులో వచ్చింది.

మార్పు సారాయి విషయంలో మాత్రమే రాలేదు. ఎన్నో విషయాల్లో వచ్చింది. పగా, మోసం, ద్వేషం వల్ల లాభంలేదని గ్రహించారు. కలసిగట్టుగా వుండడంలోని లాభాలు తెలుసుకున్నారు. ఒకరి కష్టాలకొకరు స్పందించసాగారు. తమకు చేతనైనంత సాయం చెయ్యడం మొదలెట్టారు.

అలాగే మార్పు ఈ ఊరికి మాత్రం పరిమితం కాలేదు. పక్క గ్రామాలకి పాకింది. ప్రస్తుతం పది గ్రామాలయ్యాయి.

అన్ని గ్రామాల్లోనూ చాలా పరివర్తన వచ్చింది.

వాళ్ళకి చదువు చెప్తున్నాను. మందులు ఇస్తున్నాను. వాళ్ళ ఇళ్ళల్లో సభ్యురాలిగా అయిపోతున్నాను. అందులో నాకు ఆనందం ఉంటోంది. ఆ ఆనందం చాలు ఈ జీవితానికి" అంది గోదావరి నీళ్ళని చూస్తూ శాంతి.

ఆ కథలకి పులకరిస్తున్నట్లు అలలతో సాగుతోంది గోదావరి.

ఆ మాటలని వినడానికన్నట్లు కదలకుండా ఆగిపోయింది గాలి.

ఆ కంఠానికి పరవశిస్తున్నట్లు నిశ్శబ్దంగా వుంది చుట్టూ ప్రకృతి.

అదో అనిర్వచనీయమైన అనుభూతి అయింది మోహన్‌కి.

"ఈ గుట్ట బోధివృక్షం అయింది. మీరు బుద్ధుడయ్యారు" అన్నాడు.

"నేనెవరినయ్యానో నాకు తెలియదు. బుద్ధుడు మాత్రం ప్రపంచ ప్రజలకి మార్గదర్శకుడయ్యాడు శాంతి సూత్రం బోధించి. ఆ సూత్రాన్ని ఒక దేశ స్వాతంత్ర్య సాధనకి వాడచ్చని నిరూపించాడు గాంధీ. వాళ్ళు చెప్పిందానికన్నా నేను చెప్పగలిగిందేమీ లేదు. హింసాద్వేషాలతో సాధించలేనివాటిని అహింసతో, ప్రేమతో సాధించగలం. నిజానికి హింసాద్వేషాలు, తిరిగి హింసనీ ద్వేషాన్నీ పెంచుతాయి. అదో వలయమవుతోంది. ఒకరినొకరు చంపుకునే మారణహోమం అవుతుంది. అందుకే పంజాబ్, అస్సాం, కాశ్మీర్, శ్రీలంక మండుతున్నాయి"

మోహన్ మంత్రముగ్ధుడిలా వింటున్నాడు.

' 'హింసవల్ల మార్పు రాదు. వచ్చినా అది పైపై మార్పు మాత్రమే. అసలు మార్పు రావల్సింది మనసుల్లో. అది హింసవల్ల రాదు"

"అయితే ప్రపంచంలో హింస ఎందుకు పెరిగిపోతోంది?" అన్నాడు మోహన్ నిజంగా తెలుసుకోవాలన్నట్లు.

"హింస పెరగడం కాదు అది ఎప్పుడూ వుంది. కోపం, ద్వేషం, పగా, కసీ, ప్రతీకారవాంఛ– ఇవన్నీ మనిషి సహజలక్షణాలే. అయితే నాగరికత పెరిగి, సంఘజీవనం అలవాటు చేసుకున్న మనిషికి ఈ లక్షణాలని అణచుకుని దయా, ప్రేమా, కరుణా పెంచుకునే అవకాశం కలిగింది. ఆ అవకాశాన్ని వినియోగించుకోడం, వినియోగించుకోకపోవడం మనిషి మీద ఆధారపడింది. అందరూ కామక్రోధాదుల్ని జయించేస్తే లోకం మరోలా వుంటుంది. అది జరిగే పని కాదు. అది జరగనంతకాలం అసమానతలూ, ఘర్షణలూ వుంటూనే వుంటాయి. అశాంతి వుంటూనే వుంటుంది"

"మనం చెయ్యగలిగేది ఏముంది?"

"మనం చెయ్యగలిగినంత మంచి చెయ్యడం. మంచి చెయ్యడం అంటే ఏం చెయ్యాలన్న ప్రశ్న వస్తుంది. అవసరం వున్నవాళ్ళకి సాయం చెయ్యడం. అలా చెయ్యడంలో ఇంకొకరికి హాని కలగకుండా వుండాలి. అవసరం రకరకాలుగా వుంటుంది. తల్లిదండ్రులు లేని అనాథలుంటారు. వాళ్ళని చేరదీసి, చదువు చెప్పించి, వాళ్ళ జీవితాలకో మార్గం చూపించవచ్చు. కళ్ళులేని అంధులుంటారు. వాళ్ళకి ఏదన్నా పని నేర్పించి, వాళ్ళకు జీవనోపాధి చూపించవచ్చు. కాళ్ళూ చేతులూ లేని వికలాంగులుంటారు. వాళ్ళకి ఓ దారి చూపచ్చు. భర్తలు పోయిన వితంతువులుంటారు. మందులవసరమైన రోగులుంటారు. విద్య నేర్చుకోవాలన్న ఆశ వున్న వయస్సు మళ్ళినవారుంటారు. ఈ లోకంలో అవసరాలు వున్నవారెందరో వున్నారు. వాళ్ళ కష్టాలు చూసి, వారి అవసరాలని గుర్తించి, పనిచేస్తే ఎంత లేదూ? అయితే ఇలా చెయ్యడంతో లోకం రేపటికి మారిపోదు. లోకం మారిపోవాలని కూడా కాదు నా ధ్యేయం. ఎందుకంటే ఈ లోకం వుండే కాలంతో పోలిస్తే మనం ఈ లోకంలో వుండే కాలం తక్కువ. మనం వున్న కాలంలో మనం ఏం చెయ్యగలమన్నది మనం చూసుకోవాలి. ఒకరికి చదువు నేర్పిస్తే చాలు. ఎంత తృప్తిగా వుంటుందో. అంతేకాదు. ప్రతిఫలాపేక్ష లేకుండా మనం చేసిన పనికి, అవతల మనిషి స్పందిస్తాడు. అతనూ చేతనైనంత సాయం చేస్తాడు అలా ఒకరికొకరు చేసుకోడమే మానవజాతికి కావాల్సింది. అలా చెయ్యడం మొదలెట్టాల్సింది మనలాంటి యువతీయువకులు. ఎక్కువమంది అలా చెయ్యడం మొదలెడితే అది ఉద్యమం అవుతుంది. ఇది అహింసాపరమైన ఉద్యమం కాదు. శాంతి ఉద్యమం. అయితే ఇది ఉద్యమం అవుతుందని నేను మొదలెట్టలేదు. నాకు చేతనైనంతా, నాకు వీలయినంతా, నాకు నచ్చినంతా, నేను చేస్తాను. ఇది నా జీవితం" అంటూ ఊరుకుంది శాంతి.

చంద్రుడు పైకి లేవడంతో పైనుండి పడుతున్న వెన్నెలలో వెండి నీళ్ళతో మెరుస్తోంది గోదావరి.

రాత్రి వాతావరణం చల్లబడి, ఇసుక కూడా చల్లగా వుంది.

వెన్నెల వెలుతుర్లో గుట్టమీద పర్ణశాల అందంగా కనిపిస్తోంది. పర్ణశాలకటూ, ఇటూ వున్న బొగడచెట్టూ, బాదం చెట్టూ నిశ్చలంగా వున్నాయి. వాటి ఆకుల మధ్య నుండి పడుతున్న వెన్నెల నేలమీద వింత ఆకృతుల్లో కనిపిస్తోంది.

తెల్లచీరా, జాకెట్టులతో, తల్లో మల్లెపూలతో, రెండు చేతలకి తెల్లని గాజులతో కూర్చున్న శాంతి

వెన్నెలకన్నా చల్లని, తెల్లని, అందమైన చిరునవ్వుతో వుంది.

ఆ చిరునవ్వు మోహన్ మనసులో ప్రశాంతతని నింపింది.

# 16

"టైం పన్నెండు దాటినట్లుంది. ఇంక పడుకుందామా?" అంటూ లేచింది శాంతి.

"మీరెళ్ళి పడుకోండి. నేను కొంచెంసేపు కూర్చుని వస్తాను" అన్నాడు మోహన్.

"ఈ గోదావరి బహుగడుసుది. దాని పక్కన ఒంటరిగా కూర్చుంటే మనల్ని వదలదు. ఏవేవో కబుర్లు చెప్తుంది. మాయ చేసేస్తుంది. దాని మాయలో పడితే మనమింక వదల్లేం" అంది శాంతి.

"చూస్తానదేంటో" అన్నాడు మోహన్. ఇసుకమీదకి వాలుతూ.

"మీ ఇష్టం. పొద్దున్న అయిదింటికి లేవాలి. నిన్న అలసిపోయి వున్నారని లేపలేదు. ఈరోజు లేపేస్తాను. నేను ముగ్గు వేస్తోంటే చూడద్దూ మీరు?" అంటూ గట్టెక్కసాగింది.

వెన్నెల జుట్టుమీద పడుతుంటే వెంట్రుకలు వెండితీగల్లా మెరుస్తున్నాయి.

ఓ స్థిరత్వం, ఓ గాంభీర్యం, ఓ నిండుదనం ఆపాదించుకున్న శాంతి శరీరం గాలిలో లీలగా తేలుతూ ఇంటివైపుకి వెళ్ళిపోయింది. ఇంటిముందొక క్షణం ఆగి, మోహన్ వైపొకసారి చూసి, ఇంట్లోకి అదృశ్యమైంది శాంతి.

అటునుండి ఇటు తిరిగాడు మోహన్.

గోదావరి నిర్మలంగా ప్రవహిస్తోంది. ఎప్పటిలాగానే.

ఎన్ని వందల వేల సంవత్సరాల క్రితం నుండి ప్రవహిస్తోందో.

ఎందరి మనుషుల్ని చూసిందో? ఎన్ని తరాలు అంతరించాయో?

అసలీ నది పుట్టుక ఎప్పుడో?

నది పుట్టింది మాత్రం ఇక్కడా?

వెయ్యి మైళ్ళ దూరంలో నాసిక్ దగ్గర.

ఇంకో వంద మైళ్ళలోపు దూరంలో సముద్రంలో కలిసి మరణిస్తుంది.

నదికి జననమరణాలేంటి?

నదిలోంచి నీళ్ళు సముద్రంలోకి వెళ్తాయి. అక్కడనుండి ఆవిరై ఆకాశంలోకి వెళ్ళి, అక్కడనుండి మళ్ళీ వానగా కొండలమీదా, మైదానాలమీదా కురిసి, నది అవుతాయి. నది మళ్ళీ సముద్రంలో కలుస్తుంది. నదిలోని నీళ్ళు మళ్ళీ నదిలోకి.

ఇదో చక్రం. చక్రానికి తుదీ, మొదలూ లేవు.

ఈ సృష్టికి కూడా లేవు.

విత్తనం చెట్టవుతుంది. చెట్టు నుండి విత్తనం వస్తుంది.

ఓ చెట్టుని కొట్టేస్తే చెట్టు వున్నట్లా? లేనట్లా? చెట్టులోంచి వచ్చిన విత్తనం మళ్ళీ చెట్టవుతోంది.

ఇలా సృష్టి సాగుతూనే ఉంటుంది.

మనిషిలోంచి మనిషిలోంచి మనిషి ....

కొన్ని వేల ఏళ్ళుగా సాగుతున్న మానవ చరిత్ర.

నది పుట్టడం, ప్రవహించడం, మరణించడం అంతా ఒక్కసారే జరుగుతోంది స్థలాన్ని వేరుచేస్తే.

నది పుట్టడం ఎప్పుడూ ఒక్కచోటే జరుగుతోంది కాలాన్ని వేరుచేసి చూస్తూ.

స్థల కాలాల్ని కలిపేస్తే పుట్టడం, జీవించడం, మరణించడం అంతా ఒక్కటే.

తండ్రి జననం, తండ్రి మరణం, తన జననం, తన మరణం అన్నీ పెద్ద కాన్వాసుమీద చిత్రాలు. కాలం చేసే చిత్రంవల్ల కాన్వాసంతా ఒక్కసారి కనిపించక క్షణక్షణానికి కొంచెం కొంచెంగా కనిపిస్తోంది. అందుకే అన్నీ వేర్వేరు సంఘటనలుగా చూస్తూ కార్యకారణాలని ఆపాదిస్తూ, ఏదో చేసెయ్యాలన్న ఉద్రేకానికి లోనవుతున్నారు.

నిజానికి నదిలాగే మానవ జీవనం నిత్యం.

ఈ ఆలోచనలు తనకి ఎలా కలుగుతున్నాయి?

తను ఆలోచిస్తున్నట్లు లేదు.

ఎవరో చెప్తున్నట్లుంది.

ఎవరు చెప్తున్నారా అని చూశాడు.

ఎవ్వరూ లేరు– ప్రవహించే గోదావరి తప్ప.

“గోదావరి కబుర్లు చెప్తుంది” అన్న శాంతి మాటలు గుర్తొచ్చాయి.

అవును గోదావరి చెప్తోంది. వింటున్నాడు మోహన్.

రకరకాల గొంతుకలతో ఎన్నో విషయాలు వినిపించింది.

తండ్రి మాట్లాడినట్లయింది.

ప్రపంచం మీద కసి పెంచుకోవద్దన్నాడు.

కళ్యాణి మట్లాడినట్లయింది.

ఒకరినొకరు చంపుకోడంకన్నా ఒకరికొకరు సాయం చేసుకోడం మంచిదంది.

బుద్ధుడూ, జీసస్, గాంధీ మాట్లాడారు.

మనిషి మనిషి మీద ద్వేషం పెంచుకోకూడదు. ప్రతీకారం కన్న క్షమ గొప్పది. అది మనసుకి తృప్తినిస్తుంది. అంతేకాదు. అవతల మనిషి మనసును కదిలించి మారుస్తుంది. ఆ ప్రవచనంలో మునిగాడు మోహన్.

అందులోనే నిద్రపోయాడు.

అయితే మామూలుగా నిద్రపోయినట్లు కాదు. గోదావరిలోకి మునిగినట్లు మునిగాడు. అంతా నిద్రే వుంది. కలలూ, కలతలూ లేని ప్రశాంతమైన నిద్ర.

అలా గంటో, గంటన్నరో నిద్రపోయి లేచేసరికి ఎన్నాళ్లో నిద్రపోయి లేచినట్లనిపించింది మోహన్‌కి.

బరువు తగ్గి తేలిగ్గా అయిపోయినట్లనిపింది.

బడలిక లేకుండా వున్నట్లుంది.

లేచి, ఇంటివైపు నడిచాడు.

తలుపు తోసుకుని లోపలకెళ్ళాడు.

కింద పక్క వేసుకుని నిద్రపోతోంది శాంతి.

మరో మగాడు వచ్చి పడుకుంటాడన్న ధ్యాసలేదు.

మంచం దగ్గరకి నడిచి పడుకున్నాడు మోహన్.

చిన్నదీపం వెలుగులో శాంతి నవ్వుతూ కనిపిస్తోంది.

ఆ నవ్వుని చూస్తూ పడుకున్నాడు మోహన్.

నిద్ర లేకపోయినా, అలసట లేకుండా, కళ్లు మండకుండా.

అలా చూస్తూనే వున్నాడు.

## 17

శాంతి లేచింది.

"అయిదయిందా?" అన్నాడు మోహన్.

"అయ్యుంటుంది" అంది శాంతి.

ఇద్దరూ ఇంటి బయటకొచ్చారు.

చంద్రుడు ఇంటి వెనకనున్నాడేమో కనిపించడం లేదు.

రాత్రి మోహన్‌కి ఎన్నో కబుర్లు చెప్పిన గోదావరి ఏమీ ఎరగనిదానిలా ప్రవహిస్తోంది.

గుట్టమీద నుండి నెమ్మదిగా దిగి గోదావరి నీళ్లలో మొహం కడుక్కుని పైకెక్కారు.

శాంతి ముగ్గుపెట్టడం మొదలెట్టింది.

బాదం చెట్టుకింద కూర్చుని చూడసాగాడు మోహన్.

తనలో తను అనుకుంటున్నట్లుగా చెప్పడం మొదలెట్టింది శాంతి.

"సచ్చిదానందమైనదేదో మాయకమ్మి, ఈ ప్రపంచాన్ని సృష్టి చేసుకుందిట. అదే బ్రహ్మమట. ఆ మాయ మాయమైతే బ్రహ్మమే మిగులుతుందిట. అలాగని ఉపనిషత్తులు అంటున్నాయని అద్వైతాన్ని చెప్పారు శంకరాచార్యులు.

ఇప్పుడు మనం ప్రపంచం అని అనుకుంటున్న పదార్థరాశి అంతా ఒక్కచోట కుదించికుని ఉండేదిట. పెద్ద పేలుడు జరిగి అదే ప్రపంచంగా విస్తరిస్తోందిట. అలా విస్తరిస్తూ అది నక్షత్రమండలాలుగా, నక్షత్రాలుగా, గ్రహాలుగా మారిపోతుందని అంటున్నారు బిగ్‌బేంగ్ థియరీవాళ్ళు.

దేన్ని నమ్మాలో తెలియడంలేదు.

వేల సంవత్సరాలుగా ఈ విశ్వరహస్యాన్ని తెలుసుకోవాలని ఎందరో ప్రయత్నిస్తున్నారు. యజ్ఞావల్క్యుడైనా, అరిస్టాటిలైనా అదే ప్రయత్నం. అలాంటి ప్రయత్నాల్లో తమకు అంతకుముందున్న అనుభవాల్నిబట్టి, అంతవరకూ వున్న విజ్ఞానాన్ని బట్టి కొత్త ఊహలు చేస్తున్నారు. అదే థియరీలుగా చెప్తున్నారు. కాలంతో థియరీలు కూడా మారచ్చు. న్యూటన్ చెప్పింది ఐన్‌స్టీన్ కాలానికి మారింది.

మార్క్స్ కూడా తన పరిధిలో ఆలోచించి, ప్రపంచంలోని సాంఘిక సమస్యలకి మూలసూత్రం కనుక్కున్నాననుకున్నాడు. అలా జరిగితే బాగుంటుందనుకున్న వాళ్ళు అదే సరయిందన్నారు. చరిత్ర అటే నడుస్తోందన్నారు. నిజానికి చరిత్ర ఎటూ నడవడం లేదు. థీసిస్–యాంటీథీసిస్– సింథెసిస్ జరుగుతూనే వుంటుంది. ఒక సాంఘిక ఆచారంలోంచి కొన్ని అసమానతలు పుడతాయి. సమానత్వం కోసం సంఘర్షణ జరుగుతుంది. కొత్త సాంఘిక ఆచారం పుడుతుంది. ఇలా వలయం తిరుగుతూనే వుంటుంది. అయితే అది వలయం కాదనీ, నిలుపుగీత అని అనుకున్న మార్క్స్ దానికో చివర వుందని అనుకున్నాడు.

చరిత్ర అది నిజం కాదంటోంది.

అది నిజం కానప్పుడు దేనికోసం పోరాటం?

సమాజంలో మంచి కోసం ఆయుధాల అవసరంలేదు.

నిజానికి ఆయుధాలు ఉండకూడదు.

కావల్సింది అవతలి మనిషి బాధని అర్థం చేసుకుని సాయం చెయ్యడం.

అలా చేసేందుకు ప్రయత్నించాలి. అలాకాక సాయుధ పోరాటమే సబబైనదని అనుకుంటే, మిగిలేది పోరాటమే.

అదే సాధిస్తున్నారు హింసనాశ్రయిస్తున్నవాళ్ళంతా, కాశ్మీర్‌లో ఎన్నిరకాల టెర్రరిస్టులున్నారో? హిందూ టెర్రరిస్టులు, పాకిస్తాన్ టెర్రరిస్టులు, కాశ్మీర్ వేర్పాటు వాద టెర్రరిస్టులు, వాళ్ళు సాధిస్తున్నదేమిటి? ఎందరో చచ్చిపోయారు. మరెందరో అనాధలయ్యారు. ఇంకెందరో ఇళ్ళూవాకిళ్ళూ వదలి ప్రాణభయంతో పరుగిడుతున్నారు. పంజాబులోనూ అంతే, బాంబులూ, తుపాకులూ స్వైరవిహారం చేస్తున్నాయి. అస్సాం పరిస్థితీ అలానే ఉంది.

అన్నిచోట్లా హత్యలూ, దోపిడీలూ, రక్తపాతాలు.

ఒక యుద్ధంచేసి, దాని పరిణామం చూసి, యుద్ధాలు మానుకుని బౌద్ధం స్వీకరించాడుట అశోకుడు.

ఆ అశోకుడు, బుద్ధుడూ పుట్టిన దేశం ఇది.

ఇందులో అంతా అశాంతే.

ప్రతీకారం తీసుకోడం వీరత్వంగా

చంపడం హీరోయిజంగా

కోపం, పగ, కసి ఉన్నతగుణాలుగా– కొనియాడబడుతున్నాయి.

ఒక టెర్రరిస్టు చనిపోతే ఊరేగింపులు చేసి ఎందరినో టెర్రరిస్టులుగా చేర్చుకుంటున్నారట.

తను స్వయంగా చనిపోయినా పరవాలేదు– అవతల మనిషిని చంపితే చాలన్నంత మానసిక ఉద్రిక్తతకి తీసుకువెళ్తున్నారు యువతీయువకుల్ని.

ఏం చెయ్యాలని మొదలెడుతున్నారో నాయకులు

అందులో సమిధలవుతున్నారు యువతీయువకులు.

స్వప్రయోజనాలకి, రాజకీయాలకి మొదలుపెట్టబడ్డ ఉద్యమాలలో, ఎందరినో చంపి తామూ చస్తున్నారు.

అసలే ఉడుకురక్తపు వయసులో వుంటారు యువతీయువకులు. ఏదో చెయ్యాలన్న కసి. దానికి తోడు చుట్టూ వున్న పరిస్థితులూ.

వాళ్ళకి దొరికే నవలెలాంటివి? వస్తున్న సినిమాలెలాంటివి?

తండ్రిని చంపారనో, చెల్లిని చెరిచారనో పదిమంది గూండాలని చంపడానికి తనూ ఒక గూండా అయి ఎందరినో చంపి చివరికి ప్రతీకారం తీర్చుకుంటున్నాడు కథానాయకుడు. ఆ గూండాగిరీ, ఆ రౌడీయిజం చాలా గొప్ప గుణాలుగా, హీరోయిజంగా

వర్ణిస్తున్నారు రచయితలూ, దర్శకులూ.

ఆ మాయలో పడిపోతోంది యువత.

ఆ మాయలో వాళ్ళు వున్నంతకాలం తుపాకులూ, యుద్ధాలూ, హత్యలూ, చంపుకోడాలూ తప్పవు.

ఆ మాయలోంచి వాళ్ళు బయటపడాలి. వాళ్ళనెవరన్నా బయటపడెయ్యగలగాలి. ఓ బుద్ధుడో, ఓ జీససో, ఓ గాంధీయో మళ్ళీ పుట్టాలి. మనుషులు మౌలికంగా మారాలి. అంతవరకూ అంతా అశాంతే...”

శాంతి చేతిలోంచి ముగ్గు జారుతోంది.

చూస్తున్నాడు మోహన్.

శాంతి నోటిలోంచి మాటలు వస్తున్నాయి.

వింటున్నాడు మోహన్.

ముగ్గు వెయ్యడం పూర్తయింది.

మాటలు కూడా అయ్యాయి.

మోహన్ లేచి, శాంతి దగ్గరకెళ్ళి అన్నాడు.

“తక్కిన ప్రపంచం గురించీ, దేశం గురించీ నాకు తెలియదు. నాకు మాత్రం బుద్ధుడూ, జీసస్, గాంధీ అన్నీ మీరే. మీరు నాకు గురువులు. నేను మీ మార్గంలో నడుస్తాను. నన్ను మీ శిష్యుడిగా స్వీకరించండి.”

శాంతి నవ్వుతూ అంది– “కేమూ అనుకుంటా అన్నాడు– నువ్వు నా ముందు నడవకు. నేను నిన్ననుసరించలేను. నువ్వు నా వెనక నడవకు. నేను నిన్ను నడిపించలేను. నా తోడుగా నడు. ఇద్దరం కలసి నడుద్దాం– మనం కూడా అలానే నడుద్దాం. మంచి స్నేహితులుగా”

సూర్యోదయమవుతోంది.

చీకటి పోయి వెలుతురు నిండుతోంది.

ఓ దేవత ముందు నిలబడి చెప్పుకుంటున్నట్లు మాట్లాడసాగాడు మోహన్. “నాలుగైదేళ్ళక్రితం నుండి మా నాన్నగారు పోయి నేను ఉద్యమంలో చేరేవరకూ నాలో ఏదో చేసేయాలన్న కసి వుండేది. ఏం చెయ్యాలో తెలియక నాలో నేనే మధనపడేవాడిని. నాన్నగారి మరణంతో నాలోని కసి ప్రపంచంమీద కసిగా మారింది. దాంతో అడవుల్లోకి పారిపోయి అజ్ఞాతంగా మూడేళ్ళు గడిపాను. బయట ప్రపంచంతో యుద్ధం చేశాను.

మొదట నాలో నేను పడిన మధనతో శాంతిలేకుండా పోయింది నాకు. గత మూడేళ్ళుగా ప్రపంచంతో చేస్తున్న యుద్ధంవల్ల శాంతిలేదు. ఇప్పుడు ఇంక నాలోనూ, నా

బయటా యుద్ధం లేదు. అంతా శాంతిమయంగా వుంది. ఎంతో హాయిగా వుంది".

శాంతి అంది– "ఇది మీ జీవితంలోనే కాదు– అందరి జీవితాల్లోనూ వుంటుంది. కొన్నాళ్ళు అంతర్మథనం. తర్వాత బయట ప్రపంచంతో యుద్ధం. అప్పుడు మనస్సులోని భావాలకి, బయట ప్రపంచానికి సమన్వయపరచుకునే జ్ఞానం కొందరి కబ్బుతుంది. వాళ్ళకి మాత్రం శాంతి లభిస్తుంది. తక్కిన చాలామంది అశాంతిలో మిగిలిపోతారు. మీ గొప్పతనం వల్ల మీకు శాంతి లభించింది."

"నా గొప్పతనంవల్ల కాదు. నా అదృష్టం. నాకా అదృష్టాన్ని ప్రసాదించింది మీరు" అన్నాడు మోహన్.

సూర్యుడి తొలికిరణం శాంతి తెల్లని చీరపై పడింది. ఆ కాంతే మోహన్ మీదా పడింది. మోహన్ కళ్ళు మూసుకుని, చేతులు జోడించి గట్టిగా అరిచాడు– "శాంతీ" అని. ఆ పిలుపు గాలిలో కలిసి అన్ని దిక్కులకీ వినిపించసాగింది.

ఓంకారనాదంలా.

## అంతిమపర్వం–అంకితం

## 18

మలుపులు తక్కువగా, ఉపన్యాసాలు ఎక్కువగా వున్నా నవలని చదివిన వారందరికీ కృతజ్ఞతలు.

సైకిల్ చైనులూ, కత్తులూ, గన్నులూ, బాంబులూ
పగా, కసి, ద్వేషం, ప్రతీకారం–
హత్యలూ, దొంగతనాలూ, బలాత్కారాలూ, కొట్టుకోడాలూ
రౌడీలూ, గూండాలూ, హంతకులూ, దొంగలూ–
ఎత్తులూ, పై ఎత్తులూ, మోసాలూ, కుయుక్తులూ–
వీటితో నిండిపోయాయి
కథలూ, నవలలూ, పత్రికలూ, సినిమాలూ–

ఇదే హీరోయిజంగా, చంపడమే గొప్ప లక్షణంగా, అలాంటివాళ్ళే చరిత్ర సృష్టిస్తున్నట్లుగా, వాళ్ళనే లోకం కొనియాడుతున్నట్లుగా–

అనుకుంటున్నారు జనం. ముఖ్యంగా యువతీయువకులు.

దేశం కోసమో, మతం కోసమో, కులం కోసమో, వర్గం కోసమో– హత్యలూ కిడ్నాపులూ చేస్తున్నారు.

దేశమంతా ఇలా అయితే దేశ భవిష్యత్తు ఏంటి?

ముందు తరాలవారి గతి ఏంటి?

ఈ ప్రశ్నలకి సమాధానాల గురించి ఆలోచిస్తూ, ప్రజలకోసం ఏదో చెయ్యాలన్న ఆశయం వుండి, స్వార్థంతోకాక, వాళ్ళకి సాయం చెయ్యడమే ధ్యేయంగా వుండి-

ఆ సాయం ఎంత చిన్నదయినాసరే-

సాయం చేసేవాళ్ళందరికీ-

గౌరవాదరాభిమానాలతో-

*(స్వాతి అనుబంధ నవల, అక్టోబర్ 1992)*